# కథా కౌముది

## 2012 - Part 2



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 77

కౌముది మాసపత్రికలో

2012 జూలై నుంచి డిసెంబర్ 2012

వరకూ

వచ్చిన కథలు

| | | |
|---|---|---|
| 1 వాళ్ళు ముగ్గురూ.. | వెంపటి సుధాప్రసన్న | 5 |
| 2 ప్రేమరాహిత్యం | ప్రవీణ కొల్లి | 9 |
| 3. ఆమె ఎవరు? | విజయ (కర్రా) గంటి | 13 |
| 4. దవాకాన | డా. మృదులాంజలి | 16 |
| 5.పుత్రోత్సాహం | నాగలక్ష్మి మజ్జి | 21 |
| 6. సాహచర్యపు అంచున.. | మధురవాణి | 26 |
| 7. ఎక్కడైనా వెన్నెలే! | అవసరాల రామకృష్ణారావు | 32 |
| 8. కృష్ణలంక | పాలెపు బుచ్చిరాజు | 36 |
| 9. ద్వారం | కండ్లకుంట శరత్ చంద్ర | 40 |
| 10 సెలవు | సన్నిహిత్ | 52 |
| 11 ఫోటో | మాధవ్ దుర్భా | 55 |
| 12 అమ్మా..నువ్వెప్పుడొస్తావు? | సీతాసత్య | 59 |
| 13 రాచకురుపు వారసత్వం | జొన్నలగడ్డ మార్కండేయులు | 66 |
| 14 సోక్రటీస్ భార్య | డి.పద్మజ | 72 |
| 15 నన్ను మరచిన వేళ | విజయ (కర్రా) గంటి | 78 |
| 16 బాకీ | గౌరీ కృపానందన్ | 82 |
| 17 భ్రమ | డా.వెల్చేరు చంద్రశేఖర్ | 85 |
| 18 మొదటి నేస్తం | సాగి వర్మరాజు | 90 |
| 19 సహజీవనం | వారణాసి నాగలక్ష్మి | 93 |
| 20. త్రిశంకు స్వర్గం.. | కోసూరి ఉమాభారతి | 98 |
| 21 ఎవరిదీ తప్పు? | డా. కల్లూరి శ్యామల | 102 |
| 22 పార్థుడూ పార్థివమూ | వసుంధర | 106 |
| 23 విముక్తుడు | ఎన్. తారకరామారావు | 111 |
| 24 గోరంత పొరపాటు | డి. కనకదుర్గ | 115 |
| 25 చిలికి చిలికి | కండ్లకుంట శరత్‌చంద్ర | 120 |

| | | | |
|---|---|---|---|
| 26 | ఇంటిపేరు | కొల్లి ప్రవీణ | 127 |
| 27 | నమ్మకం పేరు | సుధీర్ వంకధార | 135 |
| 28 | నిర్మాతలు | ఎ.పుష్పాంజలి | 138 |
| 29 | కథ చెప్తాను.. వింటావా? | అరిపిరాల సత్యప్రసాద్ | 144 |
| 30 | కృష్ణం వందే జగద్గురుం | మణి వడ్లమాని | 149 |
| 31 | కనపడని అంకాలు | శశికళ. వి | 152 |

అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

# వాళ్ళు ముగ్గురూ.. వెంపటి సుధాప్రసన్న

**ఆ అమ్మాయికి పట్టుమని పాతికేళ్ళుండవు.** సన్నగా పొట్టిగా ఎర్రగా ఉంది. చైనా వాళ్ళలాగా చిన్న చిన్న కళ్ళు. ఊరినట్లున్న బుగ్గలు. నల్లటి పాంటు మీద గులాబి రంగు జాకెట్ వేసుకుంది. పొడిగా ఎర్రబారినట్లున్న జుట్టుకి గులాబి రంగుదే ప్లాస్టిక్ బాండులాంటిది పెట్టింది. ఎత్తుగా ఉన్న కుర్చీలో కూర్చుని వచ్చేపోయే వాళ్ళకి కావలసినవేమిటో కనుక్కుంటూ అన్నీ సరిగ్గా అందజేయమని పనివాళ్ళకి కావలసినవేమిటో కనుక్కుంటూ, అన్నీ సరిగ్గా అందజేయమని పనివాళ్ళకి పురమాయిస్తూంది బెంగాలీ హిందీ సిక్కిం భాషల్లో గడగడా మాట్లాడుతూ.

గాంగ్‌టక్‌కి రావటం నాకు కొత్తగాదు. ఐదారుసార్లు వచ్చాను. వచ్చినప్పుడల్లా ఈ హోటలులోనే దిగుతాను. ఆ అమ్మాయి నాకు నాలుగేళ్ళబట్టీ తెలిసిందయినా ఎప్పటికప్పుడు ఆ అమ్మాయి నిర్వహణా నైపుణ్యం చూసి అబ్బురపడుతూంటాను. టూరిస్టు ప్రదేశం కావటంవల్ల చాలా హోటల్సే ఉన్నాయి అక్కడ. కానీ ఈ హోటలులో వసతులతో బాటు భోజనమూ బాగుంటుందని ముఖ్యంగా దక్షిణాది భోజనం బాగా దొరుకుతుందని అక్కడే దిగుతాను.

"పూరీకూర చాలా బాగుంది కదండీ" తెలుగు మాట వినిపించి పక్కకు తిరిగాను. పొందికైన చీరకట్టూ, అంతకంటే పొందిగ్గా చుట్టిన సిగ, మెడలో నల్లపూసలూ - అచ్చమైన ఆంధ్రవనితకు ప్రతీకలా ఉన్నదావిడ. పక్కన భర్తకాబోలు కొంచెం లావుగా పొడుగ్గా వ్యాయామం అసలు చెయ్యడనటానికి నిదర్శనంగా పొట్టా, సిగరెట్టు కాలుస్తాడని చెప్పే పెదవులూ - ప్చ్ ఆవిడకేమీ సరిజోడీ కాదుగాని, నాకు నచ్చినా నచ్చకపోయినా ఆయన్ని ఆవిడ భర్తగానే జమవేసుకోక తప్పలేదు, ఆ రాత్రి వాళ్ళతో జరిగిన సంభాషణతో అది రూఢీ అవటంతో.

"ఎంతైనా ఇటువైపు ఆడపిల్లలకు అన్నీ వచ్చునండోయ్" నేనూ తెలుగు వాడినే అని తెలిసి కబుర్లు కలిశాక అన్నాడతను, రూము బయట బాల్కనీలో కుర్చీలో కూర్చుని ఎదురుగా మంచులో తడిసిన మందారంలా కనిపిస్తున్న సిక్కిం అందాలు ఆస్వాదించకుండా. 'అన్నీ' అంటున్నప్పుడు మాటను నొక్కిపెట్టటం వంకరగా నవ్వటం - నాకు ఆ క్షణంలో అతని దగ్గర నుంచి లేచి రూములోపలికి వెళ్ళిపోదామన్నంత కంపరం కలిగింది. అంతపనీ చేసేవాడినేమో తీయని ఆవిడ గొంతు వినిపించకపోతే. "తెలియని ఆనందం నాలో కలిగెను ఈ నిముషం" ప్రకృతి సౌందర్యానికి పులకించిందేమో పాతపాటలో పదాలు సందర్భానుగుణంగా మార్చి సన్నగా లోగొంతుకలో పాడుకుంటూ మైమరచి నిల్చుంది కొంచెం అవతలగా ఆవిడ. ఇందాక గట్టిగా చుట్టిన ముడిలో పిన్నులు తీసేసి జారుముడిగా వేసుకుంది. పచ్చటి మెడమీద నొక్కులు నొక్కులుగా ఉన్న జారుముడి గోధుమరంగు శాలువా కప్పుకుంది. భర్త అన్నమాటలను వినిపించుకున్నట్లు లేదు. ప్రకృతి అందంలో స్త్రీ సౌందర్యం మిళితమయినట్లున్న ఆ దృశ్యాన్ని చూస్తూ కోయిల కూజితాన్ని వింటూన్న భావంతో మునిగి అతడి మాటకి నేను బదులివ్వలేదు. అలా ఎంతసేపు ఉండిపోయేవాడినో - మధ్యలో అతడే మరేదైనా పాటుకు మాట అని నన్ను

కదిలించే వాడేమో కానీ - ఆ అవసరమూ అవకాశమూ హోటలు బాయ్‌కి కలిగి "ఖానా తయ్యార్ సార్" అంటూ వాడు రావటంతో ముగ్గురమూ భోజనాల హాలువైపుకి నడిచాం.

"వాటే స్ర్పయిజ్! మీరు కూడా మాతోటే వస్తున్నారా?" మర్నాడు సైట్ సీయింగ్‌కి హోటలువాళ్ళు ఏర్పాటు చేసిన జీపులోకి ఎక్కబోతున్న నన్ను చూసి అతడు పలకరించడంతో కొంచెం చిరాకు వేసింది, దారిపొడుగూతా ఇతగాడి సొద భరించాలి కాబోలునని. బండిలో ఎక్కుదామా వద్దా అని ఒక్క నిమిషం తటపటాయిస్తుంటే "దీదీ! ఆప్ కహాఁసే ఆయే?" అంటూ ముందు సీట్లో కూర్చున్న అమ్మాయి వెనక్కి తిరిగి అతడి భార్యను పలకరిస్తుంటే చూసి అవాక్కయ్యాను. నిన్నటి రోజున పరిచయమయిన ఆవిడ తెలుగువెలుగైతే ఈ అమ్మయి బెంగాలీ మెరుపుతీగె - ఆ కళ్ళు చిన్నప్పుడు నేను చదివిన బెంగాలీ నవల "పెద్ద పెద్ద కళ్ళు" అనే టైటిల్‌తో ఉన్నది గుర్తుకు తీసుకువచ్చి - నన్ను అప్రయత్నంగా లోపలికి లాగించాయి. జాగ్రత్తగా అతడి పక్కన కాకుండా వెనక సీట్లో చోటు సంపాదించి కూర్చున్నాను. నేను కూర్చున్న చోటునుంచి మెరుపు తీగె కనిపించేలా సర్దుకున్నాను. సౌందర్య వీక్షణమే నాకు కావలసింది. అందాన్ని చూస్తూ గంటలు గంటలు గడిపెయ్యగలను నేను. అది ప్రకృతి అయినా, స్త్రీ అయినా! అయితే అస్తమానమూ చూస్తూ కాలం గడుపుతామంటే అందమైన స్త్రీలు ఒప్పరు కాబట్టి ప్రకృతి ఆరాధనకే పరిమితమయ్యాను. తరచూ చూసిన ప్రదేశాలే అయినా అందాలని ఆస్వాదించటానికి ఖాళీ దొరికినప్పుడల్లా వచ్చేస్తుంటాను. ఈసారి నా అదృష్టం బాగుంది. ప్రకృతితో పాటూ మెరుపూ - వెలుగూ నాకు కనువిందే ఇక.

ఆ రోజంతా అందాల ఆస్వాదనతో ఆహ్లాదంగా గడచిపోయింది. మధ్య మధ్యలో మెరుపుతో హిందీలో వెలుగుతో (ఆవిడ పేరు నేను అడగాలేదు ఆవిడ చెప్పలేదు) తెలుగులోనూ ముచ్చటించటం కూడా జరిగింది. మెరుపుకి కొత్తగా పెళ్ళయిందట. భర్తకూడా వొడ్డూ పొడుగూ మంచి పోలిక అట్టే రంగులేక పోయినా 'హీ - మాన్'లో ఉన్నాడు. మెరుపును బాగా గారాంగా చూసుకుంటున్నాడు. ఆ అమ్మాయి కూడా అతని దగ్గర ముద్దులు కుడుస్తూ హనీమూన్‌ని బాగా ఎంజాయ్ చేస్తోంది. మధ్య మధ్యలో 'అంకుల్' అంటూ నా దగ్గరా 'ఆంటీ' అంటూ వెలుగు దగ్గరా మొగుణ్ణి గురించి చిన్న చిన్న ఫిర్యాదులు చేస్తూ చనువుగా మాట్లాడింది. తెలుగు వెలుగుకి హిందీ అందులోనూ బెంగాలీ యాసతో కూడిన హిందీ అర్థం అవక నావైపు చూస్తే నేను తెలుగులో చెప్పాను. మా ముగ్గురి మధ్యా మాటలు జరుగుతున్నప్పుడు మెరుపు భర్త చిరునవ్వుతో చూస్తుంటే వెలుగు భర్త ముఖం చిట్లించుకునేవాడు.

"ఆ బెంగాలీ వాళ్ళగోల మనకెందుకండీ. మనం మనం తెలుగువాళ్ళం. మనం ఒక కట్టుగా ఉందాం రండి గురువుగారూ! అయినా ఆ పిల్లేవిటీ? పదిమందీ ఉన్నారనైనా లేకుండా ఎంతమొగుడైతే మాత్రం పట్టపగలు అతని మీద పడిపోతుందే?" అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకోవటం వొక్కటే మినహాయింపుగా మాట్లాడే అతని ధోరణి చూస్తే నాకు నవ్వూ కోపమూ రెండు వచ్చాయి. ఏది ఏమైనా ఆ రాత్రికి ఆనందపు అనుభూతులనే మదినిండా నింపుకుని వాటితోనే కడుపు నిండిందనిపించటంతో భోజనానికి కూడా వెళ్ళకుండా నాకెంతో ఇష్టమైన తలత్ మహమూద్ పాటల సి.డి వింటూ హాయిగా నిద్రపోయాను.

ఆ రోజే కాదు ఆ మర్నాడు కూడా సరదాగా గడచిపోయింది. మధులిత అనే పేరుగల మెరుపుతీగె, సరస్వతి అనే పేరుగల తెలుగువెలుగూ ఇద్దరూ చక్కటి కబుర్ల కాలక్షేపాన్ని అందజేయటంతో వాళ్ళ పేర్లు ఫలానా అని ఆ కబుర్ల మధ్యలోనే తెలిసింది. మధులిత భర్త ముద్దుల భార్యని మురిపెంగా చూసుకున్నా, కూడా వచ్చిన తన స్నేహితునికి కంపెనీ ఇస్తూ ముందుకి నడవటంతో, భారీ కాయం మూలంగా చకచకా నడవలేక వెనక ఉండిపోయే సరస్వతి భర్త రామారావు వల్ల - మధ్యలో మేం ముగ్గురం ఒక జుట్టులాగా అయి నడిచాము. మధులిత అయితే నా స్వంత మేనకోడలో అన్నయ్య కూతురో అయినట్లు 'అంకుల్ అంకుల్' అంటూ నా కూడా తిరిగింది. ఏభయ్యో పడిలో పడ్డ నాకు ఇప్పటి వరకూ ఎవరితోనూ బంధం ఏర్పడలేదు. తీరా ఈ నాలుగు రోజుల తరువాత ఈ అమ్మాయి

బంధం నాకు మనస్తాపం కలుగజేస్తుందేమో నన్న సందేహం లోలోపల తొలిచినా దాన్ని పట్టించుకోక ఆ అమ్మాయి చెప్పే కబుర్లు వింటూ గడిపేశాను.

"అంకుల్! మా పెళ్ళి ఎలా అయిందో తెలుసా. డాడీకి అసలు ఇష్టంలేదు. కానీ రామ్ పట్టుబట్టి అమ్మను ఒప్పించి పెళ్ళి జరిపించాడు. అమం చెబితే డాడీ కాదనరుగా" నవ్వుతూ చెబుతుంటే సొట్టలు పడ్డ బుగ్గలు మెరుస్తున్న కళ్ళు ఇంకా పసితనం వీడని ఛాయలు నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. ఇంత చక్కటి అమ్మాయిని చేపట్టిన రామ్ అదృష్టవంతుడు. ఆ మాటే అన్నాను ఆ అమ్మాయితో. ఫక్కున నవ్వింది మళ్ళీ. "ఎందుకలా నవ్వుతావ్?" అన్నాను. "రామ్ అంటే మా ఆయనకి స్నేహితుడు. అదుగో అక్కడ నుంచుని రాజ్‌తో మాట్లాడుతున్నాడే అతనే. మా పెళ్ళి చేయించటమేకాదు. ఈ ట్రిప్ ఏర్పాటు చేసి తీసుకొచ్చింది కూడా రామ్ భయ్యానే" అంది. నాకు చాలా ఆశ్చర్యమేసింది. ఎంత గాఢస్నేహితుడైనా పానకంలో పుడకలాగా కొత్త దంపతులతో కూడా రావటమేమిటోనని.

ఆ మాటే అన్నాను ఆ రోజు రాత్రి భోజనాల సమయంలో సరస్వతీ, రామారావులతో.

"నేను ముందే చెప్పాను కదండీ. వాళ్ళదంతా అదోరకమని. మీరేదో పూసుకు తిరిగారు గానీ" సందు దొరికింది కదా అని చలాగ్గా అంటించాడు రామారావు.

నేను ఆయన మాటలను ఖాతరు చెయ్యక మీ ఉద్దేశమేమిటన్నట్లు సరస్వతిగారివైపు చూశాను.

"ఆ అమ్మాయి చాలా అమాయకంగా కనిపిస్తోంది. లోకం తెలియని పిల్ల. రామే వాళ్ళ కుటుంబానికి చాలా సన్నిహితుడటగదా! అతణ్ణి భయ్యా అంటోంది కదా! కొత్త పెళ్ళికొడుకుతో అమ్మాయినొక్కదాన్నీ పంపటానికి సందేహించి అతణ్ణి తోడుగా మధు అమ్మగారే పంపారేమో? ఇటువైపు పద్ధతులేమిటో మనకు తెలియవుగా"

సరస్వతిగారు చెప్పింది విన్నాక నాకూ అది సబబుగానే తోచింది. ఎంతైనా ఆడవాళ్ళ ఆలోచన లోతయినది. అందులోనూ సరస్వతిగారిలో చదువుకుని ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారి మాట ఇక చెప్పేదేముంది?

మూడోరోజు పొద్దున కాంచన గంగ శిఖరం చూద్దామని బయలుదేరే సమయానికి మధులిత కనిపించలేదు. కానీ మధులిత భర్త మేము జీపు దగ్గరకి వచ్చేప్పటికే ముందు సీట్లో కూర్చుని ఉన్నాడు. మధులిత ఏదని అడిగితే ఆ అమ్మాయికి జ్వరం వచ్చిందనే అందుకని రాలేదనే అన్నాడు. "అదేమిటీ జ్వరంతో ఒక్కత్తే హోటల్‌లో ఉన్నదా" అంటే రామ్ తోడు ఉన్నాడని అన్నాడు. ఇది నాకు మరీ విడ్డూరంగా అనిపించింది. "ఇదేమిటండీ భర్తగా తను తోడువుండాలి కానీ స్నేహితుడిని ఉంచిరావడమేమిటీ?" అనేశాను చటుక్కున.

"మరదేనండి. నేను మొదటినుంచీ అంటుంటే మీరు పట్టించుకున్నారు కాదు. ఆ అమ్మయిని ఇతగాడు పెళ్ళి చేసుకున్నాడో, లేవదీసుకొచ్చాడో ఎవరికి తెలుసు?" వాళ్ళని కడిగేయబోయాడు రామారావు.

"ఇహ చాల్లెండి. వాళ్ళమీదా వీళ్ళ మీదా లేనిపోని కథలల్లటానికా మనమిక్కడకొచ్చింది?" సరస్వతిగారు తీవ్రంగా కసురుకోవటం రామారావు మీదేకాదు నా మీదా ఒక దెబ్బవేసినట్టయి మిన్నకుండిపోయాను. రెండు రోజులపాటు సరదాగా కబుర్లు చెబుతూ తిరిగిన మధులిత లేకపోవటంతో బాటు, మబ్బులు ముసిరి కాంచనగంగ శిఖరం కనిపించక పోవటంతో ఆ రోజు ట్రిప్పు నిరాశగా పూర్తయింది. ఎంత సరిపెట్టుకుందామన్నా రామారావు అన్న మాటలు కూడా విషప్పురుగులు లాగా నా బుర్రను దొలిచేసాయి ఆ రాత్రంతా. పాటలు వింటూ నిద్రపోదామని ఎంత ప్రయత్నించినా అమాయకంగా నవ్వుతూ ఉండే మధులిత ముఖమే కళ్ళముందు కదలాడి ఆ పిల్ల ఏమయినా ఆపదలో చిక్కుకుందా అన్న సందేహం పట్టిపీడించి ఇంక రాత్రంతా నాకు దాదాపు జాగరణే అయింది.

కాలింగ్ బెల్ గట్టిగా మోగుతూంటే మెలుకువ వచ్చి లేచి తలుపు తీశాను. ఎదురుగా రూమ్ సర్వీస్ చేసే అమ్మాయి 'బెట్టీ' నిల్చుని ఉంది. మీకోసం కింద గాడీ రెడీగ ఉంది రమ్మంటున్నారు అని చెప్పి వెళ్ళిపోయింది, 'మధులిత ఎలా వుంది? ' అని నేను అడుగుదామనుకుంటుండగానే!

ఆ రోజు నేను కలింపాంగే వెళుతున్నాను. సరస్వతిగారూ, రామారావూ ఊళ్ళో మిగిలిన పాయింట్స్ చూసి ఆ మర్నాడు గౌహతి వెళ్తామని చెప్పారు. మధులితా వాళ్ళు మధులిత అత్తగారి ఊరైన దుర్గాపూర్‌కి వెళ్ళాలి. ఇవాళ నేను ఆలస్యంగా లేచాను. ఈ పాటికి వాళ్ళు వెళ్ళిపోయివుంటారు. ఇంతాజేసి వాళ్ళ దగ్గర సెలవు తీసుకోవటం కూడా కుదరలేదని బజర్ నొక్కి బెట్టీని వెనక్కి పిలిచి ఒక అరగంటలో తయారయి వస్తున్నాను జీపువాళ్ళని ఆగమన్నానని చెప్పమని పంపి గబగబా తయారయి కిందకి వచ్చాను, హోటలు యజమాని అయిన ఆ అమ్మాయికి తాళం చెవులు ఇద్దామని. అక్కడ ఆ అమ్మాయికి బదులుగా ఆ అమ్మాయి తండ్రి కూర్చుని ఉన్నాడు. ఆయన నాకు పరిచితుడే కావటంతో "మీ అమ్మాయి రాలేదేమిటి?" అని అడిగాను తాళాలు ఇస్తూ.

"మా అమ్మాయి పైన మీటింగులో ఉంది" అన్నాడు. మీటింగేమిటి? అని అడగబోయి హోటలు మేనేజ్ మెంటుకి సంబందించిన మీటింగు కాబోలునని అడగకుండా బయటకు నడిచాను. రామారావు ఎదురుపడి నన్ను చూసి "గురూగారూ! మీరింకా వెళ్ళలేదా? ఎవరూ కంపెనీ లేక బోరుకొట్టి చస్తున్నా - ఇవాళ్టికి మీ ప్రయాణం మానేసి నాతో రెండు రౌండ్స్ వేద్దురూ" అన్నాడు. 'రెండే' అంటే రామారావు పరిభాషలో పగలు పేకాట, రాత్రి మందు.

ఆశ్చర్యపోవటం నా వంతయింది. "అదేమిటి? మీరు లోకల్ పాయింట్స్ చూడటానికి వెళ్తామన్నారుగా?" అన్నాను.

"అయ్యో రామ! మీకు తెలియదు కాబోలు. మా ఆవిడొక పిచ్చిమాలోకం. ఆవిడకు జతగా ఆ కుర్రకుంకలిద్దరూ కలిశారు. ఇంక నా గోడు ఎవరు పట్టించుకుంటారు?" రామారావు మాటలు నాకేమీ అర్థంకాలేదు.

"అర్థం కాకపోవటానికి నేను అచ్చ తెనుగులోనే చెబుతున్నా కదండీ! వాళ్ళెవరమో మనమెవరమో - ఏదో నాలుగు ఊళ్ళు చూసి పోవటానికి వచ్చాము గాని పంచాయితీలు పెట్టి పెళ్ళిళ్ళు చెయ్యటానికి వచ్చాముటండీ ఖర్మకాకపోతే - ఆ పిల్ల అదెవరూ బెట్టీయట. దానికి ఆ రామ్ గాడు కడుపో కాలో చెయ్యటమేమిటి? వాళ్ళిద్దరికీ ముడిబెట్టటానికి నిన్నగాక మొన్న పెళ్ళి చేసుకున్న కుర్రది మధులిత, మా ఆవిడతో కలిసి పైన మీటింగ్ పెట్టించింది. మధ్యలో మా ప్రయాణం తుస్సుమంది చూశారూ!" రామారావు వాపోతూనే ఉన్నాడు. కానీ అదంతా నా బుర్రకెక్కలేదు. పెద్ద పెద్ద కళ్ళతో అమాయకంగా కనిపించిన మధులిత పూనిక తలచుకుంటే ఆడపిల్లలను అంచనా వేయలేము సుమా అనిపించింది.

"నేను ముందే చెప్పాను కదండీ ఈ వైపు ఆడపిల్లలు సామాన్యులు కాదని. ఆ రామ్ - వాడో వెధవనుకోండి - ఏదో సరదా పడ్డవాడు అంతటితో ఊరుకోకుండా మళ్ళీ ఇక్కడకు వచ్చి ఆ పిల్లదాంతో వ్యవహారం నడపబోతే అది మధులిత కళ్ళ బడిందిట. నిన్న జ్వరమని మనకి అబద్ధం చెప్పారుగాని ఆ విషయం తేల్చటానికే మధులిత మనతో రాకుండా ఇక్కడే ఉండిపోయి రామ్‌ని పెళ్ళికి ఒప్పించిందట. నిన్నరాత్రి మా ఆవిడ మధులిత ఆరోగ్యం ఎలా ఉందని అడగబోతే ఈ విషయమంతా బయటపడింది. ఇంక ఇవాళ ఆడంగులందరూ కలిసి పెళ్ళి గురించి పైన పెద్ద మీటింగ్ పెట్టారు. మా ఆవిడకు వాళ్ళ భాష వచ్చాయేమన్నానా? అనవసరంగా ఈ లంపటాలన్నీ తగిలించుకుంది. " రామారావు అడ్డూ ఆపూలేకుండా చెప్పుకుపోతూనే ఉన్నాడు. ఇందాక నన్ను పిలవటానికి వచ్చిన బెట్టీ - ఆ అమ్మాయి ఈ హోటలులో సర్వరు పనిచేస్తుంటుంది. అనాధ పిల్ల అయితే ఆరేళ్ళనుంచీ ఈ హోటలులో పనిచేస్తూంది. ఇప్పుడు బహుశః ఇరవై ఏళ్ళుంటాయేమో? పనిచేసే పిల్ల అయిన చాలా అందంగా ఉంటుంది. రామ్ బాగా ధనవంతుడు. కలకత్తాలో పెద్ద వ్యాపారం. అతను మనసుపడ్డా వాళ్ళ వాళ్ళు ఒప్పుకోవద్దూ?

"ఒప్పించే బాధ్యత మధులిత తీసుకుంది. కాకపోతే తోడుగా మనల్ని రమ్మంటూంది. మీకు బెంగాలి వచ్చుగా మనం కూడా వెళితే పని తొందరగా అవుతుంది." పైన మీటింగు పూర్తి చేసుకుని కిందకి దిగి వచ్చిన సరస్వతిగారు నాతో అన్నారు.

ఏమంటాను? ఒక జంటను కలపటానికి పూనుకున్న సరస్వతిగారూ, మధులితా, అది సక్రమంగా జరగాలని పట్టుగా ఉన్న పాతికేళ్ళు కూడా నిండని హోటలు యజమాని - స్మితా వాళ్ళు ముగ్గురూ.. వావ్.. హేట్సాఫ్ అనుకున్నాను.

●●●

అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

# ప్రేమరాహిత్యం

ప్రవీణ కొల్లి

**రఘు పుస్తకం ముందు కూర్చున్నాడే కానీ,** చూపంతా గుమ్మంవైపే ఉంది. ఎప్పుడెప్పుడు డోర్ బెల్ మోగుతుందా అని ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు. ఆ రోజు నెలలో రెండో శుక్రవారం. రఘు నాన్న ప్రతాప్ ఆ రోజు తప్పకుండా వస్తాడు హైదరాబాద్కి. ఆ రోజు ఉదయాన్నే ఫోన్ చేసి కూడా చెప్పాడు "సాయంత్రంకల్లా నీ దగ్గర ఉంటాను" అని. ప్రతాప్కి నెలలో రెండో శనివారం సెలవు. శని, ఆదివారాలు కొడుకుతో ఉండటానికి గత మూడు సంవత్సరాల నుంచీ క్రమం తప్పకుండా వస్తూనే ఉన్నాడు.

రాత్రి పదిగంటలైంది. రఘు అలాగే పుస్తకాల ముందు కూర్చున్నాడు నాన్న కోసం ఎదురుచూస్తూ. రఘు అత్త వాసంతి వచ్చి,

"ఏరా ఇంకా పడుకోలా? పది అయిపోయింది. ఇంక పడుకో" అంది,

"మరే నాన్న?" అంటూ గొణిగాడు రఘు.

"వస్తాడులేరా మీ నాన్న, ట్రైన్ లేట్ అయ్యివుంటుంది" అంటూ రూములోని లైట్ తీసేసింది.

ఆ చీకట్లో, ఆ పసివాడి కళ్ళు, వాడి నాన్న కోసం తపించి పోతున్నాయి.

నాన్న వస్తే రఘుకి పండుగ. ఎన్నో చాక్లెట్లు, బిస్కెట్సు, బొమ్మ కార్లు, కొత్త బట్టలు తీసుకువస్తాడు. రఘు ఎదురుచూసేది వీటికోసం కాదు. నాన్న రాగానే ఎంతో ప్రేమగా కౌగిలించుకుంటాడు. తలపైన ఆప్యాయంగా నిమురుతాడు. బుగ్గలపై ఆత్మీయంగా ముద్దు పెట్టుకుంటాడు. ఆ ప్రేమ కోసం తపించుకుపోతున్నాడు రఘు. నాన్న ఉన్న ఆ రెండు రోజులు రఘుకి ఎంతో సంబరం.

రాత్రి పదకొండు గంటలకు డోర్ బెల్ మోగింది. చటుక్కున మంచం మీద నుంచి దూకి హాల్లోకి పరిగెట్టాడు రఘు. ఇంతలో అత్త వాసంతి వచ్చి తలుపు తీసింది. ప్రతాప్ గుమ్మంలో ఉండగానే రఘు వెళ్ళి నాన్న కాళ్ళకి చుట్టేసుకున్నాడు.

"నీ కొడుకు నిద్ర కూడా పోకుండా ఎదురుచూస్తున్నాడన్నయ్య నీకోసం" అంటూ వాసంతి ప్రతాప్ చేతిలో సూట్కేస్ అందుకుంది.

"ఏరా తండ్రి, ఎలా ఉన్నావు? బాగా చదువుకుంటున్నావా?" అంటూ కుశల ప్రశ్నలు అడిగాడు ప్రతాప్.

అన్నింటికీ తలూపాడు రఘు.

రఘు ఏడేళ్ళ వయసులో అమ్మ కన్ను మూసింది. ఊహ తెలిసీ తెలియని వయసులో ఒంటరివాడయ్యాడు. ప్రతాప్ భార్యా వియోగాన్ని తట్టుకుని బయటపడటానికి సంవత్సర కాలం పట్టింది. మరో పెళ్ళి చేసుకోమని బంధువర్గం ఎంతగా చెప్పినా వినలేదు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు రఘు క్షేమమే ముఖ్యం అనుకున్నాడు. అదే పరిసరాలలో ఉంటుంటే పోయిన భార్య ఆలోచనల్లో నుంచి బయటపడలేక పోతుంటే, పనిచేస్తున్న కంపెనీలోనే ఒరిస్సాకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.

ప్రతాప్ చెల్లి వాసంతి, రఘు బాధ్యత తీసుకుంది. వాసంతి హైదరాబాదులో ఉంటుంది. తనకు ఇద్దరు పిల్లలు. ఒక పాప, బాబు పాప పేరు భవ్య, ఎనిమిదేళ్ళు. బాబు పేరు భగత్, పన్నెండు ఏళ్ళు. రఘుని అన్నివిధాల వాసంతి దగ్గర ఉంచటమే మేలు అనుకున్నాడు ప్రతాప్. చదువుకి ఇబ్బంది ఉండదు. పిల్లలు ఉంటారు తోడుగా అనుకున్నాడు. అతి కష్టం మీద రఘుని వాసంతికి అప్పచెప్పి జాబులో జాయిన్ అయ్యాడు. ప్రతి నెల రెండో శని, ఆదివారాలు క్రమం తప్పకుండా వస్తాడు కొడుకుని చూడటానికి.

వాసంతి రఘుని పెంచటం తన బాధ్యత అనుకుంటుంది. నిర్వహించాల్సిన బాధ్యతను మనసుతో కంటే మెదడుతోనే ఎక్కువ ఆలోచిస్తుంది.

ఒకానొక పండుగకు వాసంతి పిల్లలు ముగ్గురికి కొత్త బట్టలు తీసుకొచ్చింది. సాయంత్రం పిల్లలు స్కూల్ నుంచి రాగానే, బట్టల పాకెట్స్ వాళ్ళకు ఇచ్చింది "ఎలా ఉంది నా సెలక్షన్?" అదిగింది వాసంతి.

"సూపర్ అమ్మా, నా గౌను చాలా బాగుంది. ఈ ఫ్రిల్స్ చాలా బాగున్నాయి" ఆనందంగా చెప్పింది భవ్య.

"ఏరా భగత్, నీ డ్రెస్ ఎలా ఉంది? చెప్పవే?" భగత్ వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"అమ్మా.. పోయిన సారి కూడా ఈ కలర్ ప్యాంటు కొన్నావు. మళ్ళీ అదే రంగు తీసుకొచ్చావేమిటి?" కాస్త నిరుత్సాహంగా అడిగాడు భగత్.

"కాదురా కన్నా, ఈ ప్యాంటుకి చూడు ఎన్ని జేబులు ఉన్నాయో. నువ్వు చాలా రోజులనుంచి అడుగుతున్నావనే కొన్నాను. నీకు నచ్చకపోతే మార్చేస్తానులే" అనునయంగా చెప్పింది వాసంతి.

అమ్మ ఇచ్చిన వివరణకు తృప్తి పడ్డ భగత్, "మార్చొద్దు అమ్మా.. నాకు నచ్చింది" తృప్తిగా చెప్పాడు.

రఘు తన వంతు కోసం ఎదురుచూస్తున్నాడు. తనకి అత్త తెచ్చిన డ్రెస్ ఎంతగా నచ్చిందో చెబుదామని.

"అత్తా.." అని మొదలు పెట్టగానే, వాసంతి "పిల్లలూ.., మీకు పాలు తీసుకొస్తాను. తొందరగా యూనిఫారం మార్చుకుని రండి" అంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది.

రఘు నిరుత్సాహంగా లోపలికి వెళ్ళిపోయాడు. రఘు చిన్నబుచ్చుకున్నాడు అని కూడా వాసంతి గుర్తించలేదు.

మరో రోజు భవ్య, భగత్‌లు కలిసి "మేమిద్దరము ఒకటి, నువ్వు వేరు" అంటూ రఘుని ఏడిపిస్తున్నారు. రఘు ఏడుపు విని ఆ గదిలోకి వచ్చిన వాసంతి, భవ్య, భగత్‌లను కోప్పడిందే కానీ, రఘుని దగ్గరకు తీసుకుని సముదాయించలేదు.

బయట నుంచి చూస్తే ఎవరికైనా 'రఘు అదృష్టవంతుడు. తల్లి లేకపోయినా, అత్త తల్లిలా ఆదరిస్తుంది' అనే అనుకుంటారు. కానీ ఆ చిన్ని హృదయం ప్రేమరాహిత్యంతో తల్లడిల్లిపోతుందే అని ఆ కన్నతండ్రి కూడా గ్రహించుకోలేదు.

ఒకనాడు భగత్‌కు బాగా జ్వరం వచ్చింది. వాసంతి రాత్రి, పగలు భరత్ పక్కనే కూర్చుని కొడుకుని చూసుకుంది. ఆమె చెయ్యి ఆ మూడు రోజులు భగత్ నుదిటిపైనే ఉంది. నాలుగో రోజు కాస్త జ్వరం తగ్గుముఖం పట్టింది. ఒక వారంలో పూర్తిగా కోలుకున్నాడు.

మరు వారంలో రఘుకి మొదలైంది జ్వరం. ఈసారి వాసంతి చాలా కంగారుపడిపోయింది. వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళింది. టైం తప్పకుండా కనిపెట్టుకుని మందులు వేసింది. భవ్య, భగత్‌లు స్కూలికి వెళ్ళిన తర్వాత రఘు ఒంటరిగానే ఉండిపోయాడు రూంలో. ఆ ఒంటరితనంలో, వాసంతి భగత్‌కు చూపించిన తల్లి ప్రేమను తలచుకుని, తను కోల్పోతున్నది ఏమిటో తలుచుకుంటూ కుమిలిపోయాడు. మందులకన్నా ఆ పసివాడికి కావాల్సింది ప్రేమ, ఓదార్పు. అత్త తన నుదుటిపైన కూడా చెయ్యివేసి, తలని నిమరాలని, దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకోవాలని కలలు కన్నాడు.

ప్రతాప్ కొడుకుకి జ్వరం వచ్చిందని తెలిసి, ఒక వారం సెలవు తీసుకుని రెక్కలు కట్టుకుని వాలిపోయాడు. ఒకరాత్రి తండ్రీ కొడుకులు వేరుగా రూములో పడుకున్నారు. ఆ కబుర్లు, ఈ కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో,

"నాన్న నేనొకటి అడగనా?" సంకోచంగా అడిగాడు రఘు.

"ఏమిటి కన్నా" ప్రేమగా అడిగాడు ప్రతాప్.

"మరి.. మరి"

"చెప్పమ్మా, ఏమిటి సంకోచిస్తున్నావు?

"నాన్న నేను నీతో వచ్చేస్తాను"

ప్రతాప్ షాక్ అయ్యాడు. ఎప్పుడూ రఘు అలా అడగలేదు.

"ఏమ్మా.. ఎప్పుడూ లేనిది, అలా అంటున్నావు?"

ఒక నిమిషం ఆగి మళ్ళీ మెల్లగా అడిగాడు ప్రతాప్.

"నీకు ఇక్కడ ఇబ్బందిగా ఉందా?" భయంగా అడిగాడు ప్రతాప్.

"ఇబ్బంది అని కాదు నాన్న, ఊరికే నీ దగ్గర ఉందామని" చెప్పలేక చెప్పలేక చెప్పాడు రఘు.

"అత్త నిన్ను బాగానే చూసుకుంటుంది కదా.. భవ్య, భగత్‌తో కలిసి ఉండవచ్చు. అక్కడకు వస్తే నువ్వు ఒక్కడివే అయిపోతావు. నేను ఆఫీసుకి వెళితే నిన్ను ఎవరు చూసుకుంటారు చెప్పు? ఇక్కడ మంచి స్కూల్‌లో చదువుకుంటున్నావు. అక్కడ అవేమీ ఉండవు కదా" బాధగా చెప్పాడు ప్రతాప్.

తండ్రి మొహం చూసేసరికి రఘు మరింకేమీ మాట్లాడలేకపోయాడు.

"ఏమిటి నీ బాధ? " అని రఘుని ఎవరన్నా అడిగితే చెప్పటానికి ఏమీలేదు. మంచి స్కూల్‌లో చదువు, కావలసినవి అన్నీ అమర్చిపెట్టే తండ్రి, వేళకు వండిపెట్టే అత్త. కానీ రఘు మనసంతా శూన్యం. లేనిదల్లా తల్లిదండ్రుల ప్రేమ. ప్రేమరాహిత్యం రఘులో ఆత్మనూన్యతకు దారితీసింది. పద్దెనిమిదేళ్ళు వచ్చేటప్పటికి ఒక ఇంట్రోవర్ట్‌గా తాయారయ్యాడు. తనకంటూ ఒక వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకునే టీనేజ్‌లో, ప్రేమతో దిశానిర్దేశం చేసే వాళ్ళు లేక, రఘు తనలో తనే కుదించుకుపోయాడు.

అంతలోను అదృష్టము ఏమిటంటే, రఘు తన ఒంటరితనాన్ని చదువుతో కొంత దూరం చేసుకున్నాడు. ఎప్పుడు ఏదో పుస్తకం చదువుతూ ఉండేవాడు. పుస్తకాలే అతని స్నేహితులు. సాహిత్యం నుంచీ రాజకీయాల దాకా కనిపించిన పుస్తకమల్లా చదివేవాడు. ఎంతో జ్ఞానం ఉన్నా నలుగురిలో మాట్లాడలేడు. భవ్య, భగత్‌ల కంటే ఎప్పుడూ మంచి మార్కులే వచ్చేవి. దానితో మరి కాస్త దూరం అయ్యారు.

కాలక్రమంలో రఘు వైద్యుడు అయ్యాడు. హైదరాబాద్‌లోనే ప్రాక్టీసు మొదలుపెట్టాడు. భవ్య, భగత్ ఇంజనీరింగ్ చేసి ఉద్యోగరీత్యా అమెరికాలో సెటిల్ అయ్యారు. అందరికీ పెళ్ళిళ్ళు అయ్యిపోయాయి.

రఘుకి సరితతో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. పెళ్లైన కొత్తలో సరిత రఘుతో కాస్త ఇబ్బంది పడింది. మనసు విప్పి మాట్లాడడు, ప్రేమ చూపించడు అంటూ అమ్మతో ఎప్పుడూ వాపోయేది. సరిత తల్లి కష్ట సుఖాలు తెలిసిన మనిషి. ఆవిడ కొంతకాలం రఘు, సరితలతో కలిసి ఉండి, రఘు మనస్తత్వం అర్థం చేసుకుంది. సరితకు అర్థమయ్యేటట్లు చెప్పటంతో, సరిత మనసు కూడా కొన్ని నెలలకు సర్దుకుంది. మెల్లగా రఘుని తన దారిలోకి తెచ్చుకుంది.

ఇప్పుడిప్పుడే రఘు కొంత మారాడు. వృత్తికే అంకితమయిపోయినా, నలుగురిలో కలవగలుగుతున్నాడు. ప్రతాప్ రిటైర్ అవ్వటంతో, రఘు సంసారంలో వచ్చి చేరిపోయాడు.

వాసంతికి ఈ మధ్య ఆరోగ్యం బాగోట్లేదు. ఎప్పుడూ ఏదో ఒక అనారోగ్యమే. పిల్లలిద్దరూ దూరదేశాలలో ఉన్నారన్న బెంగ.

ఒకనాడు రాత్రి వాసంతి భర్త రఘుకి ఫోన్ చేసాడు, వాసంతి ఉన్నట్లుండి కుప్పకూలిపోయింది. ఆఘమేఘాలమీద రఘు, ప్రతాప్ సరిత వాసంతి ఇంటికి వెళ్ళారు. హుటాహుటిన హాస్పిటల్‌లో జాయిన్ చేసారు. గుండెపోటు ఎక్కువగా వచ్చింది. వెంటనే వైద్యం అందటంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రెండు రోజుల తర్వాత వాసంతికి స్పృహ వచ్చింది. కళ్ళు తెరిసీ తెరవగానే,

"భవ్య, భగత్ వచ్చారా?" అంటూ నీరసంగా అడిగింది.

"దూరం నుంచీ అంత తొందరగా రాలేరుగా అత్తా", అనునయంగా చెప్పాడు రఘు.

"రాలేరా?" ప్రశ్నార్థకంగా, బాధగా గొణిగింది.

"రోజు ఫోన్ చేస్తూనే ఉన్నారు. డబ్బులు అవసరం అయితే పంపిస్తాము అని కూడా అన్నారు అత్తా", సముదాయించటానికి ప్రయత్నించాడు రఘు.

"డబ్బులు కాదు.. ఇలాంటి సమయంలో పిల్లలు పక్కన ఉండాలి" ఇంక మాట్లాడలేకపోయింది.

"నేనున్నాను కదత్తా" ప్రశార్థకంగా, మొహమాటంగా అన్నాడు రఘు.

"నువ్వు ఉన్నావులే.. కానీ" ఆపేసింది వాసంతి.

రఘు ఇంక అక్కడ ఉండలేక వెళ్ళిపోయాడు.

వారం రోజుల్లో వాసంతి హాస్పిటల్ నుంచి డిస్చార్జ్ అయ్యింది. రఘు, ప్రతాప్‌ల బలవంతం మీద రఘు ఇంటికి వచ్చింది. రఘు వాసంతిని కంటికి రెప్పలా చూసుకున్నాడు. అందులో సరిత సాయం చాలా ఉంది. ఒక నెలరోజుల్లో పూర్తిగా కోలుకుంది.

వాసంతి ఆరోగ్యం బాగోనప్పుడు రోజు భవ్య, భగత్‌ల దగ్గర నుంచి వచ్చే ఫోన్లు, మెలమెల్లగా వారంలో ఒక రోజుకు, ఆ తర్వాత పది, పదిహేను రోజులకు ఒకసారి వచ్చేవి. "అదేమిట్రా ఫోన్ చెయ్యలేదు" అని వాసంతి నొచ్చుకుంటే, "అమ్మా, నీకంత చాదస్తం. మాకు ఇక్కడ తీరిక ఏది?" అంటూ విసుక్కునేవాళ్ళు. వాసంతి ఎంతగానో నొచ్చుకునేది.

ఒకనాడు సాయంత్రం అందరూ కలిసి భోజనం చేస్తున్నారు.

"రఘు, నేను పూర్తిగా కోలుకున్నాను. ఇంటికి వెళ్ళిపోతాను", అంది వాసంతి.

"ఎందుకత్త ఇక్కడే ఉండిపోవచ్చుగా?" అడిగాడు రఘు.

"ఆ ఇంట్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి కద రఘు. నేను ఏమి ఇబ్బంది పడను", చెప్పింది వాసంతి.

"సౌకర్యాలు ఉంటే సరిపోతుందా అత్తా? ప్రేమానురాగాలు అవసరం లేదా?" సూటిగా అడిగాడు.

వాసంతి కంట్లో నుంచి కన్నీటి చుక్క అన్నం తింటున్న కంచంలో పడింది. ఆ కన్నీటి చుక్కలో రఘు చిన్ననాటి మొహం కనిపించింది. ఆ కన్నీటి చుక్కలో ఎన్నో అర్థాలు, బాధలు కనిపించాయి వాసంతికి.

"అత్తా, నువ్వు ఇక్కడ ఉండటం నాకు ఇష్టం. నిన్ను శాసించే హక్కు నాకులేదు. మరి నీ ఇష్టం", అంటూ లేచి వెళ్ళిపోయాడు రఘు.

●●●

# ఆమె ఎవరు? విజయ (కర్రా) గంటి

**పది అడుగుల దూరంలో ఆమె!**

ఇలా, ఇక్కడ... ఇప్పుడు... ఆకాశంలోంచి కాని ఊడి పడిందా?

అటూ, ఇటూ చూస్తూ ఇటు వయిపే వొస్తోంది. వెనక్కి తిరిగి వెళ్ళే వ్యవధి లేదు. పక్కకి తప్పుకొని తప్పిచ్చుకుందామంటే అటూ ఇటూ ఒరుసుకొని నడుస్తున్న జనం, వాళ్ళా వెనకాల కూరల బళ్ళు. ఇంచు మించు ఆరు సంవత్సరాలనుండి వస్తున్నాడు ఈ రైతు బజారుకి. అప్పుడప్పుడు తెలిసిన మొహాలు కనిపిస్తుంటాయి. కాని ఈమె... ఇలా... ఎదురవుతుందని ఊహించలేదు.

ఎనిమిదేళ్ళయిందా? పదేళ్ళయిందా? చూసి. సన్నజాజి తీగలాంటి అమ్మాయి గున్నమావిలాగ మారింది. మారినందుకు కాదు కాని ఇప్పుడా వేషం, నడకలో ఆ ఠీవి ఎదురవగానే ఎందుకో వెన్నులోంచి చలి పాకినట్లయింది. అప్పటికే చుట్టూ చూస్తు వస్తున్న ఆమె ఎదురుగుండా కళ్ళప్పగించి చూస్తున్న అతన్ని పరకాయించి చూసేలోగా, ఉలిక్కిపడి, తేరుకుని... మొహం తిప్పుకుని... ప్రక్కనుండి ముందుకు కదిలాడు. సూటిగా చూడగానే తత్తరపడి మొహం దాచుకుని వెళ్ళేవాళ్ళు ఆమెకి కొత్తేమి కాదు.

ఓరగా తల తిప్పి చూసాడు. నడుస్తున్న ఆమె సడన్‌గా వెనక్కి తిరిగింది. అక్కడ కూరలేమి చూడకుండా గబగబా నడుస్తూ ఎడమ పక్క సందులోకి తిరిగాడు. ఓ రెండు పాల కూర కట్టలు, మరో సొరకాయ కొని ముందుకు కదిలాడో లేదో మళ్ళీ ఎదురుపడిందామె. ఈసారి మొదటిసారిలా కంగారుపడకుండా మొహం మరింత క్రిందకి వాల్చేసి ప్రక్కనుండి వడివడిగా అడుగులేసాడు. అయినా ఈసారెందుకో ఆమె తనకేసి పరీక్షగా చూస్తున్నట్లు అనిపించింది.

ఓ క్షణం కూరలు కొనడం ఆపి ఇంటికి వెళ్ళిపోదామా అనిపించింది. కాని వీలుపడదు. గీచి గీచి బేర మాడి, నాణ్యత దగ్గర రాజీ పడకుండా, వారానికి సరిపడా కూరలు తీసుకు రాకపోతే భార్య మంగ తాయారు ఊరుకోదు.

ఓ పది అడుగులు వేసాక నెమ్మదిగా ఆగి తలతిప్పి చూసాడు. అదే సమయానికి ఆమె కూడ వెనక్కి తిరిగి అతన్ని చూసింది. గుండె కప్పలా ఎగిరి గొంతులోకి వచ్చినట్లయింది. తల వేగంగా ముందుకు తిరిగినా, కాళ్ళు ససేమిరా ముందుకు కదలనన్నాయి. బలవంతంగా ఈడ్చుకుంటూ ముందుకు నడిచాడు.

అతడి ఓర చూపులు తల తిప్పుకున్న విధానం ఎక్కడో ఎదో స్ట్రైక్ అయినట్లు ముందుకు రెండడుగులు వేసిన ఆమె ఆగి పోయింది. కళ్ళు కొద్దిగా చిట్లించి, కుడి చూపుడు వేలితో చెంపమీద రాసుకుంటూ 'వాడేనా వీడు?' అని ఆలోచిస్తే - 'వీడే వాడనుకుంటా!' అంది ఆమె మనసు. 'మళ్ళీ కనిపించినప్పుడు ఓ చూపు చూడొచ్చులే' అని సరిపెట్టుకుంది.

ఈసారతడు అటూ... ఇటూ... ఓసారి తేరిపార చూసి బెండకాయల బండి దగ్గర ఆగాడు. అన్నిటికన్నా కష్టమయిన పని బెండకాయలు ఏరడం. ముచిక విరిచి చూద్దామంటే కూరలమ్మి ఒప్పుకోదు. విరవకుండా కొని తీసుకెళితే "మీ మొహంలాగే వున్నాయి ముదురు ముతక బెండకాయలు" అంటూ మంగ రుసరుసలాడుతుంది.

బుట్ట తీసుకొని బెండకాయలు ఏరడం మొదలు పెట్టాడు.

ఇంతలో కూరలమ్మి "రండి మేడం! రండి! లేత బెండకాయలు తీసుకోండి!" అంటూ నవ్వుతూ ఎవరినో ఆహ్వానించింది. అతడు పక్కకి చూసి గతుక్కుమన్నాడు.

"అంత లేతగా ఏమి లేవే!" అంటూ ఆమె పక్కనే వచ్చి నిల్చుంది. "నువ్వుండవయ్యా! అమ్మగారిని ఏరుకోని" అంటూ కసిరి, లోపలనుండి తీసి లేత లేత బెండకాయలు మరిన్ని కుప్ప పోసింది కూరలమ్మి. ఆమె అతడి మొహంలోకి చూసి ఓ సారి నవ్వి కాయలు ఏరుకో సాగింది. కూరలమ్మి కసిరినందుకు జాలి పడి నవ్విందా లేక తనిని గుర్తుపట్టి నవ్విందా తేల్చుకోలేక... ఏరిన సగం బెండకాయలని వొదులుకోలేక... అతడు మొహం పక్కకి తిప్పుకొని అక్కడే నిల్చున్నాడు.

ఎప్పుడయితే మళ్ళీ మొహం చాటు చేసుకుంటూ తత్తర పడ్డాడో ఆమె అనుమానం బలపడింది.

"ఏ మిస్టర్! ఆ బుట్ట ఇలా అందుకో" అంది. వద్దన్నా అధికారం ఒలికింది ఆ కంఠంలో. కొద్దిగా మొహం తిప్పి బుట్ట అందిస్తున్న అతన్ని కాస్త పరీక్షగా చూసింది. 'అనుమానం లేదు, వాడే వీడు!' అంది ఆమె మనసు ఈసారి.

కూరలమ్మికి డబ్బులిచ్చి ఆమె కదిలి వెళ్ళి పోయాక 'హమ్మయ్యా!' అని నిట్టూర్చి గబగబా బెండకాయలు ఏరి తీసుకున్నాడు. మరో చోట ఆగి రెండు కొత్తిమీర కట్టలు కొని చకచకా పార్క్ చేసిన స్కూటర్ దగ్గరికి చేరుకున్నాడు.

కాస్త దూరంలో నిల్చుని ఆమె... బ్యాగు డ్రైవర్‌కి అందిస్తూ 'నిన్ను చూస్తునే వున్నా' అన్నట్లు ఓ చూపు విసిరింది. కూరల సంచులన్నీ స్కూటర్‌కి అటూ, ఇటూ సర్దేసి, స్టార్ట్ చేసేముందు చూసి చూడనట్లు ఓ సారి చూసాడు. ఆమె డ్రైవర్‌తో తన వయిపే వేలు పెట్టి చూపిస్తు ఏదో చెపుతోంది. డ్రైవర్‌కి తల వూపుతూ తననే చూస్తుంటే తెలియకుండానే అతని గుండె గుబగుబ లాడింది.

●●●

తిరిగి చూడకుండా స్కూటరెక్కి మార్కెట్లోనుండి బయటపడి రోడ్డెక్కాడు. కొద్ది దూరం వెళ్ళాక కనిపించిది మిర్రర్లో వెనకాలే వస్తున్న ఆమె వాహనం. 'కొంప తీసి తనని కాని ఫాలో అవుతోందా' అన్న అనుమానం నెక్లెస్ రోడ్ ఎక్కాక ఇంచు మించు నిర్ధారణ అయిపోయింది. వెనక వెనకే, స్పీడు పెంచితే పెంచి తగ్గిస్తే తగ్గి ఫాలో అయి పోతున్నారు ఆ వాహనం, నడుపుతున్న డ్రైవరు, దర్జాగా పక్క సీట్లో కూర్చుని ఆమె.

బయట చల్లగాలి వీస్తున్నా తలలోంచి వేడి పుట్టి, చెమట రూపంలో బయట పడి నుదురు, మెడ తడిపి పోసాగయి. చేతుల్లో తడి కాళ్ళల్లో వొణుకు, వెన్నుముక బిగుసుకుపోయి. స్కూటర్ నడుపుతున్నట్లు లేదు. రోడ్డు పయిన తోసుకు వెళ్తున్నంత కష్టంగా వుంది.

నెక్లెస్ రోడ్ దిగి, ఇందిరా పార్క్ దాటి బండి రైటుకి తిప్పాడు. మరో నాలుగు సందులు తిరుగుతే ఇల్లు. వెనకాలే ఆమె వాహనం కూడా రైట్‌కి తిరిగింది. 'డౌట్ లేదు, ఫాలో అయిపోతోంది!' అనుకుంటే 'ఎందుకసలు ఫాలో అవడం?' అన్న అనుమానం అప్పుడు వేసింది.

స్కూటర్ వెళ్ళి ఓ పది అపార్ట్‌మెంటులున్న బిల్డింగ్ ముందు ఆగింది. చిన్న గేట్లోనుండి లోపలికి నడిపి ఆఫ్ చేసాడు. ఆమె వాహనం వొచ్చి పక్క బిల్డింగ్ ముందు ఆగింది. అప్పటి వరకు శరీరం వివిధ భాగాల్లో విచిత్రంగా ఆడిన నొప్పులన్నీ ఒక్కసారి సెంటర్లోకి వొచ్చి అతని గుండె దడదడమని కొట్టుకుంటే, కడుపు గుడగుడమని రాగం తీసింది.

బండి ఆపి ఆపగానే గ్రౌండ్ ఫ్లోర్లో వున్న తన పోర్షన్‌లోకి పరిగెడుతున్నట్లు నడిచాడు. "కూరలేవి?" అంటూ అడుగుతున్న భార్యని తప్పుకొని "స్కూటర్‌కే వున్నాయ్, అర్జెంట్... బాత్రూం..." అంటూ లోపలికి పరిగెత్తాడు.

"ఎప్పుడూ ఇంతే, ఏ పని పూర్తిగాచేసి ఏడవరుగా!" అంటూ వీధిలోకి నడిచింది ఆమె.

బ్యాగులు తీస్తుంటే కనిపించింది మంగకి పోలీస్ వ్యాన్ తమ బిల్డింగ్‌కి పక్క బిల్డింగ్‌కి మధ్యలో ఆగి. వ్యాన్‌లోనుండి దిగారు ఓ ప్రక్కనుండి డ్రైవరు, మరో ప్రక్కనుండి పోలీస్ ఆఫీసర్... లేడీ పోలీస్ ఆఫీసర్!.

తనకేసి, తమ బిల్డింగ్ కేసి చూస్తున్న వాళ్ళని చూస్తే కాస్త బెదిరింది కాని, 'ఎవరింటికి వొచ్చి వుంటారా!' అన్న కుతూహలం మంగని అక్కడి నుండి కదలనివ్వలేదు. తరువాత ఆ పోలీస్ ఆఫీసర్ డ్రైవర్‌కి ప్రక్క బిల్డింగ్ చూపిస్తు ఏదో చెపుతుంటే సరేలే అనుకొని లోపలికి వచ్చింది. అప్పటికీ కూరలన్నీ వేరు చేస్తు అప్పుడప్పుడు కిటికిలోనుండి తొంగి చూడడం మాత్రం మానలేదు.

●●●

"శంకర్!" పిలిచింది ఆమె.

"మేడం!" అన్నాడు డ్రైవర్.

"ఇదిగో ఈ బిల్డింగ్ వెనుక వాటలోనే అద్దె కుండేవాళ్ళం అమ్మా, నేను, మా డాడి పోయాక. అప్పటికివి అపార్ట్‌మెంట్స్ కావనుకో. సారుతో పెళ్ళయి ఢిల్లీకి వెళ్ళిపోయాక ట్రాన్స్‌ఫర్ అయి ఇదే రావడం. పదేళ్ళలో సిటీతో పాటు ఈ ఏరియా కూడ బాగా మారిపోయింది. వాడి వెనకాలే వస్తే మళ్ళీ ఈ ఇల్లు గుర్తు పట్టొచ్చని ఫాలో అవమన్నాను."

"ఇంతకీ అతనెవరు మేడం?"

"వాడా!" అంటూ గలగలా నవ్వింది ఆమె. "ఈ పక్కింటి ఓనర్ కొడుకులే. ఆ రోజుల్లో వాడు, వాడి ఫ్రెండ్స్ కలిసి ఈ చుట్టు పక్కల అమ్మాయిలందరిని వెంటపడి వేధించే వాళ్ళు. వీడు పక్కింట్లోనే వుండి నాకు మరీ తలనొప్పిగా వుండేవాడు. 'చూసాను పొద్దంతా! వేచాను రాత్రంతా!' అంటూ వెకిలి పాటలు పాడేవాడు. ఆ నంగిరి చూపులు చూస్తునే గుర్తు పట్టాను. వాడి వెనకాలే వస్తే ఈ ఇల్లు మళ్ళీ చూసి నా కాలేజ్ రోజులు గుర్తుకు తెచ్చుకోవాలని అనిపించింది. అందుకే ఫాలో అవమన్నాను. ఈ యూనిఫారంలో, పోలీస్ వ్యాన్‌లో, వెనకాలే వస్తుంటే హడిలి చచ్చాడు". ఈ సారి శంకర్ కూడ నవ్వాడు.

"సరే! ఇక పోదాం పద. సార్కి, పాపకి లేత బెండకాయల ఇగురంటే ఇష్టం" అంటూ వ్యాన్ ఎక్కింది ఆమె. బండి స్టార్ట్ చేసి వెనక్కి తిప్పాడు శంకర్.

"అన్నట్లు శంకర్!"

"మేడం!"

"నువ్వెప్పుడయినా అమ్మాయిల్ని ఏడిపించావా?"

"లే... లే...... లేదు మేడం!"

వ్యాన్ తిరిగి నెక్లెస్ రోడ్ ఎక్కింది. ఎందుకో మరి ఆమెకి తెరలు తెరలుగా నవ్వొస్తూనే వుంది.

●●●

# దవాకాన

డా. మృదులాంజలి

**వాన విడవకుండా కురుస్తోంది.** మూడు రోజులుగా ఇదేతంతు. పట్టిన మబ్బు విడవటంలేదు, వానా ఆగటంలేదు. అలా అని కాలం ఆగదుకదా! రోజులు గడుస్తున్నాయి. రోజుకూలికెళ్ళే నార్సింగ్ పనిలేక, తోచుబడి లేక అటూఇటూ తిరుగుతున్నాడు. అదీగాక వానకి ఇంటిపైన కప్పిన రేకుల్లోంచి నీరు ధారలుగా కారుతుంది. ఇప్పటికే అందినకాడికి గిన్నెలూ, తప్పీలాలు ఉన్న కొద్దిపాటి స్థలంలో అటూఇటూ సర్దాడు. ఇక గిన్నెలు కూడా లేవు. ఒకపక్క మూలగా ఉన్న కాలు విరిగిన మూడుకాళ్ళ మంచమ్మీద మునగదీసుకున్న మైసమ్మ మూలుగులు ఎక్కువవుతున్నాయి. ఆమె పక్కనే పాతచీరల్లో కప్పి ఉంచిన పసిది ఉండిఉండి ఏడుస్తోంది. దానికి మూడో నెల రాలేదు. అమ్మకాడ పాలులేవు. పాలేకాదు, ఓపికా లేదు. పసిదాన్ని కనడానికి గవర్నమెంటు దవఖాన కెళితే, బిడ్డ అడ్డం బడ్డాదని చెప్పి, ఆరొందలు తీసుకుని ఆపరేషన్ చేసేసారు. బిడ్డను తీసి బైట పడేసారు కాని, తల్లిని సరిగా పట్టించుకోలా ! కుట్లు సరిగా మానక, వంట్లో సత్తువలేకా, ఈ మూడునెలలుగా మైసమ్మ మంచమ్మీదే పడి ఉంది. కుట్లు మానలేదమ్మా అని డాక్టరమ్మతో ఎంతగా చెప్పినా వినకుండా, ఇంటికి పంపేసారు. మంచాలు లేవట, ఇంకా వచ్చేవాల్లకు కావాలట !

"ఒరయ్యా, నా వల్ల కాదురా " ఒక్కసారిగా మైసమ్మ అరిచింది.

ఆలోచనల్లో కూరుకుపోయిన నార్సింగ్ ఉలిక్కిపడ్డాడు. "ఏటయ్యిందే?" ఆందోళనగా అడిగాడు.

"నొప్పి ఓపలేకున్నానురయ్యా, మందో మాకో తగలాలి గాబోలు " మైసమ్మ పళ్ళబిగువున అంటూంది.

నార్సింగ్ నెమ్మదిగా మైసమ్మ పొట్టమీదున్న గుడ్డ తొలగించి చూసాడు. గుప్పున వాసన కొట్టింది. గదిలో చీకటిగా ఉన్నా, పొట్టమీద కుట్లు చీముపట్టి తెల్లగా పాచిపోయినట్లు కనిపిస్తోంది. రెండు నెలలుగా అదే పరిస్థితి.

పక్కలో పిల్ల ఏడవటానికి ఓపికలేనట్లు నోట్లో వేలేసుకుని నిద్రపోతోంది.

"దవకానకి పోదామయ్యా" మైసమ్మ అడుగుతుంది. ఏనాడు నోరెత్తి ఇదికావాలని అడగనిది అలా అడిగిందంటే నొప్పి ఎంత ఎక్కువుందో నార్సింగ్‌కి అర్థమైంది.

"పోదాం. బండి చూస్తానుండు" దండెం మీదున్న తువ్వాలు తీసి, భుజమ్మీద వేసుకుని బయటకు నడిచాడు. ఇప్పుడు దవాకానకి పోవాలంటే కనీసం అయిదొందలన్నా కావాలె. ఆటోకి రానుపోను పోగా, అక్కడ ఆసుపత్రిలో అందరి చేతుల్లో డబ్బు పెడితేగాని మైసమ్మ ముఖం చూడరు. అసలే కూలికిపోక చేతిలో డబ్బులు లేవు. ఎలా ?ఎవరినైన అడగాలన్నా, అందరి పరిస్థితి తనలానే ఉంది. ఏం చేయడానికి తోచట్లేదు. వానలో వీధి చివరిదాకా నడిచాడు. పైసల్ చూసుకోకుండా ఆటో అడిగితే తరవాత ఇబ్బంది అవుతాది, ఎలా ? ఎదురుగా వానాలో ఎవరో నడుస్తున్నారు. తలమీద తుండుగుడ్డ వల్ల ఎవరో తెలీటంలేదు. తెలిసిన ముఖమేమో అని ఆశగా చూసాడు. మనిషి దగ్గరకు వచ్చాడు. తన ముఠా మేస్త్రీనే ! ప్రాణం లేచివచ్చింది.

"మేస్త్రీ, మేస్త్రీ " హడావిడిగా అడ్డంబడ్డాడు. కింద బురద గుంటలు చూస్తూ నడుస్తున్న మేస్త్రీ తలెత్తి చూసాడు.

" నువ్వా నార్సింగ్, ఏటి సంగతి? పనికి ఇంకా టయిం పడతాది. వాన ఆగాలి కదా " పలకరించాడు.

"అదికాదు మేస్త్రీ, మా ఇంటిదానికి బాగుండలే, కొంత పైసల్ సర్దుతావేమో అని" నీళ్ళు నమిలాడు నార్సింగ్.

మేస్త్రీ లోపల్లోపలే నిట్టూర్చాడు. అందరి సంగతి ఇలానే ఉంది. రోజూ పనిచేస్తేనే గాని పైసల్ రావు. అలాంటిది మూడు దినాల సంది పనిలేదు, ఈపాడు వాన వల్ల. కాని తను మాత్రం ఎంతమందికి సాయపడగలడు. కాని నార్సింగ్ ఎప్పుడూ తనని పైసల్ అడగలే. పెండ్లాం బాగుండలేదంటున్నాడు.తనకాడా పైసల్లేవు. ఎలా ?

"నాకాడా లేవు గాని, ఇప్పిత్తా పద. మరల నెలకో రెణ్ణెల్లకో తీర్చేయాల. నడు" తిన్నగా శెట్టి ఇంటికేసి నడిచాడు. ఆరిపోతున్నా ఆశాదీపాన్ని మరల ఎగదోస్తూ నార్సింగ్ మేస్త్రీ వెంట నడిచాడు.

శెట్టి మేస్త్రీని బట్టి ఎక్కువ ప్రశ్నలేయకుండా వెయ్యి ఇచ్చాడు. త్వరగా దవకానాకి పోవాలన్న తొందరలో, నార్సింగ్ ఇక మిగతా విషయాలు సరిగా వినలేదు. వందకి అయిదు రూపాయలు కాబోలు వడ్డీ చెప్పాడు శెట్టి. ఇప్పుడు బేరాలు చేసే పరిస్థితి కాదు తనది. పదేపదే శెట్టికి, మేస్త్రీకి దండాలు పెట్టాడు. ఆటో అడుగుతుంటే మేస్త్రీ కూడా వచ్చాడు. మంచం మీది మైసమ్మని ఇంచుమించుగా ఎత్తుకున్నట్లు లేపి ఆటోలో పెట్టి, పసిదాన్ని భుజాన వేసుకుని ఆటో ఎక్కాడు నార్సింగ్. మేస్త్రీ గట్టిగా నిట్టూర్చి వెనక్కి మళ్ళాడు. ఆటో రివ్వున గవర్నమెంటు దవకానాకి పరుగెత్తింది.

దవకానా వద్ద ఇంకా గొడవగా ఉంది. జనం, ఆటోలు నిండిపోయి, లోపలికి వెళ్ళే దారి కూడా లేదు. అయినా ఆటోవాడిని బ్రతిమలాడి, ద్వారానికి వీలైనంత దగ్గరగా వచ్చారు. పసిది నిద్రలోంచి లేచి ఏడుపు లంకించుకుంది. చలికి దానికి కప్పేదానికి కూడా సరియైన గుడ్డల్లేవు.ఒక భుజాన పిల్లనేసుకుని, మరో చేత్తో మైసమ్మను పొదివిపట్టుకుని, ఇంచుమించు మోసుకుంటూ లోపలికి నడిచాడు. లోన ఇంకా అధ్వాన్నంగా ఉంది, నిండా జనం. కూర్చోడం మాట అటుంచి, నిలుచునే జాగా లేదు.వానలకి అందరికి జొరాలు వచ్చి, చాలామంది అక్కడ మందులకోసం కూర్చున్నారు. మైసమ్మ వంతు వచ్చేసరికి ఏ టయిం అవుతాదో అనుకుంటా, చిన్న జాగా చూసి, మైసమ్మను కూర్చోబెట్టాడు. ఇప్పుడు పైసల్ పప్పుల్లా పంచితే, మైసమ్మను తొరగా చూత్తారు. లోనికి చూసుకుంటూ, జనాన్ని తోసుకుంటూ, నడిచాడు నార్సింగ్. భుజం మీద పసిది గోలకి కాబోలు, ఏడుపు ఆపి, సద్దు చేయట్లే !

హడావిడిగా, అందర్నీ గదమాయిస్తూ, తిరుగుతున్నా శాల్తీ ఒకటి కనపడింది. చూడ్డం తోనే, దవకానా పనోడని అర్థమైతా ఉంది. నెమ్మదిగా అతడి పక్కకి చేరాడు నార్సింగ్.

"అన్నా, డాక్టర్ గారు ఎప్పుడు వత్తాడన్నా ?" మాట కలిపాడు.

ఒకసారి నార్సింగ్ కేసి చూసి," ఏమో, ఎవరికి ఎరుక. వచ్చినపుడు వత్తాడు. లైన్‌లో ఉండు " గదమాయించాడు.

"అదికాదన్నా, మా ఆడదానికి బాగా నొప్పిగా ఉండాది, త్వరగా చూపించన్నా, కాల్మొక్కుతా " ప్రాధేయపడ్డాడు.

కొంత హడావిడి తగ్గించుకుని, నార్సింగ్ కేసి సూటిగా చూసాడు. "అంత అరిజెంటా ?" కళ్ళెగరేసాడు.

"ఔ అన్నా, నొప్పికి గిలగిల్లాడుతుంది " నార్సింగ్ చెప్పాడు.

"వందియ్యి, చూపిత్తా " డైరెక్ట్ గా చెప్పాడతను. ఊహించిందే గనుక నార్సింగ్ చప్పున పైసల్ అతడి చేతిలో పెట్టాడు.

"ఇది లోనికి పోడానికే. అక్కడ డాక్టర్‌కు వేరే " హెచ్చరికగా చెప్పాడతను. తలూపాడు నార్సింగ్.

ఎంత కష్ట పడితే తనకి వంద రావాలి !

"పోయి మీ ఆడాళ్ళను తోలుకరా పో " చెప్పాడతను.

నర్సింగ్ పరుగున హాల్లోకి వచ్చాడు. మైసమ్మ సొమ్మసిల్లినట్లు గోడకి పడి ఉంది. మరల లేపి, లోపలికి ఇంచుమించు ఈడ్చుకు పోయినట్లు తీసుకపోయాడు.

"ఇటు రా" ఒక డోర్ దగ్గర నుంచుని పిలిచాడు డబ్బు తీసుకున్న వ్యక్తి.

లోపలున్న డాక్టర్ సిగరెట్ పొగ రింగులుగా వదలడానికి ప్రయత్నిస్తున్నాడు కాబోలు, సరిగా రావట్లేదని చిరాగ్గా ఉన్నాడు.

"సార్, పేషెంట్" పిలిచాడతను.

"చూసాలే, ఏంటి జబ్బు?" మైసమ్మకేసి గాని, నార్సింగ్ కేసిగాని చూడకుండానే అడిగాడు డాక్టర్.

"మా ఆడదానికి పొట్టలో నొప్పయ్యా" నార్సింగ్ చెప్పాడు.

"అక్కడ బల్లమీద పడుకోమను" చెప్పాడు డాక్టర్. అతని దృష్టి ఇంకా సిగరెట్ పొగ మీదే ఉంది.

భుజం మీద పిల్లతో నార్సింగ్, రెండు చేతులూ వాడలేక పోతున్నాడు. డబ్బు తీసుకున్న వ్యక్తి ఉన్నాడేమో అని చూసాడు కాని అతను గది బయటకి పోయాడనుకుంటా! అలాగే మైసమ్మను లేవనెత్తి బల్లమీదకి చేర్చాడు.

"ఎప్పటినుండి నొప్పి?" మెడలో స్టెత్ వేసుకుంటూ వచ్చాడు డాక్టర్.

"మూడు నెల్ల క్రితం పెద్దాపరేసన్ చేసి బిడ్డను తీసారయ్యా. అప్పటి నుండి, కుట్లుకాడ నొప్పి." నార్సింగ్ చెప్పాడు.

"చీర వదులు చేసుకో" మైసమ్మకి చెప్పాడు. మైసమ్మ కదల్లేదు.

"నిద్రపోతుందా, మందుకొట్టిందా? చీర కిందకి లాగు" విసుగ్గా నార్సింగ్‌తో చెప్పాడు డాక్టర్.

నార్సింగ్ గబగబ చీర వదులు చేసాడు. నడుం దగ్గరంతా తడిగా ఉంది, బహుశా ఆటోలో వాన నీళ్ళకి తడిచింది కాబోలు !

గదిలో కొద్దిగా చీకటిగా ఉంది. బయట మబ్బు వల్ల కాబోలు.

"బల్ల మీద టార్చ్ లైట్ ఉంది.. ఇలా ఇవ్వు" నార్సింగ్‌కి చెప్పాడు డాక్టర్.

నార్సింగ్ అందించాడు. లైట్ వేసి చూసి "మై గాడ్ " అరిచాడు డాక్టర్.

ఉలిక్కి పడ్డాడు నార్సింగ్. " ఏటయ్యిందయ్యా ?" ఆందోళనగా అడిగాడు.

"ఓ మైగాడ్, ఎంతకాలంగా ఇలా ఉంది? ఇదంతా ఇన్‌ఫెక్షన్ పాకిపోయింది. పురుగులు కూడా చేరాయి. వెంటనే శుభ్రం చేయాలి. బాయ్..." బెల్లు కొట్టాడు.

"సార్" ఇందాకటి వ్యక్తి వచ్చాడు.అతను వార్డ్ బాయ్ అన్నమాట !

"వెంటనే డిస్ ఇన్‌ఫెక్టెంట్ కిట్ తీసుకురా. ఇంజెక్షన్లు తీసుకురా. ఈమెను పక్కన డ్రెస్సింగ్ రూంలో పెట్టు" డాక్టర్ చెప్పాడు.

"సరే సార్. నడువ్, ఆమెను తీసుకురా" అతను నార్సింగ్‌కి చెప్పి వెళ్ళిపోయాడు.

డాక్టర్ వాష్ బేసిన్ దగ్గర చేతులు సబ్బేసి గట్టిగా రుద్దుకుంటున్నాడు.

నార్సింగ్ మళ్ళా మైసమ్మను లాక్కుంటూ పక్కగదికి నడిచాడు. పసిదానికి పాలు పట్టాలన్నా కుదరటంలేదు.

"రెండొందలివ్వు, డాక్టర్ చెప్పిన కిట్టు, మందులు తేవాలి " వార్డుబాయ్ చెప్పాడు.

మాట్లడకుండా రెండు వందనోట్లు తీసి అతడి చేతిలో పెట్టాడు. అతను బయటకి నడిచాడు. ఇంతలో పిల్ల నిద్రలేచి ఏడుపు మొదలుపెట్టింది.

"అయ్యా, పాపకి పాలు పట్టాలి. బయటకి వెళ్ళిరానా?" గుమ్మం దగ్గర ఉన్న వార్డ్ బాయ్‌ని అడిగాడు.

"ఒయ్ ఎక్కడికీ పోకు, ఇక్కడే ఉండు. ఇప్పుడే వస్తాను" వార్డు బాయ్ పక్క వింగ్‌లోకి వెళ్ళాడు. అక్కడ షెల్ఫ్‌ల్లో సర్దిపెట్టి ఉన్న కిట్టూ, మందులు తీసుకుని, నార్సింగ్ ఇచ్చిన రెండొందల్లో, ఒక వంద అక్కడి ఫార్మసిస్ట్ చేతిలో పెట్టాడు. మరో వంద తన జేబులోకి తోసుకుంటూ, మరల డ్రెస్సింగ్ రూంలోకి వచ్చాడు. పసిది గుక్క పెట్టి ఏడుస్తుంది. నార్సింగ్ దాన్ని సముదాయించే ప్రయత్నం చేస్తున్నాడు.

"బిడ్డ సంగతి చూడవయ్యా " నార్సింగ్‌ని విసుక్కున్నాడు.

"పాలుపట్టాలయ్యా, బయటకెళ్ళి వస్తాను " నార్సింగ్ అడిగాడు.

"సరే పో, త్వరగా రా. నువ్వొచ్చాకనే పని మొదలవుతాది. ఒకళ్ళు పట్టుకొంటేనే, కుట్లు దగ్గర శుభ్రం చేయాలి" బాయ్ చెప్పాడు.

నార్సింగ్ ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు. ఒకపక్క పిల్ల, మరోపక్క పెళ్ళాం. అయిన ఆలస్యం ఎలానూ అయింది. రెండు నిముషాలు బయటకెళ్ళి పసిదానికి పాలు పట్టేస్తే అది నిద్రపోతాది. "ఇప్పుడే వస్తానయ్యా" చెపుతూ బయటకు నడిచాడు. వాన కొద్దిగా వెలిసింది. ఆసుపత్రి గేటు కెదురుగానే టీ దుకాణం ఉంది. అక్కడికెళ్ళి పాలు కొని పసిదానికి పట్టాడు. చెంచాతో పోస్తుంటే, సగం కింద సగం లోపలికి పోయాయి. మొత్తానికి ఎలాగో అయిందనిపించాడు.

మరల పరుగులాంటి నడకతో ఆసుపత్రిలోకి నడిచాడు. పనుల కోసమని సిటీకి వచ్చి ఆరు నెల్లవుతుంది. కడుపుతో ఉన్న పిల్లతో ఎలారా అని ఇంటిదగ్గర అమ్మా, అత్తా చెప్పారు కాని, సిటీలో పెద్ద దవకానా ఉంటాదన్న ధైర్యంతో వచ్చాడు. పేరుకి పెద్ద దవకానానే కాని, దుడ్లు లేకుండా పనిగాదు. ప్రసవం టయంకి అమ్మో, అత్తో వస్తారనుకుంటే, అప్పుడే ఊళ్ళో కోతల పనులు మొదలయ్యాయి. ఏడాది కాలమంతా కష్టపడ్డాది, కోతల్లో ఒకనెల్లోనే వస్తాదన్న ఆశతో, వాల్లు రాలే. ఇక మైసమ్మ కోలుకోలేదన్న సంగతి నార్సింగ్ వాల్లకు చెప్పలేదు. వాల్లు వద్దన్నా తనే సిటీకి తెచ్చాడు. ఇలా అని చెపుతే ఇంకా తిడతారని, ఊర్కున్నాడు.

డ్రెస్సింగ్ రూంలో మరో ఇద్దరు ఆడాళ్ళు చేరారు. అందరూ అమ్మా, అబ్బా అని మూలుగుతున్నారు. బాయ్ ఎక్కడా కనపడలే .

నార్సింగ్ మైసమ్మ కేసి చూసాడు. మగతగా పడి ఉంది. కుట్లదగ్గరనుండీ, చీము, నెత్తురూ కారుతుంది. గదంతా వాసన వ్యాపిస్తుంది.

వార్డు బాయ్ ఎక్కడున్నాడో అని వెతుక్కుంటూ బయల్దేరాడు. పక్కనున్న వింగ్‌లో నర్సమ్మతో బాతాఖాని కొడుతున్నాడు.

నార్సింగ్‌ని చూసి, "వచ్చావా, పద, నర్సమ్మా వస్తావా?" బాయ్ నర్సుని అడిగాడు.

"అతనికి చెప్పు" సైగ చేస్తూ అంది నర్సు.

"నర్సమ్మకో వందివ్వు, శుభ్రంగా చేస్తాది " బాయ్ చెప్పాడు. నార్సింగ్ మౌనంగా నర్సుకి వంద అందించాడు.

అందరూ మరలా డ్రెస్సింగ్ రూంకి వచ్చారు. అమ్మా, అబ్బా అని మూలుగుతున్న ఆడాళ్ళని నోర్మొయ్యమని గద్దించింది నర్సు. వాళ్ళు బాధని ఓర్చుకుంటూ నోళ్ళు మూసారు.

"అబ్బబ్బా, ఏంటిది?ఇంత కుళ్ళిపోయేదాక ఏంచేస్తున్నారు? భయంకరంగా కుళ్ళిపోయింది. బాగా లోపలికి ఇన్‌ఫెక్షన్ పోయింది. సరే, శుభ్రం చేసేటపుడు నొప్పి ఎక్కువగా ఉంటాది. గట్టిగా పట్టుకో. పిల్లని మీవాళ్ళకి ఇచ్చి రా" నర్సు ముక్కుకి మాస్క్ తగిలించుకుంటా చెప్పింది.

"ఎవరూ లేరమ్మా." నార్సింగ్ చెప్పాడు.

"మరి ఆ పిల్లను పట్టుకుని ఏంచేస్తావ్? ముందు ఈమె కాళ్ళు గట్టిగా పట్టుకో" కిట్టు తెరిచి స్టెరైల్ పాడ్స్, దూదీ తీస్తూ చెప్పింది నర్స్.

ఒకచేత్తో పిల్లను పట్టుకుని, మరో చేత్తో మైసమ్మ కాళ్ళు పట్టుకున్నాడు నార్సింగ్. నర్సమ్మ గుడ్డలు కిందకితోసి, అల్కాహాల్ పాడ్స్‌తో చీమూ, నెత్తురూ శుభ్రం చేయడం మొదలుపెట్టింది. ఒక్కసారిగా కాళ్ళు విదిలించింది మైసమ్మ, బహుశా మండినట్టుంది. ఆ ఊపుకి వెనక గోడకి కొట్టుకున్నాడు నార్సింగ్.

"చెప్పా కదా, గట్టిగా పట్టుకోవాలని" నర్సు విసుగ్గా అంది. శుభ్రమైన కోతదగ్గర సన్నగా పురుగులు మెదులుతున్నాయి. నర్సుకే కడుపు తిప్పుతుంది. అనవసరంగా వందకి ఆశపడి ఈ దరిద్రపు పనికి ఒప్పుకున్నానని తననితనే తిట్టుకుంటుంది.

డ్రెస్సింగ్ రూంకి వెనగ్గా మరో తలుపు ఉంది. తడిసిన దూది ముద్దలు తీసికెళ్ళి తలుపుతీసి బయటకు విసిరింది నర్సు. అంతవరకు గుమ్మంపక్కనే ముడుచుకు పడుకున్న వీధికుక్కలు దులుపుకుని లేచి గుమ్మంలోకి వచ్చాయి.

"ఛి, ఛీ. "నర్సు అరిసింది. కుక్కలు వెనక్కి తగ్గాయి. మైసమ్మ మళ్ళా కాళ్ళు విసిరింది. ఈసారి నర్సు చేతిలో కిడ్నీ ట్రే కింద పడింది.

"అబ్బబ్బ, సరిగ్గ పట్టుకోవయ్యా" నర్సు గద్దించింది.

నార్సింగ్‌కి ఏం చేయాలో తోచలేదు. పిల్లతో పట్టుకోడం కుదరడంలేదు. అలా అని పిల్లని ఎవరికి ఇవ్వాలి. గోడపక్కగా కూర్చున్న ఆడాళ్ళని అడిగితే వాళ్ళు కాదన్నారు. చేసేదిలేక పిల్లని గోడపక్కగా పండబెట్టి మైసమ్మ కాళ్ళు గట్టిగా పట్టుకున్నాడు.

నర్సు తిట్టుకుంటా, విసుక్కుంటా శుభ్రం చేస్తోంది. తుడిచేకొద్దీ చీము ఇంకా ఎక్కువవుతుందే కాని ఆగటంలేదు. మరోపక్క వాసనకి ముక్కులు బద్దలవుతున్నాయి. మైసమ్మ కొద్దికొద్దిగా మగత వీడి బాధతో మూలుగుతోంది. "మరో కిట్టు పట్రా పో " నర్సు అరిచింది. నార్సింగ్ బయటకు పరుగెట్టాడు. మందులుండే చోటు వెతుక్కుని అక్కడ మరో రెండు వందలు పోసి కిట్టు తీసుకుని పరుగెత్తాడు.

మైసమ్మ పూర్తిగా స్పృహలోకి వచ్చినట్టుంది, గట్టిగట్టిగా అరుస్తుంది. గదిలో ఉండాల్సిన మిగతా ఆడోళ్ళెవరూ కనపడలేదు. గోడవారగా చిన్నమూటలా పసిది గుడ్డల్లో చుట్టి ఉంది.

కిట్టు నర్సమ్మకి ఇచ్చి ఒకసారి పిల్లను చేతులోకి తీసుకున్నాడు. పక్క తడుపుకుందేమో అని గుడ్డలు తొలగించి చూసాడు. అనుకున్నట్టే, పాసుపోసేసింది. గుడ్డంతా తడిసిముద్దయ్యింది. తడిగుడ్డతీసి, మరో పొడి గుడ్డలో చుట్టాలని కింద పెట్టాడు.

"అమ్మో.." పెద్దగా అరిచింది మైసమ్మ . అదిరిపడి పిల్లను కింద వదిలి మైసమ్మ ఉన్న బల్ల దగ్గరకి దూకాడు నార్సింగ్.

"ఇక్కడే ఉండు, డాక్టర్‌ని తెస్తా" నర్సు మరో మాటకు అవకాశం ఇవ్వకుండా, బయటకు పరుగెత్తింది. నార్సింగ్ అయోమయంగా మైసమ్మకేసి చూసాడు.

మైసమ్మ కళ్ళు తేలేసింది. నోట్లోంచి నురగలు వస్తున్నాయి. కాళ్ళు, చేతులు వంకర్లుపోతున్నాయి. ఏమయ్యింది? నార్సింగ్‌కి భయంతో కాళ్ళు చేతులు ఆడలేదు. గది బయటకు పరుగెత్తి నర్సు గాని, డాక్టర్ గాని వస్తారేమో అని చూసాడు. ఎవరూ కనపడలేదు. ఇందాక డాక్టర్ ఉన్న గదికి పరుగెత్తాడు. నర్సుకూడా అక్కడే ఉంది.

"చివరి నిముషందాకా ఇంట్లో పెట్టుకుని ప్రాణం మీదకు తెచ్చుకుంటారు. ఇప్పుడొచ్చి మన ప్రాణం తీస్తారు" విసుగ్గా అంటూ డాక్టర్, నర్సు వెనగ్గా డ్రెస్సింగ్ రూం కేసి నడిచాడు. వాళ్ళిద్దరూ కదలడం చూసి నార్సింగ్ హమ్మయ్య అనుకున్నాడు.

డ్రెస్సింగ్ రూం లోకి వచ్చి మైసమ్మ నాడి చూసాడు డాక్టర్. చెంపలు తట్టి చూసాడు. "ఓవర్ " నర్సు కేసి చూస్తూ, పెదవి విరిచి బయటకు నడిచాడు. నార్సింగ్ అయోమయంగా చూసాడు. మందులకోసం వెళుతున్నాడా? లేక మందులు తనే తేవాలా? ఇంకా ఎంతుంది తనదగ్గర ? జేబులోని డబ్బు తీసి చూసాడు. రెండొందలున్నాయి, సరిపోతాయా ?

"నర్సమ్మ, మందులు తేవాలా ?" చేతులు కడుక్కుంటున్న నర్సునడిగాడు.

"ఇంక మందులేమీ అక్కర్లేదు. ఆమె చనిపోయింది. పట్టుకుపో" నర్సు నార్సింగ్ ముఖంలోకి చూడకుండా చెప్పి బయటకి పోయింది.

కాళ్ళకింద భూమి కదిలినట్టయింది. బల్లకేసి చూసాడు. మైసమ్మ కనుగుడ్లు వెనక్కి తిరిగి, తెల్ల గుడ్లే కనపడుతున్నాయి. చేతులు కాళ్ళు నిగడ తీసుకుని, అలానే ప్రాణం వదిలేసినట్టుంది. బుర్ర ఖాళీ అయిపోయినట్లు, ఏమీ తోచనట్లు చుట్టూ చూసాడు. మైసమ్మ చనిపోయిందంటే నమ్మబుద్ధికాట్లేదు.

ఇప్పుడు పసిదాని గతేమిటి?

గోడవారగా ఉన్న గుడ్డలకేసి చూసాడు. గుడ్డలక్కడే ఉన్నాయి కాని పిల్ల లేదు. గుండే ఝల్లుమంది.

పిల్లేది ? చుట్టూ చూసాడు. గదిలో ఎక్కడాలేదు. గదిలో ఇంకెవరూ లేరు. గుమ్మం బయటకొచ్చి వరండాలో చూసాడు. ఎక్కడా పిల్లలేదు, ఎవర్నడిగినా తెలీదన్నారు.

"అయ్యొయ్యొ, కుక్కలు పసిబిడ్డను పీక్కుతింటున్నాయి" ఎవరో అరిచారు. నార్సింగ్‌కి డ్రెస్సింగ్ రూం వెనక తలుపుగుండా వచ్చిన కుక్కలు గుర్తొచ్చాయి. కళ్ళుతిరిగి దబ్బున కింద పడ్డాడు. గవర్నమెంట్ దవకానలో అందరూ ఎవరిపనిలో వాళ్ళున్నారు.

●●●

# పుత్రోత్సాహం

నాగలక్ష్మి మజ్జి

**మూసి ఉన్న తలుపు తెరచి లోపలికి** తొంగి చూస్తూ ముందుకు కదిలింది గంగమ్మ.

"జానకమ్మా.. జానకమ్మా" అని పిలిచింది.

ఒక మూలన మంచం పైన కొడుకు వ్రాసిన ఉత్తరం పట్టుకుని చూస్తూ కన్నీరు కారుస్తున్న జానకమ్మ, గంగమ్మ గొంతు వినగానే కన్నీరు తుడుచుకుంటూ

"ఆ ఇక్కడనే ఉన్నా, ఇది ఏమైనా లంకంత కొంపా ఏంటి? నాలుగు అడుగుల పెంకుటిల్లు, ఉన్నదే ఒక్క గది లోపలికి వచ్చి చూస్తే సరిపోతుంది కదా" అంది.

గంగమ్మ తనతో తెచ్చిన గిన్నెను ప్రక్కన పెడుతూ

"అమెరికా వెళ్ళి వచ్చిన దానివి కదా, అక్కడ నీ కొడుకుతో పాటు పెద్ద బంగ్లాలో ఉండి ఉంటావు కదా, నీకు ఈ ఇల్లు చిన్నదిగానే ఉంటుంది. కానీ ఈ ఇంట్లోనే నీ కొడుకుని కని పెంచి పెద్ద చేసి, కంప్యూటర్ చదువు చదివించి అమెరికా పంపిన విషయం మరచిపోకు" అంటూ జానకమ్మ చేతిలోని ఉత్తరం తీసి ప్రక్కన పెట్టి గిన్నెలో అన్నం వడ్డించి పెట్టింది గంగమ్మ.

గంగమ్మ అభిమానాన్ని భరించలేకపోయింది, తన చేతిలోని గిన్నె ప్రక్కన పెట్టి

"ఏమి స్నేహమే నీకూ నాకు? ఎండన ఉంటే నీడకురా..! అని రెండు రోజులు నీడనిచ్చినందుకు ముప్పయి సంవత్సరాలుగా నా కష్టాలలో భాగానికి వస్తూనే ఉన్నావు"

ఈ మాట అంటుండగానే జానకమ్మ గొంతు దుఃఖంతో బొంగురు పోయింది.

గుండె బరువు ఎక్కి ఆ బరువు కన్నీరుగా, గంగ వరదలా పొంగుకు వచ్చాయి. తన కొంగుతో మొహం దాచుకున్నది జానకమ్మ.

"ఇదుగో ఇదే నాకు నచ్చదు ఇప్పుడు విషయం ఆలోచించమంటే.. అదే ఈ గిన్నెలో అన్నం తినే విషయం, నువ్వేమో 30 సంవత్సరాల సంగతులు మాట్లాడుతున్నావు" తన కొంగుతో కండ్లనీరు తుడుచుకుని ప్రక్కన పెట్టిన అన్నం గిన్నె అందుకుని "నువ్వు అన్నం తినవు.. లే.. నేను గోరుముద్దలు పెడతాను కాస్త ఎంగిలిపడు" అని అన్నం కలిపి తినిపించపోయింది గంగమ్మ.

కన్నీటితో తడిచిన తన కొంగు నుండి తల బయటకు పెట్టి "నేను తింటానులే అక్కడ పెట్టు" అంది జానకమ్మ.

"అదేం కుదరదు నువ్వు తిను, నాకు చాలా ఆకలిగా ఉంది, పైగా మా ఆయన, కొడుకు కోడలు కూడా ఇంకా తినలేదు" అంది మారాంగా గంగమ్మ.

"అవును కదా, ఇంట్లో నువ్వు తినకుండా మీవాళ్ళు ఎవరూ తినరుకదా, అదే అందరూ కలిసే భోజనం చేస్తారు కదా, సరే గిన్నె ఇలా ఇవ్వు. నేను తింటాను. నువ్వు వెళ్ళు" అని గంగమ్మ చేతిలోని గిన్నె తీసుకోబోయింది జానకమ్మ.

"నువ్వు తినవు.. నాకు తెలుసు, నేను పెడతాను" అని గిన్నె జానకమ్మ చేతికి అందకుండా పైకి ఎత్తింది గంగమ్మ.

"ఏంటే నువ్వు? నాకు మనమడు, మనవరాలు ఉన్నారు! నేను ఏమి చిన్నపిల్లను కాను, నేను తింటా గిన్నె ఇలా ఇవ్వు" అని గిన్నెలాక్కున్నది చిరుకోపంగా జానకమ్మ.

జానకమ్మ తింటూ ఉంటే, కొసరి కొసరి వడ్డించింది గంగమ్మ.

జానకమ్మకు పొలమారింది, గంగమ్మ కంగారుగా గ్లాసులో నీళ్ళు అందించింది,

"మెల్లగా తిను జానకమ్మా.. మా వాళ్ళు తినలేదు అని కంగారుగా తినకు" తల తట్టి నీళ్ళు తాగించింది గంగమ్మ.

"నా మతిమండ, నిన్ను కూడా కొడుకు, కోడలు, వాళ్ళ పిల్లలు తలుచుకుంటూ ఉంటారు. ఇన్ని రోజులు వాళ్ళతో అమెరికాలో వాళ్ళతో ఉన్నావు కదా" అని గుర్తు చేసింది గంగమ్మ.

వాళ్ళను గుర్తుచేయగానే తినడం ఆపి కాస్త బాధగా

"అవును. అవునవును" అని ఆలోచనలో మెల్లగా తింటున్నది జానకమ్మ.

"జానకమ్మా.. ఆరోజు ఎండన ఉంటే నీడకు రమ్మన్నాను అన్నావు, ఆ నీడ నా జీవితాన్ని నిలబెట్టింది. అయిన వాళ్ళు ఆస్తికోసం రాబందుల్లా పీక్కుతిన్నవారే, అమ్మ నాన్న లేని నేను తోడబుట్టిన వాళ్ళ వల్ల రోడ్డున పడ్డాను, ఆడపిల్లన్న ఒకే ఒక కారణంగా నాపై ఆశపడి నన్ను లాక్కెళ్ళి నాశనం చేయబోయిన మానవమృగాలను వీధికుక్క కూడా ఎదిరించలేక నన్ను కాపాడబోయి వాళ్ళ రాళ్ళ దెబ్బలకు నేలకొరిగింది. ఆ సమయంలో ఊరివాళ్ళను పోగేసి రక్షించావు. కాస్త నీడనిచ్చావు. నీతోపాటే పనికి తీసుకెళ్ళి ఎలా బ్రతకాలో అండగా ఉండి నేర్పావు. అవసరం వచ్చినప్పుడే మనవాళ్ళు ఎవరో, పరాయివాళ్ళు ఎవరో తెలుస్తుంది. తోడబుట్టినంత మాత్రాన కలిసే ఉండలేము. పరాయివాళ్ళు అయినంత మాత్రాన ఆత్మీయులు కాకపోరు. దేవుడు చాల సిత్రమైన సిత్రం చేశాడు, డబ్బు అనే రంగు కాగితం లేకపోతే మనిషి నిజమైన రంగు తెలిసేదికాదు. మనుషుల బుద్ధి డబ్బు దగ్గరే బయటపడతాయి" గంగమ్మ మాట్లాడుతూ జానకమ్మ చేయి కడుక్కోవడానికి నీళ్ళు అందించింది.

జానకమ్మ చెయ్యి కడుక్కుని, తన కొంగుతో మూతి తుడుచుకుంది. జానకమ్మ తిన్న గిన్నె తీసి బయటికెళ్ళి గుమ్మం ముందు చల్లి లోపలికి వచ్చింది. జానకమ్మ పడుకోవడానికి చేసే ప్రయత్నాన్ని గమనించిన గంగమ్మ మంచం సర్దింది. చెంబులో నీళ్ళు తెచ్చి మంచం ప్రక్కన పెట్టి, "ఏ ఆలోచన లేకుండా పడుకో ఏదైనా అవసరం అయితే ఒక కేక వేయి. ప్రక్కనేగా. పరుగున వస్తాను" బయటకు వెళ్ళింది.

***

అమెరికాలో క్లీవ్‌ల్యాండ్‌లో జానకమ్మ కొడుకు మోహన్, కోడలు పద్మిని, మనుమడు నికిల్, మనుమరాలు అనిత అందరు కలిసి ఉంటున్నారు. ఆ రోజు ఆదివారం కావడంతో జానకమ్మ ఉండి వెళ్ళిన గదిని శుభ్రం చేస్తోంది పద్మిని.

"నికిల్ నికిల్" అని తన పదిసంవత్సరాల కొడుకుని పిలిచింది పద్మిని.

మోహన్ కిచెన్‌లో కాఫీ కలుపుతున్నాడు. నికిల్ కూడా తండ్రితోపాటే ఉన్నాడు.

"వై డాడి మామ్ ఆల్వేజ్ షవుటింగ్? నికిల్ నికిల్ అని పిలుస్తూనే ఉంటుంది. గ్రాండ్ మా ఉన్నప్పుడు ఈ అరుపులే లేవు, ఇంటిపని అంతా తానే చేసేది. మీకు కాఫీ, అమ్మకు బోర్నవిటా నాకు హార్లిక్స్, చెల్లికి బాదం మిల్క్ ఇలా అందరికీ కావలసినవి ఇచ్చేది. పైగా నచ్చిన వంటలు, పిండివంటలు కూడా చేసిపెట్టింది. రాత్రి ఎన్ని కథలు చెప్పేదో మేము నిద్రపోయే వరకు. చాలా బాగుండేది ఎందుకు డాడి నాయనమ్మను ఇండియాకు పంపేశారు'?' అని తండ్రిని బాధగా అడిగాడు నికిల్.

మోహన్ నికిల్‌కి సమాధానం చెప్పేలోపలే అక్కడికి పద్మిని వచ్చింది

"ఏంటి మోహన్ నేను గొంతు చించుకుని అక్కడ అరుస్తునే ఉన్నాను, మీరు కానీ, నికిల్ కాని నాకు సహాయం చేయకపోగా, ఇక్కడ ఆ వెళ్ళిన ఓల్డ్ లేడి గురించి డిస్కషన్ పెట్టారు, ఇండియా పంపేసినా వదలడంలేదు.. శని శని.." అంది కోపంగా పద్మిని.

ఆ మాటలు నచ్చని మోహన్ కాఫీ కప్పు తీసుకుని "ఛీ" అంటూ కోపంగా ముందుకు కదిలాడు.

కానీ పద్మిని మోహన్‌ని అస్సలు పట్టించుకోలేదు.

"ఏరా నికిల్ ఒకసారి పిలిస్తే వినిపించదా, రా నాతో రా, ఆ అనిత ఎక్కడ, దాన్ని తీసుకురా. ఈ రోజు ఆదివారం కదా ఆ ముసలది ఉండి వెళ్ళిన రూమ్ క్లీన్ చేసేద్దాం, మళ్ళీ ఒన్ వీక్ దాకా టైం దొరకదు." అంటూ జానకమ్మ గదిలోకి వచ్చింది. మోహన్ సోఫాలో కూర్చుని కాఫీ త్రాగుతున్నాడు. జానకమ్మ వాడిన దుప్పటిని కర్రతీసుకొచ్చి తీసి దానివంక అసహ్యంగా చూసి పడేసింది పద్మిని.

"ఏంటి అంటరాని వారి వస్తువులా ఐ మీన్ ఎయిడ్స్ పేషెంట్ వాడిన వస్తువులా ట్రీట్ చేస్తున్నావు" కోపంగా అన్నాడు మోహన్.

"అంతకన్నా ఎక్కువే! ఛీ ఛీ పల్లెటూరి గబ్బిలం.. నీట్‌నెస్ లేని మనిషి, అస్తమానం చమట కంపు.. పైగా గుండెజబ్బు మనిషి. ఛీ ఛీ ఇంకా నయం పంపేశాము కాబట్టి సరిపోయింది. లేకుంటే ఇక్కడే చచ్చి ఉంటే లేనిపోని ఖర్చు. అనాధలా పోవలసినదానికి, ఇక్కడ వాళ్ళకోసం మర్యాదకోసం బాగా ఖర్చుపెట్టి పంపవలసి వచ్చింది. అసలు ఇక్కడికి ఇంత ఖర్చుపెట్టి తీసుకొచ్చాం, నా ఖర్మ కాకపోతే ఆ ఇండియా నుండి ఇక్కడికి తీసుకొచ్చిన తరువాత గుండె జబ్బు అని తెలియాలా, ఇక్కడ కూర్చోపెట్టి మూడు పూటలా మేపడానికా? ఏదో ఇక్కడ పనిమనిషులను కొనలేము కాబట్టి ఇండియా నుండి ముసలిదాన్ని తెచ్చుకుంటే ఇంటిమనిషిలా ఉంటూ పనిమనిషి కొరత తీరుతుంది అనుకుంటే నా ఆశలపై నీళ్ళు చల్లింది" అని బాధపడుతూ కొంపలు మునిగినట్లు రాగాలు తీస్తూ కూర్చుంది పద్మిని.

ఇంతలో ఫోన్ రింగ్ అయింది.

ఫోన్‌ను చూసి మోహన్ వైపు చూసింది పద్మిని.

అనిత, నికిల్ ఫోన్ ఎత్తడానికి పోటీ పడుతున్నారు. చివరికి నికిల్ ఫోన్ ఎత్తాడు "ఇండియా నుండి డాడీ" అన్నాడు నికిల్.

మోహన్ ఫోన్ దగ్గరకి వెళ్ళి కొడుకు దగ్గర ఫోన్ అందుకున్నాడు.

"ఆ ఇంకెవరు అయివుంటారు. ఆ ముసలిదే అయి ఉంటుంది. మా వాళ్ళు అయితే నా ఫోన్‌కే చేసేవాళ్ళు కదా" అంటూ మూతి తిప్పుకున్నది పద్మిని.

ఫోన్ విన్న మోహన్ తల గిర్రున తిరిగింది, షాక్ అయ్యాడు. కంగారుగా "ఆ వెంటనే వస్తున్నా బయలుదేరుతున్నాను" అని రిసీవర్ పెట్టేసాడు.

"ఏంటీ ఆఫీసు నుండి అర్జంట్ కాలా?" అర్థం కానట్లు అడిగింది పద్మిని.

"వెంటనే మనవి, పిల్లలవి బట్టలు సర్దు" అన్నాడు మోహన్.

"ఎందుకు?" అంది అర్థంకానట్లు.

"అమ్మ... అమ్మ చనిపోయింది" బాధగా చెప్పాడు.

"ఎప్పుడు?" ఆశ్చర్యంగా అడిగింది పద్మిని.

"రాత్రి".

"సరే మీరు బయలుదేరండి ఇప్పటికే ఆమెపైన బోలెడు ఖర్చుపెట్టాం ఒక మనిషికి అంతకన్నా.."

పద్మిని మాట పూర్తికాక మునుపే పద్మిని చెంపఛెళ్ళు మనిపించాడు మోహన్.

"ఆమె పనిమనిషి కాదు, నా కన్నతల్లి. ఆ తల్లి కన్న కొడుకు నీ భర్త, నీ బిడ్డలకు తండ్రి, అది మరిచిపోకు. నా తండ్రి నా చిన్నతనంలోనే మరణిస్తే, మరో మార్గం లేక ఇళ్ళలో పనిచేసి నన్ను చదివించి ఇంతవాణ్ణి చేసిందేకానీ, ఆమె నీకు పనిమనిషి కాదు. నిజంగా ఆమె ఈ ఇంటి మహారాణి. నిన్ను బాధపెట్టకూడదు అని పరిస్థితి ఇంత దూరం తెచ్చుకున్నాను, నా కన్నా ఎక్కువ సంపాదిస్తున్నావని అహం నీకు. నా మంచితనం నీకు చేతకాని తనంలా కనిపించిందా? ఇన్ని రోజులు నిన్ను కొట్టకపోవడానికి, నీ మూర్ఖత్వం భరించడానికి కారణం ఏంటో తెలుసా? నా తల్లి! ఆమే, ఆడదానికి విలువ ఇవ్వాలని, భార్యపై చెయ్యి చేసుకోకూడదు, భార్యకూడా ఒక మనిషే అని గుర్తించి ప్రేమ ఇవ్వాలని, ఆమె ఎదుగుదలకు అవరోధం భర్త ఎప్పుడూ కారణం కాకూడదు అని ఆమె నేర్పిన జ్ఞానమేనే, నీ గొప్పతనం ఏమీలేదు. ఛీ! నీవు చదువుకున్న మూర్ఖురాలివి, ఆమె మనసు ఉన్న సంస్కారవంతురాలు. నువ్వు అమ్మను అవమానించిన ప్రతిసారి నాకు కోపం వచ్చి నిన్ను దండించబోయే నన్ను అమ్మే ఆపింది.

'భర్త లేకుండా ఒంటరి ఆడదానిగా నేను ఎన్ని కష్టాలు పడ్డానో నాకు తెలుసు, పద్మిని చదువుకున్న పిల్ల నువ్వు తనపై కోప్పడితే పంతంతోనో, కోపంతోనో నీకు దూరమై పద్మిని పడే బాధ నాకు తెలుసు, నా బ్రతుకు లాంటి ఒంటరి బ్రతుకు ఏ ఆడది అనుభవించకూడదు, కాటికి కాలు చాచుకున్న దానికోసం ఎందుకురా పద్మపై కోప్పడటం. నువ్వు ఒక్కడివేనా నా బిడ్డవి? పద్మిని కూడా నా బిడ్డలాంటిదే, తెలియని తనంలో రెండు మాటలు అంటే నేను పడకూడదా? ' అని నన్నే ఓదార్చింది. అమ్మ వెలుతుంటే అదే చివరి చూపు అవుతుంది అనుకోలేదు. పైగా ఆమెకు అర్థం కాకుండా ఉంటుంది అని ఆమె ముందే ఇంగ్లీష్‌లో తిట్టేదానివి" గట్టిగా ఏడుస్తూ సోఫాలో కూలబడ్డాడు మోహన్.

●●●

"ఎలా జరిగింది గంగమ్మత్తా?" దుఃఖం నిండిన గొంతుతో అడిగాడు మోహన్.

"అమెరికా నుండి వచ్చిన దగ్గర నుండి ముభావంగానే ఉంది, నీ దగ్గరకు వచ్చేముందు ఉన్న కళ, వచ్చిన తరువాత ఆ మొహంలో ఆ సంతోషమే కనిపించలేదు. జానకమ్మ సుఖమే ఎరగదు, సుఖం అంటే ఏమిటో కూడా తెలియదు పాపం. అంత కష్టపడింది. ఆ విషయమే నేను ఎప్పుడైనా అంటే నా కొడుకే నా సుఖం అనేది పిచ్చిది. నీ జీవితంలో ముఖ్యమైన పెళ్ళి కూడా జానకమ్మ లేకుండానే నీ ఇష్టప్రకారం అమెరికాలోనే చేసుకున్నావు. ఫోటోలు తీసి పంపావు. వాటితోనే తృప్తిపడింది. మనుమడు, మనుమరాలు అచ్చట ముచ్చటా లేకుండా అవీ ఫోటోలు పంపావు. వాటితో సరిపెట్టుకోలేకపోయింది. అమెరికాలో ఉండడం వల్ల వాళ్ళకు తెలుగురాదు

అని మనుమడు మనమరాలితో ఎన్నోకబుర్లు చెప్పుకోవాలని, వాళ్ళతో సరదాగా గడపాలని వాళ్ళతో ఇంగ్లీషులోనే మాట్లాడాలని పట్టుబట్టి ఈ వయసులో ఇంగ్లీషు నేర్చుకుంది. పగలు కూలి చేయడం, సాయంత్రం మన ఊరి మాష్టర్ దగ్గరకి వెళ్ళి ఇంగ్లీషు నేర్చుకున్నది. మీకు సేవచేయడానికి పెద్ద పెద్ద ఇండ్లలో పనిచేసి బట్టలు ఉతికే మెషిన్స్, మిక్సీలు, చెత్త ఊడ్చే మెషిన్‌లు ఎలా చేస్తాయో నేర్చుకున్నదయ్యా ఈ వయసులో చిన్నపిల్లలా, మీ అమ్మకు మీ పై ఉన్నది ప్రేమ కాదయ్యా.. ప్రాణం'' అని గంగమ్మ గుండె అలిసేలా బోరు బోరున ఏడ్చింది.

ఈ విషయాలు అన్నీ తెలిసి మోహన్ బ్రెయిన్ పని చేయడం కాసేపు ఆగిపోయింది.

పద్మిని పశ్చాత్తాపంతో కన్నీరు వరదలా పొంగుతున్నది.

మోహన్‌కు అమెరికాలో జరిగిన సంఘటనలు గుర్తుకువచ్చాయి. ''అమ్మకు ఇంగ్లీషు తెలుసా? అది మా కోసం నేర్చుకుందా? అంటే తన ముందే అమ్మ గురించి ఇంగ్లీష్‌లో పద్మ గొడవపడడం పనిమనిషి అనడం, డాక్టర్‌లు ఆపరేషన్ చేస్తే బ్రతుకుతుంది అంటే, ఆపరేషన్‌కి అంత ఖర్చుపెట్టి చేయించడానికి వీలు లేదని గొడవపడటం.. అమ్మను నానామాటలు.. అనడం అన్నీ అన్నీ అమ్మకు తెలుసు. పిల్లలు వచ్చి నాయనమ్మ ఇంగ్లీష్‌లో మాట్లాడింది అని ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదు'' అని గుర్తుకొచ్చి ఏడ్చాడు.

గంగమ్మ ఏదో గుర్తువచ్చినదానిలా లోపలికి వెళ్ళి ఒక ఉత్తరం పట్టుకొచ్చి మోహన్‌కి ఇచ్చింది

''ఇది నీకోసం మీ అమ్మ వ్రాసిన ఉత్తరం'' అంది గంగమ్మ.

అమ్మ వ్రాసిన ఉత్తరం ఆత్రుతగా ఓపెన్ చేశాడు కానీ నీరు నిండిన కళ్ళకు ఏమీ కనిపించలేదు.

''***మై డియర్ స్వీట్ సన్***'' అని లీలగా కనిపిస్తున్నాయి అక్షరాలు. దుఃఖం ఆగలేదు తన భుజంపై ఉన్న టవల్‌తో మొహం తుడుచుకున్నాడు మోహన్.

''నేను స్వీట్ కాదు అమ్మ నీకు చేదు మిగిలించిన కర్కోటకుడిని'' అని తనను తానే తిట్టుకున్నాడు. మళ్ళీ చదవడం ప్రారంభించాడు.

''ఏడవకు నాయనా, నువ్వు చేసిన తప్పు ఏమీలేదు జీవితాంతం నీతో ఉండవలసిన భార్యకు విలువ ఇచ్చావు. దానికి నేను గర్విస్తున్నాను. కానీ ఈ అమ్మకు మాత్రం నువ్వు తప్ప ఎవరు ఉన్నారు చెప్పు. కోడలు మనస్సు నాకు అర్ధమైంది. ఉన్నది అంతా నాకు ఊడ్చిపెడితే రేపు మీ పిల్లల అవసరాలు ఎలా తీరతాయి? అదే కోడలు ఉద్దేశ్యం. నేను అర్ధం చేసుకున్నాను. అమెరికాలో తెలుగువారు అందరు అచ్చ తెలుగు మాట్లాడుతున్నారు. నేనే తొందరపడి ఇంగ్లీష్ నేర్చుకున్నాను.. అని నాకు అర్ధమైంది. నా బాధ అంతా నా మనమడు మనమరాలి గురించే, మనిషిది చూసి నేర్చుకునే నైజం. ఈ రోజు మీరు నా పట్ల చేసింది చూసి, రేపు వాళ్ళు మిమ్మల్ని బాధపెడితే నేను ఏ లోకంలో ఉన్నా నా ఆత్మకు శాంతి ఉండదు. వాళ్ళను ప్రేమగా చూసుకోవడమే కాదు, వాళ్ళు మనల్ని ప్రేమించడం కూడా మనమే నేర్పాలి. అప్పుడే మీ పిల్లలకు ప్రేమ పంచడం అర్ధం అవుతుంది.

**ఇట్లు మీ అమ్మ (మామ్)**

ఉత్తరం చదవడం ఆపిన మోహన్‌కి తల్లి మనసు అర్ధమై తన తల్లి ఎక్కడ ఉందో అక్కడికి వెళ్ళి, తన కన్నీళ్ళతో కాళ్ళు కడిగి క్షమించమని కోరాలని అనుకున్నాడు మోహన్. మోహన్ గట్టిగా ఏడుస్తున్నాడు తల్లిని తలుచుకుని. మోహన్ ఇద్దరు బిడ్డలు మోహన్ దగ్గరికి వెళ్ళారు. వాళ్ళను గట్టిగా పట్టుకుని ఏడిచాడు మోహన్.

పద్మిని ఆ ఉత్తరంలో విషయం విని స్పృహ తప్పి పడిపోయింది. పిల్లలు ఇద్దరు కంగారు పడి గ్లాసుతో నీళ్ళు తీసుకొచ్చి పద్మిని మొహంపై చల్లారు. పద్మినికి స్పృహ వచ్చింది. తన రెండు చేతులతో ఇద్దరి పిల్లలను పట్టుకుని కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. ''క్షమించండి అత్తయ్యా, మీరు మా నుండి డబ్బు ఆశించలేదు. ఇప్పుడు నా పిల్లలు నాపై చూపించిన ప్రేమలాంటి ప్రేమ మాత్రమే ఆశించారు. తల్లి

ప్రేమకు వెలకట్టిన అవివేకిని. ఈ మూర్ఖురాలిని క్షమించండి అత్తయ్యా మీరు ఎక్కడవున్నా మాతోనే ఉంటారు మీకు మేమంటే ఎంత ప్రేమో నాకు తెలిసింది నన్ను క్షమించండి అత్తయ్యా'' అంటూ భర్త దగ్గరికి వెళ్ళి కాళ్ళపై పడి ''క్షమించండి నా వల్ల మీకు ఏర్పడిన లోటు, తల్లిలేని లోటు ఎవరు తీర్చలేరు నన్ను క్షమించండి'' అని ఏడ్చింది పద్మిని.

జానకమ్మ ఎందుకలా ఎప్పుడూ బాధపడేదో గంగమ్మ కిప్పుడు తెలిసింది.

# సాహచర్యపు అంచున.. మధురవాణి

●●●

**రాత్రిలోని నిశ్శబ్దం, చీకటిలోని నలుపు** చిరపరిచితమే అయినా వాటిని ఈ ఆసుపత్రి గోడల మధ్య అనుభవించడం భయం గొలిపేదిగా ఉంటుంది. ఈ గదిలో ఇది నేను గడుపుతున్న మూడో రాత్రి. అయినప్పటికీ రోజురోజుకీ కాస్తయినా అలవాటు పడకపోగా మరింత కలవరపెడుతున్నాయి ఈ పరిసరాలు. ఎంతటి నైరాశ్యంలోనైనా సరే ఏదో ఓ మూల నుంచి ఒక్క చిన్న ఆశాకిరణమైనా ప్రసరించకపోదా అంటూ నాకు ధైర్యం చెబుతున్నట్టు ఈ గదిలో చీకటిని పారద్రోలే ప్రయత్నం చేస్తూ ఓ గుడ్డి లైటు మిణుకు మిణుకుమంటూ వెలుగుతోంది.

మూడు రోజుల బట్టీ కాస్తైనా నింపాదిగా కన్నంటుకున్న క్షణం లేదు. పడక మీద ఎంతసేపు దొర్లినా ఇక లాభం లేదని నెమ్మదిగా లేచి గోడకి జారగిలబడి కూర్చున్నాను. ఎదురుగా మంచం మీద తెల్లటి పక్క మీద తనకేం జరుగుతుందో ఏ మాత్రం అవగాహన లేకుండా పసి పాపాయిలా అమాయకంగా నిదురిస్తున్న ఆయన. డాక్టర్లు ఆయన గొంతులోకి, పొట్టలోకి పెట్టిన రకరకాల గొట్టాలు యాంత్రికంగా వాటి పని అవి చేసుకుపోతున్నాయి. అలా తన మొహంకేసి చూస్తూ ఉంటే ఎన్నో రకాల భావాలు మిళితమైపోయి గుండె గొంతులోకి వచ్చేస్తోంది. తనకి ఊపిరి అందివ్వడానికి పెట్టిన వెంటిలేటరు చూస్తుంటే నాకు ఊపిరి తీస్కోడం కష్టంగా ఉంది. అక్కడ మృత్యువుతో పోరాడుతూ హింస పడుతున్న దేహం ఆయనదే అయినా నా ప్రాణం విలవిలలాడుతూ నరకాన్ని చవి చూస్తోంది. ఆయన ఈ అపస్మారకపు నిద్రలోంచి శాశ్వత నిద్రలోకి జారిపోయి నన్ను శాశ్వతంగా చీకట్లోకి పడదోయరనీ, కళ్ళు తెరిచి మళ్ళీ మెలుకువలోకి వస్తారని ఈ మూన్నాళ్ళ నించీ పదే పదే అదే తలుస్తున్నాను.

ఈ ప్రపంచంలో అత్యంత ఆప్తుడైన మనిషంటూ నాకెవరైనా ఉంటే అది ఆయనే కదా.. జీవితమనే పదానికి నాకు తెలిసిన అర్థం ఆయనే కదా.. అసలు ఎక్కడ మొదలైందీ అనుబంధం.. ఎప్పుడు ముడి పడిందీ బంధం!

దాదాపు నలభై యేళ్ళ పైమాటే అయినా నాకింకా ఆ రోజు బాగా గుర్తు. అప్పుడు నాకు పన్నెండేళ్ళ వయసు. వేసంగి ఎండలు మండిపోయే రోహిణీ కార్తె రోజులవి. ఎండైనా వానైనా విరామం లేకుండా ప్రతి రోజూ కష్టపడి పని చేసుకోక తప్పని పరిస్థితి మాది. మగదక్షత లేని సంసారం. ఉన్నదల్లా అమ్మమ్మా, అమ్మా, నేనూ, చెల్లాయి, తమ్ముడూ. ఉన్న రెండెకరాల పొలాన్నీ అమ్మమ్మా, అమ్మా స్వయంగా సాగు చేసే పని నెత్తికెత్తుకోవడంతో, చెల్లీ, తమ్ముడు ఇంకా పసివాళ్ళు కావడంతో ఇంటి పనంతా నా మీదే పడేది.

ఆ రోజు చేనుకెళ్ళిన అమ్మా, అమ్మమ్మా మధ్యాహ్నం వేళకే తిరిగొచ్చేసి ఇంట్లోనే ఉన్నారు. గేదెల కోసం గడ్డి మోపు తేవడానికని నేను ఆ ఎర్రటి ఎండలో ఊరు పొలిమేరల్లో మా గడ్డి వాములున్న లంక చేను దాకా వెళ్ళి తిరిగి ఇంటికొచ్చేసరికి ఒళ్ళు హూనమైపోయింది. వాకిట్లోంచి లోపలికి చూసేసరికి ఎవరో కొత్త మనుషులు కనిపించారు. నడి వయసు దంపతులు పందిట్లో నులక మంచం మీద కూర్చుని ఉన్నారు. అమ్మ ఎదురుగా నించుని వాళ్ళతో ఏదో మాట్లాడుతోంది.

ఇంతలో వీధిలోనుంచి చెల్లి వెనకాల అమ్మమ్మ పరుగు పరుగున వస్తోంది. రెండిళ్ళ అవతలున్న మామ్మ గారింట్లో ఉన్న అమ్మమ్మని చెల్లి వెళ్ళి పిలుచుకొస్తున్నట్టుంది. నేను గడ్డి మోపు తీసుకుని పశువుల కొట్టంలోకి వెళ్ళాను. అమ్మమ్మ ఆదరా బాదరాగా నా దగ్గరికొచ్చి "వెళ్ళి మొహమూ అదీ కడుక్కుని రావే కాస్త.." అని చెప్పి అంతే హడావిడిగా పందిట్లో ఉన్న చుట్టాల దగ్గరికి వెళ్ళిపోయింది. నేను వెళ్ళి కాస్త సేద తీరి పందిట్లోకి వచ్చాను.

"ఇదే బాబూ.. నా పెద్ద మనవరాలు రత్నం. పిల్ల కూసింత రంగు తక్కువైనా గొప్ప పనిమంతురాలు బాబూ. కష్టపడి శ్రద్ధగా పని చేస్తుంది. ఇల్లంతా చక్కబెడుతుంది. కమ్మగా వండుతుంది. ఒద్దిక కలిగిన పిల్ల బాబూ.. మొన్న వైశాఖ మాసానికి పన్నెండు నిండాయి" అంటూ అమ్మమ్మ నా గురించి వాళ్ళకి చెప్పింది. ఆ తర్వాత మరేం మాట్లాడుకున్నారో నాకు తెలీదు. అమ్మ నన్ను ఇంట్లోకి వెళ్ళమంది. మరో అరగంటకి ఆ వచ్చిన వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ రోజంతా అమ్మా, అమ్మమ్మ ఒకటే మంతనాలు జరిపారు. రాత్రికి అన్నాలయ్యాక అందరం యథావిధిగా ఆరుబయట మంచాలేసుకున్నాం. అమ్మమ్మ నన్ను దగ్గరికి పిలిచి పక్కన కూర్చోబెట్టుకుని చెప్పసాగింది.

"అమ్మా రత్నమ్మ తల్లీ.. ఇవాళ మధ్యాహ్నం మనింటికి వచ్చినోళ్ళు నీకు పెళ్ళి సంబంధం మాట్లాడటానికి వచ్చారమ్మా. ఆ వచ్చిన జంట పెళ్ళికొడుకు అన్నా వదినా. వాళ్ళది రంగాపురంలో గొప్ప పేరు ప్రతిష్టలున్న కుటుంబం. చాలా పెద్ద సంసారం. మొత్తం తొమ్మిది మంది అన్నదమ్ములు, ముగ్గురు అప్పచెల్లెళ్ళు. ఇప్పుడొచ్చినాయన ఇంటికి పెద్ద కొడుకు. తర్వాత మరో ముగ్గురు కొడుకులకీ, ఇద్దరు కూతుర్లకీ కూడా పెళ్ళిళ్ళయినాయి. ఆడపిల్లల్ని అత్తారింటికి పంపారు గానీ మొగపిల్లలందరూ ఉమ్మట్లోనే కలిసుంటారు. మిగతా వాళ్ళందరూ చదువుకునే వయసున్న పిల్లలు.

ఇప్పుడు సంబంధం మాట్లాడేది వాళ్ళ ఐదో కొడుక్కి. అబ్బాయి వయసు ఇరవయ్యేళ్ళు. మెట్రిక్ పరీక్ష పాసయ్యాడు. బుద్ధిమంతుడు, తెలివైనవాడు. కాకపోతే ఒకటే చిన్న లోపం ఏవిటంటే అబ్బాయికి చిన్నతనంలోనే ఒక కాలికి పోలియో రావడం వల్ల కర్ర సాయం లేనిదే నడవలేడు. మొత్తం కుటుంబం కలిసే ఉంటారు కాబట్టి వంద ఎకరాలు పైనున్న వాళ్ళ పొలాలన్నీ అన్నాదమ్ములందరూ కలిసి ఉమ్మడిగా సొంత సేద్యం చేసుకుంటారు. మనుషులందరూ చాలా మంచోళ్ళని ఊళ్ళో గొప్ప పేరు. ఆస్తిపాస్తులు, సంప్రదాయం విషయంలో మనకి కలలో కూడా తూగని సంబంధం. అబ్బాయికి పోలియో ఉన్న కారణంగా డబ్బు లేకపోయినా పర్లేదు. అబ్బాయిని కంటికి రెప్పలా చూసుకుంటూ కళ్ళల్లో పెట్టుకుని కాపురం చేసే బుద్ధిమంతురాలు అయిన అమ్మాయి కోసం వాళ్ళు చూస్తున్నారంట.

నాకు తెలిసినంతలో ఇది మనకి బంగారం లాంటి సంబంధం తల్లీ.. ఎవరో ఒకరి చేతిలో నిన్ను పెట్టేసి బరువు దించుకుందామని మా ఉద్దేశ్యం కాదు. అంత పెద్ద కుటుంబంలో ఇస్తే నీకు అందరి అండదండలూ వెన్నుదన్నుగా నిలుస్తాయి. నీకైనా, నీ పిల్లలకైనా ఆ ఇంట్లో అన్నీ చక్కగా అమరుతాయి. మంచి మనసున్న వాళ్ళు కాబట్టి అత్తింటి ఆరళ్ళవీ లేకుండా ఆపేక్షగా చూసుకుంటారు అన్న ఆలోచనతో ఈ సంబంధం చేద్దామనుకుంటున్నాం తల్లీ.. నువ్వు చిన్నపిల్లవైనా లోకజ్ఞానం ఉన్న పిల్లవి. కష్టం సుఖం తెలిసినదానివి. అందుకే నీకింత వివరంగా చెప్తున్నాను. నువ్వు బాగా ఆలోచించి మనస్ఫూర్తిగా పరిస్థితులన్నీ అర్థం చేసుకుని ఈ పెళ్ళి చేసుకోడానికి ఇష్టపడితే మాకు అంతకంటే సంతోషం ఉండదు తల్లీ.." అని కళ్ళ నీళ్ళు పెట్టుకుని ఎంతో ఆప్యాయంగా చెప్పింది అమ్మమ్మ.

ఆ తర్వాత నేను సరేననడానికీ, రెండు వైపులా పెద్దల రాకపోకలకీ, పెళ్ళికి లగ్నాలు పెట్టుకోడానికీ, పచ్చని పందిట్లో మూడు ముళ్ళ సాక్షిగా మేమిద్దరం ఒక్కటవ్వడానికీ ఎన్నో రోజులు పట్టలేదు.

పెళ్ళి తతంగం అయిపోయాక అత్తవారింటికి పంపుతూ అమ్మమ్మ నన్ను దగ్గరికి తీసుకుని "ఏమనుకుంటూ నీకా పేరు పెట్టామో గానీ నువ్వు నిజంగా రత్నం లాంటి పిల్లవి తల్లీ.. అబ్బాయి చేత నీ మెడలో తాళి కట్టించుకోడానికి నువ్వే కాస్త ఎక్కువ వంగి అతనికి సహకరించి ఎలాగయితే మూడు ముళ్ళు వేయించుకున్నావో, అలాగే నిత్యం అతనికి ఆసరాగా ఉంటూ కేవలం భార్యలాగానే కాకుండా తల్లిలా అతన్ని గుండెల్లో పెట్టుకుని చూసుకో తల్లీ.. అతని నీడలోనే నీ జీవితాన్ని పచ్చగా పండించుకో.. ఇంతకన్నా నీకు చెప్పేదేం లేదు. బంగారు తల్లివి.. సుఖంగా పిల్లాపాపలతో నిండు నూరేళ్ళు వర్ధిల్లమ్మా.." అని ఆశీర్వదించి నన్ను అత్తవారింటికి సాగనంపింది.

ఆనాడు పన్నెండేళ్ళ వయసులో ఆయన చిటికెన వేలు పట్టుకుని పుట్టింటి గడప దాటిన నేను ఈనాటి దాకా ఆయన తోటిదే జీవితంలా, ఆయన నీడలా బతికాను. రోజులో ఉన్న ఇరవై నాలుగ్గంటల్లో దాదాపు ప్రతీ నిమిషమూ ఆయన్ని అంటి పెట్టుకునే ఉన్నాను. అక్షరం ముక్క ఆకారం కూడా తెలియని నేను ఆయన సాంగత్యంలో ఎన్నో మంచి విషయాలు విని తెలుసుకుని కాస్తో కూస్తో జ్ఞానం సంపాదించుకున్నాను. మనిషి కదలలేరనే గానీ ఆయనకి స్వతహాగా సొంతమైన తెలివితేటలూ, సామర్ధ్యం, బుద్ధి కుశలత, విషయ పరిజ్ఞానం, వ్యవహార దక్షత మా ఇంట్లోనే కాకుండా ఊరు మొత్తంలోనూ ఎనలేని గౌరవ ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి.

ఆనాడు అత్త చాటు కోడలిగా అందరితో కలిసి ఉమ్మట్లో కాపురం చేసిన రోజుల నుంచీ, అత్తామామలు కాలం చేసాక అందరం వేరు కుంపట్లు పెట్టుకున్న రోజులూ, ఇద్దరు పిల్లలు పుట్టుకొచ్చి వాళ్ళ చదువులూ, పెళ్ళిళ్ళూ, మనవళ్ళూ, మనవరాళ్ళూ.. ఈ సుదీర్ఘ ప్రయాణంలో అప్పుడప్పుడూ కన్నీటితో పలకరించిపోయే కష్టాల్లోనూ, పన్నీరు చిలకరించిపోయే సుఖాల్లోనూ సదా ఆయన వేలు పట్టుకుని ఆయన అడుగు జాడల్లోనే నడిచాను. ఎలాంటి భీతి గొలిపే పరిస్థితులు ఎదురైనా జడిసిపోకుండా చిరునవ్వుతో ధైర్యం చెప్పి అనునయించే నిర్భయత్వం, ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా తొణక్కుండా చాకచక్యంగా పరిస్థితులను చక్కబెట్టే ఆయన నిబ్బరం నా మనసులో ఇవాళ్టి గురించిన దిగులు, రేపటి గురించిన భయం లాంటి వాటికి స్థానం లేకుండా చేశాయి.

ఆయనకంటూ అంత పెద్ద కుటుంబం ఉన్నా సరే కాలగమనంలో తోడబుట్టిన వాళ్ళందరూ చదువులూ, ఉద్యోగాల కారణంగా ఊరు వదలిపోయినా ఆయన మాత్రం తను పుట్టిన ఈ మారుమూల పల్లెటూరిలోనే చివరిదాకా ఉండాలని నిర్ణయించుకుని ఊళ్ళో వాళ్ళందరికీ తలలో నాలుకలా, పెద్ద దిక్కుగా ఉంటూ వస్తున్నారు. ఊళ్ళో చిన్నా పెద్దా తేడా లేకుండా ఎవరికే సమస్య వచ్చినా వెంటనే పరుగు తీస్తూ మా ఇంటి గడపే తొక్కుతారు. అంత ఆదుర్దాగా వచ్చిన వాళ్ళు కూడా ఆయనతో మాట్లాడి తిరిగి మా గుమ్మంలో నుంచి వెళ్ళేప్పుడు ఎంతో స్థిమితంగా వాళ్ళ సమస్యలకి దొరికిన చక్కటి పరిష్కారంతోనో, అవసరానికి అందుకొన్న సహాయంతోనో తృప్తిగా వెళ్తుంటారు.

ఇంతమందికి ఆసరాగా, మార్గదర్శకంగా నిలుస్తున్న ఆయన మంచితనం ముందు ఎంత గొప్ప సంపదలైనా సాటి నిలుస్తాయా.. నాది ఎన్ని జన్మల పుణ్యఫలమో కదా ఇంత గొప్ప మనిషితో ఏడడుగుల బంధం కలిసింది అని నేను తృప్తిగా తలచుకోని రోజు లేదు. ఇన్నేళ్ళు గడిచినా ఇంత కుటుంబం, పిల్లలూ, ఆఖరికి మనవలు వచ్చినా సరే పెళ్ళినాడు పెనవేసుకున్న మా ఇద్దరి చేతులు ఎన్నడూ వీడిపోలేదు. ఆయన లేకుండా, రాకుండా ఒక్క పూటైనా ఇల్లు దాటి వెళ్ళిన జ్ఞాపకం లేదు నాకు. అనుక్షణం ఆయన్ని అనుసరించి ఉంటూ, ఆయనకి అవసరమైనవన్నీ అమరుస్తూ, కేవలం భార్యలా కాక ఆయన శరీరంలో ఒక భాగంలాగా బతికాను ఇన్నాళ్ళూ..

అలాంటిది..... ఇప్పుడిలా..... ఆసుపత్రి మంచం మీద ఏ మాత్రం తెలివి లేకుండా ఆయన. ఈనాటి వరకూ ఎన్నడూ పరిచయం కాని అంతులేని ఆవేదన, అభద్రతా భావాల సుడిలో కొట్టుకుపోతూ కొత్త తెలివి తెచ్చుకుంటున్న నేను!

మీద పడే వయసు కారణంగా చిన్నవో పెద్దవో ఆరోగ్య సమస్యలు అడపాదడపా వస్తూ ఉన్నా సరే వాటినసలు లెక్క చేయకుండా ఎప్పుడూ హుషారుగా చలాకీగా తన పనులు తాను చేసుకుపోయే మనస్తత్వం ఆయనది. అలాంటి మనిషి మూడు రోజుల క్రితం ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్ప కూలిపోయేసరికి నాకసలు కాళ్ళూ చేతులూ ఆడలేదు. అప్పటికప్పుడు వెంటనే పట్నంలో పెద్ద ఆసుపత్రికి తీసుకొచ్చాము. గత మూడు రోజుల నుంచీ ఆసుపత్రిలోనే ఉన్నాం. విషయం తెలిసాక బావగార్లూ, అక్కలూ, మరుదులూ, చెల్లెళ్ళూ, కొడుకులూ, కోడళ్ళూ, కూతుర్లూ, అల్లుళ్ళూ, మనవలూ, మనవరాళ్ళూ మొత్తం కుటుంబమంతా ఆసుపత్రి చుట్టూనే తిరుగుతున్నారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందోనని చూడటానికని ఊరి నుంచి వచ్చే జనాలకైతే లెక్కే లేదు.

మూడు రోజుల బట్టీ క్షణమొక యుగంలా గడుస్తోంది. పగలైతే వేరేవాళ్ళందరూ కాసేపైనా వచ్చి చూసి పోయే వీలుంది కానీ, రాత్రి పూట మాత్రం ఆయనతో పాటు కేవలం ఒక్క మనిషి ఉండటానికి మాత్రమే అనుమతించారు ఆసుపత్రి వాళ్ళు.

సాయంత్రం "నువ్వు చాలా నీరసపడిపోయావమ్మా, ఇవాళ్టికి ఇంటికి వెళ్ళి కాస్త విశ్రాంతి తీసుకోమ్మా.. నాన్న దగ్గర నేనుంటాను" అన్నాడు నా కొడుకు.

"నీరసమే కాదురా.. ఏమైనా సరే నా ప్రాణం పోయే ఆఖరి క్షణాల దాకా నేను ఆయన్ని వదిలి కాస్తైనా దూరంగా వచ్చే ప్రసక్తే లేదు" అని మాటల్లో చెప్పలేక వాడి మొహం వంక మౌనంగా చూసాను.

నా మనసు అర్థం చేసుకున్నట్టున్నాడు. మరేం రెట్టించకుండానే "నేను మళ్ళీ పొద్దున్నే వస్తానమ్మా.. నువ్వు ధైర్యంగా ఉండు. నాన్నగారికేం భయం లేదు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

"మా ప్రయత్నం మేము చేస్తున్నాము. మేము చేసే చికిత్సకి ఆయన శరీరానికి స్పందించగల శక్తి ఉందో లేదో ఇంకో రెండు మూడు రోజులు గడిస్తే గానీ పూర్తిగా తెలియరాదు" అన్నారు డాక్టర్లు.

గుండె కొట్టుకుంటున్న ప్రతీసారీ ఉలికిపాటుగా ఉంటోంది. ఇప్పుడేం జరగనుందీ? నా ప్రాణంలో ప్రాణంగా నిలిచిన ఆయన మళ్ళీ కళ్ళు తెరిచి నన్ను చూస్తారా? ఈ ఆసుపత్రి నుంచి మేమిద్దరం కలిసి సంతోషంగా ఇంటికి వెళ్తామా? ఏదో ఒక వెర్రి ఆశతో ఎదురు చూడటం తప్పించి ఇప్పుడు నేను చేయగలిగింది ఏమీ లేదా? ఈ జీవన సంధ్యలో ఎలాంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కోగలిగే ధైర్యం నాకుందా?

అసలా ఊహ దరిదాపుల్లోకి వెళ్ళడానిక్కూడా నా మనసు ఒప్పుకోవట్లేదు. చుట్టూ ఎందరున్నా ఆయనే లోకంగా బతికాను. ఒక వేళ ఇప్పుడు జరగరానిదేదైనా జరిగితే ఆయన లేని నేను ఆత్మ లేని శరీరంలా నిర్జీవంగా మిగిలిపోనూ?

మనసులో ఇలా ఆలోచనల యుద్ధం సాగుతున్న కొద్దీ శరీరంలోని అణువణువూ వణికిపోతోంది. ఒకదాన్ని మించిన ఊహ ఒకటి బయలుదేరి అన్నీ కలిసి మూకుమ్మడిగా నా మీద దాడి చేసి నన్ను పాతాళంలోకి తోసేస్తున్న భావన. ఒకేసారి నన్ను కబళించాలని కట్టగట్టుకు వచ్చిన రకరకాల భయాలన్నీ సుడిలా మారి నన్నందులోకి లాగేసుకుంటున్న భావన. మెల్లమెల్లగా నాకేం జరుగుతుందో తెలీని స్థితికి వెళ్ళిపోతున్నట్టు, చుట్టూ అంతా చీకటి పరుచుకుంటున్నట్టు, శూన్యం లాంటి నిశ్శబ్దం ఒడిలోకి జారిపోతున్నట్టు......

●●●

ఎవరిదో చెయ్యి గట్టిగా తట్టి లేపేసరికి చప్పున కళ్ళు తెరిచి చూసాను. ఎదురుగా నర్సు మొహం కనిపించింది. నేను గాఢంగా నిద్రపోయానని తెలిసొచ్చింది. చిత్రంగా గత రెండు రాత్రులుగా లేని నిద్ర ఇవాళ పట్టిందా అని ఆశ్చర్యపోతూనే లేచి కూర్చున్నాను. టైం ఎంతయ్యిందని అడిగితే ఏడున్నర దాటిందనీ, మరి కాసేపట్లో డాక్టర్ గారు వస్తారనీ చెప్పి వెళ్ళింది.

రాత్రి ఏ స్థితిలో ఉన్నానో, అసలెప్పుడు నిద్ర పట్టిందోనని ఆలోచించుకుంటూ కాస్త మొహం కడుక్కుని వచ్చి కూర్చున్నాను. ఆ తెల్లటి పక్క మీద నిన్నటిలా అంతే నిశ్చలంగా ఆయన.

మళ్ళీ నేను ఆలోచనల అలజడిలో కొట్టుకుపోయేలోగానే డాక్టరు వచ్చి ఆయన చుట్టూ అమర్చిన పరికరాలన్నీ పరీక్షించసాగాడు. అంతలోనే నా కొడుకు కూడా వచ్చాడు. మేమిద్దరం ఆదుర్దాగా, ఆత్రంగా ఆయన్ని పరీక్షిస్తున్న డాక్టరు వంకే చూస్తూ నుంచున్నాం.

"పరిస్థితి కొంత మెరుగయినట్టే కనిపిస్తోంది. ఈ మూడు రోజులుగా అస్సలేమీ స్పందన లేని శరీరంలో రాత్రి ఇచ్చిన మందులకి కొద్దిగా కదలిక వచ్చినట్టే అనిపిస్తోంది. ఇంకో మందు ఇస్తే మరి కాస్త ప్రభావం ఉండొచ్చు. ఓ గంటయ్యాక నేను మళ్ళీ వస్తాను. మరీ భయపడాల్సిందేం లేదు" అన్న డాక్టరు మాటలు విన్నాక ప్రాణం లేచొచ్చినట్టయింది. నా మనసుకీ, శరీరానికి కూడా కాస్త స్థిమితం వచ్చింది.

"అమ్మా మూడు రోజుల నుంచీ సరిగ్గా తిండైనా తినలేదు నువ్వు. ఆసుపత్రి క్యాంటీన్‌కి వెళ్ళి కాస్త వేడి వేడిగా ఇడ్లీ తిని, కాఫీ తాగి వద్దాం రామ్మా.. నాన్నగారికి మరేం పర్వాలేదు. కంగారు పడాల్సిందేం లేదని డాక్టరు చెప్పారుగా.." అంటూ నన్ను బలవంతంగా బయలుదేరదీసాడు నా కొడుకు.

ఫలహారం చేస్తున్నంత సేపూ ఒకటే ఫోన్లు ఇంట్లో అందరి దగ్గర నుంచీ. మరేం పరవాలేదని అందరికీ చెప్పాడు వాడు. ఫలహారం చేసి ఒక అరగంటలో మళ్ళీ తిరిగి ఆసుపత్రి గదికి చేరుకున్నాం.

అంతలోనే డాక్టరు కూడా వచ్చాడు. దాదాపు పది నిమిషాల పాటు ఆయన్ని పరీక్ష చేసాడు.

నా కొడుకు దగ్గరికొచ్చి నించుని గంభీరంగా "అయాం సారీ.. కొద్ది నిమిషాల క్రితమే మీ నాన్నగారు ప్రాణాలు విడిచారు. ఆయన ప్రాణాలు పోతున్న సంగతి కూడా గుర్తించలేని అపస్మారక స్థితిలోనే ఏ మాత్రం నొప్పి, బాధ అనేవి తెలీకుండానే పోయారు. ఉదయం రీడింగ్స్ అవీ చూసి..." డాక్టరు ఇంకా ఏమేమో చెప్పుకుపోతున్నాడు గానీ నా చెవులకి వినిపించడం మానేశాయి.

ఆ తర్వాత ఏం జరిగిందో, ఆసుపత్రి నుంచీ ఎలా ఇంటికొచ్చామో నాకేం స్పృహ తెలీలేదు. కళ్ళు తెరిచే ఉన్నా చీకటి తప్ప ఏమీ కనిపించని, నాలో చలనం ఉన్నా ఇది నేనే అని అనిపించని ఒక విచిత్రమైన స్థితిలో ఉండిపోయాను. కొద్ది గంటలు గడిచేసరికి ఆ చీకటి పొరలు తొలగిపోయి మా ఇంటి వాకిట్లో తెల్లటి దుప్పటి కప్పుకుని ఉదయం దాకా ఆసుపత్రి పడక మీదున్నట్టే అంతే నిశ్చలంగా, ప్రశాంతంగా పడుకుని ఉన్న ఆయన నా కళ్ళ ముందున్నారన్న నిజం గ్రహింపుకొచ్చింది.

చుట్టూ బిగ్గరగా శోకాలు పెడుతూ గుమికూడిన బంధువులూ, కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ఊరి జనాలూ కనిపిస్తున్నారు. కళ్ళ ముందున్న దృశ్యం అయితే కన్నీటి తెరల్లోంచి మసక మసకగా కనిపిస్తోంది గానీ ఏ శబ్దాలూ నా చెవులని చేరడం లేదు. ఉదయం డాక్టరు ద్వారా విన్న "ఆయన ప్రాణాలు విడిచారన్న" మాటే ఇంకా నా చెవుల్లో గింగురుమంటోంది.

ఎవరెవరో జనాలు తరలి వచ్చి ఆయన శరీరం మీద పడి భోరు భోరున విలపిస్తున్నారు. నాకు మాత్రం గొంతులోంచి చిన్న శబ్దమైనా బయటికి రావట్లేదు. మెదడు, మనసూ అంతా స్తబ్దంగా, గడ్డ కట్టుకుపోయినట్టుంది. దేనికీ చలించలేనట్టు, స్పందించలేనట్టు ఏదో రాయిలా మారిపోయిన భావన.

నా కళ్ళ ముందే అన్నీ జరుగుతున్నాయి. కళ్ళు మనసుతో సంబంధం లేనట్టు తమ ఎదుట జరుగుతున్న ఆయన అంతిమ యాత్రని నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాయి.

అతి కష్టం మీద వారం రోజులు కదిలాయి. ఉన్నట్టుండి నాలుగు రోజుల్లోనే నా జీవితం మొత్తం తల్లకిందులైపోయిందన్న వాస్తవం నెమ్మదిగా నా మెదడులోకి ఇంకుతోంది. మెల్లమెల్లగా మళ్ళీ ఈ లోకంలోకి వచ్చి పడుతున్నట్టనిపిస్తోంది. ఇంటికి వచ్చి పోయే

వాళ్ళందరూ ఏడుస్తూనే ఆయన మంచితనం గురించి చెబుతున్న మాటలన్నీ మెల్లగా నా చెవిలో పడుతున్నాయి. ఆయన తన జీవితంలో సంపాదించుకున్న విలువైన ఆస్తి ఇదే కదా అనిపిస్తోంది. ఆయన అన్నదమ్ములు, కొడుకులూ అందరూ కలిసి ఏం చెయ్యాలా, ఎలా చెయ్యాలా అని జరగవలసిన కార్యక్రమం గురించి చర్చిస్తున్నారు.

ఎప్పుడో ఒకసారి ఏదో సందర్భంలో మనిషి పోయాక జరిపే కర్మల గురించి ఈ తతంగాలన్నీ ఇంత ఆడంబరంగా ఎందుకు చేస్తారోనన్న నా సందేహానికి "అంతే మరి, మనతో పాటు ఇన్నాళ్ళూ ఈ లోకంలో కలిసి బతికి, ఇప్పుడు శాశ్వతంగా మనల్ని వీడి మట్టిలో కలిసిపోయే తోటి ప్రాణికి మనం ఇవ్వగలిగిన చివరి నివాళి ఇదే కదా! అందుకే ప్రాణం పోయిన కట్టెని సాగనంపడం కూడా ఘనంగా అట్టహాసంగానే జరుపుతామన్నమాట" అని ఆయన నవ్వుతూ బదులిచ్చిన జ్ఞాపకం తలపుకొచ్చి గుండె బరువయ్యింది.

అసలు ఎంత విచిత్రంగా అనిపిస్తోందో.. ఆనాటి రాత్రి ఆసుపత్రిలో గడిపినప్పుడు ఏమనుకున్నాను. ఆయన లేకపోతే ఎలా? అన్న ఆలోచనని సైతం భరించలేకపోయాను. అసలా ఊహే దరిజేరనివ్వలేదు.

ఆయన దూరమైపోతే నా ఊపిరాగి పోతుందేమో, గుండె కొట్టుకోడం మానేస్తుందేమో, ఆ బాధని భరించలేక చచ్చిపోతానేమో అన్నంత భయంలో కొట్టుకుపోయాను. అలాంటిది అప్పుడే ఆయన పోయి వారం రోజులు దాటినా నేనింకా బతికే ఉన్నాను. ఊపిరి పీల్చుకుంటున్నాను, బలవంతంగానైనా నాలుగు మెతుకులు తినగలిగాను, అలసి సొలసి కాసేపన్నా నిద్ర పోగలుగుతున్నానంటే చాలా విచిత్రంగా విడ్డూరంగా కూడా ఉంది. నాలో ఈ సత్తువ ఎక్కడ నుంచీ వచ్చింది? నా కళ్ళ ముందే ఆయన మట్టిలో కలిసిపోతుంటే చూసి తట్టుకుని ఇంకా మనగలిగానా? రోజు రోజు గడిచే కొద్దీ ఆయన పోయినా నేను బతికే ఉన్నాను, ఆయన లేకపోయినా నేను బతగ్గలుగుతున్నాను అని ఆశ్చర్యంగా అనిపిస్తోంది.

గడిచిన వారం రోజుల్లో ప్రతీ నిమిషమూ ఆయనకి ఫలానా వస్తువు అవసరమేమో అనో, ఆయన భోజనానికి వేళయిందనో, ఇలా ఏదో ఒకటి గుర్తొస్తూనే ఉన్నాయి. చిత్రంగా చాలాసార్లు ఆయన లేరన్న నిజం గుర్తుకు రాకపోగా, రోజులా నేనిక్కడ ఇంట్లో గదిలో ఉంటే ఆయన బయట వసారాలో పేపరు చదువుతూ కూర్చుని ఉన్నట్టో, ఊళ్ళో వాళ్ళు ఎవరో వస్తే మాట్లాడుతున్నట్టో భ్రమే ఎక్కువ. గబగబా బయటికి వచ్చి చూసినప్పుడు ఆయన కనపడకపోతే ఎవరో ఏదో పని మీద ఏ పక్క వీధికో పిలుచుకెళ్ళి ఉంటారు. కాసేపాగితే వచ్చేస్తారు కదా అనిపించి అలా వాకిటి వైపే నా చూపు నిలిచిపోతోంది.

ఆయన కూర్చునే వాలు కుర్చీ, కళ్ళజోడు, చేతి కర్ర.. ఇలా ఇల్లంతా ఎటు వైపు చూసినా ఆయన వస్తువులే కనిపిస్తున్నాయి. ఆయన ఉన్నారు అన్న భ్రమలో ఉన్నంతసేపూ ఏదో ఓదార్పు, ఆ భ్రమ తొలిగి ఆయన లేరన్న నిజం బయట పడగానే కన్నీటి ధారలు.. ఇలా భ్రమకీ, నిజానికీ మధ్యన క్షణాలు వేగంగా దొర్లిపోతూ ఈ వారం రోజులూ గడిచాయి. ఇక మీదట కూడా ఇంతేనా? భ్రమలోనో, భ్రాంతిలోనో.. బాధలోనో, వేదనలోనో.. ఎలాగైతేనేం నేను బతగ్గలుగుతున్నానుగా!

సృష్టిలో విచిత్రం ఇదేనేమో.. మనలో మనకే తెలీని నిబ్బరాన్నీ, భరించి తట్టుకోగలిగే ఓరిమినీ, ఇంకా బతికే శక్తినీ దాచి ఉంచుతుంది. అయినా, ఇవాళ కాకపోయినా రేపైనా మనమూ పోయేదేగా.. అందాకా ఎలాగోలా బతికే ఉండాలి కాబోలు. వేదాంతం వల్లిస్తున్నానా.. శ్మశాన వైరాగ్యం అంటే ఇదేనా! ఏమో.. ఏదైతేనేంలే.. ఉన్న పరిస్థితులకి తగ్గట్టుగా మనకి మనం సర్ది చెప్పుకోడానికి, ధైర్యం చెప్పుకోడానికి ఏదో ఒక సిద్ధాంతం కావాలి మనిషికి. అంతేగా!

ప్రతీ క్షణం కన్నీటిలో తడుస్తూ మరో వారం రోజుల్ని ముందుకి నెట్టాయి.

అంతా అయిపోయింది. ఆప్తులందరూ దగ్గరుండి విధిగా జరగాల్సినవన్నీ జరిపించేసారు.

అందరూ ఎవరి గూటికి వాళ్ళు చేరాల్సిన సమయం ఆసన్నమైంది. ఇక్కడే ఉంటే ఆయన జ్ఞాపకాలు మరింత బాధిస్తాయనీ, అంచేత ఈ ఊరూ, ఈ ఇల్లూ వదిలి తమతో పాటు రమ్మని నా కొడుకూ, కూతురూ చాలా బలవంతం చేసారు.

నేనిక్కడే ఇదే ఊర్లో, ఇదే ఇంట్లో ఆయన సాహచర్యంలో బతుకు పండించుకున్న క్షణాలను మళ్ళీ మళ్ళీ పునర్జీవిస్తూ ఉంటాను. చుట్టూ కనిపించే ఈ ఊరి జనమందరిలోనూ ఆయన నింపిన నవ్వుల సాక్షిగా ప్రతి రోజూ వాళ్ళ జీవితాల్లో ఆయన వదిలిన జాడల్ని తడిమి చూసుకుంటూ నా చివరి క్షణం దాకా ఇక్కడే గడిపేస్తానని చెప్పి వాళ్ళని పంపించేసాను.

ఇదివరకు ఆయనా - నేనూ.. ఇప్పుడు ఆయన జ్ఞాపకాలూ - నేనూ.. అంతేగా మార్పు!

●●●

అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

# ఎక్కడైనా వెన్నెలే!

అవసరాల రామకృష్ణారావు

**రామసూరికి ఇలాంటి మనోఘర్షణకి ఎదురవడం జీవితంలో** ఎప్పుడూ జరగలేదు. ఒక సాధారణ వ్యక్తి తన భావజాలాన్ని ఇంతగా అతలాకుతలం చేస్తుందని అతనెప్పుడూ అనుకోలేదు. ఇంతకీ అతనెప్పుడూ ఇంతగా ఇతర వ్యక్తులతో ప్రగాఢ సంబంధం పెట్టుకుని ఎరగడు. అతనికి బాగా తెలిసిన వ్యక్తి తనొక్కడే. తన సాన్నిహిత్యమంతా మనుషులతో కాదు, చదివిన పుస్తకాలు రగిలించిన ఆలోచనలతోనే. చిన్నప్పుడే అమ్మా నాన్నా పోతే మేనమామ శంకరయ్యే అతన్ని చేరదీసి పెంచి పెద్ద చేశాడు. నాన్నకో అరెకరం పొలం ఉంటే దాన్ని అమ్మి ఆ డబ్బుతోనే శంకరం తనని పెంచినా, చదివించినా, అతను ఏవో పార్టీ మీటింగులంటూ తిరిగేవాడు. దానికి సంబంధించిన సాహిత్యమంతా ఇంట్లో ఉండేది. ఎదిగే వయసులో వాటిని పదే పదే చదవడంతో సామ్యవాద సిద్ధాంతం రామసూరి మీద బలమైన ముద్రవేసింది. మెట్రిక్ పాసై కంపౌడరీ టెస్ట్ కూడా గట్టెక్కాక బతుకు తెరువనేది చిన్నదో పెద్దదో వెంటనే దొరికింది. ఏం తెచ్చుకున్నా తిన్నా, పార్టీలో సభ్యత్వం మాత్రం పొందలేదు గాని, వ్యక్తుల పట్లకాక ఉద్యమాల పట్లే అతను బలంగా ఆకర్షితుడయాడు.

అయితే రామసూరిని నిర్ఘాంత పరిచే సంఘటన ఒకటి అతని పెళ్ళి విషయంలోనే జరిగిందని తెలిసి మనశ్శాంతికి దూరమయ్యాడు. ఆర్థిక అసమానతల పట్ల అనర్గళంగా ఉపన్యాసాలిచ్చే తన మేనమామ తనకి తెలీకుండా కన్యాదాత నుంచి అరవైవేలు కట్నం తీసుకుని మరీ పెళ్ళిచేశాడు. పిల్లనిచ్చిన మామగారికి నాలుగు వాయిదాల్లో ఆ సొమ్ము జమ కట్టేశాడు, పెంచిన మేనమామే అలా కక్కుర్తి పడితే కట్టుకున్న సరోజ నుంచి ఆశించవలసింది ఏముంటుందని?

'నేనెక్కడ అడ్డుకుంటానో అని, కుటుంబాన్ని నానా ఇబ్బందులకీ గురిచేసి, చివరిదాకా దాచిపెట్టి మీరు చేసిన నిర్వాకం ఇదటండీ? మా నాన్న లక్షల మీద వ్యాపారం నడుపుతున్న వడ్డీ వ్యాపారస్తుడని మీకు తెలీదా! అరవైవేలు ఇవ్వటమంటే అతనికి ఎడం చేతి చిటికెన వేలు ఓసారి విరుచుకున్నట్టు. నాకు ఎడంకాలు ఈడుస్తూ నడిచే చిన్నలోపం ఉందని ఈ కాంపౌండరు స్థాయి సంబంధానికి

దిగిపోయాడు గాని మరుచటి ఏడే మా చెల్లెలికి లక్షకట్నమిచ్చి ఇంజనీరు అల్లుణ్ణి తెచ్చుకోలేదూ! ఏదో నైతిక బాధ్యత అనుకుంటూ ఇలా ఇద్దరు డబ్బున్నవాళ్ళ కొమ్ముకాయడం ఇదే రకం కమ్యూనిజమండీ?'

అంటూ మొగుణ్ణి నిలబెట్టి కడిగేసింది సరోజ. తప్పక పెళ్ళాడి పిల్లాణ్ణి కన్నది గాని అతని అభిప్రాయాలు ఆమెకు పూర్తిగా విరుద్ధం. ఆమెది విజయనగరం. తండ్రి జానకిరామ్ ఎంత సంపాదనా పరుడో అంతటి వ్యసనకారి. తననీ చెల్లెల్నీ పెళ్ళానికి అప్పచెప్పి ఊరిమీదపడి అతను చెయ్యని జల్సా లేదు. దైవభక్తి చాటున సరోజ తల్లి అన్ని కష్టాలూ మరచిపోయి ఆధ్యాత్మిక కార్యాల్లో మునిగితేలేది. కూతుళ్ళ నిద్దరినీ వెంటబెట్టుకుని ఆమె దర్శించుకోని కోవెలలేదు. స్వార్థపరుడైన తండ్రి ఈ పూజాపునస్కారలని కూడా వేళాకోళం చేస్తూ తనకి అనువుగా మార్చుకుంటూ ఇలా అనడం ఇప్పటికీ సరోజకి గుర్తుంది. "హోమియోపతిలో కూడా 'పాజిటివ్‌హోమియోపతి' ఉన్నట్టు భక్తిలో కూడా పాజిటివ్ భక్తి అనేది ఉంటుంది. అదేమిటంటే సుఖభోగాలలో తేలిపోడమే. కొన్ని కష్టాలు పడలేదని అనలేముగాని అన్నిరకాల దేవుళ్ళూ స్వర్గసుఖాలు అనుభవించిన వారే మరి!"

భర్త సుఖోన్మత్తత ఇక భరించలేనట్టు రెండో కూతురు పెళ్ళై ఆరునెలలు దాటకుండానే ఆవిడ పరమాత్మలో ఐక్యమైంది. ఆవిడ సంవత్సరీకాలైనా అవకుండానే ఓ మధ్య వయసు మహిళా మణికి త్రీనాట్పూ వేసేసి సెకండ్ వైఫ్‌గా చేసేసుకున్నాడు జానకిరామ్. దాన్తో ఆ తండ్రీ కూతుళ్ళకి పెర్మనెంట్ బ్రేక్ పడినట్టైంది

ఏదైనా ఎక్కడైనా గడుపుకొచ్చింది గాని మనభాష కాని ఈ శివారు గ్రామానికి మొగుడికి బదిలీ అవడం సరోజ అసహనాన్ని పెంచింది. ఎప్పుడూ మౌనంగా ఉండడం అతని లక్షణమే కాని హఠాత్తుగా అగ్నిపర్వతంలా ఎప్పుడైనా అది బయటపడడమూ కద్దు. బుర్రని గిర్రున తిప్పే ఎర్రెర్రని ఆలోచనలు లావాలో ఎగజిమ్ముతూంటే ఏ అధికారికి ఎవరు మోసారో, లేకపోతే ఈ పనిష్మెంటు ఏరియాకి వేస్తారా! చిన్నప్పట్నుంచీ భక్తి పారవశ్య శిక్షణలో పెరిగిందేమో ఈ మధ్య సరోజ బొత్తిగా తట్టులేకపోతోంది. మొగుడికి వినపడేలా విజృంభిస్తేనే ఆమెకి ఆ కాస్త మనశ్శాంతి అయినా దక్కేది. 'మంచికైనా చెడ్డకైనా ఓ బ్రాహ్మడైనా 'చొప్పడకున్నట్టి యూరు చొరకుము సుమతీ' అన్నాడు శతకకారుడు. మీకేం జందెమైనా వేసుకోని, తద్దినమైనా పెట్టని పరమనాస్తికులు. అటుకీ ఇటుకీ ఆడది వారధి అంటారు, మాకెలా కుదురుతుంది? వాయినాలిచ్చుకుందామంటే ముగ్గురు ముత్తైదువులైనా దొరికి చావరు' అంటూనే శక్తిమేరకు పూజలూ వ్రతాలూ నిర్వహిస్తూ వచ్చేది సరోజ.

ఆవిణ్ణి రక్షించడానికన్నట్టు భక్త సమాజమొకటి ఆ ఊళ్ళో ఉన్నట్టు తెలిసి అక్కడికి పరిగెత్తింది. అంతేకాదు మనోరంజన్ పండాగారింట్లో ఓ ఫోటో నుంచి విభూతి రాలడం చూసి పరవశించిపోయింది. ఇంతపొట్లం కట్టుకు తెచ్చి మురిసిపోతూ రామసూరికి చెప్పకుండా ఉండలేకపోయింది. అయితే అతని ఆలోచనాధోరణే వేరు. నిజంగా మహిమే ఉంటే అది జన ప్రయోజనకారిగా ఉండాలి. విభూతి గుట్టలవల్ల ఏం లాభం? దాని బదులు కాఫీ పౌడరో, పంచదారో, టాల్కం పౌడరో, పోనీ మైదాపిండిలాటిదో స్వామి తన ఫొటో నుంచి కురిపిస్తే ఎంతబావుణ్ణు? ఇలాంటి మాటలంటే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయో లేదోగాని తన పెళ్ళాం చెవిన వేస్తే కనీసం రెండురోజులపాటు ఇంత ముద్ద ఉడికించిపెట్టదు. ఎంత మౌనంగా సరిపెట్టుకున్నా తనలోని హేతువాది అతన్ని నిలబడనివ్వడు. మురికిబట్టలు బాధపడతాయని బండకేసి బాదడం మానేస్తామా! 'కథలు బాగా రాస్తాడు' అనే వాడికంటే 'జాతకాలు బాగా చూస్తాడు' అనేవాడికి గిరాకీ బాగా పెరిగిపోతున్న రోజుల్లో ఏం చెబితే ఎవరు వింటారు, వీళ్ళనెలా బాగుచెయ్యడం.

ఈ కుగ్రామంలో ఉద్యోగం కాదుగాని వీళ్ళెంత దోపిడీకి గురౌతున్నారో మరీ దగ్గరగా చూసే అవకాశం కలిగిందతనికి. స్వతంత్రం వచ్చి ఎన్ని దశాబ్దాలు గడవనియ్యి, మట్టిగోడలూ, ఒంటివరస బిళ్ళపెంకు పై కప్పులూ, ఆడామగా అనకుండా చాలీచాలని మోటు వస్త్రాలూ ఎన్నేళ్ళు గడిచినా వీళ్ళని ఇలాగే అణిచివేసి తాము అందలాలెక్కే ఏర్పాటు చేసుకుంటున్నారు రాజకీయ దళారులు. ఆధునిక

పరికరాల ఉపయోగంలో ముందడుగు లేదనలేం మత్తుని ఉత్పత్తి చేసే 'మందు' మీదే ప్రతి రాష్ట్రప్రభుత్వమూ బతుకుతూ సామాన్య ప్రజల జ్ఞానాన్ని చిత్తు చేసేస్తూంటే ఏ పరికరం చేతికివస్తే ఏం ప్రయోజనం. ఇప్పుడు ప్రతీ పల్లెవాడి ఎడం చేతిలో సెల్‌ఫోను ఉంది, కుడిచేతిలో? చిన్నపొట్లం ఉంటుంది, శ్రమ మరచిపోడానికి అప్పుడప్పుడు విప్పి నోట్లో వేసుకుంటూ ఉంటాడు. ఏముంటుంది అందులో? నిషిద్ధమైన ఏదో రకం ఉత్ప్రేరకం. వీళ్ళనిలా బ్రెయిన్ వాష్‌లో ముంచే, వారి జీవసారంలోంచే, స్లమ్స్ రక్తమాంసాలతో కట్టుకుని పై పైకి వేస్తున్నవే ఎన్నెన్ని వ్యాపార సంస్థలైనా! ఇంతటి ఆకటి చీకటి ఘోరకలి నుంచి విప్లవవాదులు పుట్టేరంటే పుట్టరా! 'ప్రజల కోసమే' అంటూ ఏర్పడిన ప్రభుత్వానికి ఉన్న అయిదేళ్ళలోనూ కొన్ని తరాలకి సరిపోయే ఆస్తి సంపాదించడం తప్ప వాళ్ళకి పనికొచ్చే కొన్ని మంచి పనులైనా చేసే కనీస బాధ్యత అంటూ లేదా? ప్రభుత్వాన్ని విమర్శించే టీవీ ఛానల్సూ పత్రికలూ సినిమాలు కూడా వాళ్ళ వాళ్ళ వ్యాపారాభివృద్ధి కోసం తప్ప జనప్రగతి కోసం పాటు పడిందేమీ లేదనే కటిక నిజం గుర్తించిన కొద్దీ అతని మనసు మరీ గందరగోళ స్థితికి చేరుకుంది. ఎవర్నో తప్పుపట్టడం దేనికి, ఈ నిర్భాగ్యుల ఉన్నతి కోసం తన వంతు తను చూపించిన కార్యాచరణ అంటూ ఏముంది? ప్రజల ఆధ్యాత్మిక ఔన్నత్యం కోసం జీవితమంతా పోరాడీ ప్రాణాలను కూడా బలి ఇచ్చిన మతప్రవక్తలున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో అసువులు బాసిన సాయుధ పోరాట వీరులున్నారు. ఇంట్లో కూచుని రక్తం మరగబెట్టుకుంటే ఎవరినేం ఉద్ధరించినట్టు. కనీసం పార్టీలో అయినా యాక్టివ్ మెంబర్‌గా చేరే గుండె ధైర్యం తనకి లేదే? ఆఖరికి ఎందుకూ పనికిరాదనుకున్న తన పెళ్ళాంలో కూడా కొంత ప్రజోపకార చైతన్యం కనపడుతోందే! ముప్పొద్దులా కష్టపడి తనకీ కొడుక్కీ మేపడం కాక వీధిలో కేకేసిన ముష్టివాణ్ణి ఎప్పుడూ వట్టి చేతుల్తో పంపినట్టులేదే? నెలకోసారైనా ఏదో వంకని పదిమంది సన్యాసులకి అన్నదానం చేస్తూంటుంది. ప్రసాదం చేసి వీధంతా పంచుతుంది. ఏదైనా ఎవరైనా తనంటే నయం కదా అనే చింతన ఈ మధ్య అతణ్ణి మరీ ఆందోళనకి గురిచేస్తోంది. అదిగో సరిగ్గా అలాంటి సమయంలోనే అతని సునిశితమైన పరిశీలనలోకి మంగాయమ్మ జొరపడి ఇక కదల్నని కూచుంది.

తనేమో తనలోకమేమో అని బతికే రామసూరికి ఆ ఊళ్ళోని ఏ పాత్ర పరిచయమైనా సరోజ ద్వారా జరగవసిందే 'మన వీధిలో చిట్టచివర ఇంట్లో ఉంటున్నవారు మన తెలుగు బ్రాహ్మలేనుటండీ!' అంటూ మొదలెట్టి క్రమంగా అన్ని భోగట్టాలూ చేరే 'పండాగారింట్లో జరిగే భజనల్లో ఎప్పట్నుంచో చూస్తున్నాను. ఎంచక్కా వాళ్ళ భాషలో మాటాడుతుంటే ఒరియా వాళ్ళేమో అనుకున్నాను. 'ఏదీ మీ భాష పాట ఒకటి వినిపించండి' అని వాళ్ళు అడిగితే 'రామచరణం, మాకు శరణం' అనే కృష్ణ శాస్త్రిగారి పాట ఎంతో బాగాపాడుతుంటే విని నా మతి పోయిందనుకోండి. ఆ ముసిముసినవ్వుల ముసలావిడ పేరు ముద్దాల మంగాయమ్మట. నెత్తి మీద పెట్టుకుని చూసుకునే కొడుకూ, కాలుకదపకుండా అన్నీ అమర్చిపెట్టే కోడలూ ఉంటే ఎక్కడైనా ఎంత దర్జాగానైనా కాలం వెళ్ళ బుచ్చుతారనిపిస్తుంది మంగాయమ్మ నిష్ఠూచీ చూస్తే!'

అయితే తను ఓసారి చేరేసిన భోగాట్టాకి పూర్తిగా వ్యతిరేకమైన దాన్ని చెప్పడానికి సాధారణంగా ఎవరూ ఓ పట్టాన ముందుకి రారు. అందుకే సరోజ పదిరోజులపాటు ఆ విషయం నాన్చిందేమో. ఎంతటి విభిన్న భావాలున్నా మొగుణ్ణి మించిన ఆత్మీయశ్రోత ఆడదాని కుండడు కదా. క్రమంగా బయటపడిపోయింది.

'ఏమో, దేన్ని చూసుకునో, ఆ రాలిపాటు! అరవై ఏళ్ళు దాటినా సుగురూ బీపీలాంటివి లేవనే పొగరు కాబోలు!'

అంటూ అదే మంగాయమ్మ గారి కథ యావత్తూ వినిపిస్తే ఈసారి సత్తిబాబే ముక్కున వేలేసుకోవలసి వచ్చింది.

మంగాయమ్మా వాళ్ళది బందరు దగ్గిర ఏదో పల్లెటూరుట. వాళ్ళాయనది పౌరోహిత్యం. ఒకప్పుడు బాగా బతికిన వాళ్ళే ఇద్దరు కొడుకులు. ఏదో యాక్సిడెంటులో మొగుడుపోతే, బంధువులింట వంటపనికి ఒప్పుకుని కొడుకుల్ని తీసుకుని పర్లా కిమిడె వచ్చేసి అక్కడే స్థిరపడి పెద్ద కొడుకుని వ్యాపారంలో పెట్టి, రెండో కొడుకుని టీచరు ట్రైనింగులో పెట్టింది. తన రెక్కల కష్టం మీదే ఇవన్నీ సాధించి

పిల్లల్ని ప్రయోజకుల్ని చేసింది. ఏ ఇబ్బంది వచ్చినా పంటి బిగువున నెట్టుకొచ్చింది గాని అత్తింటివారు అభిమానంగా ఇచ్చిన కాసులపేరు మాత్రం అడుగుపెట్టెలో, ఎందుకైనా పనికొస్తుందని, దాచిందిట. అలా దాచడం మంగాయమ్మని చిక్కుల్లో పడేసింది. పెద్దకొడుకు తల్లికి చెప్పకుండా దాన్ని తీసి వ్యాపారంలో పెట్టేశాడు. అప్పటికే కొడుకులిద్దరికీ పెళ్ళిళ్ళయి కోడళ్ళు కాపురానికి వచ్చేశారు. సెకండరీ గ్రేడు ట్రైనింగు పాసయిన చిన్నకొడుకు ఉద్యోగం కోసం లంచం ఇవ్వడానికి తల్లిని ఆ నగలు ఇమ్మని అడిగాడు. తనే తీసుకుని అమ్మేశానని పెద్దకొడుకు చెబితే తెల్లబోయింది మంగాయమ్మ. పోనీ 'నా సగం నాకు పంచమని' చిన్నకొడుకు అడిగితే 'బంగారం పెద్ద కొడుక్కే దక్కడం మా ఇంటి ఆచారం' అని పెద్దకోడలు తీర్పు చెప్పింది. అలా ఆ ఇంట్లో గొడవలు పెరిగాయి. 'మామగారు కాశీపూర్ దగ్గిర గ్రామంలో ఎలిమెంటరీ స్కూల్లో నాకు ఉద్యోగం వేయిస్తానన్నారు. అక్కడికి పోదాం పదవే అమ్మా' అంటూ మంగాయమ్మగార్ని రామసూరి ఉన్న ఊరికి లాక్కొచ్చాడు. 'ఈవిడ డబ్బు పెట్టడం కాదుగాని మాకు అంతకుముందు ఉన్నదీ పోయింది, అపనిందా దక్కింది.' అని పెద్దకోడలు మెటికలు విరిచిందిట.

ఇంతకీ చిన్నకోడలికి కూడా ఆ ఎలిమెంటరీ స్కూల్లో ఆయా పనే. ఇల్లు నడిపే పూర్తి బాధ్యత అంతా మంగాయమ్మదే 'నోటమ్మట మాటే ఊడిపడదన్నావ్, ఆవిడ పాత కబుర్లన్నీ నీకెలా తెలిశాయి? అని మీరడగక పోయినా మీ సందేహం నాకు తెలుసు. ఈ మధ్య ఆవిడ అక్క కాబోలు ఇక్కడి కొచ్చి రెండురోజులు గడిపి వెళ్ళింది. ఆ అక్క నోటనే ఈ మహాతల్లి గతచరిత్ర అంతా తవ్వితీశాను. పెద్దకోడలు తన్ని తగిలేస్తే చిన్నకోడలు పంచన చేరి ఊడిగం చేస్తోంది. సాటి ఆడదాన్ని సానుభూతి చూపిద్దామని వెడితే కష్టం సుఖం చెప్పుకోవాలంటారా! ఉహూఁ ఎంతసేపూ నవ్వు మొహమే. సిగ్గులేని మొహానికి నవ్వే సింగారమంటారు. ఇదే కాబోలు.' అంటూ ఆవిడ పట్ల తన వెగటు భావాన్ని వెళ్ళగక్కింది సరోజ.

సరోజ కోపానికి కారణం రామసూరి ఊహించలేనిదేం కాదు. కొడుకుల మీద ఆవిడ నేరాలు చెప్పుకుని ఉంటే ఈవిడ మొగుడు మీద చెప్పుకుని ఉందును. సరోజకా ఛాన్సు పోయిందికదా!

ఏమైనా వెంకాయమ్మగారి జీవనసరళి సత్తిబాబుతో ఉత్సుకత రేకెత్తించింది. పట్టుకుంటే దొరక్కుండా పారిపోయే పిల్లాడిలా తెలుసుకున్న కొద్దీ ఇంకా ఇంకా స్టడీ చేసి తీరాలనే కోరిక అతన్ని కుదపసాగింది. ఎక్కడా ఏ ఆసరా దొరక్కపోయినా ఆమె ఆనందంగా ఎలా ఉండగలుగుతోంది? ఒకరిద్వారా కాక తనంత తానుగా దీనికి జవాబు కనిపెట్టాలి. ఇల్లా పెద్ద దుమారం కాదు. తనకా మరీ పీకలు తెగిపోయే పనికాదు. ముందు ఆమె దినచర్యని గమనించాలి. నాలుగురోజుల అన్వేషణలో చాలా విషయాలే రాబట్టాడతను.

కోడలు ఆయాపని చేసినా కొడుకు పాఠాలు చెప్పినా వాళ్ళిద్దరికీ ఊడదియ్యలేని ఉద్యోగాలు. ఆంధ్రామూలాలు ఉన్నా వాళ్ళొక్క ముక్క తెలుగు మాటాడడట ఒరియా వాళ్ళలాగే అక్కడ చలామణీ అవుతున్నారు. ఉద్యోగాలు వేయించడం ఒకటే కాదు. చిన్నకొడుకు మామగారు ఆ ఊళ్ళో వాళ్ళకో ఇల్లులాంటిది కూడా కొనిచ్చాడు. ఇల్లులాంటిది అని ఎందుకన్నారంటే ఆజాగాలో ముందు ఉన్న ఎటాచ్డ్ బాతూ కరెంటూ ఉన్నది ముందు నున్న సిమెంటు గది ఒక్కదానికే. మిగిలినవి ఆనుకుని ఉన్నవి రెండు మట్టిగదులూ, నుయ్యి ఉన్న పెద్ద పెరడు.

చేసేది ఆయాపని అయినా చిన్నకోడలు ఆ స్కూల్లో ఓ నియంతలా వ్యవహరిస్తుంది. ఇక ఇంట్లో అత్తగారికి దాసీని మించిన పెద్ద హోదా ఇస్తుందా? 'ఈవిడ బంగారం అంతా పెద్దకొడుకే దోచుకున్నాడు, సేవాభాగ్యమేనా అందుకోని మా బతుకెందుకు?' అని చిన్నకోడలు అనుకుని ఉండాలి.

తనేమిటో తనకి తెలిసిన వెంకాయమ్మగారికి ఎవరు ఏమేమనుకున్నారో తెలుసుకోవలసిన అవసరం ఉండుండక పోవాలి. మధ్య నున్న మట్టిగదిలో మాసిన దోమతెర కట్టుకుని నిద్రపోయే ఆమెకి మనసే అలారంగా తెల్లారి నాలుగూ అయ్యేసరికి తెలివి వచ్చేస్తుంది. లేచి

కాలకృత్యాలు తీర్చుకుని నూతి దగ్గర స్నానం చేసుకుని ఓ అరగంట ధ్యానం చేసుకుంటుంది. టీ, టిఫినూ తయారుచేసి ఏడుగంటలకల్లా కొడుక్కీ కోడలికీ అందిస్తుంది. ఆమె వండేదిక్కూడా గ్యాసు స్టవ్ మీద కాదు. ఆ గ్రామంలో కూడా గ్యాసు స్టవ్‌లు అక్కడక్కడ లేకపోలేదు కాని ఆమె చేసే వంట మట్టిపొయ్యి మీదే ఓ రకం బంక మన్నుతో ఇటికెలతో మొత్తుకుని నాలుగు ఇనపకడ్డీలు మధ్య అమరిస్తే కుంపటిలా తయారవుతుంది. ఆ ఊరి సమీపాన అడవి ప్రాంతాలవాళ్ళు అటూ ఇటూ బొగ్గు బస్తాలు కావడిలో అమ్మకానికి తెస్తారు. ఓసారి పడేయించుకుంటే ఎన్నినెలలో వస్తాయి. ఆరిన మట్టిపొయ్యిలో బొగ్గులు నింపుకుని ఓ కిరసనాయిలు చుక్క వేసుకుని అంటిస్తే దానిముందు ఏ గ్యాసు జోరూ బలాదూరు. ఇక కొడుక్కీ కోడలికీ వండి వండి వడ్డించి, నింపిన టిఫెన్ బాక్సూ ఫ్లాస్కూ ఇచ్చి పంపిస్తే చీకటి పడి మళ్ళీ వాళ్ళొచ్చేదాకా మంగాయమ్మకి తీరికే తీరిక.

తను తిని అన్నీ కడుక్కుని వాళ్ళవీ తనవీ బట్టలు ఆరేసుకుని ఆరేక ఇంట్లో పెట్టుకోడానికి కూడా రెండు గంటలకంటే ఎక్కువ పట్టదు. ఇక మిగిలిన టైము ఏం చెయ్యాలని. ఆ ప్రాంతాల్లో మరీ చిన్న ఆదివాస్ స్కూళ్ళని ఒంటిగంటకల్లా వదిలేస్తారు. అందులో సగం మంది పిల్లలు పొలోమమటూ మంగాయమ్మ ఇంటికే చేరతారు. ఆమె మనసులా ఎందరొచ్చినా గదులు ఖాళీగానే ఉంటాయి. ఏ రోజు కారోజు ఇంతకారప్పూసో, చేగోడీలో చేసి ఉంచుతుంది. కొందరు ఒళ్ళోనూ కొందరు భుజాలమీదా ఎక్కి తొక్కుతూంటే ఆవిడ వాళ్ళకి వాళ్ళ భాషలో మన 'రాజూ ఏడుచేపలూ' లాంటి కథలు మళ్ళీ మళ్ళీ చెబుతూ ఉంటుంది. ఇందరు పిల్లలు ఉండగా తనకింకా మనవలు పుట్టలేదని ఆమె ఏనాడూ అనుకుని ఎరగదు. మన 'గుణగుణగుంచం' తో సమానమైన ఒరియా బాలగీతిక 'చౌకాచౌకా భూరీ, మామొ ఘెరె చాఃరీ' పాడుతూ వాళ్ళని నవ్విస్తూ వాళ్ళతో కలిసి తనూ నవ్వుతుంది. ఆ ఇంటికి వచ్చే బడుగుజాతి పిల్లల్కి శుభ్రంగా ముస్తాబై వచ్చే అవకాశాలు ఉండవు. ఏదో కప్పుకు వస్తారుగాని బట్టలు కంపుకొట్టకుండా ఉండవు. పేలు స్వైర విహారం చెయ్యని జుత్తు అంటూ ఉండదు. ఆవిణ్ణి చూస్తూనే 'ఆయీ!' అంటూ వచ్చి ఆమె కౌగిట్లో ఇమిడిపోతారు. మంగాయమ్మ రెండుచేతులూ వాళ్ళని అదుముకుంటుంది. తనవాళ్ళా పరాయివాళ్ళ, మన భాషా పరాయిదా అనే విచిక్షణ ఆమె ఎరగదు. ఆమెకి తెలిసిన సత్యం ఒకటే. వాళ్ళూ తనలా మట్టిలోంచి పుట్టిన మనుషులే. వాళ్ళ మొహాలు కడిగి తుడిచి కడుపునిండా ఇంత తిండిపెట్టి, కరువుతీరా ఇన్ని కథలు చెప్పి పంపడం తన అదృష్టం. ఈ తంతు తెలిసినా దానికి అడ్డురాని తాను చిన్నకోడలికి మనసులోనే కృతజ్ఞత చెప్పుకుంటుందామె. దేనికీ కంప్లైంట్ చెయ్యక ఏ పరిస్థితిల్లోనైనా నిండు మనసుతో నెగ్గుకొచ్చే మనిషి మొహంలో చిరునవ్వుకి తప్ప మరిదేనికి చోటుంటుంది.

వెంకాయమ్మ జీవితం తరచిన కొద్దీ రామసూరి మనసులోని ఒక్కొక్క మబ్బూ తొలిగి పోయినట్టయింది. 'మార్క్సిజమూ, మహిమాయుత భక్తి తత్వము ఈ రెండూ రెండు ఎక్స్ట్రీమ్స్. మానవ సౌభాగ్యానికే పుట్టినా ఇవి సర్వకాల సర్వబాధానివారణలు కాజాలవు. సామాజిక ప్రగతి మొదలయేది వ్యక్తివికాసంతోనే. అందుకనే ఆదర్శ వ్యక్తుల్నే తప్ప ఆదర్శ వ్యవస్థను సూచించి నిలబెట్టలేకపోయింది ఏ దేశ చరిత్ర అయినా! – అనే నిర్ధారణకు వచ్చాడతను. నోటితో ఒక్కముక్క చెప్పకుండా చిరునవ్వుతో వెంకాయమ్మ రగిలించిన వ్యక్తిత్వపు వికాసపు వెలుగు మాత్రం అతను ఎక్కడికి వెడితే అక్కడికి వస్తుంది.

●●●

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది – రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

## కృష్ణలంక

### పాలెపు బుచ్చిరాజు

**రాంరెడ్డి కృష్ణలంక ఊళ్ళోకల్లా మోతుబరి.** ఊరికి పంచాయితీ, ప్రెసిడెంటు, మెంబర్లూ ఉన్నా, అవన్నీ నామమాత్రమే. రాజ్యం చేసేది రాంరెడ్డే అంటే అతిశయోక్తికాదు. కృష్ణలంక జనాభా అంతా కలిపి ఆరువేలకి పైన ఉండరు. వాళ్ళలో చాలా మంది సన్నకారు, చిన్నకారు రైతులు. ఒక్క రాంరెడ్డికి మాత్రమే ఆ ఊళ్ళో, వందెకరాల మాగాణి భూమి ఉందన్న విషయం, లంకంత ఇంట్లో, వరసగా కబంధుల్లా నిలబడిన గాదెల్ని చూస్తే అర్థం అవుతుంది. అవెప్పుడూ అంచుల వరకూ, ధాన్యంతో నిండివుంటాయి. ఓ ప్రక్కనుంచి, ధాన్యం బస్తాలు మార్కెట్టుకి మళ్ళించి, డబ్బు సంచులు నింపుకొస్తూనే ఉంటాడు. మళ్ళీ, రెండోపంటకీ, మూడోపంటకీ, ఈ గాదెలు నిండుతూనే ఉంటాయి. రెడ్డికి డబ్బు యావ మెండు. నోట్ల కట్టల్ని, గోనెసంచుల్లో, మూతులు బిగించి కట్టి లెక్కచూసుకుని మురిసిపోతూ ఉంటాడు.

ఆ డబ్బు తెచ్చిపెట్టిన హోదా, దర్పం అతన్ని ఊళ్ళో అందరికన్నా పైమెట్టు మీదకెక్కించాయి. మిగతా విషయాలెలా ఉన్నా డబ్బు విషయంలో మాత్రం రెడ్డి కరాఖండీగా ఉంటాడు. దానికోసం అతనెంత పనైనా చేయడానికి వెనుకాడడు. అందుకే, అతనంటే, ఊళ్ళో అందరికీ భక్తిభావం కంటే, భయమే ఎక్కువ.

ఒక్కడున్నాడు. వాడిపేరు సీతయ్య. వాడికి మాత్రం రాంరెడ్డి అంటే భయమూ, భక్తీ కూడా ఉన్నాయి. నమ్మినబంటు. అది తాతల కాలం నుంచీ, పారంపర్యంగా వస్తున్న ఆచారం. సుమారుగా ఇద్దరూ ఒకవయసు వాళ్ళే. ఊరిబడిలో కలిసి ఆ, ఆలు దిద్దినవాళ్ళే. కలిమిగల రాంరెడ్డికి కలిసొచ్చి, పట్నం వెళ్ళి చదువుకొచ్చాడు, లేచి సీతయ్య లేమిలో మిగిలిపోయాడు. తాతలూ, తండ్రులూ ఆ కుటుంబానికి చేసిన సేవలు, తలుచుకుని, అదే విశ్వాసంతో, రాంరెడ్డికి కుడిభుజం అయ్యాడు. రెడ్డి ఎక్కడికెళ్ళినా, సీతయ్య కుక్కలా వెంట ఉండవలసిందే వాడిని నమ్మినట్టు రెడ్డి ఇంట్లో వాళ్ళని కూడా నమ్మడు. మానసికంగా సగం బలం డబ్బుదయితే, శారీరకంగా సగం బలం సీతయ్యది రెడ్డికి.

అప్పనంగా డబ్బు సంపాదించే మార్గాలెక్కడున్నాయో, అక్కడుమాడు రెడ్డి. గ్రామీణ ఉపాధి పథకాలు ప్రభుత్వం, దారిద్ర్యరేఖకి అడుగున ఉన్నవారు సంక్షేమం కోసం ప్రారంభించింది. ఆడదానికి నూరు, మొగాడికి నూటయాభై రూపాయల కూలి రోజుకి. అలాంటి ప్రజల బ్రతుకులెంతో రాంరెడ్డికి బాగా తెలుసు. మహా అయితే, ఒక్కో కుటుంబానికి రోజుకి పాతిక రూపాయలుంటే కడుపు నిండిపోద్ది. అలాంటిది అన్నేసి వందల రూపాయలు ఆళ్ళేం జేసుకుంటారు? ఆలోచించినకొద్దీ కన్ను కుట్టింది. కోట్లకొద్దీ గవర్నమెంటు మంచి గ్రాంటు వచ్చింది. రోజుకి వెయ్యిమంది పనిచేస్తున్నట్టు లెక్కలు రాయించేడు. అందులో సీతయ్య పేరు కూడా ఉంది. మిగతా అందరికీ, రూపాయికి అరవై పైసల చొప్పున కత్తిరించి తన బొక్కసం నింపుకున్నాడు. అధికారుల్నీ, సర్పంచినీ, మెంబర్లనీ తనతో చేర్చుకుని, వాళ్ళకి పారేసేది పారేసేడు. అదేమని అడిగే మొగాడెవడు? ఎవరైనా గట్టిగా మొరాయిస్తే, వాళ్ళమీదికి సీతయ్యని ఉసిగొల్పేవాడు. వాడెలాంటివాడంటే, యజమాని కోసం ప్రాణాలో, డబ్బో పట్టుకెళ్ళకుండా పోడు.

ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో అసలే లేని ఇళ్ళకొచ్చిన డబ్బంతా కట్టలు కట్టలుగా రాంరెడ్డి ఇంటికే వచ్చి పడింది. వందెకరాలమీద రాబడి, పెద్దవేవో వస్తున్నాయికదా అని చిన్నవాటిని చిన్న చూపు చూసే మనిషికాదు అతను. చిన్నవాటిని కూడా కొట్టేయకపోతే, పెద్దవాటికి ఉనికే లేదని నమ్ముతాడు. ఆ మనిషి మారడు. అతని యావతీరదు.

ఊళ్ళో ముసలోళ్ళకి పెన్షను ఇస్తున్నారంటే, తన వయసు డెబ్బై రాయించేసుకున్నాడు - భర్త పోయినోళ్ళకిచ్చే భరణం జాబితాలో పెళ్ళాం పేరు రాయించేడు. అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. ఆ వేలు అలా ముక్కుమీదే ఉంది, ఇక్కడ రెడ్డి సంచుల్లో డబ్బు

నింపుతూనే ఉన్నాడు. 'ఆళ్ళమొకం - ఆళ్ళకేం తెలుసు డబ్బు విలువ. అదే తెలిస్తే ఆళ్ళు పెజలెందుకవుతారు' అని జాలి పడతాడు తప్ప ఎప్పుడూ వాళ్ళని కోపగించుకోడు.

**భరత దేశమ్మొక పాడియావు**
**నిరతము పిదుకు చుండ్రు పాలు**
**రక్తమ్ము చిందుచుండ స్వార్ధపరులు**
**పేదలేగలు నిస్సహాయులై చూచుచుండ**

కృష్ణలంకు ప్రక్కనే బిరబిరా పారుతూ, బంగారు పంటలందించే కృష్ణమ్మ వందసంవత్సరాలుగా చదువుతోంది ఇలాంటి కథలు. మనిషి తప్పుచేస్తున్నాడు - దొంగతనాలు, దోపిడీలు చేస్తున్నాడు. హత్యలు చేస్తున్నాడు. సాటి మనిషిని మోసం, దగా చేస్తున్నాడు. అయినా శిక్ష పడడంలేదు. దానితో పాపపంకిలం వంటికి పూసుకుని మరీ విచ్చలవిడిగా తిరుగుతున్నాడు. సగటు మనిషికి శక్తిలేక అన్యాయాన్ని ఎదిరించి పోరాడ లేకపోతున్నాడు. నీతినియమాలకి నిలువ నీడలేకుండా పోయింది. ఆ తల్లి మాత్రం ఎంతకాలమని సహిస్తుంది? ఆమె కోపం కట్టలు త్రెంచుకు ప్రవహించింది. రాత్రికి రాత్రి ఊళ్ళూ, పూళ్ళూ ఏకం చేసింది. ఉద్రేకంతో పరవళ్ళు త్రొక్కింది. వందలకొద్దీ పొలాల్లో పంటలు గంగపాలయ్యాయి. నిన్నటి లక్షాధికారి నేడు భిక్షాధికారి అయ్యాడు. దానం చేసిన చేయి దానంకోసం చేయిచాచింది. అన్యాయం చేసిన వాళ్ళనీ, అన్యాయం సహించిన వాళ్ళనీ అందరినీ చుట్టబెట్టేసింది. అంతా బాధ్యులే. ఎవరిపైనా దయచూపలేదు. కృష్ణలంక ప్రజలంతా చెట్టుకొకరు, పుట్టకొకరు అయిపోయేరు. ఉవ్వెత్తున వరద వెన్నంటి వస్తుంటే, ఉన్నపాటున ప్రాణాలరచేత పట్టుకుని, పారిపోయారు. ఆ జలప్రళయంలో ఎన్నో అమాయిక జీవులు, పశువులు, పక్షులు బలైపోయాయి. బాలలూ, వృద్ధులూ కన్నుమూశారు - ఆస్తులు కొట్టుకుపోయాయి. బ్రతికి బయటపడినవారు నిరాశ్రయులై, ఎందుకు బ్రతికామా అని విలపించసాగారు. ఆ ప్రాంతాన్నంతా అంతులేని శోకం ముంచెత్తింది. అయిదు రోజులు ఆంధ్రదేశాన్ని అతలాకుతలం చేసి, శాంతించింది కృష్ణమ్మ. పోయినవాళ్ళుపోగా, పోయిన ఆస్థులుపోగా, మిగిలిన వాళ్ళ జీవితం దుర్భరం అయింది. నీరు తీసిన ఊరంతా, బాడి, బురద, కళేబరాలతో కంపుకొడుతోంది రాంరెడ్డి దురాగతాలలా. ఈ మూలా, ఆమూలా బాగుచేసుకుని, ఇళ్ళకి చేరారు జనం. కానీ ఏం తింటారు? ఏం తాగుతారు? ఏం మిగిలిందని?

సీతయ్యా వాళ్ళలో ఒకడే వాడి గుడిసె కూడా వరద ధాటికి కొట్టుకుపోయింది. నిలువునా కూలిపోయాడు. పెళ్ళాం బిడ్డలతో సహా, మెట్టప్రాంతాల్లో తలదాచుకుని, ప్రాణాలతో బ్రతికి బైటపడ్డాడు. అయిదోరోజున, వరద తగ్గుముఖం పట్టాక, ఆలనా పాలనా చూస్తారని, రాంరెడ్డి ఇంటికి వెళ్ళాడు. చిత్రం. ఆయింటికేం కాలేదు. ఇంట్లో వాళ్ళకీ ఏం కాలేదు. పాపీ చిరాయువంటే ఇదేనేమో!

లోపల గాదెల దగ్గర తనిఖీ చేస్తున్న రాంరెడ్డిని చూసి, చేతులెత్తి దణ్ణం పెట్టి, నిలబడ్డాడు. దగ్గరగా వెళ్ళి, భోరున ఏడుస్తూ, కాళ్ళమీదపడ్డాడు. మీరే రక్షించాలని మొరపెట్టుకున్నాడు.

ఒక్కడుగు వెనక్కి జరిగి, రాంరెడ్డి, "ఏరా! సీతిగా బతికిపోయినట్టున్నావే! కిట్టమ్మ నిన్ను ఎత్తుకుపోయిందనుకున్నాను" అంటూ భళ్ళున నవ్వాడు. తన తెలివితేటలకి మనసులోనే పొంగిపోతూ.

సీతయ్య దెబ్బతిన్నాడు. తనను చూసి, తన అవస్థని చూసి యజమాని జాలిపడతాడనుకున్నాడు. ఆపన్నహస్తం అందిస్తాడని ఆశించాడు - 'ఎలా ఉన్నావురా?' అని పలకరిస్తాడనుకున్నాడు - అంతా దానికి విరుద్ధంగా జరగడంతో, దిమ్మతిరిగిపోయాడు. ఆయన కర్కోటకుడని తెలుసు. దుర్మార్గుడని తెలుసు. కానీ, ఇంత అమానుషత్వమా? ఇంత కండకావరమా? వేలకి వేలు జనం అన్నమో రామచంద్రా అని హాహాకారాలు చేస్తుంటే, తనిక్కడ వికటట్టహాసం చేస్తాడా? ఏమూలనో మానవత్వం లేని మానవజన్మ ఉంటుందా!

ఇంతకాలం పేదవారిని, బేలమనుషుల్నీ, అమాయకుల్నీ, తన తోటివారినీ దండించి, బెదిరించి డబ్బు గుంజి ఈయన సంచులు నింపావే, ఈరోజు చూడడానికేనా?

సీతయ్య మనసు విరిగిపోయింది. ఆశనిపాతానికి చెట్టుకొమ్మలా ఫెళఫెళా విరిగిపోయింది. అయినా ఆవేశపడలేదు నిదానంగా ఆలోచిస్తున్నాడు. సహాయం అర్థించి వచ్చినవాడిని, అవసరం తీర్చుకోవాలి. ఈ అపాయాన్ని ఉపాయంతో గట్టెక్కించుకోవాలి దానికి మార్గాలు తను రెడ్డి దగ్గర నేర్చుకున్నవే ఉన్నాయి.

అతని మానసిక క్షోభని గుర్తించే స్థితిలో లేడు రాంరెడ్డి. తనధోరణిలో చెప్పుకుపోతున్నాడు. "ఒరేయ్ ఇయ్యాల నుంచి నువ్విక్కడే ఉండు. ఊరంతా మునిగిపోయి, తిండిగింజలన్నీ నాశనమైపోయాయి. జనం మన గాదెల మీదికెగబడతారు. రెట్టింపు ధర పలుకుతాది. ఒక్క గింజ పొల్లుపోకుండా అప్పుడే డబ్బు చేసుకోవాల. రొక్కం డబ్బిచ్చినోడికే ధాన్యం."

అది వింటున్న సీతయ్య స్థాణువైపోయాడు. ఎంత నీతి నియమాలు లేకుండా మట్లాడుతున్నాడీయన. ఓ పక్కన అందరి కడుపులు ఆకలితో నకనకలాడిపోతుంటే, ఆ నిస్సహాయతని అనువుగా తీసుకుని వాళ్ళకడుపులు కొట్టాలని చూస్తున్నాడు. మనిషికి డబ్బుమీది వ్యామోహం ఎంతటి దౌర్జన్యానికి దారితీస్తుంది. ఇప్పటికే, ఏ ధాన్యం గాదిలో, ఎన్ని నోట్లకట్టల బస్తాలున్నాయో సీతయ్యకి తెలియందిగాదు. అవన్నీ నింపినవాడు వాడే ఇంకా ఎందుకీ కాపీనం? చస్తే ఇదంతా వెంట తీసుకుపోతాడా? ఈ రోజు కాస్త దయాగుణం చూపించి నలుగురిలోనూ మంచివాడనిపించుకుంటే అది మిగులుతుందికదా!

మౌనంగా ఆలోచిస్తూ నిలబడిపోయిన సీతయ్యని చూస్తూ, "ఏరా! మాట్లాడవు? నీ గంజి నీకు మిగులుద్దిలే. ఇంటికెళ్ళి గంజి తాగిరా - అప్పుడే జనం పోగడతున్నారు ధాన్యం కోసం" అని తొందరపెట్టాడు.

ఎక్కడిది ఇల్లు? ఎక్కడి గంజి? అసలేమైనా మిగిలిందా అని అడిగాడా? తన స్వార్థం మాత్రం చుసుకుంటున్నాడు. ఏం మనిషి? ఆ రోజుకి మనసు సరిపెట్టుకుని, వెనుదిరిగి వెళ్ళిపోయాడు సీతయ్య.

వీడి మతి వరదలో కొట్టుకు పోయిందని మరో విషపు నవ్వు నవ్వుకున్నాడు రాంరెడ్డి.

మర్నాడు ఊళ్ళో జనమంతా రాంరెడ్డి ఇంటికి తండోపతండాలుగా రాసాగారు. కానీ సీతయ్యజాడ మాత్రం ఎక్కడాలేదు. పోతే పోయాడులే అని వాడికోసం చూడకుండా, గాదెల్లోని ధాన్యం దింపించి, రెట్టింపు రేటుకి అమ్మసాగాడు రెడ్డి. రేటు గురించి జనం లెక్క చేయడంలేదు. అడిగిన డబ్బిచ్చి కొనుక్కుపోతున్నారు. వందలకి వందలు కోట్లు తెచ్చి, డబ్బిచ్చి కొనుక్కుపోతున్నారు. అవి దంచుకుని అన్నం వండుకుని తింటున్నారు. ఒక రోజయింది, రెండు రోజులయ్యాయి. కృష్ణలంకే కాదు పొరుగూర్లనుంచి కూడా జనం ప్రవాహంలా వచ్చి ధాన్యం తెగేసి కొనుక్కుపోతున్నారు. చిత్రం ఏమిటంటే బీదాబిక్కీ కూడా ప్రాధేయపడకుండా, రొక్కం ఇచ్చి కొంటున్నారు.

అసలు రాంరెడ్డి వేసిన ఎత్తువేరు. వీళ్ళ ఆస్తులెలాగూ నీళ్ళపాలయ్యాయి కదా, డబ్బులెక్కడి నుంచి వస్తాయి? అడిగిన వాళ్ళందరి దగ్గరా అరువుకి బదులు, అప్పు పత్రాలు రాయించుకుని, ఆ మేరకు వాళ్ళ పొలాలు రాయించేసుకుందామని. దానితో మరో పాతిక ఎకరాలైనా తన భూమి విస్తీర్ణం పెరుగుతుందని. మొదట్లో, ఏముందిలే, ఒకరోజుకంటే ఎక్కువ డబ్బిచ్చికొనే స్తోమతు ఎవడి దగ్గరుందని, ఈ కాస్తా కూడా ఏ సేవా సంఘాలో దయా దాక్షిణ్యాలతో ఇచ్చిన డబ్బు అయివుంటుందని, ఉపేక్షించాడు. కాని, మూడోరోజుకల్లా ఈ రహస్యం ఏమిటా? అని మనసు పీకసాగింది. ఇలా మొలకెత్తిన అనుమానం పెనుభూతం అయింది. ఉప్పెనలా కొట్టుకొచ్చింది. వెన్నెముకలో ఎక్కడో కలుక్కుమంది. కానీ అది అబద్ధం అనుకున్నాడు. అంతటి సాహసమా? అది అసంబద్ధం. ఆలోచించిన కొద్దీ పిచ్చెక్కిపోతోంది రాంరెడ్డికి.

ఆ రోజు చీకటి పడగానే, తానొక్కడే స్వయంగా ఆ గాదెలోకి దిగాడు. అదే ఆ గాదె అని రాంరెడ్డికి కాక, మరొక్కడికే తెలుసు. ఆ విషయం రాంరెడ్డికి తెలుసు. అందులో దాచిన, నోట్ల కట్టలున్న గోనె బస్తాలు మాయం. రాంరెడ్డికి గుండె ఆగినంతపనైంది. అవెన్ని కోట్లుంటాయో మళ్ళీ లెక్కేస్తేగాని, అతనికే తెలియదు. అంతటి ఘోరాన్ని అతడూహించలేదు. "అమ్మ సీతిగా! ఎంతపనిచేశావురా!" అనుకున్నాడు.

మూడోనాడుదయం, సీతయ్య శవం ఊరిచివర నేలనూతిలో తేలింది. ఊరు ఊరంతా ఏడిచి గగ్గోలు పెట్టింది. ప్రతి మనిషీ, తమ కుటుంబంలో ఒక వ్యక్తిని పోగొట్టుకున్నట్టు విలపించాడు. ఆ రోజు ఏ ఇంట్లోనూ పొయ్యిలో పిల్లి లేవలేదు. అంత పెద్ద ప్రళయం వస్తే ఏమీ కాలేదు వాడికి. అంతా అయిపోయాక చిన్న గోతిలో పడి చచ్చిపోయాడు. 'అదే భగవంతుడి లీల' అని వాపోయారంతా. ఇలాంటి సమయాల్లో తప్పించుకోవడానికి భగవంతుడు బాగా కలిసొస్తాడు సామాన్య ప్రజానీకానికి.

ఎందరికో, ఎవరిమీదో అనుమానం ఉంది. అది సహజమైన చావు కాదని గట్టి నమ్మకముంది. దుఃఖాన్ని లోలోపలే దిగమ్రింగుకున్నారు వారంతా. ఎవరికి ధైర్యం? ఎద చెప్పిన కబురు ఎరుక చెప్పడానికి? కారణాల్ని విస్మరించారు. కారణ జన్ముడని సీతయ్యని కీర్తించారు. ఆపదలో ఆదుకున్న భగవంతుడికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నారు. సీతయ్య చచ్చిపోయి కూడా వాళ్ళ హృదయాల్లో చిరంజీవి అయ్యాడు.

ఎవరుండిపోతారు? రాంరెడ్డి పోతాడు. అసలుండీ పోయినవాడే అతను. ఆ డబ్బూ, ఆస్తీ తనతో తీసుకుపోతాడా? రాజులూ రాజ్యాలే పోయాయి. వారేరీ? ఈ భూమి మీద పేరైనా ఉందా? ఉండనక్కర్లేదు - 'పోయాడు. మంచిదైంది' అనిపించుకోకుండా ఉంటే చాలు.

# ద్వారం — కండ్లకుంట శరత్ చంద్ర

●●●

**"క్యూలో ఉన్న మీరిద్దరూ, కాసేపట్లో ద్వారాన్ని దాటబోతున్నారు.** ద్వారాన్ని దాటబోయేవారెవరికీ, నేను ఈ విషయం ముందుగా చెప్పను. నా పుట్టిన రోజున మాత్రం, లాటరీలో ఇద్దరి పేర్లను తీసి, ఆ ఇద్దరికీ విషయం చెప్పేస్తుంటాను." మా ఎదురుగా కూర్చున్న స్త్రీ చెప్పింది.

రాత్రి పదింటికి, బార్‌లో కూర్చుని మందుకొడుతున్న నేను, లేపాక్షి శంకర్ మొహామొహాలు చూసుకున్నాం. మా ఎదురుగా వచ్చి కూర్చున్న స్త్రీ, నీలిమేఘపు వర్ణంలో ఉంది. ఆమె కనుగుడ్లలోని తెల్లని భాగం లేకపోతే చీకట్లో ఆమెను పోల్చుకోవడం కష్టం. చీకటిని మగ్గంపై వేసి, చీరగా నేసి ఆ చీరను కట్టుకొని వచ్చినట్లుంది. ఆశ్చర్యకరంగా ఆమె దంతాలు మిరియాల రంగులో ఉన్నాయి. ఆమె నాలుక సైతం నల్లగా ఉంది. చీరకొంగును తలపై కప్పుకోవడం వల్ల, ఆమె శిరోజాలు కనిపించడంలేదు. ఆమె నల్లని చేతికి, నల్లని కంకణం! చేతి వేళ్ళకు, నాలుగు అంగుళాల నల్లనిగోళ్ళు,

"సాధారణంగా లాటరీ తీసినప్పుడు, ఒక పేరు ఇండియన్‌ది వస్తే, మరోపేరు ఏ అమెరికన్‌దో వస్తుంది. లేదా, ఓ ఆస్ట్రేలియన్, ఓ ఈజిప్షియన్ లేదా ఓ పాకిస్తానీ, ఓ ఇటాలియన్ .. ఇలా వస్తుంటాయి. ఆశ్చర్యకరంగా, ఈ రోజు భారతదేశంలో, హైదరాబాద్‌లో ఒకే బార్‌లో ఒకే టేబుల్ దగ్గరున్న మీ ఇద్దరి పేర్లు వచ్చాయి. ఇది విడ్డూరంగా ఉంది. ఈ రోజు, నా రెండు కోట్ల నలభై రెండు లక్షలా అరవై మూడువేలా నాగులు వందలా ఇరవై ఆరో పుట్టినరోజు. ఇన్నేళ్ళలో ఇలా ఎప్పుడూ జరగలేదు" అంది చిరునవ్వుతో.

ద్వారమేమిటి?! క్యూ ఏమిటి? దాటడం ఏమిటి?! ఈవిడెవరు? అసలు ఏం మాట్లాడుతోంది?! నేను తల విదిలించి చూసాను. అయినా కనిపిస్తూనే ఉంది. హరికథాపితామహుడు ఆది భట్ల నారయణదాసుగారు తాగుబోతులను దృష్టిలో పెట్టుకుని, ఓ శ్లోకాన్ని ప్రవచించారు.

శుకఃపికోఒకశ్చైవ, హనుమాన్ రావణశ్చతు!
కర్ణంచ కుంభకర్ణంచ, సప్తైతే డోసు లక్షణా!!

మొదటి రౌండ్ డోసులో శుకః అంటే చిలుకలా పలుకుతారు. రెండవ రౌండ్‌లో పికః అంటే కోకిలలా కూస్తుంటారు. మూడవ రౌండ్‌లో ఒకః అంటే కొంగలాగా అర్ధనిమీలిత నేత్రాలతో ఉంటారు. నాలుగవ రౌండ్‌లో హనుమాన్, అంటే కోతిలాగా చంచలంగా రెచ్చిపోతారు. ఐదవ డోసు పడగానే, రావణుడిలా అంటే స్త్రీలను దుష్టతలంపుతో చూడడమో, స్త్రీల పట్ల అసభ్యంగా ప్రవర్తించడమో చేస్తారు. ఆరవ రౌండ్‌లో కర్ణుడిలా దానం చేస్తుంటారు, అంటే బార్‌లో బేరర్‌లకు టిప్పులివ్వడం, ఆటోమీటర్ వందరూపాయలైతే, రెండొందలు ఇవ్వడం చేస్తుంటారు. ఇక ఏడవరౌండ్‌లో కుంభకర్ణుడిలా నిద్రపోతారు. చిన్నప్పుడు, ఓ గుళ్ళో హరికథ వింటూంటే హరిదాసుగారు సరదాగా చెప్పారు ఈ శ్లోకం. అయితే, నేను మందుప్రియుడిని అయ్యాక, బార్‌లలో గమనించింది ఏమిటంటే, కొందరు రెండో రౌండ్‌లోనే కోతులలా మారతారు. కొందరు, మూడవ రౌండ్‌లోనే రావణాసురులౌతారు.

అయితే, ఏ రౌండ్‌లోనూ, నాకు దెయ్యాలు మాత్రం కనిపించలేదు. కానీ ఏమిటిది?!

"శంకర్ మన ఎదురు సీట్లో, నీకు ఎవరైనా కనిపిస్తున్నారా?" భయం భయంగా అడిగాను.

"క...క...కనిపిస్తోంది!" చెప్పాడు.

'హమ్మయ్య మనిషేనన్నమాట'

"నువ్వు? అసలు ఏం మాట్లాడుతున్నావ్?" సీరియస్‌గా అడిగాను.

"చెప్తాను. కానీ మీరు భయంతో అరవకూడదు" చెప్పింది.

"ఈ ప్రపంచంలో, నేను ఎవ్వరికీ భయపడను. ఆఖరికి నా పెళ్ళానికి కూడా" అన్నాను.

"చెప్పు. ఏంటి సంగతి?" అడిగాడు లేపాక్షి శంకర్.

"నేను మృత్యుదేవతను" చెప్పింది.

లేపాక్షి శంకర్ భళ్ళున నవ్వాడు. కుక్కకు ఎక్కిళ్ళు వస్తే ఎలా ఉంటుందో, అలా ఉంది ఆ నవ్వు.

మృత్యుదేవత, చిరునవ్వు నవ్వి చెప్పింది. "ఈ ప్రపంచంలో నల్లవాడు, తెల్లవాడు, చామనఛాయవాడు, పొట్టి, పొడవు, పురుషుడు, స్త్రీ, కులం, మతం, ప్రాంతం, దేశం, వృత్తి, ఆరోగ్యవంతుడు, అనారోగ్యవంతుడు, శిశువు, యువకుడు, వృద్ధుడు, మంచివాడు, చెడ్డవాడు, మూర్ఖుడు, మేధావి, గ్రామీణుడు, పట్టణవాసి, ప్రధానమంత్రి, సామాన్యుడు, ఏనుగు, పులి, తోడేలు, పాము, ఎలుక, హైడ్రా, అమీబా, షార్క్,తిమింగలం, ట్యూనా చేప, మర్రిచెట్టు, రావి, కరివేప, నారింజ, దేవదారు.. హ్హా హ్హాహ్హా .. ప్రతిప్రాణికీ ఒక అంతర్లీనమైన సంబంధం ఉంది. ప్రతిప్రాణికీ మరో ప్రాణితో ఒక 'లింకు' ఉంది. అదేంటో తెలుసా! అందరూ నిరంతరం ఒక

'క్యూ'లో కదులుతుంటారు. ఆ'క్యూ'పేరు మరణం. ప్రాణి పుట్టీపుట్టగానే 'క్యూ'లో చేరిపోతుంది. ఆ 'క్యూ' నిర్విరామంగా ఒక 'ద్వారం' వైపు కదులుతుంది. అదే మృత్యుద్వారం. దాన్ని ఎవరూ తప్పించుకోలేరు.

తమాషా ఏమిటంటే, ఏ ప్రాణికీ తాను 'క్యూ'లో ఎక్కడుందో తెలీదు. 'క్యూ'లో తన ముందు ఎవరున్నారో, తన వెనక ఎవరున్నారో అస్సలు తెలీదు. ఇంకా తమాషా ఏంటంటే సాధారణంగా 'క్యూ' అనగానే వరుసగా ఒకరివెనుక మరొకరు నిలబడుతూ వెళ్ళాలి, కానీ ఈ 'క్యూ'లో ఒక్కోసారి పాతిక ప్రాణులు, ఒక్కోసారి వందప్రాణులు ఇలా ద్వారాన్ని దాటేస్తుంటాయి. వీళ్ళందరూ ఒకేసారి మరణించినవారన్నమాట. ఇంకా గమ్మత్తేంటో తెలుసా! మీ భూలోకపు 'క్యూ'లలో కొత్తగా వచ్చేవారు 'క్యూ' చివరన వచ్చి నిలబడుతుంటారు కదా! కానీ, ఈ 'క్యూ'లో ఆ పద్ధతి ఉండదు. కొత్తగా వచ్చేవాళ్ళు మరణపు 'క్యూ' లో చివరగా వెళ్ళి చేరాలని రూలు లేదు. వారి వారి ఆయువును బట్టి, అంతకు మునుపే 'క్యూ'లో నిలబడినవారికంటే ముందే వెళ్ళి, మధ్యలో ఎక్కడో కలుస్తారు.

మరికొందరు ధూమపానం, మద్యపానం, వ్యభిచారం, కలుషితమైన పదార్ధాలు తినడం, అతికోపం ఇలాంటి వాటివల్ల తమకు తెలియకుండానే 'క్యూ'లో వేగంగా ముందుకు వెళ్ళిపోతుంటారు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు సైతం, ఈ 'క్యూ'లోని తర్కవితర్కాలను అర్థంచేసుకుని ప్రోగ్రామ్ రాయలేరు."

లేపాక్షి శంకర్‌కూ, నాకూ చెమటలు పట్టాయి.

"మీరు, ద్వారానికి అతి దగ్గరగా వచ్చేసారు. చెప్పానుగా, ప్రతి సంవత్సరం నా జన్మదినం నాడు, ఆ రోజు మరణించబోయే వారి పేర్లలోనుండి, రెండు పేర్లు ఎన్నుకుంటుంటాను. ఈసారి మీ ఇద్దరిపేర్లు వచ్చాయి. మీకు, మరో.. 388,80,00,000 తత్పరలు ఆయువు ఉంది. అంతే. ఈ లోపల, ఏమేం చెయ్యాలో చేసెయ్యండి" అంది పైకి లేస్తూ.

"మూడు వందలా ఎనభై ఎనిమిది కోట్ల చిల్లర, అంటే చాలా సమయం ఉన్నట్లుంది" అన్నాను నవ్వుతూ నాకు, ఈమె ఎవరో పిచ్చిదానిలా కనిపిస్తోంది.

"మూర్ఖుడా 60 తత్పరలు ఒక పర, 60 పరలు ఒక విలిప్త, 60 విలప్తలు ఒక లిప్త, లిప్త అంటే మీ సెకనులో మూడూ బై అయిదవ వంతు. 60 లిప్తలు ఒక విఘడియ. విఘడియ అంటే 25 సెకనులు. 60 విఘడియలు ఒక ఘడియ. ఘడియ అంటే 24 నిమిషాలు. నేను చెప్పింది మీకు అర్థమయ్యేలా, మీ కాలగణనలో చెప్పాలంటే, ఇంకా మీ ఆయువు నూటా ఇరవై నిమిషాలుంది. అంటే, రెండు గంటలు."

నా మొహంలో నవ్వు మయమయ్యింది.

"మీ లోకంలో, కాలాన్ని పంచాంగాలలో లెక్కిస్తారా అయితే" నవ్వాడు లేపాక్షి శంకర్.

"ఓరి అజ్ఞానీ మామూలుగా పేరు శంకర్ అనో, భవానీ శంకర్ అనో, గౌరీ శంకర్ అనో, శివశంకర్ అనో పెడతారు. నీ పేరు, మీ నాన్న లేపాక్షి శంకర్ అని ఎందుకు పెట్టాడో తెలుసా?" అడిగింది.

"వెరైటీగా ఉంటుందని" చెప్పాడు ముందు సిప్ చేస్తూ.

"కాదు. నువ్వు, భరణీ నక్షత్రం మూడవపాదంలో పుట్టావ్. నీ జన్మనామం 'లే' అనే అక్షరంతో ప్రారంభం కావాలి. 'లే' అనే అక్షరంతో, తెలుగులో, మగపిల్లాడికి ఏం పేరు పెట్టాలో తోచని మీ నాన్న, నీ పేరు లేపాక్షి శంకర్ అని పెట్టాడు. ఇంకా నూటాపదిహేడు నిమిషాలు" చెప్పేసి, అదృశ్యమయ్యింది.

నేను, అతని మొహంలోనికి చూసాను. రసం పిండేసిన బత్తాయికాయలా ఉంది, అతని మొహం.

"గురూ! ఇదంతా నిజమేనా?" అడిగాడు.

"ఆమె, మన కళ్ళముందు మాయమవడం పచ్చి నిజం!" చెప్పాను.

"అంటే, మనం కొన్ని నిమిషాలలో.."

"చచ్చిపోతామేమో ఇది కలో, భ్రమో కాకపోతే!" అన్నాను.

"అయితే, నేను ఇప్పుడే ఇంటికి వెళతాను గురూ!" అంటూ పైకి లేచాడు.

అతని మొహం పాలిపోయి ఉంది. అయితే, నా మొహమూ, శరీరమూ పాలిపోయిందని గ్రహించే స్థితిలో అతడున్నాడో లేడో తెలీదు.

●●●

పదినిమిషాలలో ఇంటి దగ్గరున్నాను.

టిన్ టిన్ టిన్, టిన్ టర టర టర టిన్ టిన్ టిన్!

నా, కాలింగ్ బెల్ నొక్కుడు శబ్దం విని, విసుక్కుంటూ వచ్చి, నా భార్య సుమతి తలుపు తెరిచి, వెళ్ళి సోఫాలో కూర్చుని, టి.విలో ఏదో ఏడుపుగొట్టు సీరియల్ చూస్తోంది.

నేను, తలుపు మూసేసి బోల్టు పెట్టాను.

'రేపటి నుండి, నేను లేనని తెలిస్తే ఏం చేస్తుందో?' ఛీ!ఛీఛీ! అప్పుడే నా పదప్రయోగం భ్రష్టుపటింది. 'నేను ఉండనని తెలిస్తే' అనేది సరైన వాక్యం.

'హమ్మ్.... ఏం చేస్తుంది. నాలుగురోజులు ఏడ్చి, ఐదవరోజునుండీ మళ్ళీ ఏడుపుగొట్టు డైలీ సీరియల్ చూస్తుంది' మనసులో అనుకుంటూ, నేనూ సోఫాలో కూర్చున్నాను.

సమయం దగ్గరపడుతోంది. కానీ, మళ్ళీ ఏదో సంశయం. మృత్యుదేవత నిజంగా కనిపించిందా?!

"సుమతి. నా నుండి, ఇంకా నువ్వేం ఆశిస్తున్నావో చెప్పగలవా?" అడిగాను.

బహుశా, ఏ భర్తా, తన భార్యను ఇంత చెత్త ప్రశ్న అడిగుండడు.

సుమతి నా వంక విచిత్రంగా చూసి "ఈ రోజు ఏం తాగారు?" అడిగింది.

"రోజూ తాగేదే తాగాను కానీ, చెప్పు" అన్నాను.

"ఆశించడమేమిటి ఆశించడం? మనమేమీ విడాకులు తీసుకోవడం లేదుకదా" అంది వెటకారంగా.

"ఉదాహరణకు, నేను లేననుకో. ఐమీన్, మళ్ళీ మనం కలవమనుకో! అలా ఊహించుకుని చెప్పు. నా నుండి నీకు ఏం కావాలి?" అడిగాను, గడియారం వంక చూస్తూ.

"ఆఫీసులో పని ఎక్కువయ్యిందా? లేక, మందు డోసు ఎక్కువయ్యిందా? లేదంటే, ఏదైనా పిచ్చి మొక్కను తొక్కి వచ్చారా? పదండి, తిని పడుకుందురుగానీ" అంది.

నేను, మౌనంగా లోపలికి నడిచాను. ఇరవై ఏళ్ళ వయసున్న నా సుపుత్రుడు గౌతమ్, ఇంటర్‌నెట్‌లో ఎవరితోనో ఛాటింగ్ చేస్తున్నాడు.

నేను లోపలికి వచ్చిన సంగతి గమనించి, వెనక్కి తిరిగి, "హాయ్ డాడ్" అన్నాడు.

నేను పలకరింపుగా నవ్వి, వాడి దగ్గరకి వెళ్ళి "ఎలా చదువుతున్నావ్?" అడిగాను.

వాడు, నా వంక వింతగా చూశాడు. ఏ రోజూ నేను వాడి చదువు గురించి అడగను. వాడికి, ఎంత డబ్బుకావాలో అడుగుతుంటాడు. ఇస్తుంటాను.

చాలమంది యువతీ యువకులకు, ఇల్లంటే రాత్రి పూట పడుకోవడానికి పనికొచ్చే సత్రం. అంతే.

"యా! బాగానే చదువుతున్నాను" చెప్పాడు.

"అమ్మను జాగ్రత్తగా చూసుకో" అన్నాను.

"ఊరికి వెళుతున్నారా, డాడ్?" అడిగాడు.

"బాబూ! అవును బాబూ, తిరిగిరాని ఊరికి వెళుతున్నాను" లాంటి డెబ్బై, ఎనభై దశకాలలో వచ్చిన సినిమాల్లోని మెలో డ్రమెటిక్ భారీ డైలాగులు కొట్టడం నాకు ఇష్టంలేదు.

"లేదు జస్ట్ చెప్పాలనిపించింది అంతే" అనేసి మరో గదిలోనికి నడిచాను.

అక్కడ, నా కూతురు ఎమ్ సెట్, ఐఐటి ఎంట్రెన్స్‌లకోసం ప్రిపేరవుతోంది.

మేము చదువుకునే రోజుల్లో, ఇంతలా చదివేవాళ్ళం కాము. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఓ పిల్లో, పిల్లాడో పుట్టారంటే 'ఎల్.కె.జి నుండి ఇంజనీరింగ్ వరకూ' దమ్ము ఆగకుండా చదువుతూనే ఉండగలిగే శక్తి స్థైర్యాలు ఉండితీరాల్సిందే

"ఏమ్మా? ప్రిపరేషన్ ఎలా నడుస్తోంది?" అడిగాను.

"సైన్ ఏ కాస్ బి ప్లస్ కాస్ ఏ సైన్ బి.. ఆఁ బానే నడుస్తోంది" అంది చదువుతూనే. నేను తల నిమిరి, నా గదిలోనికి వెళ్ళాను.

గబగబా బీరువా తెరిచి, ఫిక్స్‌డ్ డిపాజిట్ కాగితాలు తీసి, లెక్కలు వేసాను. అలాగే, బ్యాంకులో బాలన్స్ చూసాను. మొత్తం ఆరున్నర లక్షలున్నాయి. ఈ ఇల్లు ఉంది.

ఎల్.ఐ.సి బాండ్లు తీసి, గబగబా లెక్కలు వేసాను. ఈ రోజు నేను చచ్చిపోతే, ఎల్.ఐ.సి డబ్బు, నా కుటుంబానికి దాదాపు పదిహేను లక్షలు వస్తుంది. చాలు. ఊహూఁ చాలదు. ఏం చెయ్యాలి?

వెంటనే, కారు వేసుకుని సెక్రటేరియట్‌కు వేగంగా వచ్చాను. త్రోవలోనే ఎనిమిది మందికి ఫోన్ చేసాను.

"మీ పెండింగ్ ఫైల్ క్లియర్ చేస్తాను. వెంటనే డబ్బుతో రండి" ఇదీ, నేను వాళ్ళకు చెప్పిన విషయం.

సెక్రటేరియట్ ముందు, నైట్ డ్యూటీలో ఉన్న గార్డులు, నన్ను చూసి ఆశ్చర్యపోలేదు. అక్కడికి రాత్రి పూట కూడా వచ్చి, అర్జంటు(?) పనులు చూసే నాలాంటి వాళ్ళు, వాళ్ళకు మామూలే.

పరుగు పరుగున, నా సెక్షన్ వైపు పరుగెత్తాను. హాల్లో బల్లలు, కుర్చీలు, ఫైళ్ళు అంతే! వేగంగా ఫైల్స్ అందుకుని, కనీసం చదవనైనా చదవకుండా, కోడికెలికినట్లుండే నా సంతకాన్ని బరబరా బరికాను. ఆ తర్వాత, వాటిని తీసుకుని బయటికి వచ్చాను. పార్కింగ్ లాట్ దగ్గర, ఆ ఫైళ్ళ తాలూకు ఎనిమిది మందిలో ఏడుగురు వేచిచూస్తున్నారు.

"చాలా థాంక్స్ సార్. యాభైవేలు తీసుకునే మీరు, పాతిక వేలకే" ఒకతను, లంచంలో నేను ఇచ్చిన డిస్కౌంటుకు పొంగిపోతున్నాడు.

"మాటలొద్దు, డబ్బివ్వండి" అన్నాను, ఫైళ్ళు అందిస్తూ.

ఎనిమిదోవాడు వచ్చాడు. మొత్తం రెండు లక్షలు పోగయ్యాయి. నిజానికి వీటిలో లక్ష రూపాయలు, నాకింది ఉద్యోగులకు చేరాలి. ఇప్పుడు ఆ పని చెయ్యదల్చుకోలేదు. రేపు బ్రతికుంటే అప్పుడు చూద్దాం.



కౌముది

"సర్. చాలా ఫైళ్ళున్నాయని విన్నాను. సెక్రటేరియట్‌కు పదికిలోమీటర్లలోపు నివసించేవారికి మాత్రమే, ఇంతరాత్రి ఫోన్ చేసి పిలిపించి, సంతకాలు చేసిచ్చారు. కారణం?" ఒకతను అడిగాడు.

"మీ సంతకం కోసం ఆర్నెల్లనుండీ తిరుగుతున్నాను సార్. మీ ఫోన్ రాగానే, గబగబా ఏటిఎంకు వెళ్ళి డబ్బు డ్రా చేసుకుని పరుగెత్తుకొచ్చాను" ఇంకొకతను.

నేను వాళ్ళకు ఏ సమాధానాలూ చెప్పకుండా, కారెక్కి వేగంగా మెహందీ బజార్ వైపు దూసుకెళుతుంటే, ట్రాఫిక్ పోలీస్ ఆపాడు.

"తాగి డ్రైవ్ చేస్తారా? కిందకి దిగండి"

"నేను తాగి ఇంట్లో పడుకుంటే, మంత్రిగారు ఫోన్ చేసి రమ్మన్నారు. వెళ్ళనిస్తావా లేదా?" సీరియస్‌గా అబద్దం చెప్పాను, నా ఐడెంటిటీ కార్డును చూపిస్తూ.

"సారీ! వెళ్ళండి సార్" అన్నాడు.

నేను ఊపిరి పీల్చుకుని, మరో ఐదునిమిషాలలో మెహందీ బజారులోనికి వెళ్ళాను. కారు పార్క్ చేసి, ఓ ఇంటి తలుపు తట్టాను.

కిటికీ సందులో నుండి మంగమ్మ తొంగిచూసి, "ఓ మీరా.. సార్" అంటూ తలుపు తెరిచింది. నేను లోపలికి వెళ్ళాను.

"మీరు ఇక్కడికి రావడమేమిటి సార్! ఫోన్ కొడితే, చిలుకలను మేమే పంపేవాళ్ళం కదా" అంది. కొందరి ఫైళ్ళు కదిలించడానికి, మేము లంచంగా 'డబ్బు', 'సెల్‌ఫోన్లు', 'ఎల్. సి.డి.టి.వి' 'బంగారు నగలు' అడుగుతుంటాం. మరికొందరు లంచంగా మాకు అందమైన కాంతామణులను సమకూరుస్తారు. ఎవడికి కావాల్సింది వాడికి ఇస్తాం. మాకు కావాల్సింది మేము తీసుకుంటాం. "అందరూ బిజీసార్, దివ్య తప్ప. ఆ గదిలో ఉంది. వెళ్ళండి" అంది మంగమ్మ.

నేను వాచీ చూసుకుంటూ, గబగబా ఆమె చూపించిన గదిలోనికి వెళ్ళాను. దివ్య, మంచం మీద బోర్లా పడుకుని, ఎద క్రింద దిండు పెట్టుకుని, కాళ్ళను గాల్లోనికి ఆడిస్తూ ఏదో పుస్తకాన్ని సీరియస్‌గా చదువుతోంది. దివ్యకు, నా కుమారుడి వయసు ఉండొచ్చు. నేను వెళ్ళి, ఆమె ప్రక్కన కూర్చుని, భుజం మీద చెయ్యి వేస్తూ "ఏం చదువుతున్నావ్?" అడిగాను.

"భాగవతం. అజామిళుడి గురించి" అంది పైకి లేచి కూర్చుంటూ.

"వాడెవడు?" అన్నాను, ఆమెను తమకంతో కౌగిలించుకుంటూ.

"అజామిళుడు లెక్కలేనన్ని పాపాలు చేస్తాడు. అయితే, చివరిక్షణంలో చచ్చిపోయే ముందు, తన కొడుకును నారాయణా అంటూ పిలుస్తూ, చచ్చిపోతాడు. అయితే, నారాయణ శబ్దాన్ని అంత్యసమయంలో ఉచ్చరించినందుకు గానూ, అతడి ఆత్మను వైకుంఠం తీసుకుపోవడానికి విష్ణుదూతలు వస్తారు. అలాగే యమదూతలూ వస్తారు. వాడు పిలిచింది తన కొడుకునేగానీ విష్ణువును కాదనీ, అందుకు యమలోకానికి తీసుకెళతామని యమదూతలు వాదిస్తారు. అతడు ఎవరిని పిలిచాడో తమకు అనవసరం, నారాయణ శబ్దం చివరిగా అతని నోటినుండి వెలువడింది కాబట్టి, వైకుంఠమే తీసుకెళతామని విష్ణుదూతలు వాదిస్తారు" చెప్పింది.

వేశ్యలు పుస్తకాలు చదువుతారనీ, అందులోనూ భాగవతం చదువుతారనీ నాకు తెలియదు.

"ఇంతకూ, వాడు ఎటు వెళ్ళినట్లు, వైకుంఠమా? నరకమా?" అడిగాను.

"ఇంకా చదవలేదు. ఇంతలో మీరొచ్చారు. చదివి చెప్పనా?" అడిగింది.

"అవసరంలేదు. వాడెటుపోతే నాకెందుకు?" అన్నాను మరింత గట్టిగా హత్తుకుంటూ.

"ఏంటీ, కొత్తబిచ్చగాడిలాగా ఇంత ఆత్రంగా ఉన్నారేం?"

"టైమ్ లేదు"

"టైమా? దేనికి?"

"చెప్పినా, నీకు అర్థం కాదులే" అంటుండగా, నా ఫోన్ మోగింది.

"ఛ ఈ టైములో ఎవరు?" అనుకుంటూ ఫోన్ అందుకున్నాను. సుమతి ఫోన్ చేసింది.

"చెప్పు" అన్నాను విసుగ్గా.

"లేపాక్షి శంకర్‌గారి భార్య ఫోన్ చేసింది. ఆయన ఉన్నట్లుండి విరుచుకుపడిపోయాడట. అపోలో ఆసుపత్రికి తీసుకువెళతున్నారట" చెప్పింది.

దెబ్బకు నా ఆవేశం చల్లారిపోయింది. టైమ్ చూసాను. ఇంకా అరగంట. అంతే. కానీ, మరి శంకర్ అప్పుడే ఎందుకు? ఇక ఆలోచించలేకపోయాను. ఇప్పుడు, నా వంట్లో అసలు సిసలు మృత్యుభయం మొదలయ్యింది

ఒక్క ఉదుటున క్రిందికి దూకి బయటికి పరుగెత్తాను. దివ్య, మంగమ్మ నా వంక వింతగా చూస్తున్నారన్న విషయాన్ని గ్రహించి, ప్రతిస్పందించే స్థితిలో నేనులేను. ప్రచండవేగంతో ఇంటికి వచ్చిపడ్డాను. రెండులక్షలూ బీరువాలో దాచాను.

"ఎక్కడికెళ్ళారు?"

"భోజనం చేస్తారా?"

"లేపాక్షి శంకర్.." నా భార్య మాటలు చెవికి తాకుతున్నాయి కానీ మొద్దుబారిపోతున్న మెదడులోనికి ఇంకడంలేదు.

నన్ను కనిపెంచిన తల్లిదండ్రులు, నా బాల్యస్నేహితులు, ఇబ్రహీం, శీనుగాడు, రవి, నేను కాలేజీ రోజుల్లో ప్రేమించిన శారద, నన్ను తన్నిన మధు, మా పెళ్ళిరోజు ఇలా ఏవేవో స్మృతులు వేగంగా మదిలో పేజీలలా టపటపాకొట్టుకుంటున్నాయి.

నేను చచ్చిపోయాక, నా అస్థికలు గంగానదిలో కలిపితే బావుండును. అప్పుడు ఖచ్చితంగా స్వర్గానికే వెళతాను. కానీ, అంతదూరం ఏం వెళతానులే అని నా సుపుత్రుడు బద్ధకిస్తే?

ఇంకో పదినిమిషాలు.

వెంటనే ఇంటర్ నెట్ ముందు కూర్చుని, నేను చచ్చిపోయిన మూడవరోజున వెళ్ళివచ్చేలా, కాశీకి రానూపోనూ ఫ్లైట్ టికెట్లు గౌతమ్ పేరిట బుక్ చేసి, టికెట్ వాడి ఈమెయిల్‌కు పంపి, ఓ తెల్లకాగితం మీద ఆ విషయాన్ని రాసి, నా జేబులో పెట్టుకున్నాను.

ఇంకొక్క నిమిషం. ఆ తర్వాత కూడా బ్రతికుంటే, మృత్యుదేవత కనిపించడం నా భ్రమే.

కానీ లేపాక్షి శంకర్? అసలు ఉన్నాడా, పోయాడా?

ఇప్పుడు నేను చస్తే, 'మీ ఆయుష్షు ఎనభై ఏళ్ళు' అని, నా చెయ్యి చూసి జాతకం చెప్పిన జాతకబ్రహ్మ పరమేశ్వర శాస్త్రిని దెయ్యమై పట్టిపీడిస్తాను.

ఓ రకంగా ఆనందంగా ఉంది. వేగంగా వెళ్ళి, సంతకాలు పెట్టి, నా కుమారుడికోసం మరో రెండులక్షలు సంపాదించగలిగాను.

ముప్ఫై రెండు సెకన్లు..

అసలు చావు ఎలా వస్తుంది? నా గదిలో నేను కూర్చున్నాను. ఎవడైనా వచ్చి, చంపే అవకాశంలేదు. అసలు, ఇంతవరకూ నాకు హార్ట్ ఎటాక్ రాలేదు. పాములొచ్చి కాటేసేందుకు, ఇదేమీ పల్లెటూరు కాదు. ఎలా చస్తాను? ఎలా.. ఎలా?

సమయం అయిపోయింది. ఎగిరి గంతేసాను. కాశీ టికెట్లు క్యాన్సిల్ చెయ్యాలి. కాస్త డబ్బు కట్ చేసుకుంటారు, అంతే. నా కుమారుడికి ఆ టికెట్ల గురించి ఏదో ఓ కథ చెప్పాలి.

అన్నింటికంటే ముఖ్యంగా మృత్యుదేవత కనిపిందనీ, మరో రెండుగంటల్లో చస్తాననీ, నా భార్యాపిల్లలకు చెప్పి ఫూల్ అయ్యే స్థితి రాలేదు.

ఆనందంగా నా గది నుండి బయటికొచ్చి "అన్నంపెట్టు" అన్నాను.

"సరే. కాళ్ళు కడుక్కుని రండి" అంది సుమతి.

నేను, బాత్రూంలోనికి వెళుతుంటే, "ఏం మనిషో ఏమో, వేళకు తిండి తినడు, కుటుంబం కోసం కష్టపడతాడు, కానీ ఆ తాగుడొకటి, ఈ రోజు ఎక్కువ తాగినట్లున్నాడు, పిచ్చి పిచ్చిగా ప్రవర్తించాడు" గట్టిగా సుమతి గొణుక్కుంటోంది.

నేను బాత్రూంలో మరో అడుగువేసాను.

జర్రున జారడం, నా తల వేగంగా వెళ్ళి బాత్రూంలోని కొళాయికి బలంగా గుద్దుకోవడం మాత్రం గుర్తుంది. అం...తే.

ఇ..క...అంతే (అంతు +ఏ)

●●●

నా ఆత్మ, నా దేహాన్ని వదిలి 'క్యూ'లో మృత్యుద్వారాన్ని దాటింది. నాతోపాటూ లేపాక్షి శంకర్ ఆత్మ, మరికొన్ని ఆత్మలు ద్వారం దాటాయి.

వెనక్కి తిరిగి చూసాను. ద్వారం బయట ఎవరున్నారో కనిపించడంలేదు. మా ముందు నడుస్తున్న ఆత్మలు మాత్రం కనిపిస్తున్నాయి. మాకు ఇరువైపులా, ఆయుధాలు ధరించి కొందరు నడుస్తున్నారు. అయితే వారిలో కొందరు నేరేడు పండు రంగుల్లోనూ, మరికొందరు బాదం పాలరంగుల్లోనూ ఉన్నారు.

"ఏంటడీ ఇది? అసలు ఏమిటిదంతా, చచ్చిపోయాక కూడా మాకు ఉనికి ఉందా? మా నమ్మకాల ప్రకారం అలా ఉండేందుకు వీల్లేదు. మా కమ్యూనిస్టు సిద్ధాంతం అందుకు ఒప్పుకోదు" అరుస్తున్నాడొకాయన.

"నేనేం పాపం చేసాను? నన్నిలా పాతికేళ్ళకే చంపేసారు." అరుస్తున్నాడు ఇంకొకాయన. అయితే దూతలు సమాధానం చెప్పలేదు.

మా గుంపులో, ఒక స్వామీజీ (!) కూడా ఉన్నాడు.

"దూతలు ఇలా ఉన్నారేమిటి? మేము ఏ పురాణంలోనూ చదవని విధంగా ఉన్నారే? ఇంతకీ మేము స్వర్గానికి వెళుతున్నామా లేదా?" అడిగాడు స్వామీజీ, దూతలను.

"జనాలందరికీ ఆధ్యాత్మికతను బోధించిన తమరు, నాలుగువేల కోట్ల ఆస్తి కూడబెట్టకుండా ఉండుంటే, కనీసం పాదనమస్కారాల పేరిట జనాలతో డబ్బులు వసూలు చేసే పని చెయ్యకపోయుంటే, ముండకోపనిషత్తులో చెప్పినట్లు సత్యమేవజయితే అనే సూత్రాన్ని పాటించి ఉంటే, కనీసం ఇప్పుడు మాతో మాట్లాడేప్పుడు నీకు నువ్వు గౌరవాన్ని ఆపాదించేసుకుని 'మేము' అనే పదం వాడావే, అది వాడకుండా ఉండుంటే నిన్ను స్వర్గానికి పంపాచ్చేమోనని ఒక విలిప్తపాటు ఆలోచించేవాళ్ళం" దూత కంఠం ఖంగుమంది.

"అసలు, మమ్మల్ని శిక్షించడానికి మీరెవరు? పీడిత తాడిత బాధాసర్పద్రష్టులు తరఫున పోరాటం సాగించిన మమ్మల్ని నరకానికి ఎందుకు తీసుకెళుతున్నారు? అసలు ఈ స్వర్గనరకాలనేవి పెట్టుబడిదారి విధానానికి చిహ్నాలు" అరిచాడు కమ్యూనిస్టు.

మరోదూత, చిరునవ్వు నవ్వి, "తమరికి ఇరవైఏళ్ళ వయసున్నప్పుడు, తమరి పార్టీలో తిరిగే లక్ష్మి అనే అమ్మాయికి కడుపు చేసి వదిలేసారు, తమరు. తమరి కొడుకుని ఆస్ట్రేలియా పంపించి, డాలర్లు సంపాదించే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. తమ్ముడి ఆస్తి లాక్కున్నారు, సిద్ధాంతాలతో సంబంధంలేకుండా, అధికారం కోసం ఏ పార్టీతో పడితే ఆ పార్టీతో పొత్తుపెట్టుకున్నారు, భూమికోసం

భుక్తికోసం పోరాడండి అంటూ జనాల్ని రెచ్చగొట్టే తమరికి అరవై ఎకరాల పొలం ఉంది, తమరి రెండో సుపుత్రుడు తాగి కారు డ్రైవ్ చేసి ఓ వృద్ధుడిని ఢీ కొట్టి చంపేస్తే పోలీసులకు డబ్బులిచ్చి కేసులేకుండా చూసుకున్నారు. తమరి చరిత్ర ఆసాంతం చదివే ఓపిక నాకు లేదు. చిత్రగుప్తులవారు, చిట్టా విప్పుతారు. అప్పుడు వాదించండి'' అన్నాడు.

ఆ కమ్యూనిస్టు మొహం మాడిపోయింది.

''మానవుడు శక్తివంతమైన టెలిస్కోపులు కనిపెట్టాడు. మరి, మీ యమలోకం కనిపించలేదేం? భూమి, సూర్యుడు, చంద్రుడు ఇవన్నీ ఆస్ట్రనామికల్ బాడీస్. అంతే. నా ఉద్దేశ్యం ప్రకారం, నేను చావలేదు. బహుశా ఇదంతా కల అయ్యుంటుంది. కలలో సైతం సైన్సునూ, కార్యకారణ సిద్ధాంతాన్నీ, హేతువాదాన్నీ నేను విస్మరించను మైడియర్ దూతలూ!'' ఇంగ్లీష్‌లో అన్నాడు ఓ హేతువాది. ఇంకో దూత ఫక్కున నవ్వి,

''చనిపోయినవాళ్ళెవరూ తాము చచ్చామని అంత సులభంగా నమ్మరు. ఎందుకంటే ఏ ప్రాణికైనా చావంటే భయం. అది ఊహాలోకానికి కూడా రానివ్వడు. దేవుని ముందు దీపం వెలిగించడంలో అర్థం లేదు, నూనె దండగ అని వాదించే నువ్వు తాగుడు కోసం ఎంత ఖర్చుచేస్తావో జనాలకు తెలీదు'' అన్నాడు.

ఇవన్నీ వింటూ నేనూ, లేపాక్షి శంకర్ గజగజ వణికిపోయాం(!!)

మరో ఐదు నిమిషాలు గడిచాక, వై జంక్షన్‌లాంటిది వచ్చింది.

''ఇక్కడ స్వర్గానికి, నరకానికి వెళ్ళేదారులు విడిపోతాయి. కుడివైపు నరకపు దారి, ఎడమవైపు స్వర్గపు దారి. లేపాక్షి శంకర్, దివ్య, జువ్విచెట్టు, గేద, ఊరపంది ఆత్మలు మాతోపాటూ రావాలి. మేము అమరావతీ నగరవాసులం, మహేంద్రుని దూతలం'' చెబుతూ బాదం పాలరంగులో ఉన్న దేవదూత ఎడమ వైపు వెళ్ళాడు. మిగతా దేవదూతలూ, అతడు చెప్పిన ఆత్మలూ అతణ్ణి అనుసరించాయి.

''పుణ్యాత్ములారా! మీ ఐదుగురికీ సుస్వాగతం. అగరు, కర్పూరం, మంచి గంధం, చందనం సువాసనల మధ్యలో, ఇక్కడినుండి అమరావతి ప్రధాన ద్వారం వరకూ దేవకన్యలు రంభ, ఊర్వశి, మేనక తిలోత్తమ, చిత్రసేన, పరవతి, నీలకుంతల, ప్రమ్లోచా, సుభాగ, శశిరేఖ, ఘృతాచి, ముంజికస్థల, భాద్రాంగి, విపులాననా, మిశ్రకేశి, చిత్రమధ్య తమనృత్యాలతో, పాటలతో మిమ్మల్ని అలరిస్తారు'' చెప్పాడు దేవదూత.

లేపాక్షి శంకర్, నా వంక జాలిగా చూసాడు.

నేను, అతని ఆత్మ (!) వంక ఈర్ష్యతో చూసాను.

మరుక్షణంలో వాళ్ళందరూ వెళ్ళిపోయారు.

''నడవండిరా పాపాత్ములారా, దుర్మార్గులారా!'' నేరేడు పళ్ళ రంగులో ఉన్న యమదూతలు మమ్మల్ని ముళ్ళకొరడాలతో కొట్టసాగారు. అకస్మాత్తుగా, వాళ్ళ చేతుల్లోనికి కొరడాలు ఎలా వచ్చాయో అర్థం కాలేదు. దారిలో బ్రహ్మజెముడు, నాగజెముడు ముళ్ళు. అందరం హాహాకారాలు చేసాం. కోట్లాడి కోడిగుడ్ల డొల్లలను, సంవత్సరాల తరబడి మురగబెట్టి ఆ వాసనను వదిలితే ఎలా ఉంటుందో అంతటి దుర్గంధం.

''అయ్యా! బా..బూ! నాదో సందేహం అడగనా?'' నరకయాతనను అనుభవిస్తూ అడిగాను.

''ఏంటీ?'' తాపీగా అడిగాడు, నన్ను కొరడాతో బాదుతున్న యమదూత.

''జువ్వి చెట్టు, గేదె, ఊరపంది ఆత్మలు స్వర్గానికి వెళ్ళడమేమిటి?''

"ఆకులు, కొమ్మలు, కాండము, వ్రేళ్ళు, ఇలా అన్నింటినీ పరులకోసం త్యాగం చేసింది ఆ జువ్వి చెట్టు. తన క్షీరాన్ని నిస్వార్ధంగా ఇచ్చింది గేదె. తనకు లభించిన ఆహారంలో కొంత భాగం, మిగతా పందులకు పంచిపెట్టేది, ఆ పంది, ఆ జువ్వీచెట్టు అమెజాన్ అడవిలోనిది, గేదె స్వీడెన్‌ది, పంది ఇటలీది" చెప్పి, కొరడాతో నాకు గట్టిగా ఓ దెబ్బను ప్రసాదించాడు.

నేను గిలగిలా తన్నుకుంటూ, "మరి ఆ దివ్య, ది..వ్య, వ్యభిచారి కదా! స్వర్గానికి ఎందుకు వెళ్ళింది?" అడిగాను.

"ఓహ్! ఆ స్త్రీ ఆత్మనా? నీ చావుకు సరిగ్గా పదిలిప్తల ముందు విధ్యుద్ఘాతంతో చనిపోయింది. హ్మ్! ఆమెను బలవంతంగా వ్యభిచారంలోనికి దింపారు. చంపుతామని బెదిరించి, ఆమెను వేశ్యగా మార్చారు, మీ హైదరాబాద్‌లోని కొందరు నీచులు. ఐతే, ఆమె నిరంతరం భగవంతుని ధ్యానిస్తూనే ఉండేది. ఆమెకు వచ్చే ప్రతీపైసా శారదాంబా అనాధాశ్రమానికి పంపించేది. తప్పించుకోవాలని చాలాసార్లు ప్రయత్నించి విఫలమయ్యింది. అంతటి సమస్యలో చిక్కినా, ఆత్మహత్య చేస్కోవాలని ఏనాడూ ప్రయత్నించలేదు. ఏదో ఒకరోజు బయటపడకపోతానా అనే ఆశావాదంతో ఉండేది. స్వర్గానికి వెళ్ళడానికి, ఇంతకన్నా ఏం కావాలి?" చెప్పాడు యమదూత.

హాహాకారాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతోంది.

"సంయమని సరిహద్దుల్లోనికి వచ్చాం. అదిగో వైతరణి" అన్నాడు ఓ యమదూత.

వైతరణిలో రక్తం, చీము ప్రవహిస్తున్నాయి. ఆ ప్రవాహంలో ఏవో విచిత్ర జంతువులు భీకరంగా అరుస్తున్నాయి. పది అడుగులున్న పాములు, ఈదుతూ, మమ్మల్ని కోరలు చాచి ఆహ్వానిస్తున్నాయి.

"ఆ లేపాక్షి శంకర్, సెక్రటేరియట్‌లో నా సహోద్యోగి, నన్ను మించిన లంచావతారం. ఎన్నో వ్యసనాలున్నాయి. అయినా అతడు ఎందుకు స్వర్గానికి వెళ్ళాడు? నేనెందుకు నరకానికి వచ్చాను?" అడిగాను, వైతరణిని భయం భయంగా చూస్తూ.

"మృత్యుదేవత, మీ ఇద్దరినీ కలిసి, మీరు చావబోతున్నారని చెప్పాక, లేపాక్షి శంకర్ ఏం చేసాడో తెలుసా?" అడిగాడు యమదూత.

"తె..తెలీదు"

"ఇటు చూడు, తెలుస్తుంది" అంటూ తన అరచేతిని చూపాడు.

అరచేతిలో దృశ్యం కనిపిస్తోంది.

●●●

ఆ నదిలో లేపాక్షి శంకర్ వణుకుతూ, బార్ ముందు పార్క్ చేసున్న తన కారు ఎక్కి, వెంటనే తన లాయర్ స్నేహితుడికి ఫోన్ చేసాడు.

"రేయ్! నేను వీలునామా రాయాలనుకుంటున్నాను. వెంటనే నీ ఇంటికి వస్తున్నాను."

"ఇంత రాత్రిపూటా?" లాయర్ ఆశ్చర్యపోయాడు.

"అవును. వెంటనే రాయాలి. దయచేసి ఎక్కువ ప్రశ్నలు వెయ్యకు. సహాయం చెయ్యి"

" సరే. కానీ అటెస్టేటర్ తో పాటు కనీసం ఇద్దరు అట్టెస్టోలు కావాలి."

"అంటే?"

"అటెస్టేటర్ అంటే వీలునామా రాసే వ్యక్తి. అంటే నువ్వే. అటెస్టో అంటే సాక్షి సంతకం చేసే వ్యక్తి. సాక్షులు ఇద్దరు కావాలి" చెప్పాడు లాయర్.

ఆస్తిపంపకాల కోసం, ప్రపంచ వ్యాప్తంగా రకరకాల చట్టాలున్నాయి. వాటికి ఒకొక్క పేరూ ఉంది. అయితే, ఆంగ్లంలో “will” అనే పదాన్ని వీలునామా కోసం వాడతారు. షేక్స్‌పియర్ వ్రాసిన జూలియస్ సీజర్ నాటకంలో will అనే పదాన్ని వాడసాగారు. బ్రిటిష్‌వారు మనదేశాన్ని పాలించారు కాబట్టి, మనమూ న్యాయశాస్త్రంలో Penal code లో will అనే పదాన్ని వాడుతున్నాం.

''సరే'' అనేసి లేపాక్షి శంకర్, కారులో తన స్నేహితుడి దగ్గరకు వెళ్ళి, ''వీలునామా రాయబోతున్నాను. సాక్షి సంతకాలు పెట్టేందుకు నువ్వూ నీ భార్యా రావాలి'' చెప్పాడు.

అతని స్నేహితుడు ఆశ్చర్యంగా చూస్తూ, ''నీ భార్యా పిల్లలతో గొడవా?'' అడిగాడు.

''లేదు. నాకే, వెంటనే వీలునామా రాయాలనే బుద్ధిపుట్టింది. దయచేసి ప్రశ్నలు వెయ్యకు''

''సరే! రేపు వస్తాం''

''కాదు. ఇప్పుడే రావాలి''

''ఇప్పుడా! ఇంతరాత్రా!''

''అవును. ప్లీజ్'' లేపాక్షి శంకర్ గొంతులో అర్థింపు.

''అరే, ఏమైందిరా?''

''ప్లీజ్‌రా! ప్రశ్నలు వద్దు''

లేపాక్షి శంకర్, ఆ స్నేహితుడికి ఎన్నో సహాయాలు చేసాడు. అయితే, శంకర్ అవన్నీ గుర్తుచెయ్యదల్చుకోలేదు.

''సరే పదా!''

పదినిమిషాలలో లాయర్ ఇంట్లో ఉన్నారు.

లేపాక్షి శంకర్ కంగారు, భయం, వణుకుడు చూసి లాయర్ ఆశ్చర్యపోయాడు. ఐతే ఏమీ అడగలేదు.

''ఇంటర్ నెట్ కావాలి, కంప్యూటర్ ఆన్ చెయ్యి.'' చెప్పాడు లేపాక్షి శంకర్, లాయర్‌తో.

ఆ తర్వాత, తన ఈ మెయిల్ లోనికి లాగిన్ అయ్యి, డ్రాఫ్ట్స్ ఫోల్డర్‌లో ఉన్న ఒక ఫైల్ తెరిచి, దాన్ని ప్రింట్ తీసాడు.

''జి.నాగరాజు, 7,000, 2-2-85/ఏ, మలక్ పేట్, హైదరాబాద్

ఎల్.రాములు, 10,000, ఫ్లాట్ నెంబర్ 208, భరత్ అపార్ట్‌మెంట్స్, సిక్ విలేజ్, సికిందరాబాద్..'' పేర్లు, డబ్బు, చిరునామాలు ఉన్నాయి. దాదాపు ఆరువందల పేర్లున్నాయి.

''వీళ్ళందరూ ఎవరు?'' అడిగాడు లాయర్.

''నేను వీళ్ళందరి దగ్గరా లంచాలు తీసుకున్నాను. గత రెండేళ్ళుగా నేను తీసుకున్న లంచాల లిస్ట్ ఇది. అంతకు ముందు లిస్ట్ లేదు. నా మరణానంతరం, వీళ్ళందరికీ నా ఆస్తిలో నుండి, వారి వారి డబ్బులు వారికి ఇవ్వాలి'' చెప్పాడు లేపాక్షి శంకర్.

వింటున్న వాళ్ళు, ఉలిక్కిపడ్డారు.

''స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆరు, బ్యాంక్ ఆఫ్ బరోడాలో నాలుగు, ఆంధ్రాబ్యాంక్‌లో రెండున్నరా, కెనరాబ్యాంకులో మూడు మొత్తం పదిహేనున్నర లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లున్నాయి, ఇంట్లో, బియ్యం బస్తాలలో ఆరుకిలోల బంగారం, ఇరవై కిలోల వెండి ఉంది, ఇదంతా వాడేసి, నేను లంచాలు తీసుకున్న వాళ్ళకు ఇవ్వాలి.

నా జీతంతో, నేను కొనిపెట్టిన వెయ్యి గజాల స్థలం, నా ఇద్దరు కొడుకులకూ చెందుతుంది. అయితే రెండు షరతులు. ఒకటి, నా కుమారులిద్దరూ చెరో యాభై చెట్లు పెంచాలి. రెండు, వాళ్ళిద్దరూ కులాంతర లేదా మతాంతర వివాహాలు చేసుకోవాలి. అప్పుడే ఆ

స్థలం వాళ్ళకు చెందుతుంది. ఇప్పుడున్న నా ఇల్లు, నా భార్యకు చెందాలి. ఆమె మరణానంతరం మదర్ థెరిసా స్థాపించిన 'నిర్మల్ హృదయ్' సంస్థకు చెందుతుంది. ఇదే, నా వీలునామా. ఎలాంటి లొసుగులూ చట్టప్రకారం రాకూడదు. వీలునమా డ్రాఫ్ట్ చెయ్యి." చెప్పాడు శంకర్.

"లంచాల డబ్బు అనే పదాలు మాత్రం రాయను. అది నేరం" చెబుతూ లాయర్ వీలునామా రాసాడు. సంతకాలు పూర్తయ్యాయి.

శంకర్, అక్కడినుండి వేగంగా తన ఇంటికి వచ్చాడు.

భార్యనూ, ఇద్దరు సుపుత్రులనూ హాల్లోనికి పిలిచి కూర్చోపెట్టాడు.

"మంచో చెడో చెసి, నేను కుటుంబం కోసం కష్టపడ్డాను. ఎన్నో తప్పులు చేసాను. నా వ్యసనాలతో, నా ప్రవర్తనతో మీకు బాధ కలిగించి ఉంటానని తెలుసు. దయచేసి, నన్ను క్షమించండి."

"ఏంటండీ ఇది? ఏం మాట్లాడుతున్నారు మీరు? ఏమయింది?" అడిగింది భార్య.

"ఏమీ కాలేదు. ఇంకాసేపట్లో అవ్వొచ్చు. అందుకే, నా తప్పులు మన్నించమని వేడుకుంటున్నాను." లేపాక్షి శంకర్ గొంతులో నుండి మాటలు బయటికి రావడంలేదు.

అతని సుపుత్రులు, అతని వంక వింతగా చూడసాగారు.

"చిన్నప్పుడు బళ్ళో నీతిపాఠాలు చదువుకుంటాం. కానీ పాటించం. ప్చ్.." అంటూ వెనక్కి విరుచుకుపడిపోయి, గుండెను పట్టుకుని గిలగిలా తన్నుకోసాగాడు.

అపోలో ఆసుపత్రిలో చేర్చారు. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో యాతన అనుభవించి, చచ్చిపోయాడు.

●●●

"మృత్యువు ఇంకొన్ని నిమిషాలలో రాబోతుందని తెలిస్తే, నువ్వెలా ప్రవర్తిస్తావో దానిపై కూడా, నీ స్వర్గ నరకాల ప్రస్థానం ఆధారపడి ఉంటుంది. ప్రతి పుట్టినరోజున, మృత్యుదేవత ఇద్దరికి ఇలాంటి అవకాశం ఇస్తుంటుంది. కానీ, ఎవ్వరూ సద్వినియోగం చేసుకోరు.

వేరేవాళ్ళ సంగతి ఎందుకు, నీ సంగతే తీసుకో, వ్యభిచారి దగ్గరికెళ్ళావ్. నీ కుటుంబం కోసం మరింత డబ్బు కూడబెట్టాలని లంచాలు తీసుకున్నావ్. జీవితంలో నువ్వు చేసిన తప్పులకు పశ్చాత్తాప పడకుండా, ఉచితంగా స్వర్గాన్ని పొందాలని కాశీకి టికెట్ బుక్ చేసి, నీ అస్తికలను గంగానదిలో కలిపేయించే పథకమూ వేసావ్. పోలీసుకు అబద్దం చెప్పావ్. మృత్యుద్వారం దగ్గరికొస్తుంటే, ఒక్కటంటే ఒక్క మంచిపని కూడా చెయ్యలేదు. " అన్నాడు యమదూత.

నేను బాధతో కృంగిపోయాను.

"జీవించేటప్పుడు, మృత్యుద్వారం మరో రెండు గంటల దూరంలో ఉందని భావించి మంచి చేస్తే స్వర్గం వైపు, అనైతికంగా ఉంటే నరకం వైపు వెళతారని ఆలోచించి ప్రవర్తిస్తే చాలు. ప్రపంచం మరోలా ఉంటుంది. స్వర్గం, నరకం ఉన్నాయా లేవా అనే తర్కవితర్కాలూ, మీమాంస భూలోకంలో అనవసరం. అలా ఆలోచించి జీవించమని చెబుతున్నాను. అంతే! పద, వైతరణిలో దిగు" చెప్పాడు యమదూత.

నేను పశ్చాత్తాపంతో వైతరణిలో అడుగుపెట్టాను.

●●●

# సెలవు

సన్నిహిత్

**ఆఫీసునుండి ఆలస్యంగా ఇంటికి వచ్చాను.**అప్పటికే నా భార్య ఇంటికి వచ్చి వంట గదిలో పనులు చూసుకుంటోంది. అలసటగా అనిపించి సోఫాలో కూలబడ్డాను. నా రాకను గమనించి వంట గదిలో నుండి కాఫీ కప్పుతో వస్తూ "ఇప్పుడే శ్రీశైలం వచ్చి వెళ్ళాడండీ. పని ఇవ్వమని ఒకటే పోరు పెడుతున్నాడు. మీతో మాట్లాడి చెబుతానని పంపించేసాను" నెమ్మదిగా చెప్పింది నా భార్య శైలజ.

"ఆహా అలాగా !" అంటూ తలూపి ఆలోచనలో పడ్డాను.

శ్రీశైలం మా అందరికి చాలా కాలంగా తెలిసిన వాడు. కార్పెంటరీ పని చేస్తుంటాడు. అప్పుడెప్పుడో మాట వరసకి మా ఇంట్లో కొంచెం పని చేసి పెట్టాలయ్యా అన్నాను. అదిగో అప్పటి నుండి వాడికి బయట పని దొరకనప్పుడల్లా వచ్చి మమ్మల్ని కెలుకుతూ ఉంటాడు. అతడికి పని ఇవ్వడానికి నాకు కూడా పెద్ద అభ్యంతరం లేదు. కానీ చిన్న సమస్య ఉంది. ఆ సమస్య పేరు 'సెలవు'. మన ఇంట్లో కార్పెంటరీ పని జరుగుతున్నపుడు మనం ఆఫీసుకి సెలవు పెట్టి దగ్గరుండి పర్యవేక్షించకపోతే ఇక అంతే సంగతులు. మనం చెప్పిన డిజైన్ కాకుండా వేరే ఏదో డిజైన్ తయారవుతుంది. పోనీ వేరే వాళ్ళనెవరినైనా ఇంట్లో ఉంచుదాం అంటే అది ఇంకా రిస్క్‌తో కూడుకున్న వ్యవహారం. అందుకే నేనే సెలవు పెట్టి ఇంట్లో ఉండటం తప్పనిసరి. అయితే మా ఇంట్లో ఉన్న షెల్ఫ్‌లన్నింటికీ వుడ్ వర్క్ చేయడానికి అతనికి మినిమం పది రోజులు పడుతుంది. వేరే ఏదైనా పని అయితే ఆలోచించేవాడిని కాదు కానీ ఇంత చిన్న కార్పెంటరీ పనికి పది రోజులు సెలవు పెట్టడానికి నాకు మనసొప్పడం లేదు. అందుకే నా భార్య ప్రపోజ్ చేసిన ఈ వర్క్ ఆర్డర్ని వెంటనే నేను ఎప్రూవ్ చేయడం లేదు.

●●●

నేన , నా భార్య ఇద్దరమూ ఆఫీసు పక్షులమే ! మేము ఆఫీసుకి సెలవు పెడితే ఈ భూభ్రమణం ఆగిపోవడం, అగ్ని పర్వతాలు బద్దలవ్వడం లాంటి వేమీ జరగవు, కానీ సెలవు పెట్టడం మాత్రం కుదరడం లేదు. ఎందుకంటే ఒకటి రెండు రోజుల సెలవుకే మా బాస్ అగ్గి మీద గుగ్గిలం అవుతాడు. నా భార్యది ఇప్పుడే కొత్తగా మొదలైన ప్రైవేట్ కంపెనీ. తనకి పది రోజుల సెలవు అనేది గగన కుసుమం. అందుకే ఈ విషయం మీద ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా దాటవేస్తూ వస్తున్నాము.అయితే ఈ కార్పెంటరీ పని చేయిస్తే మా ఇంటికి మరింత అందం వస్తుంది. ఎవరి నైనా ఇంటికి ఆహ్వానించడానికి, గొప్పగా చూపించు కోవడానికి బాగుంటుంది. అందుకే ఎప్పుడైనా వీలు కుదిరినప్పుడు పది రోజులు సెలవు పెట్టి ఈ పని చేయించాలి అని నిర్ణయించుకున్నాము.

సాయంకాలమైంది.

"డాడీ!" అంటూ మా అబ్బాయి స్కూల్ బస్ దిగి ఇంట్లోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. దగ్గర్లో ఉన్న ఇంగ్లీషు మీడియం స్కూల్లో రెండో క్లాసు చదువుతున్నాడు. స్కూల్ యూనిఫాంలో వాడి పోయిన పువ్వులా అలసి పోయి ఉన్నాడు. ఎత్తుకుని ముద్దు చేసాను. స్కూల్ అవగానే ట్యూషన్‌కి వెళ్ళి అక్కడి నుండి ఈ టైముకి వస్తాడు. వాడికి ట్యూషన్ చెప్పే తీరిక , ఓపిక మాకు లేవు. ఉన్న ఆ కాస్త ఓపికని డబ్బు సంపాదనకే ఉపయోగించాలి అన్న ఆలోచన మాది!

వాళ్ళ మమ్మీ కలిపి ఇచ్చిన కాంప్లాన్ త్రాగుతూ నా మీద ప్రశ్నల వర్షం కురిపించ సాగాడు మా అబ్బాయి. వాడికి స్కూల్‌లో కలిగిన సందేహాలన్నీ నా దగ్గర తీర్చుకుంటాడు. ఆ టైంలో నేను పెద్ద మేథావిలా మారిపోతాను. నాకు తెలియనివి కూడా తెలిసినట్టే చెబుతుంటాను, ఎందుకంటే మా అబ్బాయి తిరిగి నన్ను ప్రశ్నించలేడు కదా, అందులోనూ వినే వాడు అమాయకుడు అయితే చెప్పే వాడు మేథావి అవుతాడు అన్న సూక్తి ఎలాగూ ఉంది కదా !

"డాడీ ! అతిథి అంటే ఏంటి డాడీ? " ప్రశ్నించాడు. మా వాడిది ఇంగ్లీషు మీడియం స్కూల్. బహుశా ఈ తెలుగు పదం ఎవరో మాట్లాడుకుంటే విని ఉంటాడు.

"అతిథి అంటే ఇంగ్లీషు లో గెస్ట్" అని చెప్పాను.

"అదేంటి? అతిథి అంటే క్రిష్ణ గారి అబ్బాయి మహేష్ బాబు కదా" అమాయకంగా అడిగాడు

నా భార్య నవ్వుతూ "అతిథి అంటే మహేష్ బాబు కాదమ్మా! చెప్పా పెట్టకుండా మనింటికి చుట్టపు చూపుగా వచ్చే వాళ్ళని అథిది అంటారు" అంటూ వివరించింది.

"మరి మనింటికి ఎప్పుడూ అతిథి రాలేదేంటి ?" అమాయకంగా అడిగాడు వాడు

"డాడీ, నేనూ రోజూ పొద్దున్నే ఆఫీసులకి వెళిపోతాము, నువ్వేమో స్కూల్‌కి వెళిపోతావు, మరి అతిథి వస్తే అతన్ని ఎవరు చూసుకుంటారు ? అందుకే మనింటికి ఎవరూ అతిథి రారు" అంటూ చెప్పింది నా భార్య.

"ఆహా ! అలాగా ...ఓకే" అంటూ తుర్రున ఆడుకోవడానికి పారిపోయాడు మా అబ్బాయి. నేను నా భార్య వైపు చూసాను, తను చిన్నగా నవ్వుతోంది. మా అబ్బాయితో వచ్చిన చిక్కే ఇది. సందేహం వస్తే వదలడు. ఆ మధ్య స్కూల్ నుండి రాగానే ఏడవడం మొదలు పెట్టాడు.

'ఎందుకురా ఏడుస్తున్నావు?' అని అనునయంగా అడిగితే ' మా క్లాసు లో నా ఫ్రెండ్స్ అందరికీ లవర్‌లు ఉన్నారు. నాకే లేరు' అని సమాధానం ఇచ్చాడు. ఆశ్చర్యం వేసింది నాకు. ఇంత చిన్న వయసులో వాడికి లవర్ కావలసి వచ్చింది.

"అసలు లవర్ అంటే ఏంటి నాన్నా?" ప్రేమగా అడిగాను

"మగధీర సినిమాలో రాం చరణ్ కి కాజల్ లవర్ కదా" ఆ మాత్రం కూడా తెలీదా అన్నట్టు చెప్పాడు.

"ఓహో ! ఆ లవరా! ... నువ్వు బాగా చదువుకుని పెద్ద అవుతావు కదా అప్పుడు నీకు లవర్ ఉంటుంది...సరేనా" అని ఓదార్చాను.

"అప్పుడు నాకు గుర్రం కూడా ఉంటుందా? " అమాయకంగా అడిగాడు

" గుర్రం ఉంటుంది...హెలికాప్టర్ కూడా ఉంటుంది. " ప్రేమగా చెప్పాను. అంతటితో శాంతించాడు.

ఇంకో సారి - "పాలు తాగరా బాబూ" అంటూ నా భార్యా ,నేనూ మా వాడిని బతిమాలుతున్నాము.

"ఏంటి డాడీ ! రోజూ పాలు త్రాగమని వెంట పడతారు...పాలు శోభనం రోజు కదా త్రాగాలి " అన్నాడు. అదిరి పడ్డాము మేము.

"ఎవరు చెప్పార్రా నీకిది " కోపంగా అడిగాను

"టీవీలో చూసాను డాడీ ఒక సినిమాలో పెళ్ళి అవగానే శోభనం ఉంటుంది. ఆ రోజున ఆంటీ అంకుల్‌కి గ్లాసుతో పాలు ఇస్తుంది. అంకుల్ కొంచెం త్రాగాక ఆంటీ కూడా త్రాగుతుంది." అంటూ పెద్ద ఆరిందలా చెప్పాడు. నాకు అర్థమైంది- మా వాడికి

సినిమా నాలెడ్జ్ బాగా ఎక్కువైపోయిందని. వాడి వాగుడు వెనక ఈ సినిమాల ప్రభావం చాలా ఉందన్న మాట. ఇక లాభం లేదు. వీడు టీవీ చూడటాన్ని మేము కంట్రోల్ చెయ్యాలి అని నిశ్చయించుకున్నాము.

●●●

పొద్దున్నే ఆఫీసుకు వెళ్ళే హడావుడిలో ఉన్నాం మా దంపతులిద్దరం !.

సైకిల్ మీద హడావుడిగా వచ్చాడు శ్రీశైలం !. "సార్ ఏదో ఒకటి చెప్పండి. ఎక్కడా పనులు దొరక్క ఇబ్బందిగా ఉంది." అంటూ వాపోయాడు.

ఏం చెప్పాలో నాకు అర్థం కాలేదు. నేనే క్లియర్‌గా లేనప్పుడు అతనికి భరోసా ఎలా ఇవ్వగలను ?

" సరే ! చూద్దాంలే ! ఇలా ఊరికే వెంట పడకు...అవసరమైతే నేనే నీకు ఫోన్ చేస్తాను. " అని చెప్పి నా బైక్ ర్ట్ చేసుకుని ఆఫీసుకి వెళ్ళసాగాను. నేను రోజూ వెళ్ళే దారి కాబట్టి నా చేతులూ, కాళ్ళూ బైక్‌ని మెకానికల్‌గా నడుపుతున్నాయి. కానీ నా మనసు మాత్రం శ్రీశైలం గురించే ఆలోచించ సాగింది. అతడు చెప్పేది నిజమే ! రెక్కాడితే గాని డొక్కాడని బ్రతుకులు వాళ్ళవి. పని దొరికినప్పుడు ఒళ్ళు వంచి కష్టపడి పనిచేస్తారు. ఆ డబ్బులతో కుటుంబాన్ని వెళ్ళదీస్తారు. అది పూర్తవ్వగానే మళ్ళీ పని దొరికే వరకు ఖాళీ ! ఉంటే తింటారు, లేకపోతే లేదు. కులవృత్తిని నమ్ముకున్న సగటు మనిషి జీవితం అంతే కదా !

...ఇలా ఆలోచనల్లోనే విహరిస్తూ బైక్ నడుపుతున్నాను. ఇంతలో సడన్‌గా అత్యంత వేగంగా వస్తున్న ఒక లారీ నా ముందు ప్రత్యక్షమయింది. దాని నుండి తప్పించుకునే వ్యవధి కూడా నాకు దొరకలేదు. నేను తేరుకునే లోపు నా బైక్‌ను ఢీ కొట్టి వెళ్ళిపోయింది. ఎగిరి అవతల పడ్డాను. నా చుట్టూ పదిమంది గుమిగూడారు. నన్ను కొట్టిన లారీ ఆగకుండా వేగంగా వెళ్ళిపోయింది. కుడి కాలు విపరీతంగా నొప్పి. బహుశా విరిగిపోయిందేమో? గుంపులో నుండి ఎవరో ఒక వ్యక్తి నన్ను నెమ్మదిగా లేపి ఒక ఆటోని పిల్చి అందులో కూర్చో బెట్టాడు. ఇంకెవరో నా బైక్‌ని రోడ్‌కి ఒక ప్రక్కగా పార్క్ చేసి తాళం వేసి కీస్ నా చేతికిచ్చారు. నేను నిస్సత్తువగా ఆటోలో వాలిపోయాను. ఆటో అపోలో హాస్పటల్ వైపు దూసుకెళ్ళింది.

●●●

అపోలో హాస్పటల్ ఎమర్జెన్సీ వార్డ్‌లో బెడ్ మీద పడుకుని బాధతో మూలుగుతున్నాను. నా బెడ్ పక్కన నా భార్య, అబ్బాయి నిలబడి నన్ను జాలిగా చూస్తున్నారు. అంత వరకు నా కాలి ఎక్స్‌రేని పరిశీలనగా చూసిన డాక్టర్ నా దగ్గరికి వచ్చి "మేజర్‌గా దెబ్బ ఏమీ తగల లేదు. కొంచెం హెయిర్ లైన్ ఫ్రాక్చర్ ఉంది. సిమెంట్ పట్టీ వేస్తే బెటర్ !.ఇంట్లో నెలరోజులు రెస్ట్ తీసుకోవాలి. ఆఫీసుకి వెళ్ళ కూడదు, మెడికల్ లీవు పెట్టండి. దెబ్బ తగిలిన కాలు మీద ఎక్కువ బరువు పెట్ట కూడదు. జాగ్రత్తగా చూసుకోవాలి. లేకపోతే సరిగ్గా అతుక్కోదు" అని చెప్పి వాడాల్సిన మందులు అవీ స్లిప్ మీద వ్రాసి ఇచ్చాడు. మెడికల్ లీవు పెట్టడానికి కావాల్సిన రికమెండేషన్ కూడా దాంట్లో వ్రాసాడు. అవన్నీ తీసుకుని, వీల్ చైర్‌లో పక్క రూములోనికి వెళ్ళాను. అక్కడ ఉన్న జూనియర్ డాక్టర్ నా కాలుని బాగా పరిశీలించి, స్లిప్‌లో పెద్ద డాక్టర్ వ్రాసిన విషయం చదివి నా కాలికి సిమెంట్ పట్టీ వేసాడు.

హాస్పటల్ నుండి బయటపడి ఆటో ఎక్కి మా ఇంటి వైపు వెళ్ళసాగాను. ఎందుకో నాకు చాలా సంతోషంగా అనిపించింది. ఏక్సిడెంట్ జరిగితే బాధ పడకుండా సంతోషపడతాడేంటని ఆశ్చర్యపోతున్నారా? చెబుతాను, వినండి. ఆఫీసుకి ఒక్క రోజు సెలవు పెట్టాలంటే బాస్‌కి సవా లక్ష కహానీలు చెప్పాలి. అలాగని సెలవు పెట్టి ఇంటి పనులు చూసుకుంటున్నా కూడా ఆఫీసులో ఏం జరుగుతుందో అని మనసు నిండా టెన్షనే ! ఇప్పుడు ఆ బాధ లేదు. హాయిగా ఇంట్లో ఉండవచ్చు. జెన్యూన్‌గా సిక్ లీవు పెట్టాం

కాబట్టి మనల్ని ఎవరూ డిస్టర్బ్ చెయ్యరు. సడెన్‌గా 'శ్రీశైలం' గుర్తొచ్చాడు. అతడి కుటుంబ పరిస్థితి గుర్తొచ్చింది. 'పని ఇవ్వండి సార్' అంటూ అతడు నా వెంట పడటం గుర్తొచ్చింది. ఇప్పుడు ఫర్వాలేదు, నేనెలాగూ నెల రోజులు ఇంటి పట్టున ఉంటాను కాబట్టి అతడికి పని పురమాయించొచ్చు. ఏంటో ఈ విచిత్రం. ఎక్కువ రోజులు 'సెలవు' దొరకడం లేదు అని నేను వర్రీ అవుతుంటే ఆ భగవంతుడే ఈ ఏక్సిడెంట్ రూపంలో అవకాశం కల్పించాడని అర్థమైంది. పైగా దీనివలన శ్రీశైలం లాంటి వ్యక్తికి 'భృతి' దొరికుతుంది. ఒకరి సమస్య ఇంకొకరికి జీవనాధారం కల్పిస్తుంది అంటే ఇదేనేమో !. ఈ సృష్టి లోని జీవన మర్మం అర్థమైంది. అందుకే నాకు అంత సంతోషం! ఇంటి ముందు ఆటో దిగుతూ శ్రీశైలంకి ఫోన్ చేయడానికి జేబులో నుండి సెల్ ఫోన్ బయటకు తీసాను.

●●●

# ఫోటో

**మాధవ్ దుర్భా**

## తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (టాన్‌టెక్స్) నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతి పొందిన కథ

**ఫోటోకి చెదలు బాగా పట్టేసాయి.** అందులో అమ్మాయి కనబడడంలేదు. కానీ అతడ్ని చూస్తూ అలాగే ఉండిపోయాడు సుమన్. మనిషిని పోలిన మనుషులు ఉంటారని విన్నాడు గానీ. చూడడం మాత్రం ఇదే. ఎంతపోలిక?

"ఎక్కడ్నించి వచ్చింది ఈ ఫోటో?" అన్నాడు కుమార్‌తో.

"కిరణ్ తాతగారు పోయారు కదా! ఆయన జ్ఞాపకంగా ఆయన వ్రాసిన కవితల పుస్తకం తెచ్చుకుంది తను. పుస్తకం మధ్యలో దొరికిందీ ఫోటో. అచ్చం నీలాగే ఉన్నాడని చూపించడానికి తెచ్చాను" అన్నాడు కుమార్.

కిరణ్మయి కుమార్ భార్య. వాళ్ళ తాతగారు మూడు వారాల క్రితమే పోయారు. దూరపు చుట్టరికం అయినా కిరణ్‌కి ఆయనంటే ఎంతో అభిమానం. ఫోటో కేసి పరీక్షగా చూశాడు సుమన్. "విజయా ఫోటో స్టూడియో. కోట గుమ్మం సెంటర్, పిఠాపురం" అని వ్రాసి ఉంది. పిఠాపురంలో తన బంధువులు ఎవరూ లేరు. సుమన్ పుట్టి పెరిగింది గుంటూరులో. అమ్మ, నాన్న వాళ్ళ పూర్వీకులంతా గుంటూరు, తెనాలి ప్రాంతం వాళ్ళే.

"నేనీ ఫోటో నాతో తీసుకెళ్ళొచ్చా?" అడిగాడు సుమన్. సరేనన్నాడు కుమార్.

●●●

"చాలా ఆశ్చర్యంగ ఉందిరా! మనవాళ్ళు ఎవరూ కూడా పిఠాపురం వైపు నుంచి వచ్చిన వాళ్ళు లేరు. కానీ ఇతనెవరో అచ్చం నీలాగే ఉన్నాడు. నువ్వేనంటే నమ్మదగ్గట్టుగా ఉంది. ఫోటో చూస్తూంటే మాత్రం చాలా సంవత్సరాల క్రితం తీసినట్లుంది" అంది అమ్మ.

రాత్రి పడుకున్నాడు గానీ సుమన్‌కి నిద్రపట్టలేదు. తెల్లారుఝామున నాలుగ్గంటలకి లేచి రెడీ అవుతూంటే అమ్మ లేచి వచ్చి "ఏవిట్రా పొద్దుటే హడావుడి" అని అడిగింది.

"పిఠాపురం వెడుతున్నానమ్మా. ఎలాగూ ఇవాళ, రేపు సెలవు కదా! ఈ ఫోటోలో వ్యక్తి ఎవరా అని తెలుసుకోవలనుంది" అంటున్న సుమన్‌తో

"అదేమిట్రా! లేడికి లేచిందే పరుగులాగా? అసలే ముక్కూ మొహం తెలీని ఊరు. అందులో ఒక్కడివే కారులో అన్ని గంటలు. పోనీ నేను కూడా రానా" అంది.

"లేదమ్మా! నేనేమన్నా చిన్నపిల్లాడినా? ఇరవై ఎనిమిదేళ్ళు రాలేదు?" అని కారు బయల్దేరదీసాడు.

●●●

విజయవాడ 80 కి.మీ...

మైలు రాయి చూస్తూ ఆవులించాడు సుమన్. కాస్త నిద్రమత్తుగా ఉంది. రోడ్డు పక్క ఉన్న టిఫిన్ సెంటర్ ముందు కార్ పార్క్ చేసి టిఫిన్ తిందామని కూర్చున్నాడు. ఇడ్లీ, కాఫీ ఆర్డర్ చేసి ఆలోచనలో పడ్డాడు. కిరణ్మయి తాతగారికి తనంటే విపరీతమైన అభిమానం. "మా మనవడు" అని అనేవారు. తీరిక వేళల్లో కవిత్వం వ్రాయడం అలవాటు తాతగారికి.

ఆయనకి దైవభక్తి. ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. తనేమో దేవుళ్ళు, దెయ్యాలూ అనేవాటిని నమ్మడు. మానవమాత్రులకి అంతుపట్టని ఒక అతీత శక్తి మనని నడిపిస్తుందనేవారు తాతగారు. దానికి వ్యతిరేకంగా తను వాదించేవాడు. తాతగారు పోయారని తెలిసినపుడు చాలా బాధపడ్డాడు తను. ఆ సమయానికి ఆఫీసు పని మీద సింగపూర్ వెళ్ళడంతో ఆయన అంత్యక్రియలకి రాలేకపోయాడు తను.

తాతగారిని గుర్తుచేసుకుంటూ జేబులోని ఫొటో బయటకి తీసి చూసాడు సుమన్. తాతగారికి ఈ ఫోటో ఎలా వచ్చింది? నన్ను పోలిన మనిషి మరొకరు ఉన్నట్లు ఎప్పుడూ నాతో మాటమాత్రం అనలేదు. అనుకుంటూ ఫోటో జేబులో పెట్టుకోబోతూ ఏదో గమనించి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు.

తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు. మరోసారి ఫోటో కేసి చూశాడు. "ఓ మైగాడ్!" అని గట్టిగా అరిచి కారు వైపు పరిగెత్తాడు.

"సార్! సార్! మీ టిఫిన్" అని అప్పుడే టిఫిన్ తెస్తున్న వెయిటర్ మాట లెక్కచేయకుండా. కారు స్టార్ట్ చేసి వేగం పెంచాడు. రోడ్డుమీద ట్రాఫిక్‌ని. చేతిలోని ఫోటోని మార్చి మార్చి చూస్తూ. సందేహం లేదు. నిన్న చూసినపుడు ఫోటోలో కాలెండర్ లేదు. ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. జూన్ 2, 1984.. ఇవాళ్టికి సరిగ్గా ఇరవై ఎనిమిది సంవత్సరాల క్రితం. ఇదే రోజు. ఇంతవరకూ లేని కాలెండరు హఠాత్తుగా ఇప్పుడిలా. చాలా ఆశ్చర్యమేసింది సుమన్‌కి. ఈ పజిల్‌కి సమాధానం పిఠాపురంలోనే దొరుకుతుంది. అనుకుంటూ కారు వేగం పెంచాడు.

●●●

కోటగుమ్మం సెంటరు బాగా రద్దీగా ఉంది. రోడ్ల మీద కార్లు. స్కూటర్లు, బస్సులు. ఇసకేస్తే రాలని జనం. సూర్యుడు నడినెత్తికెక్కాడు. కార్ పార్క్ చేసి విజయా ఫోటో స్టూడియో కోసం వెతకడం ప్రారంభించాడు సుమన్. ఆ పేరుతో ఏ స్టూడియో లేదని చాలామంది చెప్పారు.

నిరాశగా కారు దగ్గరకి వచ్చి ఆలోచిస్తూ నిల్చున్నాడు.

"హలో! విజయా ఫోటో స్టూడియో కోసం వెతుకుతున్నారా?" అన్న మాటలకి ఈ లోకంలోకి వచ్చాడు.

తెల్లగా, పొడుగ్గా నింగి నుంచి దిగివచ్చిన దేవకన్యలా ఉన్న ఆమెను చూసి ఒక్క క్షణం శిలలా నిలబడిపోయాడు.

"మీరు.." అన్నాడు సందేహంగా.

"నా పేరు నిశిగంధ" ఆమె సమాధానం.

"నేను విజయా స్టూడియో గురించి వెతుకుతున్నట్లు మీకెలా తెలుసు?"

"ఇప్పుడే ఆ షాప్‌లో అడుగుతుంటే విన్నాను"

"మీకు విజయా ఫోటో స్టూడియో ఎక్కడుందో తెలుసా?" సుమన్ అడిగిన ప్రశ్నకి.

"ఇంతకీ మీకు ఆ స్టూడియోతో పనేమిటి?" అంది ఆమె.

"ప్రశ్నకి ప్రశ్నతోనే సమాధానం చెబుతున్నారే?" ఆమెతో అలా మాట్లాడుతూనే ఉండాలని ఉంది సుమన్‌కి.

వీణ మీటినట్లుంది ఆమె గొంతు.

"మరి ఇరవై ఎనిమిది సంవత్సరాల క్రితం మూతబడ్డ స్టూడియోని ఇన్నేళ్ళ తర్వాత వెతుక్కు వచ్చారే!" నిశిగంధ సమాధనం.

స్టూడియో మూతబడి ఇరవై ఎనిమిదేళ్ళయిందా?... మళ్ళీ ఆలోచనలో సుమన్.

"నన్ను ఫాలో అవ్వండి. నిదానంగా మా ఇంటికి వెళ్ళి మాట్లాడుకుందాం" అని తన స్కూటర్ స్టార్ట్ చేసిన ఆమె వెనక కారు బయల్దేరదీసాడు సుమన్. ఒక గుడిముందు ఆగిందామె.

"ఇది కుక్కుటేశ్వర స్వామి ఆలయం. మా పిఠాపురంలో చాలా ప్రసిద్ధి. రండి దర్శనం చేసుకుని వెడదాం" అంది.

"మీరు వెళ్ళి రండి.. నేను వెయిట్ చేస్తాను" సుమన్ సమాధానం.

"ఓ.. నాస్తికులా?"

కొంచెం మొహమాటంగా తలూపాడు.

"సరే మా గుడిలో ఆర్కిటెక్చర్‌ని చూసి ఆనందిద్దురుగాని రండి. హైదరాబాదు నుంచి వచ్చారు కదా మరి?"

"అరే.. నేను హైదరాబాద్ నుంచి వచ్చినట్లు మీకెలా తెలుసు?"

"మీ కారుమీద డీలర్ స్టిక్కర్ చూసి గెస్ చేసాను"

"మీకు సెన్సాఫ్ అబ్జర్వేషన్ బాగా ఉందే"

చిన్నగా నవ్వి ముందుకి నడిచిందామె. ఎంత అందంగా ఉంది ఆ నవ్వు? ఆ నవ్వు చూస్తూ ఎన్ని యుగాలైన గడిపెయ్యవచ్చు కదా?! దర్శనమై బైటకొచ్చి సంభాషణ కొనసాగించారు. మాటల్లో ఆమె కాకినాడలో మెడిసన్ చదివి అక్కడే ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది. గుడిలోంచి బైటకొచ్చి మళ్ళీ కారులో ఆమెను ఫాలో చేసాడు సుమన్. అందానికి అందం. తెలివికి తెలివి. చక్కటి వాక్చాతుర్యం ఉన్న నిశిగంధ తొలికలయికలోనే తనను ఆకట్టుకుంది.

●●●

రెండతస్థుల మేడ. చుట్టూ పెద్దగోడ. ఇంటి ముందు కార్ పార్క్ చేసి మళ్ళీ జేబులోంచి ఫోటో తీసాడు. ఫోటోలోని అమ్మాయి చేతులు స్పష్టంగా కనిపిస్తున్నాయిప్పుడు. ఇదంతా కలా. నిజమా అని తనని తను గిల్లి చూసుకున్నాడు. నిజమే. రాను రాను ఫోటోలో స్పష్టత పెరుగుతోంది. గేటు తెరిచి నిశిగంధ "రండి సుమన్! అని ఆహ్వానించింది.

ముందు పెద్ద అరుగు. అరుగుమీద పడక్కుర్చీలో సుమారు అరవై సంవత్సరాల వయసున్న వ్యక్తి పడుకుని విసనక్రర్రతో విసురుకుంటున్నాడు. కారు శబ్దానికి లేచి కూర్చున్నాడు.

"నాన్నా వీరు సుమన్" అని పరిచయం చేసింది.

సుమన్ తను హైదరాబాద్ నుంచ్చి వచ్చినట్లు చెప్పి కిరణ్మయి తాతగారి పుస్తకంలో ఫోటో గురించి చెప్పాడు. ఆ ఫోటోలోని వ్యక్తి తనలా ఉండడంతో వివరాలు తెలుసుకుందామని పిఠాపురం వచ్చినట్లు చెప్పాడు. కానీ ఆ ఫోటోలో వస్తున్న పరిణామం గురించి మాత్రం ప్రస్తావించలేదు.

అంతా విని "ప్రయాణం చేసి బాగా అలసిపోయినట్లున్నావ్. ముందర ఏమన్నా తిని తర్వాత మాట్లాడుదువుగాని" అని ఆహ్వానించి "ఏవమ్మోయ్ భోజనాలు సిద్ధం చెయ్" అని ఇంట్లోకి ఓ కేక పెట్టారు నిశి నాన్నగారు.

బాగా ఆకలిగా ఉండడంతో సుమన్ కూడా నిశి తల్లితండ్రులకి ధన్యవాదాలు చెప్పి భోజనం ముగించాడు. చేతులు కడుక్కుని కూర్చుని జేబులోని ఫోటో తీసి నిశి నాన్నగారికి చూపించాడు సుమన్.

"ఈ విజయా ఫోటో స్టూడియో నాదే". నిశి నాన్నగారి మాటకి ఉలిక్కిపడి నిశి వైపు చూసాడు సుమన్. ఇప్పుడర్థమైంది తను వాళ్ళ నాన్నగారి వద్దకెందుకు తెచ్చిందో.

సుమన్ దగ్గర ఫోటో తీసుకుని పరిశీలనగా చూస్తూ

"ఔనోయ్ అచ్చం నీలానే ఉన్నాడు. ఇది మా స్టూడియోలో తీసిందే సందేహం లేదు. కానీ ఇతనెవరో నాకు తెలీదు. పిఠాపురం గుడులూ, గోపురాలకి చాలా ప్రసిద్ధి. వేరే ఊళ్ళవారు బోలెడు మంది వస్తూ వెడుతూ ఉంటారు" అంటూనే ఫోటోలోని కేలెండర్ మీద తేదీ చూసి ఒక్క క్షణం షాక్ అయ్యారాయన. ఆయన ముఖం పాలిపోయింది.

"జూన్ 2, 1984.. ఒక కొత్త జంట వచ్చారు ఫోటో తీయించుకోడానికి. ఆ సమయంలో నేను లేను. నా అసిస్టెంట్ ఉన్నాడు. వాళ్ళకి తోడుగా వచ్చిన స్నేహితుల మాటలు బట్టి అర్థమైంది వాళ్ళు వాళ్ళ పెద్దలకి వ్యతిరేకంగా పెళ్ళి చేసుకున్నారని. నాకా రోజు బాగా గుర్తు. స్టూడియోలో అగ్ని ప్రమాదం జరిగింది. అందరూ బైటపడ్డారు గానీ ఆ జంట కాళ్ళ పారాణి ఆరకుండానే ఆ మంటలకి బలైపోయారు. బహుశా ఈ ఫోటోలో అబ్బాయి ఆ పెళ్ళికొడుకు కావచ్చేమో" అన్నారాయన కళ్ళు వత్తుకుంటూ.

ఆయనకి ధన్యవాదాలు చెబుతూ లేచాడు సుమన్.

బయల్దేరబోతున్నవాడు వెనక్కి తిరిగి "ఇంకొక ప్రశ్న. ఆ ఫోటోలో అమ్మాయి ఎవరో తెలుసా?" అన్నాడు.

"తెలీదు బాబూ! ఆ ఫోటో అగ్నిప్రమాదంలో దగ్ధమవకుండా ఉండడమే విశేషం. ఇందాకన్నట్లు ఆ రోజు నేను స్టూడియోలో లేను" అన్నారాయన.

సాగపంపడానికి గేటు దగ్గర కొచ్చింది నిశిగంధ. ఎందుకో తనని వదిలి వెళ్ళాలని లేదు సుమన్‌కి. నిశి కూడా సుమన్‌తో "డిన్నర్ చేసి వెళ్ళవచ్చు కదా?" అంది.

"లేదండీ! అమ్మ ఎదురుచూస్తూ ఉంటుంది. ఇప్పుడు బయల్దేరితే రేపుదయం లోపు హైదరాబాద్ చేరవచ్చు" అన్నాడు.

"మళ్ళీ మా పిఠాపురం వస్తారా?"

"మీ కుక్కుటేశ్వరస్వామి దయతలిస్తే తప్పకుండా త్వరలోనే వస్తాను".. నాస్తికుడైన తన నోటి నుంచి ఆ మాట రావడం ఆశ్చర్యమనిపించింది సుమన్‌కి.

తన కారు వీధి మలుపు తిరిగే వరకూ గుమ్మం వద్ద నిలబడి తన దిశగా చూస్తున్న నిశిని రేర్ వ్యూ మిర్రర్‌లో గమనించాడు సుమన్.

●●●

హైదరాబాద్ వెళ్ళే దారంతా ఆ రోజు సంఘటనలు గుర్తు తెచ్చుకుంటున్నాడు. ఆలోచిస్తున్న కొద్దీ మనసంతా ఎన్నో ప్రశ్నలు. మరో పక్క నిశిగంధ రూపం కళ్ళముందు కదలాడుతోంది. అలా డ్రైవ్ చేస్తూ ఆలోచిస్తుండగా ఈ పజిల్‌కి సమాధానం ఆ ఫోటో దొరికిన పుస్తకంలో ఉందనిపించింది. కారు వేగం పెంచాడు సుమన్.

●●●

"ఏమిటి సుమన్ ఈ టైంలో?" కళ్ళు నులుముకుంటూ అడిగాడు కుమార్. వెనకాలే కిరణ్మయి కూడా లేచి వచ్చింది.

"సారీ! అర్థరాత్రి తలుపు కొట్టినందుకు. ఒక్కసారి కిరణ్మయి తాతగారి కవితల పుస్తకం చూడాలి" అన్నాడు సుమన్.

కిరణ్మయి వెంటనే పైకెళ్ళి పుస్తకం తెచ్చి సుమన్‌కి ఇచ్చింది. పుస్తకం తెరవగానే మొదటి పేజీలో:

"నా ఏకైక పుత్రుడు గోవింద్ (ఏప్రిల్ 16, 1956 - జూన్ 2, 1984)కు అశ్రుధారలతో అంకితం:

అని వ్రాసి ఉంది. జేబులోంచి ఫోటో తీసి చూసాడు సుమన్. ఇప్పుడు స్పష్టంగా ఉంది ఫోటో. అచ్చం తనలా ఉన్న గోవింద్. పక్కనే అచ్చం నిశిగంధలా ఉన్న గోవింద్ భార్య. పుస్తకంలో ఓ పేజీ తిప్పాడు సుమన్. అక్కడ ఇలా వ్రాసి ఉంది..

**కంట పడని విద్యుత్తే కాంతి మనకి అందించును**
**కనిపించని శక్తి నీకు దారి చూపి నడిపించును**
**తర్కానికి తావీయని వింత నీకు అగుపించును**
**చేతిలోని చిత్రపటం శుభలేఖలు దిద్దుకొనును**

తనకి దారి చూపిన మానవాతీత శక్తికి ధన్యవాదాలు తెలుపుకుంటూ ముందుకి నడిచాడు సుమన్.

●●●

# అమ్మా..నువ్వెప్పుడొస్తావు? సీతాసత్య

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**"అత్తయ్యగారేరీ?" అంది లహరి, గుమ్మం** బయట చెప్పులు విడిచి మొహం వ్రేళ్ళాడేసుకుని ఇంట్లోకి అడుగుపెట్టిన ఆదిత్యను ఉద్దేశించి.

ఆమె వైపు ఓసారి చూసి, "రానంది లహరీ.. తనక్కడే ఉంటానంది" అన్నాడు ఆదిత్య. అతడి కంఠంలో ధ్వనించిన అసహాయతా, దీనత్వం ఆమెను కలవరపెట్టాయి.

"అదేం? అయినా అక్కడ ఎవరున్నారని? మావయ్యగారున్నప్పుడైతే ఆయన కోసం ఉండిపోయార్లే అని సరిపెట్టుకోవచ్చు. పెద్ద వయసులో ఆవిడకేదైనా తేడాచేస్తే చూసేవారెవరున్నారక్కడ? పిల్లలు కూడా ఉదయం స్కూల్‌కు వెళ్ళేటప్పుడు 'అమ్మా.. మేం స్కూల్

నుంచి తిరిగొచ్చేసరికి నాన్నగారు బామ్మను తీసుకొచ్చేస్తారు కదా!' అంటూ సంబరంగా వెళ్ళారు. అత్తయ్యగారికిక్కడ ఇబ్బందిగా ఉండకూడదని ప్రత్యేకంగా గది కేటాయించి కావల్సిన ఏర్పాట్లన్నీ చేశానాగదిలో" తనతో తాను చెప్పుకుంటున్నట్టుగా ఉంది లహరి బాధగా.

"నిజమే లహరీ! అన్నివిధాలా చెప్పి చూశాను. నేనెన్నిసార్లు ఎన్నివిధాల చెప్పినా తను చివరికి 'ఈ కట్టె ఇక్కడే కాలిపోనివ్వరా అబ్బాయ్!' అనే సమాధానం చెప్పింది.

అక్కడ మన ఇరుగుపొరుగు వాళ్ళుకూడా 'ఈ వయసులో నీ వంట నువ్వు వండుకుంటూ, తుమ్ముతూ, దగ్గుతూ ఇక్కడెందుకుంటావు? హాయిగా కొడుకు దగ్గరకెళ్ళి, మనవళ్ళ ఆలనా పాలనా చూసుకుంటూ కోడలితో సేవ చేయించుకుంటూ సుఖంగా ఉండమని పలువిధాల చెప్పి చూశారు.

'నా కొడుకు సాక్షాత్తూ శ్రీరామచంద్రుడే! కోడలు సీతాదేవికి మారు రూపం. నా మనవలు బంగారు బొమ్మలే! కాలు క్రిందపెట్టకుండా చూసుకుంటారు నన్నందరూ. అయినా సరే నాకిక్కడే ఉండాలని ఉంది. వయసైపోయిందని మిమ్మల్నెవర్నీ ఇబ్బందిపెట్టను లెండి' అంది అమ్మవారందరితో. కన్నకొడుకునై ఉండి నేనే అమ్మను ఒప్పించలేకపోయినప్పుడు బయటివాళ్ళు ఎంతకని తనకు నచ్చచెప్పగలరు?" అన్నాడు ఆదిత్య బాధగా.

ఆ విషయం ఇంకా పొడిగిస్తే అసలే దిగులుగా ఉన్న మనిషి మరింత బెంబేలు పడిపోతాడని, "అత్తయ్యగారు రాకపోవడం మన దురదృష్టం. ప్రస్తుతానికి ఊరుకుని కొన్నిరోజులు పోయాక ప్రయత్నించి చూద్దాం. అప్పటికి అత్తయ్యగారి ఆలోచనలో మార్పు రావచ్చు. సాయంత్రం పిల్లలు స్కూల్ నుంచి వచ్చేసరికి ఏదో కోల్పోయినవాళ్ళలా ఇలా మొహాలు దీనంగా పెట్టుకుని ఉంటే వాళ్ళకు నచ్చచెప్పడం కష్టం!" అంటూ భర్తను అనునయించింది లహరి.

●●●

**"కన్నా..**

ఎలా ఉన్నావు? కోడలూ, మనవలూ అంతా కుశలమని తలుస్తాను. పిల్లలు బుద్ధిగా బడికి వెళ్తున్నారా? నా పిచ్చిగానీ. వాళ్ళు నా మనవలు. వాళ్ళుగాక ఇంకెవరు బుద్ధిగా చదువుకుంటారు? లహరి ఎలా ఉంది? పాపం పిచ్చిపిల్ల నేనంటే ఎంతో ఆపేక్షదానికి. అక్కడికి రానని, నేనిక్కడే ఉంటానని తెలిసి ఎంత బాధపడిందో! తన్నెలా సముదాయించావో పాపం.

మనవలు నాకోసం బెంగపెట్టుకోలేదు కదా! రోజుకో కొత్త కథ చెపితేనే కానీ ఒహాపట్టాన నిద్రపోరు వెర్రి కూనలు. క్రిందటినెల నేనక్కడ పదిరోజులున్నప్పుడు బాగా మాలిమి అయ్యారు నాకు.

బడినుండి ఇంటికొచ్చాక వాళ్ళను ఇంట్లోనే బంధించేయకుండా బయట తిరిగి ఆడుకోనివ్వండి. ఆ కాస్త సమయమూ చదువుకు దూరమైనంత మాత్రాన వాళ్ళేమీ వెనుకబడిపోరు.

చిన్నప్పుడు నీకు గుర్తుందిగా! నువ్వు బయటికెళ్ళి ఆడుకుంటానంటే నాన్నగారు ఒప్పుకునేవారు కాదు. ఏదో విధంగా ఆయన్ని మాయచేసి నిన్ను పిల్లలతో ఆడుకుందుకు బయటకు పంపించేదాన్ని. అప్పుడు నీ కళ్ళలో ఎంత ఆనందమో! పిల్లలంతా అంతే కన్నా.

ఆటలూ, కథలూ వాళ్ళ మానసిక వికాసానికెంతో దోహదం చేస్తాయి. గంటల తరబడి పుస్తకాలు ముందేసుకుని కూర్చుని చదివినా అర్థంకాని విషయాలు కాస్సేపు వాళ్ళకు నచ్చిన పనులు, వ్యాపకాలు చేసినతర్వాత తక్కువ సేపే చదివినా మనసుకు గాఢంగా హత్తుకుంటాయి.

పిల్లల్ని చదువు విషయంలో మరీ కట్టడి చేయవద్దని లహరికి నా మాటగా చెప్పు. వాళ్ళ తరగతి పిల్లలతో పోల్చి తక్కువ మార్కులు వచ్చాయని ఎప్పుడూ నిలదీయకండి. వాళ్ళు పట్టుదలగా చదవాలనే మంచి ఉద్దేశ్యంతోనే మనం ఆ పని చేసినా ఆ పసి మనసులు తీవ్రంగా గాయపడతాయి.

'ఎంత కష్టపడి చదివినా ఈ అమ్మా నాన్నలెప్పుడూ ఇంతే!' అని నిరాశ చెందుతారు. ఒకసారి ఆ భావన వాళ్ళ మనసుల్లోకి ప్రవేశిస్తే తర్వాత మనం ఎన్నిసార్లు ఎంత అనునయంగా వాళ్ళకు నచ్చచెప్పినా వాళ్ళు మామూలుగా కాలేరు. పొరపాటున కూడా ఆ పరిస్థితి రానీయకండి.

నీకు జిహ్వాచాపల్యం ఎక్కువ. తినడానికి రోజూ ఏదో ఒక కొత్త తినుబండారం ఉండాలి నీకు. ఈ విషయంలో మీ నాన్నగారి పోలికే వచ్చింది నీకు. రోజూ ఏదో ఒకటి చెయ్యమని లహరిని ఇబ్బంది పెట్టకు. అసలే అర్భకపు పిల్ల. నువ్వెక్కడ నొచ్చుకుంటావోనని ఒంట్లో ఓపిక ఉన్నాలేకపోయినా నిన్ను మెప్పించేందుకు ఏదో ఒకటి చేస్తూ ఎప్పుడూ ఏదో ఒక పనిలో వంటింట్లో సతమతమౌతూ ఉంటుంది.

ఎదుటివారికి సేవచేయటం తప్ప తనంతట తానుగా ఎవర్నీ అడగదు పిచ్చిపిల్ల. తను అడక్కపోయినా తన మనసెరిగి, అవసరాలు గుర్తించి ప్రవర్తిస్తూ ఉండు. నెలకోసారైనా బయటకు వెళ్ళిరండి. సినిమా చూడ్డం ఇష్టంలేకపోతే పార్కుకో, దేవాలయానికో, బీచ్‌కో వెళ్ళిరండి.

తనకు కనీసం రెండు నెలలకోసారైనా కొత్త చీర కొను. నీకేం బట్టలు కావాలో ఎటువంటివి కావాలో లహరికి తెలిసినట్టు నీకు తెలియదు కనుక ఆ బాధ్యత లహరి మీదే ఉంచు. అవసరాన్నిబట్టి నీ ఒంటికి బాగుండే బట్టలే చక్కగా ఎంపిక చేసి కొంటుంది.

తను చేసే వంటకాలకు పేర్లు పెట్టి తనను కించపరచకు. తను చాలా ఎంత బాగా వంటచేసేవారికైనా ఒకోసారి అటూ ఇటూ అవుతూంటుంది. తను చాలా సున్నితంగా పెరిగిన పిల్ల. చిన్నమాటన్నా తట్టుకోలేదు. నేనక్కడున్నప్పుడు ఓ రోజు తను కాఫీలో ఎక్కువ చక్కెర వేసినందుకు నువ్వు చిరుబురులాడినపుడు తానెంత మనసు కష్టపెట్టుకుందో నేను కళ్ళారా చూశాను.

కలకంఠి కంట కన్నీరొలికిన ఇంట్లో సిరిసంపదలు, సుఖసంతోషాలు ఉండవుకన్నా! తల్లిదండ్రుల సంరక్షణలో అల్లారు ముద్దుగా పెరిగిన పసిపిల్ల పెద్దదై తనకంటూ ఒక వ్యక్తిత్వాన్ని సంతరించుకుని ఎన్నో కలలతో, ఆశలతో తనంతవరకూ ఎన్నడూ చూడని, తనకేనాడూ పరిచయంలేని, పూర్తిగా తనకు కొత్తవాడైన ఒక మగవాడితో తన భావిజీవితాన్ని పంచుకుని సుఖసంతోషాలతో జీవనం గడపాలని వచ్చే వ్యక్తే నాన్నా.. భార్యంటే.

తల్లిదండ్రుల్ని మరపించేలా భర్త తనను చూసుకున్నప్పుడు అతడికి మనసా, వాచా పూర్తిగా దాసోహమైపోతుంది ఏ భార్య అయినా. భార్య భర్తకు, భర్త భార్యకూ దాసోహం కావడం అంటే ఒకరికి మరొకరు లొంగిపోయినట్టని అర్థం కాదు. ఎదుటివారి అభిప్రాయాల్ని మన్నించి గౌరవించే మనసు మనకుందని ఎదుటివారికి తెలియచెప్పే ప్రక్రియ అది.

ఎదుటివారు ఒకసారి ఆ విషయాన్ని కేవలం తమ మాటల ద్వారా కాక చర్యలద్వారా తేటతెల్లం చేసినపుడు ఎటువంటి మనస్తత్వం ఉన్న జీవిత భాగస్వామిలోనైనా పునరాలోచన ప్రారంభమౌతుంది. ఒకవేళ అప్పటివరకూ వారి ఆలోచనలూ భావాలు వ్యతిరేక ధోరణిలో ఉన్నప్పటికీ.

భార్యాభర్తలు ఇద్దరూ ఒకసారి ఆ స్థితికి చేరుకున్నాక వారి జీవన గమనం పూలబాట మీద నడకే అవుతుంది. ఇవన్నీ నీకూ, లహరికీ తెలియవని కాదు. కానీ మనకు తెలిసిన, నచ్చిన విషయాలే మరొకరి ద్వారా, ఇంకా చెప్పాలంటే మనం ఇష్టపడే వ్యక్తిద్వారా మరోసారి తెలుసుకున్నప్పుడు మన అభిప్రాయాలూ, భావాలూ మరింత బలపడతాయి. ఇప్పుడే కరెంట్ పోయింది. కొవ్వొత్తి వెలిగించి ఈ

చివరి వాక్యాలు వ్రాస్తున్నాను. ఇహ ఉంటాను కన్నా. మరోసారి వీలు చూసుకుని రాస్తాను. నేను బానే ఉన్నాను. నా గురించి దిగులుపడకండి. మీ ఆరోగ్యాలూ, పిల్లల ఆరోగ్యాలూ జాగ్రత్త. ఉండనా మరి.

మీ అమ్మ'

ఉత్తరం చదవటం పూర్తిచేసి భార్య చేతికి అందించి, ఆమె చేతిలోంచి కాఫీగ్లాసు అందుకుని బయటకు నడిచి వరండాలో ఉన్న వాలుకుర్చీలో కూర్చుని కాఫీగ్లాసును పక్కనే ఉన్న బల్లమీద ఉంచి కుర్చీలో వెనక్కి వాలి కళ్ళుమూసుకున్నాడు ఆదిత్య.

తమ భావిజీవితం గురించి నిరంతరం తపనపడే తల్లిరాసిన ఉత్తరంలోని ప్రతి పదమూ అతడికి భూతకాలాన్ని గుర్తుచేసింది.

●●●

"ఎన్నిసార్లు చెప్పాలి నీకు. టిఫిన్ చల్లారిపోతే నాకు నచ్చదని.?" ఇల్లెగిరిపోయేలా అరుస్తూ విశాలాక్షి తన ముందుంచిన పళ్ళాన్ని విసురుగా తోసేస్తూ కాలితో నేలను గట్టిగా తన్ని కుర్చీలోంచి లేచాడు శంకరం.

స్కూల్‌కు వెళ్ళేందుకు పుస్తకాలు, టిఫిన్ డబ్బా, నీళ్ళ సీసా, అన్నీసర్దుకుని కాళ్ళకు సాక్స్ తొడుక్కోబోతున్న ఆదిత్య ఉలిక్కిపడ్డాడు తండ్రి గొంతువిని.

డైనింగ్ టేబుల్ మీద అమ్మ టిఫిన్ పెట్టి పదినిముషాలైంది. ఈ పదినిముషాల్లోనూ అమ్మ కనీసం ఆరుసార్లు పిలిచింది నాన్నగార్ని టిఫిన్ చేయమని. 'ఊ...ఆ..' అని బదులిచ్చిన నాన్నగారు అమ్మ పిలిచిన పదినిముషాలకు డైనింగ్ టేబుల్ దగ్గరకొచ్చి తను చేసిన ఆలస్యానికి అమ్మమీద కోప్పడడం గమనించిన ఆదిత్యకు తండ్రిమీద అంతులేని కోపం వచ్చింది.

'తను టిఫిన్ సిద్ధంచేసి చాలాసేపైందనీ, అది చల్లారిపోవడం తన తప్పుకాద'నీ అమ్మ చెప్పదేం? అమ్మమీద కూడా కోపం వచ్చింది ఆదిత్యకు.

అతడి కోపాన్ని మరింతపెంచేలా, "అయ్యో చల్లారిపోయిందా? ఒక్క నిముషం వేడివేడిగా ఇప్పుడే తెస్తాను" అంటూ డైనింగ్ టేబుల్ మీద ఉంచిన పళ్ళాన్ని తీసుకుని వంటింట్లోకి పరుగెత్తింది విశాలాక్షి.

జరుగుతోన్న సంఘటనను గమనిస్తున్న ఎనిమిదేళ్ళ ఆదిత్యకు గుండెమండసాగింది.

ఏంటిటీ అమ్మ? ఎందుకు నాన్నగారంటే అంత భయం? అతడి ఆలోచనలను భగ్నం చేస్తూ "ఊ త్వరగా తగలెయ్! మీనమేషాలు లెక్కపెట్టుకుంటూ నువ్వు తెచ్చిపెట్టే దిక్కుమాలిన టిఫిన్ తినకపోతే నా జన్మధన్యంకాదని అనుకుంటావు పెద్దగొప్పదానిలా. నాలుగు డబ్బులు పారేస్తే ఇంతకంటే రుచికరమైన టిఫిన్ మన వీధి చివరున్న శరభయ్యగాడి హోటల్‌లో కూడా దొరుకుతుంది" అంటూ పళ్ళెంలో చేయిపెట్టి వేడిగా ఉన్న ఇడ్లీని త్రుంచబోయి వేళ్ళు చుర్రుమనడంతో కెవ్వుమని అరచి, "వేడిగా తెమ్మంటే ఆవిర్లు కక్కే ఇడ్లీలు తెచ్చి నా మొహం మీద కొట్టమనా అర్థం?" అని వ్రేళ్ళు ఊదుకుంటూ టిఫిన్ తింటోన్న తండ్రిని ఓరకంట గమనించి, 'మా బాగా అయింది' అని సంబరపడుతూ షూ లేస్ బిగించుకుని పుస్తకాల సంచిని వీపుకు తగిలించుకుని ఇంట్లోంచి బయటపడ్డాడు ఆదిత్య.

మరోరోజు. సాయంత్రం ఆదిత్య స్కూల్‌నుంచి తిరిగొచ్చిన సమయంలో ఇల్లెగిరిపోయేలా అరుస్తున్నాడు శంకరం.

"పదేళ్ళనుంచి సంసారం చేస్తున్నావు. మొగుడనేవాడు పగలంతా పనిచేసి అలిసిపోయివస్తాడు. గోరు వెచ్చని నీటితో స్నానం చేసి కాస్సేపు విశ్రాంతి తీసుకుంటే వాడి అలసటంతా మయమవుతుందనే స్పృహ ఏమైనా ఉందా నీకు? ఏదో నా బాధపడలేక వారానికొక్కసారి సమయానికి నీళ్ళు సిద్ధం చేస్తావు. కానీ అవెలా ఉంటాయని? పొగలు, సెగలు కక్కుతూ ఒంటిమీద పడితే చర్మం ఊడొచ్చేలా ఉంటేయి లేదా కాగి కాగి చల్లారిపోయి ఉంటాయి.

చేసే పనిమీద శ్రద్ధ ఉంటే ఇలా ఎందుకవుతుంది? నోట్లో నాలుకలేని దానివని ముచ్చటపడి పొంగిపోయి నిన్ను నాకు అంటగట్టింది మా అమ్మ. ఇప్పుడెవ్వరనుకుని ఏం లాభం? అంతా ఖర్మ'' అని సణుక్కుంటూ బాత్‌రూములో దూరాడు శంకరం.

అటువంటి అనేకానేక అసంతోషకర సంఘటనలకు ప్రత్యక్ష సాక్షిగా వారాలు, రోజులు, నెలలు, సంవత్సరాలు గడిపి తన మనసులోని భావాల్ని తల్లితో నేరుగా చర్చించే వయసు సంతరించుకున్నాక ఒకరోజు ఆదిత్య తల్లితో అన్నాడు, ''ఎందుకమ్మా నాన్నగారు ప్రతిదానికీ నీ తప్పులేకపోయినా నీమీద కోప్పడతారు?

నీ తప్పులేకపోయినా నువ్వెందుకు అవన్నీ సహిస్తావు? ఒకసారి ఎదురుతిరిగి సమాధానం చెపితే ఆయన నోరు మూసుకుంటారుగా. నువ్వేమైనా ఈ ఇంట్లో పనిచేసేందుకొచ్చిన అనాథవా? ఎందుకు నీకంత భయం ఆయనంటే? నీ అలుసు చూసుకునే అయినదానికీ కానిదానికీ ఆయన రెచ్చిపోతున్నారు. నిన్నసలు మనిషిలా చూస్తున్నారా? నీకసలు కోపంరాదా?

అయినా ఆయన మాటలకు ఎంత శాంతంగా ఉండే వాళ్ళకైనా కోపం వస్తుంది. ఇటువంటి మనిషితో బ్రతకటమంటే ఇంట్లోంచి బయటకు పోయి ముష్టెత్తుకుని బ్రతికినా ప్రశాంతంగా బతకొచ్చు. పద ఆయనొచ్చేలోగా వెళ్ళిపోదాం!''

విశాలాక్షి జాలిగానూ, ప్రేమగానూ ఆదిత్యను చూస్తూ అతడి తలమీద చేయి వేసి నిమురుతూ, ''తప్పుకన్నా అలా మాట్లాడకూడదు. ఇంటిని పోషించే వ్యక్తికి ఎన్నో వత్తిళ్ళు ఉంటాయి. ఆ విషయాలు అలానే ఇంట్లో మాట్లాడితే మానసిక ఆందోళన పెరుగుతుంటే తప్ప తగ్గదు. అందుకే తన మనసులోని అలజడిని తట్టుకుందుకు ఏదో ఒక విషయంలో కోపం తెచ్చుకుని తన ఆందోళనను తగ్గించుకుంటారు.

అంతేగానీ.. నా మీదా నీమీదా నిజంగా కోపం ఉండికాదు. నాన్నగారు కోపంగా అరచినపుడు నేనూ కోపంగా మాట్లాడితే ఆయన కోపం మరింత పెరుగుతుందేగానీ తగ్గదు. 'కోపం' అనేదాన్ని ఏదో ఒక విధంగా బయటకు పంపించకపోతే అది మనిషి మనసును బలహీనపరుస్తుంది. అంతేకాదు శారీరకారోగ్యాన్ని పాడుచేస్తుంది.

స్వంతమనుషులే ఆయన కోపాన్ని భరించలేకపోతే పరాయివాళ్ళకేం అవసరం?! అటువంటి సందర్భాల్లో ఇంటా బయటా కూడా తనను అర్థంచేసుకునేవాళ్ళూ, తనపట్ల ఆపేక్ష, అభిమానం చూపించేవాళ్ళూ లేరని ఆయనకు అనిపించడం మనాందరికీ నష్టాన్నే కలగజేస్తుంది.

బయట ఎటువంటి అనుభవాలెదురైనా కనీసం ఇంట్లోని మనుషులు తననర్థం చేసుకున్నారనే భావన ఇంటి యజమానికి అంతులేని మానసిక బలాన్నిస్తుంది. ఆ బలం బయటి వ్యవహారాల్లో ఎదురయ్యే ఎటువంటి ఒడిదుడుకులనైనా సునాయసంగా తట్టుకునే సామర్థ్యాన్నిస్తుంది.

నాన్నగారికి మనమీద ప్రేమలేకపోతే మనం అవసరాలన్నీ ఎందుకు తీరుస్తారు? అయినా ఈ విషయాలన్నీ బాగా అర్థం కావాలంటే నీకింకా వయసురావాలి. అంతవరకూ బుద్ధిగా చదువుకో. నాన్నగారి గురించి ఆలోచించకు. అవన్నీ నేను చూసుకుంటాను. సరేనా?'' అంది.

తల్లిమాటలు తనకు నచ్చకపోయినా, తండ్రి ప్రవర్తనకు మనసు కష్టపెట్టుకోవడం లేదనీ, ఏ పని చేసినా ఇష్టంగానే చేస్తున్నానని తల్లి చెప్పదలచుకున్నట్టుగా మాత్రం అర్థమైంది ఆదిత్యకు.

అందుకే ఆరోజు ఏమీ మాట్లాడకుండా అయోమయంగా మొహం పెట్టి తల్లి ఒడిలో తలదాచుకున్నాడు.

తల్లి పట్ల తండ్రి ప్రవర్తనను మనసులో అసహ్యించుకుంటూనే చదువు పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్న ఆదిత్య... ఒక రోజు తల్లి మీద తండ్రి చేయిపైకెత్తడం చూసి తీవ్రమైన ఆగ్రహానికి లోనయ్యాడు.

వారిద్దరి మధ్యకూ వెళ్ళి తల్లిని చేయిపట్టుకుని గదిలోకి తీసుకువెళ్ళి తలుపులు బిగించాడు, " ఎందుకమ్మా.. ఇంకా నిన్ను నువ్వు మోసం చేసుకుంటావు? నాకు తెలిసి నేను చూస్తుండగా ఆయనెప్పుడూ నిన్ను ప్రేమగా పలకరించలేదు. దేనికో ఒకదానికి నిన్నెప్పుడూ కసురుకోవడమో, తిట్టడమో తప్ప మనసారా నీతో సంతోషంగా నవ్వుతూ ఎప్పుడైనా మాట్లాడారా? ఎందుకమ్మా ఆయన్నింకా వెనకేసుకుని వస్తావు?" అన్నాడు ఆదిత్య, విశాలాక్షి భుజాలు పట్టుకుని కుదుపుతూ.

గెడ్డమూ, మీసమూ వచ్చిన కొడుకుని గతంలోలా ఏదో ఒకటి చెప్పి సమాధాన పర్చడం తేలిక కాదని అర్థమైంది విశాలాక్షికి.

"సరే కన్నా. మనిద్దరం విడిగా బ్రతకాలంటే నీకేదో ఉద్యోగం దొరకాలి కదా! నువ్వు సంపాదనాపరుడివైన తర్వాత నేను వచ్చేసి నీతో ఉంటాను. సరేనా?"

తల్లి మాటలు విన్న ఆదిత్య మనసు సంతోషంతో పొంగిపోయింది. "నీ నోటి నుంచి ఎన్నాళ్ళకీ మాట విన్నానమ్మా! నీ మనసు మళ్ళీ మార్చుకోకు. ఆ మాట మీదే ఉండు. "అని తల్లి బుగ్గమీద ముద్దుపెట్టుకుని తలుపులు తీసుకుని హాలులో తనవైపే తీక్షణంగా చూస్తోన్న తండ్రిని పట్టించుకోకుండా మొహంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోండగా పెద్ద పెద్ద అంగలు వేస్తూ బయటకు నడిచి వెళ్ళిపోయాడు ఆదిత్య.

ఆరు నెలల తర్వాత...

తనకు ఉద్యోగం వచ్చిన రోజు గాలిలో ఎగురుకుంటూ ఇంటికి వచ్చి, "అమ్మా మన సామాన్లు సర్దడం ప్రారంభించు. మొదటినెల జీతం అందగానే మనం ఇల్లు మారిపోదాం. నెలరోజుల్లో ఈ బాధలనుంచి నీకు శాశ్వతంగా ఉపశమనం కలగబోతోంది. చూద్దాం. అప్పుడైనా ఆయనకు నీ విలువ తెలిసి వస్తుందేమో!"అన్న ఆదిత్యను మురిపెంగా చూసింది విశాలాక్షి. తన మనసులోని భావాలు మాత్రం మొహంలో గోచరించకుండా జాగ్రత్త పడుతూ తీరా ఆరోజొచ్చాక.

"ఇప్పుడేకాదుకన్నా, నాన్నగారికి దూరంగా నువ్వూ, నేనూ ఓ ఇల్లు తీసుకుని విడిగా ఉంటే నీ పెళ్ళి ఎవరు చేస్తారు? నీకో మంచి పిల్లను చూసి పెళ్ళిచేశాక చూద్దాం. సరేనా? " అని సముదాయించింది విశాలాక్షి.

అనతికాలంలోనే నాలుగైదు సంబంధాలు చూసి అన్ని విధాలా ఈడూ, జోడూ అవుతుందనుకున్న లహరిని ఎంపిక చేసి వైభవంగా పెళ్ళిచేశారు విశాలాక్షి దంపతులు.

ఉద్యోగరీత్యా వేరే ఊళ్ళో ఉండవలసి రావటం, కొత్త సంసారం, ప్రతిరోజూ తండ్రి సమక్షంలో గడపవలసిన అవసరం లేకపోవడం.. ఇవన్నీ 'తల్లిని తనతోపాటు ఉంచుకోవాల'ని ఆదిత్య మనసులో ఉన్న కోరికను కొంతకాలం వాయిదా పడేలా చేశాయి.

పెళ్ళి హడావుడీ, కొత్త సంసారపు మోజు సర్దుమణిగాక తల్లిని తనతో వచ్చేయమని బలవంతపెట్టసాగాడు ఆదిత్య.

ఒకరోజు అదే విషయమై మంకు పట్టిపట్టిన ఆదిత్యతో, "చూడు ఆదిత్య మాది త్వరలో ముగిసిపోతున్న జీవితం. మీ జీవితం ఇప్పుడే ప్రారంభమైంది. ఇంతకలం కుటుంబాన్ని పోషించిన మనిషిని ఆయన మానాన ఆయన్ని వదిలేసి నేనొక్కదాన్నీ నీతో వచ్చి ఉండడం ఏ విధంగా చూసినా హర్షణీయంకాదు." అంది విశాలాక్షి నచ్చచెపుతున్నట్టుగా.

"సరే. నువ్వు చెప్పిందాంట్లో న్యాయం ఉంది. ఎటూ నాన్నగారు రిటైరైపోయారు కదా! మీ ఇద్దరూ మాతో కలిసి ఉండొచ్చుకదా! అప్పుడంటే నేను చిన్నవాణ్ణి కాబట్టి నీమీద ఇష్టం వచ్చినట్టు అజమాయిషీ చెలాయించి నిన్ను బాధపెట్టేవారు. ఇప్పుడు ఎదిగిన కొడుకు ముందూ, కోడలి ముందూ నీమీద కోపతాపాలు ప్రదర్శించేందుకు వెనుకాడతారు కదా!" అన్నాడు ఆదిత్య మధ్యే మార్గంగా అన్నట్టుగా.

విశాలాక్షి కొడుకువైపు చూసి, "ఒకప్పుడు ఎలా కావలిస్తే అలా ప్రవర్తించిన వ్యక్తికి ఇప్పుడు తన ప్రవర్తనను అదుపు చేసుకుంటూ, ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా రోజులు గడపడాన్నిమించిన దుర్భరమైన పరిస్థితి ఏదీ ఉండదు. మమ్మల్నిలానే ఉండనివ్వు ఆదిత్యా. నేను తరచూ వచ్చి నాలుగురోజులుండి వెళ్తూంటానులే!" అంది ఆదిత్యను ఊరడిస్తూ.

ఆ తర్వాత ఇచ్చిన మాట ప్రకారం తరచూ వచ్చి కొడుకు సంసారాన్ని కళ్ళారా చూసి సంతోషంగా తిరిగి వెళ్ళేది విశాలాక్షి. అప్పుడప్పుడూ తండ్రి కూడా తల్లితో వచ్చి కొన్నిరోజులు గడిపినా తండ్రితో ముభావంగా ఉండేవాడు ఆదిత్య.

అలా ఎనిమిదేళ్ళు గడిచాక..

తండ్రి ఒకరోజు హఠాత్తుగా నిద్రలో పోయాడని తెలిసి, భార్యా, పిల్లలతో వెళ్ళి కర్మకాండ తతంగం ముగించుకుని తల్లిని కొన్ని రోజులుంచుకుందుకు మేనమామ తీసుకెళ్ళడంతో భార్యాపిల్లలతో తిరిగివచ్చాడు ఆదిత్య.

పదిహేను రోజుల క్రితం తల్లి వద్దకు వెళ్ళి తనతో రమ్మని ఎంత బ్రతిమాలినా ఆమె రాననడంతో హతాశుడై ఇంటికి తిరిగి వచ్చాడు.

తల్లి తనతో రాలేదన్న బాధను మరింత ఎక్కువచేస్తూ ఈరోజు ఉత్తరం.

●●●

"చీకట్లో కూర్చున్నారేఁవిటి లైటయినా వేసుకోకుండా?" అంటూ వరండాలో లైట్ స్విచ్ వేసి,

"అయ్యో కాఫీ అలానే ఉందేవిటి? పూర్తిగా చల్లారిపోయి ఉంటుంది. ఉండండి. మళ్ళీ కా చితెస్తాను. "అని ఆ గ్లాసు అందుకోబోయిన లహరిని వారించి, "ఇలా కూర్చో లహరీ రేపుదయం మళ్ళీ మనిద్దరం వెళదాం. ఈసారి ఏఁవైనా సరే అమ్మను తీసుకురావాలి. పిల్లల్ని పక్కింట్లో అప్పజెప్పి ఉదయాన్నే వెళదాం" అన్నాడు ఆదిత్య.

●●●

ఆదిత్యనూ, లహరినీ చూసి సంతోషంతో పొంగిపోయింది విశాలాక్షి. వారితో పాటు మనవల్ని తీసుకురానందుకు నిష్ఠూరమాడింది.

తనతో మాట్లాడే అవకాశం కోసం తను ఎక్కడికి వెళితే అక్కడికి వెంటబడుతూ ఇల్లంతా తిరుగుతోన్న వాళ్ళను కసిరి, "ఉదయం ఎప్పుడనగా బయల్దేరారో అలిసిపోయి ఉంటారు. మాట్లాడకుండా ఒకచోట కూర్చోండి భోజనం సిద్ధమయ్యాక పిలుస్తాను" అని తనపనిలో పడిపోయింది విశాలాక్షి.

అత్తగారి మాటల్ని పట్టించుకోకుండా ఆవిడ వెనుకే తిరుగుతూ ప్రతిపనిలో సాయం చేస్తూ వంటలో తన సహకారం అందించసాగింది లహరి.

చేసే పనేమీలేక తల్లివెంటా, భార్య వెనుకా వాళ్ళు వెళ్ళిన చోటికల్లా తిరగసాగాడు ఆదిత్య.

కోడలి ఆపేక్షకు పొంగిపోతూ. "నా కొడుకెంత అదృష్టవంతుడోకదా తల్లీ!" పదే పదే పొగిడింది విశాలాక్షి.

"ఊహూఁ.. మీ అంతమంచి అత్తగారిని పొందిన నేనే ఎంతో అదృష్టవంతురాలిని. మాతో కలిసి ఉండమని ఎంత బ్రతిమలినా పెద్దగా పట్టించుకోకుండా.. మావయ్యగారున్నంత కాలమూ మాకు దూరంగా ఉన్నారంటే కొంత అర్థం ఉంది. కానీ ఇప్పుడూ కూడా మాతో కలిసి ఉండేందుకు సుముఖంగా లేరంటే మీకెందుకో మామీద కోపంగా ఉందనిపిస్తోంది.

ఇప్పుడీ పెద్ద వయసులో మాతో కలిసి మీరుండాలని కోరుకునే మాకు దూరంగా.. ఇలా ఒంటరిగా అవస్థలు పడుతూ.. " ఆ తర్వాత కంఠం రుద్ధమై మాటలు రాలేదు లహరికి.

"అవునమ్మా.. లహరి అన్నట్టు నీకెందుకో మామీద కోపంగా ఉంది. నాతో కలిసి ఉంటానని చిన్నప్పటినుంచీ ఊరిస్తున్నావు. ఇప్పుడే కారణమూ లేకపోయినా కూడా ఇక్కడే ఒంటరిగా ఉంటూ అవస్థలు పడడానికి నిర్ణయించుకున్నావు. నీకసలు నిజంగా మామీద ప్రేమ ఉందా?" అని తల్లిని నిలదీశాడు ఆదిత్య.

"వెర్రినాగన్నా పిల్లల మీదా వారి కుటుంబం మీదా ఆపేక్షలేని తల్లి ఎక్కడైనా ఉంటుందా? నేను ఒంటరిగా ఉండాలని నిర్ణయించుకోవడానికి కారణం మీమీద ప్రేమలేకపోవడం కాదు. ఒకరకంగా నా స్వార్థం అని చెప్పవచ్చు. " అని తెల్లబోయి తనవైపు చూస్తున్న ఆదిత్యనూ, లహరినీ చూసి నోరారా నవ్వుతూ,

"నా మాటలు నమ్మశక్యంగా అనిపించడం లేదుకదూ? పెళ్ళయ్యేవరకూ అమ్మానాన్నలు చెప్పినట్టే నడుచుకున్నాను. పెళ్ళయ్యాక నాకిష్టమున్నా లేకపోయినా నాన్నగారి కోరికలకనుగుణంగా ప్రవర్తిస్తూనే బ్రతికాను. మీ నాన్నగారు పోయాక ఇదిగో ఇప్పుడేకదా.. నాకు నచ్చిన విధంగా నేను బ్రతకగలిగే అవకాశం దొరికింది నాకు.

మీతో కలిసి ఉంటే నాకు నచ్చినట్టు నేను బ్రతకలేననికాదు. నా అదృష్టం కొద్దీ మీరిద్దరూ బంగారు కొండలే. కానీ మీరు నా అడుగులకు మడుగులెంతగా ఒత్తినా నా మనసులో ఏదోమూల మీ స్వేచ్ఛను నేను హరిస్తున్నానేమో అనే భావం నన్ను వెన్నాడుతూ ఉంటుంది.

అదే ఇక్కడ ఈ ఇంట్లో అనుకోండి. పూర్తిగా నాకిష్టం వచ్చినట్టే ఉండొచ్చు. ఏ పనికీ నన్ను తొందర చేసేవారుండరు.ఎప్పుడు లేవాలనిపిస్తే అప్పుడూ లేవవచ్చు. ఏది తినాలనిపిస్తే అది తినొచ్చు. ఎవరి అవసరాల మేరకూ నా అవసరాల్ని తీర్చుకోవడాన్ని వాయిదావేయనక్కరలేదు.

ఇవన్నీ మీ ఇంట్లో నాకు జరగవనికాదు. ముందే చెప్పినట్టు మీరు నన్ను కాలుక్రింద పెట్టకుండా తప్పకుండా చూసుకుంటారనే విషయంలో నాకే సందేహమూ లేదు. కానీ నన్ను సంతోషపరచే ప్రయత్నంలో మీరు కొంత ఆనందానికి, కొన్ని కోరికలకు.. చిన్న చిన్నవే కావచ్చు, దూరమయ్యే సందర్భాలు తప్పకుండా వస్తాయి.

కనుక నాకు ఒంట్లో ఓపిక ఉన్నంతవరకూ ఇలా ఉండనివ్వండి. నా పనులు నేను చేసుకోలేని పరిస్థితి వచ్చాక ఎలానూ నేను మీ సహాయం తీసుకోకతప్పదు." అని ఇద్దరి బుగ్గలమీదా చెరో ముద్దుపెట్టి.. చెమ్మగిల్లిన కళ్ళతో తనవైపు దీనంగా పసిపిల్లల్లా చూస్తున్న వారిద్దరి భుజాల మీదా చేతులు వేసి, "ఇహ భోజనాలకు లేవండి. ఎప్పుడు తిన్నారో ఏమో!" అంటూ ముందుకు నడిచింది విశాలక్ష్మి.

●●●

# రాచకురుపు వారసత్వం జొన్నలగడ్డ మార్కండేయులు

అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.



కౌముది

**మునసబు, గ్రామకరణాల వ్యవస్థ రద్దయినపుడు** నా ఉద్యోగం పేరు గ్రామకరణం. తాత ముత్తాతలనాటి ఆ వ్యవస్థలో నాది వారసత్వపు ఉద్యోగం. అందుచేత దయతలచిన ప్రభుత్వ క్రొత్తగ్రామాధికారి వ్యవస్థలో నేను వి.ఆర్.ఓగా రూపాంతరం చెందగలిగాను.

మునసబుగారి కుటుంబం నుంచి ఎవరూ వి.ఆర్.ఓ అనబడే విలేజ్ రెవెన్యూ ఆఫీసరు ఉద్యోగం ఆశించలేదు. మునసబు జంట పదము లేకుండా సొంత గ్రామంలోనే మా నాన్నగారి కరణీకం స్థానంలో వి.ఆర్.ఓ పదవిని కడుపులో చల్ల కదలకుండ నిర్వహిస్తున్నాను. ఉద్యోగమే కాదు తాతముత్తాతల నుంచి సంక్రమించిన ఆస్తివల్ల కూడా కరణం నాటి ఇన్ఫ్లూయన్స్ చెక్కుచెదరలేదు.

ఒక విశేషమేమిటంటే మా ముత్తాత సంగతి తెలియదు కాని, మా తాతగారు రాచకురుపు వేసి నయమయిన కొద్దిరోజులకే కాలం చేశారు. మా నాన్నగారు కూడా నాకు కరణీకం బాధ్యతలు అప్పచెప్పిన మూడేళ్ళకు ముందు రాచకురుపుతో బాధపడ్డారు. రాచకురుపు పోయినా ఆయనకూ రాచకురుపు వేసిందన్నది నిజం.

ఇప్పుడు నాకు ఏభై ఎనిమిది. నా రాచకురుపు పేరు మారింది. వీపు మీద పెద్ద డయాబెటిక్ అల్సరు రావడంతో ఇంట్లో అందరూ కంగారుపడ్డారు.

"ఇది ఖచ్చితంగా రాచకురుపే! కరణం పేరు వి.ఆర్.ఓ అయినట్లే. పేరేదేతైనేం డాక్టరు తేల్చిన ఈ డయాబెటిక్ అల్సర్ వారసత్వంగా వచ్చింది" నా శ్రీమతి ఏడ్చేసింది.

చెప్పొద్దూ. నాకూ భయంగానే ఉంది. కానీ బింకంగా "కరణీకం వారసత్వం వల్ల ఇది వచ్చిందని అనుకుందాం. ఇప్పుడు వారసత్వాలు రద్దయిపోయాయికదా! నా తరువాత మనింట్లో ఎవరూ వి.ఆర్.ఓగా రారు. నాన్నగారు కురుపు తగ్గింతరువాత మూడేళ్ళు బ్రతికారు. నాన్నగారికి తగ్గినట్లే తగ్గిపోతుంది. ఎక్కువకాలం బ్రతకడమన్నది మన చేతిలో లేనిది" అన్నాను ఆశావాదిలా.

నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. నాపైన ఇద్దరన్నలున్నారు. వాళ్ళు నా తరువాత ఇద్దరు చెల్లెళ్ళు. అన్నలు బాగా చదువుకున్నారు. మహానగరాలలో ట్రాన్స్‌ఫర్ల ఉద్యోగాలలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పుడు కరణీకమైనా, ఇప్పుడు ఉద్యోగం వి.ఆర్.ఓగా ఉద్యోగమైనా వ్యవసాయం ఉంది కాబట్టే చేస్తున్నాను.

అన్నలు ఉద్యోగాలలో దూరంగా ఉన్నారు. పొలం కౌలుకిస్తే కౌలుదారుతో చిక్కులు రావచ్చు. అదీకాక అన్నల పొలం కూడా నేనే సాగుచేయచ్చు. దురూహ కాదుకాని దూరాలోచన అని అన్నలు స్వార్థంతో అన్నా పొలం మీద గుత్తాధిపత్యం నాకే వచ్చింది. చదువుకుని పెద్ద ఉద్యోగం చేయాలన్న బాధ నాకు రాలేదు.

పైగా నాకు ఇద్దరూ కొడుకులే. కూతుళ్ళులేరు. ఒకడు లెక్చరరు, ఇంకొకడు బ్యాంకు మేనేజరు ఉద్యోగాలు చేస్తున్నారు. నన్ను "అందరూ తెలివైనవాడు, లౌక్యుడు" అన్నారు. అందుకు కారణం నా చెల్లెళ్ళ కూతుళ్ళనే నా కోడళ్ళుగా చేసుకున్నాను. మా నాన్నగారు వాళ్ళకిచ్చిన చెరో ఎకరం కట్నం నేను తిరిగి అడగలేదు కట్నం వద్దన్న నా మంచితనానికి గుర్తుగా అవి నా ఖాతాలోనే ఉన్నాయి. అవికూడా కలుపుకుని మొత్తం పదెకరాలు నా చేతిలో ఉన్నాయి.

ఆస్తిపరుడినవడం చేత, గ్రామాధికారిని కూడా కాబట్టి కొన్ని ఖర్చులుంటాయి. గౌరవం కోసం ఆ ఖర్చులు చేయడానికి నేను వెనుకాడను. ఏ పార్టీ రాజకీయనాయకుడొచ్చినా కొబ్బరిబోండాలు నా తోటలోంచే. మండలాధికార్లు డ్యూటీమీద వస్తే క్యారేజీలు నా ఇంట్లోంచే. ఎలక్షను డ్యూటీకి వచ్చే సిబ్బందికి ముప్పొద్దుల్లా అతిధిమర్యాదలు చేస్తాను. అయితే గెలిచినా ఓడినా ఏ పార్టీకూడా నాకు రాజకీయరంగు పులమలేదు.

మండల హెడ్ క్వార్టర్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రి ఉంది. మా గ్రామానికి పదికిలోమీటర్లు దూరం. హాస్పటల్లో ఎం.బి.బి.యస్ డాక్టరున్నాడు. ఆయనే నాకు అన్ని పరీక్షాలు చేసి వీపు మీద సెగ్గడ్డను 'డయబెటిక్ అల్సరు' అని తేల్చాడు.

"ఏదయితేనేం తాతలనాటి వారసత్వపు రాచకురుపు. తగ్గినా ఎక్కువకాలం బ్రతకను" అన్నాను బేలగా తాతగారు, నాన్నగారు గురించి చెప్పి.

"కురుపువల్ల పోలేదుకదా! వాళ్ళకింకేవో సైడెఫెక్ట్స్ వచ్చుంటాయి. ఇప్పుడు టెక్నాలజీ పెరిగింది. ఆయుఃప్రమాణం కూడా పెరిగింది. నేను మీకు ఇంట్లోనే అల్సర్‌ను ఓపెన్ చేసి కట్టుకడతాను. షుగరుంది కాబట్టి ఓ నెలరోజులు పుండు బాధ భరించాలి. నేను నా కారులో రోజూ మీ ఇంటికి వచ్చి ట్రీట్‌మెంట్ చేస్తాను" అన్నాడు డాక్టరు.

"సరే!" అన్నాను.

డాక్టరు కారులో ఇంటికి వచ్చి అల్సరును కోసేసి కట్టుకట్టాడు. ఇరవైరోజులైంది. యమబాధ పడుతున్నాను. పుండు కనపడదు కానీ సలుపు మాత్రం ముఖంలో కనపడేది. నా ఆందోళన చూసి డాక్టరు "తగ్గుతోందండి. కొంచెం ఓర్చుకోండి. మీకు ధైర్యం చాలకపోతే ఇంకో నాలుగురోజులు చూసి కాకినాడ గవర్నమెంటు ఆసుపత్రికి వెళదాం" అన్నాడు కట్టుకట్టి.

డాక్టరు కూడా లౌక్యుడు. ఆయన ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. "నేను ప్రభుత్వ ఉద్యోగిని. తోటి ప్రభుత్వ ఉద్యోగికి వైద్యం చేసి డబ్బును ఆశించను. కార్లోవస్తున్నాను కాబట్టి పెట్రోలు ఖర్చు ఇవ్వండి చాలు" అన్నాడు. మండల హెడ్ క్వార్టర్స్‌లో పెట్రోలు బంకు ఉంది. నేను డబ్బులు తీసుకోవద్దని బంకు యజమానికి ఫోను చేశాను. నేను ఇస్తాననడం చేత బంకు యజమాని డాక్టరుగారికి ట్యాంకు ఫుల్ చేసేస్తున్నాడు.

ఇక వెళ్ళేటప్పుడు మా ఆవిడ కారు డిక్కీ నిండేలా చేలో పండిన కూరగాయలు, అపరాలు, ప్రతిరోజూ నింపేది.

"నేను పెట్రోలు ట్యాంకు, నువ్వు కారు డిక్కీ నింపి సంతోషపెడుతున్నంతకాలము డాక్టరుగారు నా పుండు కెలికి పెద్దది చేస్తారు" పుండు సలుపుతున్న మంట డాక్టరుగారు వెళ్ళగానే శ్రీమతి దగ్గర కక్కాను.

నా బాధ చూసి జాలిపడింది. కానీ నా మాటలకు నవ్వాపుకోలేకపోయింది. "కట్టుకట్టిన వెంటనే సలుపు సహజం. ఈ మాత్ర వేసుకోండి" అని మంచినీళ్ళు మాత్ర ఇచ్చింది. తరువాత ప్రక్కకు తిరిగి కళ్ళు తుడుచుకోవడం నేను గమనించాను. మాత్రవేసుకున్నాను.

"రాజ్యాంతే ధ్రువం నరకమ్" అని మూలిగాను.

అది ఎప్పుడో చదువుకున్న సంస్కృతం మాట. అప్రయత్నంగా బయటకు వచ్చింది. సంధి ప్రేలాపనేమోననుకుని మా ఆవిడ భయపడినట్టుంది.

"ఏవండీ! ఏమయింది?" అని అరిచింది.

"కంగారు పడకు. గ్రామాధికారి పదవి కూడా రాజులాంటిదే తెలియకుండా ఏ రైతుకో అపకారం చేసి ఉంటాను. అన్నదాత ఉసురు తగిలి ఉంటుంది. ఎప్పుడూ కరణం మామూలు కూడా ఆశించలేదు. ఈ పుండు బాధ భరించలేకపోతున్నాను. రాజులందరూ చచ్చి నరకాన్ని చూస్తారట. నాదీ చివరిదదే నరకం వస్తుందన్న ఆ శ్లోకం గుర్తొచ్చి చదివాను" అన్నాను.

"నిజమే! తెలిసి చేసినా తెలియక చేసినా నిప్పులాగే పాపం వెంటపడుతుంది" నా భార్య ముఖంలో కన్నీళ్ళు.

"ఏ పాపం చేశారో ఈ రాచపుండు వారసత్వం మీవాళ్ళనుంచి మీకూ వచ్చింది. తగ్గిపోతుంది. తగ్గాక తీర్ధయాత్రలకు వెళదాం. ప్రస్తుతం నిద్రపొండి. ఆలోచనలు మానండి" అని పడుకోబెట్టి దుప్పటి కప్పింది.

ఆ మాటలలో ఎంతో కొంత నిజముందని నాకనిపించింది. నావల్ల ఎవరికి అపకారం జరిగి ఉంటుందా అని ఆలోచిస్తూ నిద్రపోయాను. కొద్దిసేపు పడుకున్నాను. నేను లేచి భోజనం చేసి మళ్ళీ పడుకోబోయాను.

నన్ను పరామర్శించడానికి మా పురోహితుడు శర్మ వచ్చాడంటే పడుకోలేకపోయాను. పురోహితుడు శర్మ, నేను చిన్నప్పట్నుంచీ స్నేహితులం. ఒకే ఊరు. ఒకే స్కూల్లో చదువుకున్నాం. నేను కరణం అవడానికి ముందే శర్మ పౌరోహిత్యం వృత్తిగా స్వీకరించాడు.

''ఎలాఉంది?'' అడిగాడు శర్మ ఆప్యాయంగా.

''బాధతో చచ్చిపోవాలనుంది. బ్రతికుండగానే గోదానం, భూదానం చేసేస్తాను. స్నేహితుడివి. అదేదో నీకే ఇచ్చేసి బ్రతికున్నప్పుడే కళ్ళారా చూసుకుంటాను'' అన్నాను ఏడుపు మిళితమైన గొంతుతో.

''అశుభం పలికావంటే నాలుక పీకేస్తాను. నీ జాతకం నాకు తెలియదా? నువ్వు సప్తతి ఉత్సవం చేసుకుంటావు. సహస్ర మాస జీవిగా 80ఏళ్ళ పైబడి జీవిస్తావు. వెయ్యి పున్నమిలు చూసి సుఖంగా జీవిస్తావు'' అని ఆప్యాయంగా తల నిమిరాడు.

ఆ తరువాత కొంటెగా నవ్వాడు. ''ఆరోగ్యం బాగుపడాలని నువ్వు గోమాతకు పూజచేస్తానంటే వద్దనను. సద్బ్రాహ్మణుడిని. గోదానం తీసుకోవడానికి అభ్యంతరంలేదు. నువ్వు ఇస్తానన్న భూదానం మాత్రం తీసుకోను. నాకక్కరలేదు'' అన్నాడు నవ్వుతూ.

''భూదానం కూడా పూజ చేసే ఇస్తాను. తీసుకో'' అన్నాను నేనూ నవ్వుతూ ఉల్లాసంగా.

''ఇప్పుడు ఎక్కడ చూసినా భూకబ్జాలు. తరాలు తిరగేస్తే ఆ పొలాల హక్కుదారులు ఏవో కాగితాలు పట్టుకుని వచ్చి మావే ఈ పొలం అని నన్ను కోర్టుకీడుస్తారు. నువ్వు కరణానివైనా నీకే దిమ్మతిరిగి పోయేలా ఈ పొలం నాది అనే హక్కుదారులున్న రోజులివి'' అన్నాడు.

''రిజిష్టరు చేసే ఇస్తాను'' అన్నాను.

''దేవాలయాలకు దానమిచ్చిన పొలాలు, బాటసారులకు నీడనిచ్చిన దాతల సత్రాలు ఇళ్ళ స్థలాలుగా అమ్మేస్తున్నారు. ఊరుమ్మడి మాన్యం స్థలాలు వెదికి మరీ ప్రభుత్వం ఇళ్ళస్థలాలుగా మార్చేస్తోంది. దానపట్టాలకు విలువపోయింది'' అన్నాడు శర్మ.

ఊరుమ్మడి మాన్యం మాటవిని ఉలిక్కిపడ్డాను. ''నా రాచకురుపుకు కారణం మా వంశం వాళ్ళు చేసిన ఊరుమ్మడి మాన్యం కబ్జా కాదుకదా!'' అనిపించింది. శర్మ వెళ్ళిపోయినా ఆలోచనలు వదలలేదు.

మా తాతగారి చిన్నప్పుడు ఊరుమ్మడి మాన్యముండేదిట! మా నాన్నగారు కానీ, నేను కాని ఊరుమ్మడి మాన్యమును మా పొలంగానే ఎరుగుదుము. ఒకప్పుడు ఊరుమ్మడి మాన్యం రైతులందరిదీను. రైతులతో ఎవరో ఒకరు వేలం పాటలో సాగుచేయడానికి రొక్కానికి పాడుకునేవాడు. ఆ రొక్కాన్ని గ్రామంలో సుబ్బారాయుడి షష్ఠికి, సీతారామకళ్యాణానికి ఖర్చుపెట్టేవారు. ఆ సమయంలో వినోదప్రదర్శనగా జరిగిన నాటకాలలోని నటులకు, తోలు బొమ్మలాటలవాళ్ళకి, ఇంకా సంక్రాంతికి వచ్చే గంగిరెద్దుల వాళ్ళు, బుడబుక్కలవాళ్ళు, పగటి వేషగాళ్ళకు పారితోషికాలిచ్చేవారు. ఆ పారితోషికాలకు ఊరుమ్మడి మాన్యం రొక్కం ఉపయోగపడేది.

సాధారణంగా కృష్ణపియ గోవిందశర్మ అనే ఆయన ఆ పొలం పాడేవాడు. ఎందుకంటే ఆయన పొలం ఊరుమ్మడి పొలాన్ని ఆనుకుని ఉండేది. ఆయనే తనంతట తానే ఎక్కువ మొత్తం చెప్పడంతో పోటీ ఉండేదికాదుట. తన పొలంతోబాటే సాగుచేసి ఈనాములు కూడా కళాకారులకు ఆయనే ఇచ్చేవాడు. ఆ కారణం చేతనేనేమో ఊరుమ్మడి పొలం కన్నా గోవిందశర్మగారి పొలంగా మారిపోయి ఉండవచ్చు కబట్టి ప్రజలు వేలం పాట మరిచిపోయారు.

ఆయన ఇప్పుడు ముంబయి అప్పుడు బొంబయిగా పిలవబడిన పట్నానికి వెళ్ళిపోయాడు. కాలంలో మార్పో గోవిందశర్మ తిరిగి రాకపోవడం వల్లనో ఊరుమండి మాన్యం కరణం మాన్యంగా రికార్డులలో కెక్కింది. కృష్ణప్రియ గోవిందశర్మ పొలం కూడా ఈ మాన్యంలో చేరిపోయింది. ఆయన ముంబయి వెళ్ళిపోయిన విషయం ఎవరికీ తెలియదు.

పొలంలో మాత్రం గోవిందశర్మగారు ఇల్లు కట్టుకుని ఉండేవారేమో! తెలియదు. వెళ్ళిపోతూ ఆ ఇల్లు గుడి పూజారిగారిచ్చారు. ఆయన ప్రస్తుత కుటుంబాలవాళ్ళు అప్పుడే నాలుగైదు తరాల నుంచి ఉంటూ ఆ ఇల్లు తమదేనని భావిస్తున్నారు. ఇల్లు ఉన్న ఆ స్థలం వదిలేసే మాన్యం సాగుబడి జరుగుతోంది. అయితే ఉరుమ్మడి వేడుకలు ఉత్సవాలు ఖర్చులు లేవుగాని కృష్ణప్రియగోవింద శర్మగారి బదులు మేమా పొలాన్ని నచ్చిన రైతుకు అమర్చి సొమ్ము తీసుకుంటున్నాం. వేలం పాటలు లేవు.

కరణీకాలు పోయినా ఊరుమ్మడి మాన్యాన్ని కరణం మామూలుగా మేమే అనుభవిస్తూనే ఉన్నాం. మాన్యం ప్రస్తుతం నా చేతిలో ఉన్నా అది రద్దయి ఇళ్ళస్థలాలకు పంచాయితీకి అప్పచెప్పమని వస్తున్న ఒత్తిడికి తగిన రిపోర్టు నా కలం రాయడానికి పలుకుబడితో వీలులేకుండా నొక్కిపెడుతోంది. ఆ విషయం గుర్తుకు రాగానే రాచకురుపు సలపసాగింది.

రాచకురుపు వేసిన తరువాత ప్రస్తుత పుజారి నన్ను కలిశాడు. గుడిలో నా పేరు మీద అభిషేకం చేశాడుట. ప్రసాదం ఇస్తూ మా ఆవిడకు ఆ సంగతి నాకు వినబడేలా గట్టిగా గొంతు పెంచి మరీ చెప్పాడు.

కుశల ప్రశ్నలు పూర్తయ్యాయి. "దేవుడు చల్లగా చూస్తాడు. మీ పూర్వీకుల దయవలనే కరణం మాన్యంలో ఇంతచోటు సంపాదించాం. ఆ స్థలం కరణం మాన్యంలోది కాదని మీకూ తెలుసు. ఇప్పుడు మీ మాన్యం కూడా పంచాయితీవాళ్ళు తీసేసుకుని ఇళ్ళ స్థలాలకు కేటాయిస్తారుట. నా ఇల్లు ఉన్న స్థలం కరణం మాన్యంలోనిది. కాదని సర్వే నెంబరు తెచ్చుకోమంటున్నారు. లేదంటే దస్తావేజు కావాలిట. 'శాశ్వత నివాస పట్టా ఇచ్చి పన్ను ఇంటికి కట్టించుకుంటాను. లేదంటే రేపు మాన్యం పంచాయితీ పరిధిలోకి వచ్చాకా నేనేం చెయ్యలేకపోవచ్చు' అని సర్పంచ్‌గారు అంటున్నారు. మీరు కోలుకున్నాక 'ఏదో సర్వేనెంబరు ఇచ్చి ఇది మీ మాన్యంలోది కాదని నన్నాదుకోండి" అన్నాడు. వినయం, నత్తిమాటలు ఒలకబోస్తూ మాటలు పూర్తయ్యాయి.

కుశలమడుగుతూనే వచ్చిన పని వివరించాడు పూజారి. కరణం మాన్యంగా నాకు పొలం సంక్రమించి. పూజారికి ఇల్లు వచ్చింది. రెండూకూడా గోవిందశర్మగారివే! "నీపొలమెలాగూ పోతుంది. నా ఇల్లు నిలబెట్టు" అన్నది పూజారి భావం.

గోవిందశర్మగారు ఎలా ఉంటారో నాకు తెలియదు. కాని పూజారిగారిలోంచి గోవిందశర్మగారు ఓ అపరిచితుడిలా తొంగిచూస్తూ నన్ను తిడుతున్నాడనిపించింది.

"ఊరుమ్మడి మాన్యం ఒకప్పుడు కళాకారులకు ఉపయోగపడింది. జనం మరిచిపోయిన సంస్కృతి అవశేషమది. నీ వల్ల ఉపయోగపడే రైతులది నీకు కట్టబెట్టారు. ఇప్పుడు ఇళ్ళ స్థలాలయిపోతున్నందుకు నాకు సంతోషం. పూజారి ఇంట్లో మాత్రం నా ఇంటిదీపం ఆరిపోకుండా ఊరుమ్మడి మాన్యాన్ని కరణం మాన్యం నుండి విడదియ్యి" అంటూ కృష్ణప్రియ గోవింద శర్మ బయటకు వచ్చి నా వీపు మీద చరిచినట్లైంది. పుండు మండింది.

నాదికాని భూమిని నేను యజమానిగా అనుభవించాను. రైతులూ ఆమోదించారు. కరణము పదవితో అధికారంతో భూకబ్జా అన్నది పల్లెటూరినుంచే ప్రారంభమయింది. నేను భూకబ్జాదారుడి ననుకోసాగానే సిగ్గేసింది. మనదికాని వస్తువును అనుభవించడం రాచకురుపు లాంటిదని నా వీపు సాక్ష్యమై ఘోషించిందనిపించింది.

"పూజారిగారూ! రెవెన్యూ రికార్డుల ప్రకారం మీ స్థలము కరణం మాన్యంలోనే వస్తుంది. నేను మీకు అది కృష్ణప్రియ గోవిందశర్మగారి స్థలమని సర్వే నెంబరు వేసి ఇస్తాను. మీకెంతవరకు కావాలో అంతవరకు కొలతలు వేసి స్థలం తీసుకుని కాగితం

ష్టండి. ఆ స్థలం పంచాయితీదేనని నేను వి.ఆర్.ఓగా సర్టిఫై చేస్తాను. మిగతాపని సర్పంచ్ గారు చూస్తారు. మీరు ఆ స్థలంలో ఉన్న ఇంటిని కృష్ణప్రియ గోవింద శర్మగారి దగ్గర మీ పూర్వికులు కొనుక్కున్నారని చెప్పడం మాత్రం మరిచిపోకండి'' అన్నాను.

పూజారిగారి ముఖం సంతోషంగా వెలిగింది. ఆ క్షణంలో నాకు ఆయన గోవిందశర్మగారిలా కనిపించాడు. మొహమాటంగా కాసేపు కూర్చుని పూజారి వెళ్ళిపోయారు. ''మీరు నిండు నూరేళ్ళు జీవిస్తారు. నేను తప్పు మాట్లాడి ఉంటే క్షమించండి'' అని వెళ్ళిపోతూ అంటుంటే గోవిందశర్మగారు దీవించినట్లనిపించింది.

జరిగింది నా భార్యకు చెప్పాను. ''మంచి పని చేశారు. నాక్కూడా ఒక కోరిక ఉంది మనకున్నది చాలు. మాన్యం కాపాడ్డానికి ఉద్యోగం చెయ్యక్కరలేదు. పోతే పోనీయండి. మీరీ ఉద్యోగం సెలవు పెట్టెయ్యండి. తెలిసున్నవాళ్ళమీద ఇన్‌చార్జి వచ్చేలా చేసుకోండి. సెలవుపెట్టినా ఉద్యోగంలో ఉన్నట్లే గోవిందశర్మగారిలాంటి స్థలాలు వెలుగులోకి తేవచ్చు'' అంది.

ఊరుమ్మడి స్థలాలు ఇంకా ఏవన్నా ఎవరైనా కబ్జా చేశారా అని ఆలోచిస్తున్నాను. నా ఆలోచనలు అలా ఉండగానే నా జంటపదం మునసబు చూడటానికి వచ్చాడు. మేము కూడా ఒకే స్కూల్లో చదువుకున్న బాల్యస్నేహితులం. చనువుగా నువ్వు నువ్వు అని మొహమాటపడుతూ బహువచనం జోడించి మాట్లాడుతుంటాడు. ఆ తమాషా పలకరింపు నాకు హాయిగా ఉంటుంది. అతడూ నా వయసువాడే

''ఏంటండీ ఇది. నీకు అల్సరేమిటి? వారసత్వంగా వచ్చిన రాచపుండు అని భయపడుతున్నారంట. నువ్వు త్వరగా కోలుకోవాలండి'' ఆ పలకరింపులో ఆప్యాయత ఉంది.

''నువ్వు మునసబు గిరి నుంచి వి.ఆర్.ఓగా రానన్నావు. నేనేమో ఉద్యోగం పురుషలక్షణం అని వదులుకోలేకపోయాను. కరణంగా ఉన్న విలువ దీనికి లేదు. ఎవరైనా మనవాళ్ళుంటే చూడు. సెలవు పెట్టేస్తాను. వాళ్ళు ట్రై చేసుకుని ఇందులో చేరతారు.''

''మీరు నిజంగానే అంటున్నారాండి?'' మునసబు కళ్ళు మెరిసాయి.

''సీరియస్‌గానే చెపుతున్నాను.'' అన్నాను.

''నా మనవడున్నాడు. కూతురు బిడ్డ. టెంత్ మూడుసార్లు, ఇంటర్ నాలుగుసార్లు తప్పాడు. ఎలాగో డిగ్రీలో చేరాడు. వాడి పోకిరీ వేషాలతో కాలేజ్ నుండి సస్పెండయ్యాడు. మానిపించేసి పొలం పనులలో పెట్టాను. కుదురుగానే ఉంటున్నాడు. ఉద్యోగముంటేనే పిల్లనిచ్చే రోజులివి. పొలం ఉన్నా వీడికి పిల్లనెవరూ ఇవ్వడానికి ముందుకు రావడంలేదు. వీడికి పెళ్ళవ్వాలంటే తాత్కాలికంగా ఈ ఉద్యోగం చాలు. నువ్వు వీడిమీద సెలవు పెట్టొచ్చా?'' అన్నాడు.

ఇప్పుడు రైతాంగం తెలివిమీరారు. పోకిరీగాళ్ళ ఆటలు సాగనివ్వరు అని మనసులో అనుకున్నాను.

''టెంత్ పాసయితే చాలు. అదీగాక నువ్వు మాజీగ్రామాధికారివి. మునసబుగా వారసత్వం ఇవ్వరు. కానీ వాళ్ళ పిల్లలకు వారసులకు గ్రామనౌకరులు చదువుకుని ఉంటే పరిశీలిస్తారు. ఇవ్వాలనేం రూలులేదు కానీ మాజీ గ్రామాధికారి మనవడిగా సెలవు పెడుతూ నేను తహసిల్దారుకు రికమండ్ చేస్తాను.'' అన్నాను.

మునసబుకి నచ్చినట్లుంది. ఆలోచనలు పైకి కనపడనీయకుండా కాసేపు కూర్చుని వెళ్ళిపోయాడు.

నేను ఉద్యోగంలో ఉన్నా, కులం రీత్యా మునసబు పలుకుబడి నాకన్నా పెద్దది. నేను సెలవుపెట్టాను. రామకోటి రాయడం మొదలు పెట్టాను. నా స్థానంలో మునసబు మనవడు వచ్చి రికార్డు పట్టుకుపోయాడు. కొన్ని రోజులు బాధపడ్డాను.

కృష్ణప్రియ గోవిందశర్మ పేరు వెలుగులోకి రావడం వల్ల పూజారి ఇల్లు నివాస స్థలంగా పంచాయితీ రికార్డుల్లో చేరింది. కానీ మిగిలిన కరణం మాన్యం ఇళ్ళ స్థలాలకి పనికిరాని ఊసర క్షేత్రంగా రెవెన్యూ రికార్డుల్లో మారిపోయింది.

"బంగారం లాంటి పొలం రైతుగా ప్రాణం ఒప్పలేదు. నా మనవడు ఉద్యోగంలో ఉన్నన్నాళ్ళూ అది మాదే తరువాతి సంగతి చూడొచ్చు. ఎదురించే వాళ్ళు వచ్చేవరకూ సాగు చేస్తాను." మునసబు నేను కలుసుకున్న మాటల సందర్భంలో ఒకరోజు అన్నాడు.

కాలం గడిచిపోతోంది. నా సెలవు రెన్యూ అవుతుందో లేదో కూడా తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. కురుపు తగ్గింది. రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. రామకోటి రాస్తూనే ఉన్నాను. కానీ మృత్యువు దగ్గర పడిందనే అనుమానం పోలేదు. ఒకరోజు మునసబు రాచకురుపుతో బాధపడుతున్నాడని తెలిసింది. చూడ్డానికి వెళ్ళాను.

గవర్నమెంటు డాక్టరు కట్టు కడుతున్నాడు. నన్నుచూసి నవ్వాడు.

"కరణం, మునసబులు విడిపోయినా రాచపుండు విడిపోలేదు. రెండేళ్ళ క్రితం మీకు, ఇప్పుడు మునసబుకు. కొత్త కారు కొన్నాను." అన్నాడు నవ్వునాపుకుంటూ.

పూజారి కూడా అక్కడే ఉన్నాడు. నాకు నమస్కారం చేసాడు. అభిషేకం చేసి పట్టుకొచ్చిన ప్రసాదం టేబుల్ మీద ఉంది.

"అయ్యా మునసబుగారూ! మీరు త్వరగా కోలుకోవాలి. రోజూ దేవుడికి పూజ చేస్తున్నాను. వీలుంటే మనవడి గారికి చెప్పి మా ఇంటినానుకున్న మీ ఊసర క్షేత్రంలోని స్థలంలోని కొంచెం స్థలం నాకిప్పించండి." అన్నాడు.

ఈ మాటలు పరిచిత గొంతులా అనిపించి పూజారిగారికేసి చూసాను. కానీ నాకు కృష్ణప్రియ గోవిందశర్మ కనిపించలేదు. పూజారి గొంతులో గోవిందశర్మ కలిసిపోయాడు.

ఇంటికొచ్చి ఈ విషయం చెప్పగానే నా భార్య పడీ పడీ నవ్వింది.

"కలిసొచ్చిన ఇతరుల భూమిని నాదే అనడం వారసత్వపు హక్కు. అడిగేవాడుంటే అది కబ్జా. ఒకప్పుడు గ్రామాధిపత్యం ఇప్పుడు రాజకీయ పెత్తనం. దేనికి అధికారమున్నా కబ్జా వారసత్వమైపోతుంది. రాచకురుపు వారసత్వ కబ్జా మీ నుంచి బదిలీ అయిపోయింది." అంది.

'నిజమేనా అనుకుంటూ అవాక్కయ్యాను.'

●●●

# సోక్రటీస్ భార్య

డి.పద్మజ

**ఉత్తేజంగా వినపడుతున్న వాద్యఘోషకి అనుగుణంగా నృత్యం చేస్తోంది హెలీనా.** చిరుచెమట ముత్యాల్లా ఆమె నుదుటిమీద ఒక అలంకరణగా కనిపిస్తోంది. వసంత ఋతువుకి ఆహ్వానం పలుకుతూ నిర్వహిస్తున్న ఆ వసంతోత్సవాలకి తన స్నేహితురాళ్ళతో హాజరైన హెలీనా వారందరిలో ప్రత్యేకంగా కనిపిస్తోంది. యువకుల దృష్టి ఆమె మీద ఓ నిమిషం పాటు వారికి తెలియకుండానే నిలిచిపోతోంది.

జతి మారింది. దీప ప్రమిదలతో నృత్యానికి సిద్ధమైంది హెలీనా. తనకి జోడీ ఎవరా అని చూస్తే, తన వంకే ఆరాధనగా చూస్తున్న నికొలస్ కనిపించాడు. ఒక్క క్షణం ఆమె ఒళ్ళు ఝల్లుమంది. దీపం చేజారబోయి నిగ్రహించుకుంది.

నికొలస్ తనమీద ప్రత్యేక అభిమానాన్ని చూపిస్తాడు అని ఈ మధ్య హెలీనాకి అర్థమవుతోంది. అతని కళ్ళల్లో స్నేహభావానికి మారుగా ఆరాధన కనిపిస్తోంది. ఆమెకి అది ఆనందాన్నిస్తోంది కూడా. గ్రీస్ సామ్రాజ్యంలోని ఆ పల్లెటూరిలో నికొలస్ ఓ చిన్న పాటి కథానాయకుడు. ప్రతీ ఆడపిల్లా అతని మీద మనసు పారేసుకుంటుంది. అతనితో మాట్లాడాలని చొరవ తీసుకుంటుంది. కానీ స్వతహా నెమ్మదస్తురాలు, తండ్రి చాటు బిడ్డ అయిన హెలీనా మాత్రం అతనికి దూరంగా మసలుకుంటుంది. ఆమెకీ అతనంటే ఇష్టమే.

దీపనృత్యం కూడా పూర్తయింది. పొద్దుపోవడంతో అమ్మాయిలందరూ జట్టుగా కలిసి ఇళ్ళకి వెళ్తున్నారు. నెమ్మదిగా హెలీనా పక్కకి చేరాడు నికొలస్.

"ఈ వసంతోత్సవంలో నువ్వు వనరాణిలాగా ఉన్నావు తెలుసా?" ఆమె చెవిలో గుసగుసగా చెప్పాడు.

పదహారేళ్ళ హెలీనా ఆ మాటలకి పరవశించిపోయింది. ఆమె శరీరం లతలా ఒణికింది. ఆమె చెయ్యిపట్టుకుని ఆపాడు నికొలస్. అమ్మాయిలందరూ గోలగా మాట్లాడుకుంటూ ముందుకి వెళ్ళిపోయారు. ఆ పున్నమిరాత్రి వారిద్దరూ ఆ బాట మీద మిగిలిపోయారు. ఆరడుగుల నికొలస్ నెమ్మదిగా వంగి, ఆమె చుబుకం పట్టుకుని పైకెత్తి చిగురుటాకులా కంపించే ఆమె పెదవులని ముద్దుపెట్టుకున్నాడు. వారిద్దరికీ అది తొలిముద్దు. ఆ పారవశ్యంలో కొద్దిసేపు అలాగే ఉండిపోయారు. నికొలస్ నెమ్మదిగా, అయిష్టంగా ఆమె పెదవులని వదిలి మృదువుగా చెప్పాడు.

"ఇంటికి వెళ్ళు. రేపు సాయంత్రం నేను, మీ ఇంటికి వచ్చి మీ నాన్నతో మాట్లాడతాను"

హెలీనా ఒక్క పరుగుతో తన మిత్రులని కలుసుకుంది. ఆ రాత్రి ఆమెకి ఎన్నో కలలు. అన్ని కలల్లోనూ నికొలస్, తనే. మూడో వ్యక్తికి చోటులేదు.

●●●

మర్నాడు హెలీనా స్నేహితురాళ్ళతో కలిసి గ్రామ సమీపంలోని అడవికి వెళ్ళింది. అడవి పూలని దండలా గుచ్చి మెడలో వేసుకుని, ఏటినీటిలో ప్రతిబింబం చూసుకుంటూ అనుకుంది 'అవును వనరాణిలాగానే ఉన్నాను.'

ఇంటికి వచ్చిన హెలీనా ఇంట్లో అందరూ ఆనందంగా ఉండటం గమనించింది. నికొలస్ తండ్రిని కలిసి ఉంటాడని ఊహించింది.

"అక్కడ ఏథెన్స్ నగరం చాలా అందమైనదిట. నువ్వెంత అదృష్టవంతురాలివి. ఈ పల్లెటూరిలో పుట్టి పెరిగినా నగరంలో ఉండబోతున్నావు." చెల్లెలు ఉత్సాహంగా చెప్పింది.

"ఏథెన్సా?" అర్థంకాక అడిగింది హెలీనా.

"అవును. ఏథెన్స్‌లోని గొప్ప విద్యావంతుడు సాక్రటీస్ నిన్ను పెళ్ళి చేసుకుంటానని కబురు చేసాడు. నేను ఇంకా నమ్మలేకపోతున్నాను" తల్లి సంతోషంగా చెప్పింది.

"ఏమిటీ?" కీచుగా అరిచింది హెలీనా.

"చూడు హెలీనా! సోక్రటీస్ గారికి గొప్ప విద్వాంసుడుగా ఎంతో మంచి పేరుంది. అది మన రాజుగారి దృష్టికి వెళ్ళిందా ఇక ఆయన ఆస్థాన విద్వాంసుడవుతాడు. నువ్వు రాణీగారి ముఖ్య స్నేహితురాలవుతావు. నువ్వు పుట్టినప్పుడే నాకు తెలుసు గొప్పదానివవుతావని. సోక్రటీస్ భార్యగా నీ పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందమ్మా" తండ్రి ఆమె భుజం మీద ఆప్యాయంగా తడుతూ చెప్పాడు.

ఆ తర్వాత సంఘటనలన్నీ చకచకా జరిగిపోయాయి. హెలీనా ఇక బయటకి వెళ్ళలేదు. వెళ్ళొద్దని ఆంక్షలు లేకపోయినా నికొలస్ ముఖం చూసే ధైర్యం ఆమెకి లేదు.

పెళ్ళిలో వరుడ్ని క్రీగంటితో చూసింది హెలీనా. పొట్టిగా లావుగా చిరుబొజ్జతో, కొద్దిగా బట్టతలతో ముదురుగా కనిపిస్తున్న అతన్ని చూసి హెలీనా మనసు మూగపోయింది. పెళ్ళి అనే ఉత్సవానికి పెద్దగా ప్రాధాన్యత లేదన్నట్లుగా అతను మాసిన గడ్డంతో, మురికి దుస్తులతో కొద్దిగా అసహనంగా ఉన్నాడు. పెళ్ళికూతురి అందచందాల మీద ఆసక్తి లేదన్నట్లుగా తన పక్కనే ఉన్న సహచరులతో ఏవో మాట్లాడుతూనే ఉన్నాడు తప్ప ఆమెని పట్టించుకోలేదు.

పెళ్ళికి వచ్చిన అతిథుల్లో నికొలస్‌ని గుర్తించింది హెలీనా జబ్బుపడి లేచినట్లుగా, కృంగిపోయి నీరసంగా ఉన్న అతను హెలీనాతో ఏకాంతంగా కలిసి చెప్పాడు.

"నేను ఆలస్యం చేసాను హెలీనా. ఆ రోజు ఉదయమే మీ నాన్నని కలవాల్సింది. ఇలా ఎందుకైంది అని ఇన్నిరోజుల నుంచి ఎన్నిసార్లు అనుకున్నానో, నన్ను నేను తిట్టుకున్నానో నీకు తెలుసా?"

శుష్కహాసం చేసింది హెలీనా.

"పెళ్ళి కూతురుగా ఎంత బావున్నావు హెలీనా. ఈ సౌకుమార్యాన్ని, నీ అందమైన చిరునవ్వుని ఎప్పటికీ కోల్పోవద్దు. హెలీనాకి, మిగిలిన వారికి గలతేడా అదే నీలోని ఆ సున్నితత్వం చూసే నిన్ను ఇష్టపడ్డాను తెలుసా?" ఆమె చెక్కిలిని మృదువుగా నిమిరి వెళ్ళిపోయాడు నికొలస్.

●●●

పెళ్ళికూతుర్ని తన వెంట తీసుకువెళ్తానని చెప్పాడు సోక్రటీస్. "ఇప్పటికే నా శిష్యులకి మూడురోజుల పాఠాలు పోయాయి. మళ్ళీ మళ్ళీ ఈ ప్రయాణాలు నేను చేయలేను. అలాగే మా వెంట ఎవరూ రానవసరంలేదు. మళ్ళీ వాళ్ళని దింపడానికి ఎవరో ఒకర్ని పంపాలి నేను" నిష్కర్షగా చెప్పాడు.

పదహారేళ్ళ హెలీనా తన భర్తగా చెప్పబడ ఆ వ్యక్తి వెంట, తమ పల్లెకి సుదూరంగా ఉన్న ఏథెన్స్ నగరానికి బయలుదేరింది. ప్రయాణంలో కూడా అతను పెద్దగా ఏం మాట్లాడలేదు. మాట్లాడాలని ఆమె కోరుకోలేదు కూడా. మనసంతా నికొలస్ నిండి ఉండటంతో ఈ కొత్తవ్యక్తికి చోటు లేకుండా పోయింది. దాంతో అతను దగ్గరివాడులా కాక అపరిచితుడిగా అనిపించాడు.

ఏథెన్స్ నగరంలోని ఓ సన్నటి సందులో ఓ చిన్న కుటీరం ముందు ఆగింది వారు ప్రయాణిస్తున్న గుర్రబ్బండి. ఆ ఇంటి బయట అరుగుల నిండా చాలామంది కూర్చుని ఉన్నారు. సోక్రటీస్ చెంగున బండి దిగి ఆ అరుగు మీద కూర్చుని అందరితో ఆనందంగా మాట్లాడటం మొదలుపెట్టాడు. హెలీనా నెమ్మదిగా బండి దిగి తన పెట్టెని దింపుకుని తలవంచుకుని నిల్చుండిపోయింది. ఆమె ఉనికిని గుర్తించినవారెవరూ లేరక్కడ. ఆమెకి తెలిసిన గ్రీకు భాషలో, ఆమెకి అర్థంకాని ఏవేవో సంభాషణలు చెవులబడుతున్నాయి.

అటుగా వెళ్తున్న ఒక రైతు హెలీనాని, సోక్రటీస్‌ని చూసి జరిగింది అర్థం చేసుకున్నాడు.

"కొత్త పెళ్ళికూతుర్ని గుమ్మంలోనే ఉంచి ఏమిటిది గురువుగారూ? ముందు ఆమెని లోపలకి తీసుకెళ్ళండి" మందలించాడు.

అప్పుడే ఆమె గుర్తుకొచ్చినట్లుగా సోక్రటీస్ ఆమె వైపు చూసి, తన శిష్యుల్లో ఒకరి వంక చూసాడు. అతను అరుగు దిగి వచ్చి హెలీనా పెట్టెని అందుకుని లోపలికి నడిచాడు. హెలీనా కూడా ఆయన వెనకే నడిచింది. లోపల ఒక పెద్దగది. దుమ్ము, ధూళి, బూజులతో నిండివుంది. పెద్దగా సామానేమీ లేదు. ఒక కుక్కిమంచం. దానిమీద మాసిన బట్టల కుప్పలు ఒక మూల పొయ్యి. నాలుగైదు పాత్రలు ఉన్నాయి. పెట్టెని లోపల పెట్టిన శిష్యుడు బయటకి పరిగెత్తాడు.

పదిగంటల బండి ప్రయాణంతో అలిసిపోయిన హెలీనా ఆ మంచం మీద బట్టలని కింద పడేసి ఆకలితో అలాగే నిద్రపోయింది. ఒకరాత్రి వేళ తన పక్కన ఎవరో ఉన్నట్లుగా అనిపించి కళ్ళు తెరిచి చూసింది. పక్కనే సోక్రటీస్ పడుకుని ఉన్నాడు. ఇద్దరికీ ఇరుకుగా ఉన్న ఆ మంచం మీద ఆమెకి అతి సన్నిహితంగా పడుకున్న అతను చెప్పాడు.

"మనిషి జీవితంలో వివాహం కూడా ముఖ్యం. దాంపత్య జీవితం వల్లే జాతి నిలబడుతుంది అని నా విశ్వాసం. నీ వల్ల నాకు నీ అంత అందగాడు, నా అంతటి మేధావి అయిన కొడుకు కావాలి."

అడవిలో ఏటి ఒడ్డున పూల పరుపు మీద ప్రకృతి సాక్షిగా నికొలస్‌తో తన సమాగమం జరగాలని ఊహించుకున్న హెలీనా కలలకి విరుద్ధంగా ఆ గదిలోని కుక్కిమంచంలో సోక్రటీస్‌తో ఆమె శారీరకంగా అతనికి భార్య అయింది.

"చాలా ఇరుకుగా ఉంది. నువ్వు కింద పడుకుంటావా?" పావుగంట తర్వాత అడిగాడతను.

లేచి దుస్తులు సరిచేసుకుని కటిక నేలమీద పడుకున్న హెలీనాకి నిద్ర రాలేదు. దుఃఖం కూడా ఘనీభవించింది. కానీ ఆమెకి ఆశ్చర్యం కలిగిన విషయం ఏమిటంటే, అతను తన ఆకలిని తీర్చుకున్నాడు కానీ భార్య ఆకలిని పట్టించుకోలేదు. తమ ఊరిలో తిన్న భోజనం. లేపి అన్నం పెట్టాలన్న ఆలోచన లేని వ్యక్తి తాత్త్విక విచారం చేసే గొప్ప తత్త్వవేత్త!

●●●

మర్నాడు ఉదయమే నిద్రలేచిన హెలీనా పరిస్థితులతో రాజీపడక తప్పదు అని రాత్రే నిర్ణయించుకోవడం వల్ల చకచకా ఇల్లంతా సర్దేసింది. వంట సామాను ఉన్నాయి పదార్థాలేమీ లేవు.

నిన్న తన పెట్టె పట్టుకుని లోపలికి వచ్చిన శిష్యుడు లోపలికి వచ్చి అడిగాడు.

"గురువుగారింకా లేవలేదా? ఏమైనా కావాలా అమ్మా? మా అమ్మ కనుక్కురమ్మంది"

దాదాపు తన ఈడే ఉన్న అతను తనని 'అమ్మ' అనడం కొంచెం ఎబ్బెట్టుగా అనిపించింది హెలీనాకి.

"వంట చేయడానికి సంబారాలేమీ లేవు.." అర్ధోక్తిగా ఆగింది.

"మీ గురువుగారు లేచాక దుకాణానికి వెళ్ళి తెస్తారులే."

"అయ్యో! ఆయనకి ఇలాంటి లౌకిక విషయాల చెపితే కోపం అమ్మా. నేను తెస్తాను." వాడు పరుగున వెళ్ళిపోయాడు.

పావుగంట తర్వాత నిద్రలేచిన సోక్రటీస్‌తో చెప్పింది.

"మీ శిష్యుడు సంబరాలు తేవడానికి వెళ్ళాడు. మీరు ఈలోగా స్నానం చేయండి"

"ఆడవారు అధికంగా మాట్లాడితే నాకు ఇష్టం ఉండదు" సగంలోనే ఆమెని ఆపుతూ చెప్పి స్నానాలగదిలోకి వెళ్ళిపోయాడతను.

●●●

సోక్రటీస్‌తో హెలీనా జీవన ప్రయాణం మొదలైంది. పల్లెటూరిలో ఏ చీకూ చింతా లేకుండా లేగదూడలా హాయిగా గడిపిన హెలీనాకి ఇక్కడ తెల్లవారిందంటే భయం. ఏ పూటా కడుపునిండా తినడానికి సరిపోని ఆహారమే. గురుకులం నడుపుతున్న సోక్రటీస్ శిష్యులలో చాలామంది పేదవారే. అతని అరాచకవాదం ధనికులకి నచ్చక వారి పిల్లలని ఇక్కడికి పంపరు. దాంతో గురుదక్షిణగా అతి తక్కువ మొత్తం దొరుకుతుందాయనకి. కానీ సోక్రటీస్ ఈ ధనం, ఎక్కువ, తక్కువల గురించి ఏనాడూ ఆలోచించడు. ఆర్థిక అసమానతలమీద, విలువల మీద ఆయన కేవలం తత్త్వ విచారాన్ని మాత్రమే చేయగలడు.

హెలీనా ఈ ఆర్థిక ఇబ్బందులతో తలమునకలయ్యేది. ఆ రోజుకి కడుపు నిండితే అమ్మయ్య అనుకునేది. ఒక్కోసారి ఇద్దరికి చేసిన ఆహారాన్ని సోక్రటీస్ తన శిష్యులతో సహా వచ్చి వారికీ పెట్టమనేవాడు. ఆమె నిస్సహాయతని అర్థం చేసుకున్న శిష్యులే ఆకలి

కావడంలేదని ఇంటి దగ్గర తినొచ్చామని అబద్ధాలు చెప్పి తప్పించుకునేవారు. ఇంట్లో ఉందా లేదా, రోజూ భోజనం ఎక్కడినుంచి వస్తోంది అన్న స్పృహ లేకుండా సోక్రటీస్ ప్రవర్తించేవాడు. ఆయన 'తన చేతులతో ధనాన్ని ముట్టను' అని చెప్పేవాడు.

రోజులు గడిచే కొద్దీ హెలీనాలో సున్నితత్వం మాయమై, ఆ స్థానంలో కరుకుదనం ప్రవేశించింది. పెళ్ళినాటి బట్టలు చివికి, వదులుగా వేళ్ళాడుతున్నాయి. ఎముకల పోగులా మారిన హెలీనా ఏనాడూ కంటినిండా సుఖనిద్ర పోలేదు. 'అక్కా ఏథెన్స్ నగరం అద్భుతంగా ఉంటుందిట. నువ్వు ఎంత అదృష్టవంతురాలివి రా అన్న చెల్లెలి మాటలు గుర్తొచ్చినప్పుడు మాత్రం పాలిపోయిన ఆమె పెదవులమీద ఓ శుష్క హాసం కనిపిస్తుంది. గూడుబండి ఇంటి ముందుకి వచ్చేదాకా తనకి ఇల్లు వచ్చిందనే తెలీదు. నగర ప్రవేశం గురించి కానీ విశేషాలని కానీ తన భర్త చెప్పలేదు. వచ్చినప్పటినుంచి గుమ్మం దాటి బయటకి పోలేదు. స్వేచ్ఛా విహంగంలాగా స్నేహితురాళ్ళతో విహరించే హెలీనాకి ఇంటి పట్టున పంజరంలో పక్షిలాగా ఉండటం దుర్భరంగా ఉంది. దానికి తోడు అనురాగంగా మాట్లాడేవారు కాని, బాధలని పంచుకునే వారు కానీ లేని ఏకాకి జీవితమైపోయింది. ప్రయోజనం లేని ప్రేమ మాటలకి సోక్రటీస్ వ్యతిరేకి.

ఇప్పుడామెకి తన పల్లె జీవితం కలలోలా అస్పష్టంగా కనిపిస్తోంది. కలలు రావడం లేదు. అసలు కలలు కనేంత మనసూ లేదు. ఊహలు లేవు. ఏపూట కాపూట కడుపు నింపుకోడానికి పడే తాపత్రయంలో అన్నీ అడుగంటిపోయాయి. శిష్యులని గురుదక్షిణ కోసం వేధిస్తుంది. వాళ్ళు ఉచితంగా అప్పుడప్పుడూ వెచ్చిచ్చే పాలు, పళ్ళులాంటి వాటికి ఆశపడుతుంది. దాన్ని సోక్రటీస్ గుర్తించాలని ఆశిస్తుంది. కానీ ఆయన ఇవేమీ పట్టని వేదాంతి. వేళ తప్పిన భోజనం, మెదడు వేడెక్కినప్పుడు సాంత్వనగా శృంగారం తప్ప ఆయనకేమీ పట్టవు.

ప్రేమరాహిత్యంతో అలమటించి పోతుంది హెలీనా. తనకి ఓ బిడ్డపుడితే బావుండు వాడి ఆటపాటలతో గడిపేయ్యచ్చు అని ఆశపడసాగింది.

●●●

మూడేళ్ళు గడిచాయి. హెలినా మరింత శుష్కించిపోయింది. గయ్యాళిగా మారింది. పక్కవారికి కూడా వినపడనంత నెమ్మదిగా మాట్లాడే హెలీనా ఇప్పుడు పెద్దగా తప్పించి మంద్ర స్వరంతో మాట్లాడటం లేదు. కడిగిన ముత్యంలా ఉండే ఆమె అద్దంలో చూసుకుని ఎన్నో రోజులైంది. స్త్రీత్వం అనేదే లేని ఎండు కొమ్మలా ఉంది హెలీనా.

ఆ రోజు హెలీనా వేళ్ళతో లెక్కలు పెట్టుకుని కడుపు చూసుకుని చాలా కాలం తర్వాత ఆనందించింది. తనకో పిల్లవాడు పుడితే ఎంత బావుంటుందో అని ఊహల్లో తేలిపోయింది. ఆ రాత్రి సోక్రటీస్‌కి ఆ విషయం చెప్పింది. ఆయన పెద్దగా స్పందించలేదు.

"అది చాలా సహజమైన పరిణామం. ఎలా జరగాలని ఉంటే అలాగే జరుగుతుంది" నిర్లిప్తంగా చెప్పాడు.

అలవాటైన ఆ ధోరణిని ఆమె తల్లి కాబోతున్నాననే ఆనందంతో క్షమించేసింది.

●●●

ఓ రోజు మధ్యాహ్నం భోజనానికి వచ్చిన భర్తతో చెప్పింది. "మనకో బిడ్డపుట్టబోతున్నాడు. ఈ దరిద్రంలో వాడిని ఎలా పెంచగలం? మీరు కొంత తెలివి తెచ్చుకుని శిష్యుల నుంచి సంభావనలు ఖచ్చితంగా స్వీకరించండి."

పొలమారేంత పెద్దగా నవ్వాడు సోక్రటీస్.

"గ్రీకు దేశంలోని మేధావులందరిలోనూ, అధికమేధావిగా చెప్పుకునే నన్ను తెలివి తెచ్చుకోమంటున్నావా?"

"మరి? పుట్టే బిడ్డని ఎలా సాకుదామనుకుంటున్నారు?" ఉక్రోషంగా అడిగింది.

"ఇంతకాలం మనం ఎలా బ్రతికామో అలాగే, ఆ ఏర్పాటు చేసే దేవుడు వాడిని భూమి మీదకి పంపుతాడు" లేచి వెళ్ళిపోయాడాయన.

●●●

అదే రోజు నికొలస్ ఏథెన్స్ వచ్చాడు. అతనికి ఎప్పుడెప్పుడు హెలీనాని చూస్తానా అని ఆత్రంగా ఉంది. హెలీనా ఎలా ఉండి ఉంటుంది? కొంచెం ఒళ్ళు చేసి మామిడి పండులా మిసమిసలాడుతూండి ఉండొచ్చు. ఇరవై ఏళ్ళ ప్రాయంలో ఆమె అందాలన్నీ పూర్తి రూపం సంతరించుకుని ఉండొచ్చు. ఇన్నేళ్ళకి కుదిరింది రాజధానికి రావడం. నికొలస్‌కి గురుకులాల గురించి, ఆ గురువులు సంపాదించే ధనం గురించి అవగాహన ఉంది. అందులోనూ సోక్రటీస్ లాంటి గురువు ఎంత డబ్బు సంపాదిస్తాడో కూడా అతనికి తెలుసు. హెలీనా అదృష్టవంతురాలు అనుకున్నాడు.

నగర వీధుల్లోని వారిని సోక్రటీస్ ఇంటి గురించి అడిగాడు. వారు చెప్పిన దారిలో అతను ఆ ఇల్లు చేరుకున్నాడు. ఇంటి అరుగుల మీద అనేక మంది కూర్చుని ఉన్నారు. మధ్యలో సోక్రటీస్ చమత్కారంగా మాట్లాడుతున్నాడు. నికొలస్‌ని ఎవరూ పట్టించుకోలేదు.

●●●

నీళ్ళు మోసుకొస్తున్న హెలీనా కాలు జారి అమ్మో అనే కేకతో కింద పడింది. కడుపులో విపరీతమైన నొప్పి. విలవిలలాడిపోయింది. లేవలేక పెద్దగా అరిచింది.

"ఓసారి ఇటొస్తారా?"

కర్ణకఠోరమైన ఆ కంఠస్వరానికి అరుగుమీదున్న వాళ్ళు మాట్లాడటం ఆపేసారు. నికొలస్ ఉలిక్కిపడ్డాడు.

"కంగారు పడకండి. నా భార్యకి ఆశాభూతం పట్టుకుంది. డబ్బులు సంపాదించమని ఒకటే వేధిస్తోంది" సోక్రటీస్ చెప్పాడు.

నమ్మలేకపోయాడు నికొలస్. తమ పల్లెలోనివారికి ధనం అవసరంరాదు. అలాంటిది హెలీనా ఇలా మారిందా?

ఇంతలో ఓ విద్యార్థి వచ్చి సోక్రటీస్ ముందు వినయంగా నిలబడి అడిగాడు.

"గురువుగారూ నా తల్లితండ్రులు నాకు పెళ్ళి చేయాలని తొందరపడుతున్నారు. మీ సలహా ఏమిటి?"

"చేసుకో. ఆమె అనుకూలవతి అయితే సుఖపడతావు. గయ్యాళి అయితే నాలా వేదాంతివి అవుతావు." హాస్యంగా చెప్పాడు సోక్రటీస్.

అంతా పెద్దగా నవ్వారు.

కిందపడి లేవడానికి ప్రయత్నిస్తున్న హెలీనాకి ఆ నవ్వులు పుండుమీద కారం రాసినట్లుగా వినిపించాయి. తనకి గర్భస్రావం అయిందని గ్రహించిన ఆమె బాధతో, నొప్పితో పిచ్చిదైపోయింది. ఆవేశంగా లేచి బిందెని తీసుకుని బయటకి వచ్చి ఆ బిందెడు నీళ్ళు ఆయనమీద కుమ్మరించి పెద్దగా అరిచింది.

"రమ్మన్నానా? ఎందుకు పిలిచానో తెలుసుకోరా?"... అరుస్తూ తలెత్తి చూసిన హెలీనాకి తెల్లబోతూ తనవంకే చూస్తున్న నికొలస్ కనిపించాడు.

గడ్డిలాగా ఎండిపోయిన తైల సంస్కారం లేని జుట్టు, మురికిగా వదులుగా వేలాడుతున్న దుస్తులు, వాటి మీద రక్తపు మరకలు, అసహజంగా ముడతలు బడిన శరీరం, బుగ్గలు లోతుకుపోయి అందవిహీనంగా కనిపిస్తున్న ముఖం. మొరటుగా, కరుకుగా పెద్దగా అరుస్తున్న కంఠం..

నికొలస్‌ని చూసిన హెలీనా ఆ బిందెని అక్కడే పారేసి, రెండు చేతుల్లో మొహం దాచుకుని కెవ్వున అరుస్తూ లోపలికి పరిగెత్తింది.

●●●

ఆ తర్వాత హెలీనా భౌతికంగా ఏమైందో తెలీదు కానీ మానసికంగా ఆ క్షణంలోనే మరణించింది. తన తండ్రి కోరిక ప్రకారం సోక్రటీస్ భార్యగా చిరస్థాయిగా నిల్చిపోయింది - కాకపోతే గయ్యాళిగా.

●●●

***ప్రతి విజయవంతమైన పురుషుడి వెనక ఓ స్త్రీ ఉన్నట్లే, ప్రతీ గయ్యాళి భార్య వెనక ఓ అరసికుడైన భర్త ఉంటాడు అనే అభిప్రాయంలో రాసానిది. కాలమాన పరిస్థితులు, చరిత్ర అంతా కల్పితమే. సోక్రటీస్, ఆయన భార్య మాత్రమే నిజం.***

***- రచయిత్రి***

●●●

# నన్ను మరచిన వేళ — విజయ (కర్రా) గంటి

**పన్నెండో గది తలుపు నెమ్మదిగా తెరుచుకుంది...** అప్పటి వరకు బందీగా వున్న సంధ్య మెరుపు వేగంతో మాయమయ్యింది. కదిలి పోతున్న అరుణావర్ణ సౌందర్యాన్ని తలుపు పక్కనే నిల్చుని చూస్తుండిపోయాడు రేడియో.

అంతకు అరగంట క్రితం...

"మనిషి స్పర్శ. కంటి చూపు... ఆరాధనలకి మనమే కేంద్రం అయ్యాం. మనిషికి మనిషికి దూరం పెంచి పెంచి మనకి బానిసలని చేసుకోవడంలో విజయాలు సాధిస్తూనే వున్నాం. మనని సృష్టించిన మనిషే మనకి దాసోహమంటున్నాడు. చాపక్రింద నీరులా... నీటి అడుగున నాచులా... చాకచక్యంగా మానవ జీవితాల్లోకి చొచ్చుకొని పోతున్నారు మనవాళ్ళు. మనం చల్లిన మత్తులో ఎవరికివారు తమ చుట్టూ ఒక మిథ్యా ప్రపంచాన్నీ సృష్టించుకొని... ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా జీవితాలని గడిపేస్తున్నారు" చెప్పాడు టీవి సీనియర్.

కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లు, పాడ్లు, ప్యాడ్లు, ట్యాబ్లెట్లు, గేం వీడియోలు, మ్యూజిక్ ప్లేయర్లు... తో నిండి వున్న ఆ హాలు కలతరధ్వనులతో మారు మ్రోగిపోయింది.

"ఇంట్లో, ఆఫీస్‌లో, కాలేజ్‌లో, హోటల్స్‌లో... వెకేషన్‌లో ఎక్కడికి వెళ్ళినా కంప్యూటర్, ఇంటర్నెట్ సదుపాయం వుందా అనే తప్ప భోజన సదుపాయం వుందా అని ఆలోచించడం లేదు మనిషి. కుటుంబంలో మనుషులకన్నా కంప్యూటర్ల సంఖ్యే ఎక్కువవుగా వుంటున్నాయి. ఇక గేం వీడియోలు మ్యూజిక్ ప్లేయర్లు లేని ఇల్లే కనిపించదు." మళ్ళీ చప్పట్లు.

టీవి సీనియర్ మళ్ళీ చెప్పసాగాడు. "ఈ డిజిటల్ ఏజ్‌లో మనిషికన్నా మనమే మిన్నా అని ప్రూవ్ చేస్తున్నారు మన స్మార్ట్ ఫోన్, ఐప్యాడ్, ఐపాడ్లు. అవి చేతిలో లేకుండా యువత కంటికే కనిపించరు. గర్ల్ ఫ్రెండ్, స్మార్ట్ ఫోన్లలో ఎదో ఒకటే ఎన్నుకోమంటే ఫోన్

ఎంచుకునే వాళ్ళే ఎక్కువమంది వుంటారు. అమ్మాయిలయినా అంతే''. ఈసారి అందరూ నవ్వుతూ స్మార్ట్ ఫోన్ కేసి చూసారు. ఆమే ఓరగా ఓసారి కంప్యూటర్ కేసి చూసి సన్నగా నవ్వింది.

వెనుక వరసలో కూర్చుని ఇదంతా చూస్తున్న రేడియో నెమ్మదిగా లేచి బయటికి వచ్చాడు. అతనినెవరూ పట్టించుకోలేదు. పట్టించుకోరని కూడ తెలుసు. ఏదో కసి... మరేదో చిరాకు. తనొక్కడే ఈ ప్రపంచంలో వున్నప్పటి రోజులు గుర్తుకువచ్చాయి. అప్పట్లో మనిషి జీవితంలో తనో చిన్న భాగం కాని ఇప్పుడో... తనలాంటి ఎలక్ట్రానిక్ పరికరాల్లోనే మనిషి జీవితాన్ని వెతుక్కుంటున్నాడు. ఉదయం లేచినప్పటినుండి నిద్రలోకి జారిపోయే వరకు అవే అతని లోకం.

వచ్చి వచ్చి అతను మూసివున్న పన్నెండో గది దగ్గర ఆగిపోయాడు. తమ కుటుంబంలోకి అడుగు పెట్టే ప్రతివాళ్ళకి ఆ తలుపులు తెరవకూడదని చెప్పే పెద్దవాళ్ళలో అతనూ ఒకడు. తాళం చెవి అతని దగ్గరా వుంది. నెమ్మదిగా తాళం తిప్పి తలుపు తోసాడు.

గది తలుపు నెమ్మదిగా తెరుచుకుంది... అప్పటి వరకు బందిగా వున్న సంధ్య మెరుపు వేగంతో మాయమయ్యింది. కదిలి పోతున్న అరుణావర్ణ సౌందర్యాన్ని తలుపు పక్కనే నిల్చుని చూస్తుండిపోయాడు రేడియో.

●●●

మెటాలిక్ వాతవరణంలో ఏదో తెలియని అలజడి... ఎక్కడో ఏదో తెలియని మార్పు. పరిగెత్తుకొని వచ్చి చెప్పిందో పిల్ల ప్యాడు 'పన్నెండో గది తలుపు ఎవరో తెరిచారని'.

ఒక్కసారిగా కలకలం. ''ఎవరు? ఎవరు తెరిచి వుంటారు?'' ప్రశ్నలు... కేకలు...

''ఆపండి... ఆపండి... తిరిగి ఎలాగయిన పట్టి బంధించండి!'' ఆయాసపడుతూ అరిచాడు సీనియర్ టీవి.

అందరూ హడావిడి పడుతూ లేస్తుండగా ఐప్యాడ్ గట్టిగా అరిచి చెప్పింది ''ఆగండి! కంగారు పడకండి! ఇప్పుడొచ్చిన నష్టమేమిలేదు''. అందరూ ఆగి ఏమిటన్నట్లు చూసారు. ''తప్పించుకున్న సంధ్యనెవరూ గుర్తించటంలేదు. అందరూ ఇటు చూడండి!''.

తెరలు తెరలుగా దృశ్యాలు కదిలి పోతున్నాయి. ''నిజమే! పాపం! ఎవరూ పట్టించుకోవటం లేదు'' అన్నారెవరో.

మళ్ళీ చప్పట్లు వినిపించాయి దూరంగా వెళ్ళిపోతున్న రేడియోకి.

●●●

కనుచూపు మేర ప్రపంచమంతా అద్భుతమయిన వెలుగు పరుచుకుంది. వెండి వెన్నెల్లో దోసెడు సూర్య కాంతి కలిపి చల్లినట్లు కొండలూ, లోయలూ, సెలయేళ్ళు, పచ్చిక బయళ్ళూ... సరికొత్త రంగులని సంతరించుకున్నాయి. పడమటి దిక్కున అరుణిమని చెంపలకి అద్దుకొని... సింధూర వర్ణం దుస్తులు ధరించి... బంగారు జలతారు మేలి ముసుగులో... వెండి మబ్బుల పల్లకీ ఎక్కి... వచ్చింది సంధ్య. పక్షిని, పశువుని, మనిషిని, మానుని, పుడమి పైన అణువణువుని తాకి మరీ చెపుతోంది ' ఇదిగో... నేనొచ్చాను సుమా! మీ కోసమే! మీ ఆనందం కోసమే!'.

తనువు పులకరించి... తరువులు నాట్యం చేస్తే... చిటారు కొమ్మన చిన్నిపిట్టలు చిరు చిరు శబ్దాలు చేస్తూ ఉయ్యాలలూగాయి. గూటికెగిరి పోబోయిన గువ్వల జంట గాలి పాట వింటూ గమ్యాన్ని మరచి పోయాయి. అడవిలో జింక పిల్లలు అధాటుగా లేచి చెంగుచెంగున గంతులు వేస్తూ పరిగెత్తసాగాయి.

ఇటు జనారణ్యంలో ఎటు చూసిన... సంధ్యారాకకి స్పందించని జనం. నడుస్తూ... కార్లలో... బస్సు స్టాపుల్లో... రైల్వే స్టేషన్లలో... ఎయిర్‌పోర్ట్‌లలో - చెవిలో యంత్రాలతో... చేతిలో యంత్రాలతో... కళ్ళుండి సంధ్య వెలుగులు చూడలేరు చెవులుండి సంధ్యారాగం వినలేరు.

పరిస్థితి అర్థం అవడానికి సంధ్యకి ఎంతో సమయం పట్టలేదు. తను బందీ అయిన ఆ రోజుకి ఇప్పటికీ పెద్ద మార్పేమి లేదు. ఓ వైపు ఆటవేళ అంటే తెలియని పిల్లలు ఇంతకు పూర్వం లాగే స్కూల్ నుండి కోచింగ్ సెంటర్లకి వెళ్తున్నారు. మరో వైపు విరామం తెలియని పెద్దలు, పగలుకి రాత్రికి తేడ తెలియకుండా ఇంతకు పూర్వం కన్నా ఎక్కువ సమయం పనిచేస్తున్నారు. విశ్రాంతిగా గడపగలిగే వాళ్ళు, లేని వాళ్ళూ కూడ ఎలక్ట్రానిక్ యంత్రాలలో విరామాన్ని వెతుక్కుంటున్నారు. మనిషి అభిరుద్ధికి ఎలక్ట్రానిక్ పరికారాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. అందుకు తనూ ఒప్పుకుంటుంది. కాని బాంధవ్యాలని ఆరోగ్యాన్నీ లెక్క చేయకుండా ఆవే లోకం అంటే ఎలా? అతి సర్వత్రా వర్జయేత్ కదా!

ఇలాంటి రోజే ఓ రోజు. టీవి సీరియల్స్ ప్రాచుర్యం పెరిగి వీధులన్నీ నిర్మానుష్యం అయిన రోజు. తను ఆవేశం పట్టలేక నిలదీసి అడగడానికి వెళ్తే పట్టి గదిలో బంధించారు ఆ ఎలక్ట్రానిక్ యంత్రాలు. మళ్ళీ అలాంటి పొరపాటు చెయ్యకూడదు. ఈ మనుషుల మనసులని కదపాలి. తన వైపు ఆకర్షించుకునేలా చెయ్యాలి. సంధ్యా సమయంలో ప్రకృతి ఒడిలో పిల్లలు ఆడుకున్నా... పెద్దలు విశ్రాంతి తీసుకున్నా కలిగే ఆనందం వాళ్ళకి తెలియజేయాలి. అందుకోసం తను ప్రతి రోజు ఈ జనంలోకి వస్తుంది. ఎన్ని కోట్ల సాయంత్రాలయినా శ్రమ పడుతుంది.

అదిగదిగో ఆమె ఎవరో పాపనెత్తుకొని గుమ్మంలో నిలబడి ఎదురుచూస్తోంది. ఆమె భర్త అప్పుడే కారు దిగి లోపలికి వచ్చాడు. నవ్వుతున్న పాప బుగ్గలు నిమిరి అదే చేత్తో అతని నుదుటిని తాకింది సంధ్య. ఏదో సందేశం అందినవాడిలా "నేను బట్టలు మార్చుకొని వస్తాను. పార్క్‌కి వెళ్దాం" అన్నాడతడు.

"ముందు కూర్చోండి. మీకొకటి చూపించాలి" అంటూ ఆమె పాపని క్రిందకి దింపి చేతిలో ఐప్యాడ్ పెట్టింది. ఆ సంవత్సరం పాప తన చిట్టి చిట్టి వేళ్ళని చకచకా కదుపుతూ... నొక్కుతూ... కేరింతలు కొట్టసాగింది.

"వావ్! ఇదెప్పటినుండి" ఆశ్చర్యం.

"ఇవాళే! ఎప్పుడు చూసి నేర్చుకుందో తెలియదు. ఎంత బాగ ఆపరేట్ చేస్తోందో!" అంది ఆమె మురిపంగా.

"నేను డ్రెస్ ఛేంజ్ చేసుకొని వచ్చి రికార్డ్ చేస్తాను. ఈ రాత్రికే యూ ట్యూబ్‌లో పెట్టేద్దాం".

సంధ్య నిరాశగా వెనక్కి తిరిగింది. పక్కింటి ముందు పదినుండి పదిహేను వయసున్న పిల్లలు. సంధ్య వాళ్ళ చుట్టూ తిరుగుతూ అంది 'రండి.. పరిగెత్తండి... హాయిగా ఆడుకోండి.'

"రండిరా పార్క్‌లో ఆడుకుందాం" అన్నాడొకడు.

"లేదురా! మా డాడి కొత్త గేం కొన్నాడు. అందుకే పిలిచాను".

అందులో నలుగురు "ఒకే! కూల్!" అంటూ అరుస్తూ ఇంట్లోకి, మిగిలిన ముగ్గురూ పార్క్‌లోకి పరిగెత్తారు.

వాళ్ళ వెనకే పార్క్‌లోకి నడిచింది సంధ్య. ప్లే గ్రౌండ్‌లో కొంతమంది పిల్లలు క్రికెట్ ఆడుతున్నారు. బిపి, షుగర్లు తగ్గించుకునే ప్రయత్నంలో ఓ నలుగురు పెద్దవాళ్ళు గబగబా నడుస్తున్నారు. బెంచ్ పయిన ఓ నడివయసు జంట కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళని చూస్తే మాలతి గుర్తుకొచ్చింది సంధ్యకి. మాలతికి తనపట్ల వున్న ఆరాధన... దాన్ని ఆమె చెప్పిన తీరు, నిన్నో మొన్నో జరిగినట్లు గుర్తుకొచ్చింది.

●●●

ఒకానొక సాయంత్రం వేళ. ట్యుటోరియల్స్, కాంపిటీషన్ పరీక్షలు అంటే తెలియని పిల్లలు స్వేచ్ఛా విహంగాలకి మళ్ళే ఆడుకుంటున్నారు. జుట్టుకి రంగు, వంట్లో కొలెస్ట్రాలు వుంటాయని తెలియని పెద్దలు అక్కడక్కడా గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు. కొందరు గృహిణిలు తులసి కోట దగ్గర సంధ్యాదీపం వెలిగిస్తున్నారు.

అతనామె కోసం డాబా పైన ఎదురు చూస్తున్నాడు. మొదట మల్లెల పరిమళం, తరువాత కాలి మువ్వల సడి, విడి విడిగా కట్టిన పసుపు తాళ్ళు కలివిడిగా కలిసిపోయి సూత్రాలు ఒకదాని నొకటి తాకి చేసే చిరు సవ్వడి - కొత్త పెళ్ళి కూతురు, నెమ్మదిగా మెట్లెక్కి పైకి వచ్చింది. ఆ మేడ పైన వాళ్ళిద్దరే. ఒకరికెదురుగా ఒకరు.. ఊసులాడుకునే జంట పక్షుల్లా.

అతను చెపుతున్నాడు, తన కలలు, కోరికలు, ఆశయాలు. ఆమె వింటోంది నవ్వుతూ. మధ్య మధ్య అతని వేళ్ళు ఆమె చెవి జూకాలని మీటు తున్నాయి. ముంగురులని సద్దే నెపంతో ఆమె చెంపలని తాకుతున్నాయి. "మరి నీ సంగతేమిటి? నువ్వేమి చెప్పవే? నీ ఇష్టాలు... నీ కోరికలు..." అడిగాడతడు.

ఆమె ఒకసారి చుట్టూ చూసింది. తూరుపు వయిపు నీలి ఆకాశం, వెండి మబ్బులు, బారులు తీరి వెళుతున్న కొంగలు. పడమటికొండల అంచున అరుణ కాంతి... "ఇదే!" అంది ఆమె అతనికేసి తిరిగి ఉద్వేగంగా.

"ఏమిటి?" అన్నాడతడు ఆశ్చర్యంగా. అతని అరచేతుల మీద తన చేతులు వుంచి, కళ్ళలోకి చూస్తూ చెప్పింది మాలతి

"ఇలాంటి ప్రతి సాయంత్రం నువ్వు నాతో గడపాలి. నీ సాయంత్రాలన్నీ నావి కావాలి".

"ఓస్! అంతేనా!" అన్నాడతడు తేలికగా.

"అంతే" అంటూ అతని మెడ చుట్టూ చేతులు వేసి మరింత దగ్గరయింది.

●●●

ఇప్పుడెక్కడుంది మాలతి? తలుచుకోగానే సంధ్య ఓ పెద్ద భవంతి ముందుకు వచ్చి నిల్చుంది. రెండతస్తుల ఇంద్ర భవనంలాంటి ఇల్లు. సరాసరి మేడ పైకి వెళ్ళింది. ఎవరూ లేరు. క్రిందకి దిగి హాల్లోకి వచ్చింది. అక్కడ కనిపించింది మాలతి. వయసు మూడు పదులు, చుట్టు కొలత మూడింతలు పెరిగి సోఫాలో కూర్చుని టీవిలో సీరియల్ చూస్తూ కిటికీ ప్రక్కగా పాకిన సన్నజాజి పరిమళాలని కానుకగా తెచ్చి ఇస్తూ 'మాలతీ! నేను... నిన్ను వెతుక్కుంటూ వచ్చాను' అంది సంధ్య ఆమె చెవి దగ్గర గుసగుసగా.

మాలతి ఒకసారి కదిలి తిరిగి దీక్షగా చూస్తోంది 'అమ్మ పుట్టిల్లు మేనమామకే తెలుసు' సీరియల్. మూడు తరాలా ఫ్యామిలీ కథ! రెండున్నర ఏళ్ళుగా ప్రచారమవుతోంది. తల్లిని చంపింది మేనమామే అని తెలిసి, అతనిపై పగ సాధించడానికి తన కోడలితో కలిసి ప్లాన్ చేస్తోంది హీరోయిన్. ఇంతలో మాలతి పక్కన వున్న సెల్ ఫోన్ బర్మంటూ కదిలింది. విసుగ్గా కదిలి చేతిలోకి తీసుకుంటే భర్త నుండి టెక్స్ట్ మెసేజ్ - 'మరో క్లయింట్ మీటింగ్... రావడం లేటవుతుంది... నువ్వు డిన్నర్ చేసెయ్!.'

"రోజు పాడే పాటేగా" విసుగ్గా అంటూ ఫోన్ పక్కకి విసిరేసి లేచి కిటికీ దగ్గరికి నడిచింది మాలతి.

అదే సమయమని 'అతను రాకపోతేనే. నాతో సమయాన్ని గడుపు. బయటకి వెళ్దాం! లేదా మేడ పైకి వెళ్దాం! ఈ సంధ్యాసమయాన్నీ నువ్వయినా ఆస్వాదించు!' అంటూ సంధ్య ఆ రోజుని గుర్తుకుతెస్తూ ఆమె నెరసిన చెంపలు సవరించింది. మాలతి పెదవులపై సన్నని చిరునవ్వు. వెంటనే సంధ్య ఆమె చెయ్యి అందుకుని 'రా! రా! రా!' అంటూ తొందర పెట్టింది. మాలతి నెమ్మదిగా వెనక్కి తిరిగి వీధి తలుపుకేసి రెండడుగులు వేసింది. ప్రసారంలో అంతరాయం ముగిసి సీరియల్ మళ్ళీ మొదలయింది. మాలతి వెనక్కి వెళ్ళి తిరిగి సోఫాలో కూర్చుంది.

టీవిలో ఆగకుండా మ్రోగుతున్న డోర్‌బెల్. హీరోయిన్ వెళ్ళి తలుపు తీసింది. చెప్పులు, చీర కుచ్చిళ్ళు... అలా అలా కెమేరా పైపైకి పాకి గుమ్మంలో నిల్చున్న స్త్రీ మొహం పైకి వచ్చి ఆగింది. "ఎవరు మీరు? ఎవరు కావాలి?" అడుగుతున్న హీరోయిన్ని పక్కకి తోసి లోపలికి వస్తూ చెప్పింది ఆమె "నేను సుందర్ భార్యని, సుందర్ లేడా?".

"ఏమిటి మోసం! సుందర్ నా భర్త!" అంటూ హీరోయిన్ కీచుగా అరుస్తూ క్రింద పడిపోయింది.

మాలతి ఆవేశంగా ఊగిపోతూ "ఒసే! పిచ్చిదాన! అదంతా నీ మేనమామ చేస్తున్న కుట్ర. దాని మాటలు నమ్మకు. బయటకి పంపించెయ్!" అంటూ అరవసాగింది. అరుస్తున్న మాలతిని అయోమయంగా చూసి, కలవరపడుతూ బయటకి వచ్చేసింది సంధ్య.

ఎందుకిలా మారిపోయిందీలోకం? కనీసం సాయంత్రం వేళయినా తనవాళ్ళతో గడుపుదామని, సేదదీరుదామని లేదే వీళ్ళెవరికీ. అందరూ నన్ను మరచిన వేళ... ఈ సంధ్యవేళ... ఎవరితో చెప్పుకోను నా బాధ? ఆవేదనల ఆలోచనలలో కొట్టుమిట్టాడుతూ ఓసారి చుట్టూ చూసి సంధ్య ఉలిక్కిపడింది.

చీకటి తెరలు నెమ్మదిగా జారుతూ నేలని కప్పివేస్తున్నాయి. ఎక్కి వచ్చిన వెండి మబ్బుల జాడే లేదు. 'నా వెను వెంటే రా! భయంలేదూ!' అని చెప్పే సూరీడు ఎప్పుడో జారుకున్నాడు.

అప్పుడే ఆకాశంలో చోటు చేసుకుంటున్న తారలు "పరిగెత్తు సంధ్యా! పరిగెత్తు!" అంటూ ఎలుగెత్తి అరిచాయి. తరుముకొస్తున్న చీకటి శక్తులకి పట్టుబడకుండా సంధ్య వేగంగా పరిగెత్తసాగింది. పరిగెత్తి... పరిగెత్తి... పడమటి కొండచరియ నుండి క్రిందకి దూకేసింది.

●●●

# బాకీ

**తమిళం : అశోకమిత్రన్ అనువాదం : గౌరీ కృపానందన్**

**పోలీస్ స్టేషన్ కి ఎదురుగా** ఉన్న సందులో వెళ్ళ కూడదు అనే అనుకున్నాను. కానీ మర్చి పోయాను. సందులో తిరిగి నాలుగు అడుగులు వేసానో లేదో ఎదురుగా సుందరి.

నేను సుందరిని చూడనట్లే దాటుకుంటూ వెను. కానీ ఆమె పెద్ద గొంతుతో "ఏమండీ .. ఏమండీ" అని పిలిచింది. సందులో పోయే వాళ్ళంతా ఆగి నావైపు చూసారు. నేను ఆగాను.

సుందరి దగ్గరికి వచ్చి" రెండు నిమిషాలు ఇంటిదాకా వచ్చి వెళ్ళండి" అని అంది. నేను ఆమె వెనకాలే వెళ్ళాను.

సందు తరువాత సందుగా మూడు సార్లు తిరిగి ఆమె ఇంటికి చేరుకున్నాము, అక్కడ ఉన్న ఇళ్ళకి గోడలు ఉన్నాయన్న మాటే గానీ గుడిసె ప్రాంతం కన్నా ఎక్కువేమీ కాదు. సుందరి ఉన్న ఇంటి ప్రధాన వాకిలిని తెరవగానే ఉన్న వరండా మధ్యలో పెద్ద మురుగు నీటి తూము. రెండు ప్రక్కనా ఉన్న పోర్షన్‌లలో ఎన్నో కుటుంబాలు. ఆ ఇంటికి ఒక మేడ ఉంది. అందులో ఒకే ఒక గది. అది సుందరిది.

పగటి పూట వెలుతురికి లోటు లేదు. "గోడ గడియారం ఎక్కడ?" అని అడిగాను. అది నేను కొని ఇచ్చింది.

"మార్వాడి దుకాణంలో ఉంది" అంది.

"ఇరవై రూపాయలు కూడా రావే? "

"చేతిలో చిల్లిగవ్వ కూడా లేనప్పుడు ఏం చేయనూ?"

"ఏమైయ్యింది? ప్రభాకర్ లేడా?"

"ఆయన గురించి అడగడానికే మిమ్మల్ని పిలిచాను."

"ఏం జరిగింది?"

"తెలియదు. ఆయన ఇక్కడికి వచ్చి మూడు నెలలు అవుతోంది."

నా మనసులో ఏదో ఒక మూలలో "బాగా కావాలి నీకు" అని చెప్పాలని అనిపించింది. "ఓహో.. అలాగా అన్నాను."

ఉన్నట్లుండి సుందరి వెక్కి వెక్కి ఏడవ సాగింది.

సుందరి ఏడవటం ఇంత వరకు నేను చూసింది లేదు. నిజం చెప్పాలంటే మిగిలిన వాళ్ళను ఏడిపించడంలో ఆమెకు ఆమే సాటి. ఏడెనిమిది సంవత్సరాలకు ముందు నా ఇంటి ముందు నిలబడి నా పరువు ఎలా తీసేసింది? ఎవరో పోలీసుని పిలుచుకొని రాగా, ఆ తరువాత పోలీస్ స్టేషన్‌లో విచారణ జరిగింది. నాగరికత నిండిన ఈ కాలంలో ఒక మగవాడికి ఉండే గౌరవాన్ని కొంచం కూడా మిగల కుండా సుందరి పూర్తిగా మంట కలిపేసింది. ఇంత జరిగిన తరువాత ఏ మగాడైనా వెంటనే ఏ గంగలోనైనా మునగాలి. లేదా దూలానికి ఉరి వేసుకొని చావాలి. నేనూ అదంతా ఆలోచించాను. కానీ దానికి మించిన తీవ్రమైన నిర్ణయం ఒకటి తీసుకున్నాను. సుందరి మెడలో తాళి కడతాను అని అన్నాను. కానీ అలా చేయడానికి పరిస్థితులు అనుకూలించలేదు. మూడు సంవత్సరాలు ఆమెతో ఉన్నాను. నాకు వచ్చే జీతమంతా ఆమె చేతిలో పెట్టి ఆమె వండి పెట్టింది తిన్నాను. ప్రేమ కోసం, ఒక స్త్రీ కోసం త్యాగం చేసానని గానీ, లేదా మంచి చెడు తెలుసుకునే బుద్ధి లేక పోయింది అని గానీ నా గురించి నేను చెప్ప బోవడం లేదు. కొన్ని సార్లు సంతోషంగా కూడా ఉన్నాను. అప్పుడే ప్రభాకర్ మా జీవితంలోకి వచ్చాడు. గొడవ, సమస్య ఏదీ లేకుండా ఆరు నెలలు దాటకుండా అతను ఆమె గదిలో నివాసం ఏర్పరచుకోగానే, నేను మళ్ళీ నా బంధువుల మధ్యకి చేరిపోయాను. నాకు ఇప్పుడు రెండో కూతురు పుట్టి ఒక నెల అవుతోంది.

సుందరి ఏడుపు ఎలాగో ఒకలాగా ఆగింది. నేను లేచాను. ఆమె కళ్ళూ, ముక్కూ తుడుచుకుంటూ "ఎక్కడికి వెళ్తున్నారు?" అని అడిగింది దిగులుగా.

"ఏం? ఏమైయ్యింది?"

"ఏమీ చెప్పకుండానే వెళ్తున్నారే?"

నేను గదిని కలయచూసాను. ముందు ఉన్న సామాన్లలో సగం కూడా లేవు. బక్కెట్ మారింది. నా జుబ్బా ఒకటి మసి గుడ్డగా రూపాంతరం చెంది మూలన పడి ఉంది. బట్ట గట్టిదై ఉండాలి.

"టీ తెప్పించనా?"

"ఇక్కడే తయారు చేయడం కుదరదా?"

"టీ పొడి, పాలు, పంచదార అన్నీ చేబదులు అడగాలి. దానికి బదులు పూర్తిగా టీ నీళ్ళను అప్పుగా అడిగి తేవచ్చు."

"ఇంత తెలివితేటలు ఉండికూడా ఎలా వెళ్ళి పోనిచ్చావు? నాకు ప్రభాకర్ గురించి ఎక్కువగా తెలియదు. క్రవున్ టాకీస్ పక్క సందు అని ఎప్పుడో ఓసారి మాటల మధ్యలో చెప్పాడు. "

"నువ్వు వెళ్ళి చూసావా?"

"వెళ్ళాను. అక్కడ వాళ్ళ అమ్మ మాత్రమే ఉంది. ఆమె పెద్ద గయ్యాళి. తన కొడుకు డబ్బంతా నేను లాక్కున్నానని అరిచి నానా యాగీ చేసి పోలీసుల్ని కూడా రప్పించేసింది. కానీ ఆ పాపాత్ముడు ఎక్కడికి వెళ్ళాడో జాడ మాత్రం తెలియలేదు."

"నేను మాత్రం ఏం చేయగలను? నాకూ అతని గురించి ఎక్కువగా తెలియదు."

"మీ చీఫ్ మేకప్ మేన్‌కి చుట్టం అని ముందొకసారి చెప్పారు."

"నేను చెప్పానా?"

"అవును. మీరే చెప్పారు."

నాక్కూడా లీలగా జ్ఞాపకం వచ్చింది. నరసింహం ఓసారి తన ఊరికి వెళ్ళినప్పుడు ఒక అమ్మాయిని తీసుకొని వచ్చాడు. కొన్ని రోజుల తర్వాత తెలిసింది ఆమె అంతకు ముందే ఇంకొకడికి భార్య అని. ఇద్దరి ప్రవర్తనలో ఉన్న సారూప్యతని బట్టి నరసింహానికి తమ్ముడు ప్రభాకర్ అని నేను చెప్పి ఉంటాను.

"నాలుగు ఏళ్ళు అతనితో కాపురం చేసావు. అతని తరఫు వాళ్ళు ఎవరూ, ఏమిటీ అని తెలుసుకొని ఉండొచ్చు కదా."

నేను పూర్తిగా స్వాధీనంలో లేని సమయంగా చూసి ఆమె నా గురించి అన్ని వివరాలూ సేకరించి ఉంచుకుంది. ఈ వివరాలన్నీ ఆమె మా ఇంటి ముందు గొడవ చేసినప్పుడు, ఆ తరువాత పోలీస్ స్టేషన్‌లోనూ బాగా పనికి వచ్చాయి. నేను ఇంకా చావకుండా ఎలా బ్రతికి ఉన్నానని నాకే ఆశ్చర్యంగా ఉంది.

ప్రభాకర్ ఆమెను ఉంచుకుని పోషించలేదు అన్న మాటతో విషయం ముగిసి పోలేదు. ఆమె దగ్గర ఉన్న ఒకటో రెండో నగలు, వెండి సామాన్లు, పట్టు చీరలు అన్నీ అమ్మేసి ఉపయోగించుకున్నాడు. అతనికి తాగుడు అలవాటు లేదు. సుందరి నన్ను తన జీవితంలో నుంచి తొలగించి అతన్ని చేర్చుకున్నందుకు ఇది కూడా ఒక కారణం అయి ఉండొచ్చు. పూర్తిగా తెలివితో ఉంటూనే ఆమెను దోపిడీ చేస్తాడు.

నేను మళ్ళీ లేచి నిలబడ్డాను. కొరడా లాంటి తన నాలుకను నమ్ముకొని ఇంత కాలం ఇంత పెద్ద పట్టణంలో రోజులు గడిపిన మనిషి ఇప్పుడు చేవలేనట్లు జారగిల పడిపోయింది. నేను ఆమెతో జీవితం గడిపినప్పుడు కూడా ఆమె తరఫు కుటుంబ వ్యక్తులు గానీ దగ్గర బంధువులు గానీ ఎవరూ వచ్చింది లేదు. ఆమె ఊరి నుంచి ఎప్పుడైనా ఎవరో ఒకరు ఎలాగో విచారించుకుంటూ వచ్చి చేరుతారు. ఒక పూట లేదా రెండు పూటలు భోజనంతో సరి. సుందరి వాళ్ళను పంపించేస్తుంది. ప్రభాకర్‌తో ఉన్నప్పుడు ఈ పద్ధతిలో మార్పు వచ్చి ఉంటుందని నేను అనుకోను. నేను నా దగ్గర ఉన్నదంతా కప్పం కడుతున్నట్లు ఆమె కాళ్ళ దగ్గర సమర్పించుకుంటే, అతను మాత్రం ఆమె దగ్గరి నుంచే దోచుకున్నాడు. కిల్లాడియే! అతనితో నాకు ఎక్కువ పరిచయం అవడానికి అవకాశం లేక పోయింది.

"సుందరి! ఇప్పుడు నా దగ్గర మునుపటి లాగా ఎక్కువ ఏమీ లేదు. నేను కూడా అప్పటి మనిషిని కాదు. అలా ఉండనూ కూడదు. నేను పెళ్ళి చేసుకున్న ఆమె దగ్గర నీ సాహసాలు, బెదిరింపులు ఏమీ పనిచేయలేవు."

"అలా నేను ఏమీ అనుకోలేదండీ. మీ ఇంటి వైపు నేను రానే లేదు కదా. దాన్ని బట్టే మీకు నా మనసు తెలియడం లేదా?"

"అతనికి వచ్చిన ఉత్తరం ఏమైనా ఉందా? అతను పని చేసిన చోటునుంచి జీతం డబ్బులు ఇచ్చిన వివరాలు ఏమైనా ఉంటాయి కదా."

"ఒక రేకు పెట్టెలో రెండు మూడు చిరిగినా బట్టలు మాత్రమే ఉన్నాయి. ఒక ఫోటో, దేవుడి పటం ఉన్నాయి."

"ఆ రెండింటినీ తీసుకొని రా."

ఆ ఫోటోను బట్టి ఏదీ ఊహించడం కుదరదు లేదు. ఫోటోలో ఉన్నది ఆడ మనిషా, మగాడా అని కూడా తెలియనంతగా పాతబడిపోయింది. దేవుడి పటం నరసింహస్వామిది. పెద్దగా నోరు తెరిచి ప్రహ్లాదకుడికి దర్శనం ఇస్తున్న దృశ్యం. పానకాల నరసింహస్వామి అని పేరు. గుంటూరుకి దగ్గర మంగళగిరి అన్న ప్రదేశంలో కొండ మీద ఉన్న ఆ నరసింహస్వామి నోట్లో ఎలాంటి పాత్రలో పానకం తయారు చేసినా సరే, సగం పానకం అవ్వగానే నోరు నిండి పోతుంది. ప్రభాకర్ విజయవాడ, గుంటూరుకి చెందినవాడై ఉండాలి.

"సరే. విచారించి చెబుతాను" అని బయలు దేరడానికి వెనుతిరిగాను.

"ఒక్క నిమిషమండీ."

"నీవు ఇలా మర్యాద ఇచ్చి మాట్లాడుతుంటే నాకు ఎలాగో ఉంది."

"అది కాదండీ."

"సరే. త్వరగా చెప్పు."

"పరిస్థితి అస్సలు బాగా లేదండీ. వెంటనే ఆ మనిషిని చూసి ఏమైయ్యిందని అడగ లేకపోతే నేను మళ్ళీ స్టూడియో వైపు వెళ్ళాల్సి ఉంటుంది."

నేను కఠినంగా ఏమైనా అనేస్తానేమో అన్న భయం ఆమె కళ్ళలో కనబడినప్పుడు నాకు కాస్త బాధగా అనిపించింది. కళ్ళ ముందు పోలీస్ స్టేషన్‌లో నేను నిలబడ్డ దృశ్యం మళ్ళీ మళ్ళీ కదలాడింది.

జేబు నుంచి పాత కవరుని తీసాను. డబ్బును పేపర్ కవర్లలో పెట్టుకోవడం నా అలవాటు.

సుందరి కదలకుండా నిలబడి ఉంది.

ముప్పై రూపాయలు ఉన్నాయి. తీసి ఆమెకి ఇచ్చాను. తీసుకుంది.

"ఇప్పటికి ఇది ఉంచు. అప్పుడప్పుడూ నేను వచ్చి వెళ్తుంటాను."

నేను ఏ భావంతో ఇలా అన్నానో నాకే ఇంకా అర్థం కాలేదు. ఆమెకీ అర్థమైనట్లు లేదని ఆమె ముఖమే చెప్పింది.

ఆరోజు సాయంత్రం నేను మళ్ళీ ఆమె గదికి వెళ్ళినప్పుడు ఏవో మాటలు వినిపించాయి. ప్రభాకర్ వచ్చేసాడు. సగం దాకా ఎక్కిన మెట్ల నుంచి అలాగే వెను తిరిగాను. నాకూ సుందరికీ మధ్య ఏమైనా బాకీ ఉందో లేదో తెలియదు. ప్రభాకర్‌కి మాత్రం నేను ఏ జన్మలోనో బాకీ ఉన్నాను. సుందరి గది నుంచి స్పెషల్ వంట తాలూకు ఘుమఘుమలు చుట్టుపక్కల ఆవరించుకున్నాయి.

●●●

# భ్రమ  డా.వెల్చేరు చంద్రశేఖర్

అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**రాంచి స్టేషన్లో దిగేసరికి, సామాను** చూసి "సాబ్" అంటూ రెండు కమిలిపోయిన చేతులు సలామ్ కొట్టాయి. మాడిపోయిన నల్లబడిన చెట్టు బెరడులాంటి వాడి శరీరానికి ఈ రెండు చేతులూ తగిలించేరెవరో..

"ఫిరయ్‌లాల్ జానాహై"

"ఠీక్ పాంచ్ రుపయా"

"చలో" అంటూ అప్పుడే దిగిన స్నేహని చూసాను.

"దో ఆద్మీ హై.. ఆఠ్ రుపయాహోగా" అన్నాడు. ఆదివాసీవాడి అమాయకత్వానికి నవ్వు వచ్చినా.. నువు ముందు అయిదన్నావ్ అని నేను, నే మీరొక్కరే అనుకున్నా వాడు వాదించుకు ఆరు రూపాయలకు బేరం కుదుర్చుకుని ఫిరాయలాల్ వచ్చి బస్సెక్కి కాలేజీ కేంపస్ కొచ్చేసరికి తలప్రాణంతోక కొచ్చింది. అఫ్‌కోర్స్ తోక లేదనుకోండి మాటవరుసకి.

ఎక్కడో రాంచీకి దూరంగా సువర్ణముఖీ నది వొడ్డున సుమారు అయిదువందల ఎకరాల్లో ఈ కాలేజీ ఉంది. అయిదువందల ఎకరాలు చుట్టుప్రక్కల గిరిజన్ల నుంచి కొనుగోలు చేసినవే, కొనుగోలు చెయ్యడానికి ఏ పద్ధతులు ఉపయోగించారన్నది అప్రస్తుతం అని యాజమాన్యం అనుకుంటుంది, కాదు అని గిరిజనులు అనుకుంటారు. కాలేజీ చుట్టూ గిరిజన తండాలు (గ్రామాలు).

ఛోటానాగ్‌పూర్ అందాలకి అద్భుతం, సువర్ణముఖి నది, చుట్టూ పంటపొలాలు, నింగికి తాకుతూ సాల్‌వుడ్ చెట్లు.

బస్సులో స్నేహ "మీ అమ్మగారు కూడా వస్తానంటున్నారు పనిపిల్లాడ్ని చూడండి, ఇంటి పని పర్లేదు. బైటనుండి ఏదేనా కావాలన్నా ఇల్లు మెయిన్‌టెన్ చెయ్యాలన్నా చాలా కష్టం" అని పదేపదే చెప్తోంది.

నేను ఇంట్లో పనికి ఎవర్నేనా పెట్టాలి, అదీ స్నేహ చాయిస్‌తో. పనిపిల్లని పెట్టడానికి స్నేహ ఇష్టపడటంలేదు. జాగ్రత్తపడుతోందా అనిపిస్తోంది. "ఆదివాసీ ఆడపిల్లలు ఏ పనికైనా సిద్ధపడిపోతారు" అని స్నేహ అనుమానం. ఎన్నేళ్ళు కాపురం చేసినా తన జండర్‌ని పూర్తిగా బిలీవ్ చెయ్యని వాళ్ళల్లో పెళ్ళాలు ప్రథములుగా మిగిలిపోతారు. అందుకే పనిపిల్లాడే కావాలి, పనిపిల్ల పనికిరాదు. అలాగని చెప్పదు. కానీ దానర్థం అదే!

బస్సు కేంపస్‌లో ప్రవేశించింది. కేంపస్ 'సౌత్' బోర్డర్ కానుకుని స్టూడెంట్స్ హాస్టల్స్ ఉన్నాయి. నార్తు బోర్డర్‌లో ఒక మూల జిమ్, కోపరేటివ్ స్టోర్స్, రెండోమూల స్టాఫ్ క్వార్టర్స్. వీటికి కాస్త దూరంగా కాలేజీకి ధారాదత్తం అయింది. అప్పుడు వాళ్ళకి ఇచ్చిన కాంపన్సేషన్ వల్ల ఆదివాసీలెవరూ మోతుబర్లవలేదు సరికదా, ఆ కాంపన్సేషను ఏమైందో ఎవరికీ తెలీదు.

భూములు పోయి, ఆ భూముల్లో కట్టిన కాలేజీకి వచ్చిన తెల్లకాలరు పోటుగాళ్ళకి చాకిరీ చెయ్యాల్సి వచ్చింది. బతుకు తెరువు కోసం తమగడ్డలోనే తాము కొంచెం పడాల్సి వచ్చింది. దాంతో వాళ్ళలో ఆగ్రహం, తమ చేతకాని తనానికి చింత పట్టుకున్నాయి. కొన్నాళ్ళకి తమకి ఉద్యోగాలు, తమ పిల్లలకి ఇంజనీరింగ్ చదువులూ అబ్బుతాయి అనుకున్న ఆదివాసీలకి, తాము ప్యూను ఉద్యోగాలకి కూడా పనికి రామని, తమ పిల్లలకి ఇంగ్లీషు చదువుల మోడ్రన్ సంస్కృతి లేదని అర్థం అయేసరికి ఓ పదేళ్ళు పట్టింది. కానీ ఈ పదేళ్ళలో రాజకీయనాయకుల కొడుకులకి ధనధాష్టీకం కలిగిన పిల్లలికి ఏ సంస్కృతి అక్కర్లేదని ఇంజనీరింగ్ చదువుకి అర్హులని, తాము ఈ కాలేజీకి తప్ప, తమకి ఈ కాలేజీ ఎందుకూ ఉపయోగపడదని అర్థం చేసుకున్నారు ఆనాటి నుంచి వాళ్ళలో అసహనం.

ఇలా అభివృద్ధి పేరు మీద ఒకటి కాదు మరెన్నో సంఘటనలు అందుకే చోటానాగపూర్ ప్రాంతం అంతా ఝార్‌ఖండ్‌గా ప్రత్యేక ప్రాంతంగా ప్రకటించమని ఉద్యమం, రాజకీయమిండగాళ్ళ ప్రవేశంతో, ఈ ప్రాంతంలో చాలా గందరగోళం చోటుచేసుకుంది.

నే వచ్చిన రోజే రామ్‌రాజ్ వచ్చాడు. ''సాబ్.. ఆప్ కబ్ ఆయె'' అంటూ.

''ఇప్పుడే''

''శలవుల్నించి చాలా ముందుగా వచ్చేసారు.''

''కోపరేటివ్ లక్షరూపాయల సరుకులు తెప్పించారు, అవన్నీ ఇవాళ వచ్చాయి, మీకివాళ పనే'' అంటున్నాడు.

''సాయంకాలం వస్తాన్లే.. చెక్ చేస్తాను.''

వాడెళ్ళిపోయాడు.

కాలేజీ ఉద్యోగంతో పాటు కోపరేటివ్ బోర్డు మెంబర్‌షిప్ అదనపు భారం. దాన్ని తప్పించుకోలేం. నే సాయంకాలం వెళ్ళేసరికి సెక్రటరీ వర్మ, బోర్డు మెంబర్లు స్వరూప్ అందరూ రెడీగా ఉన్నారు. ఏడుగంటలకి కోపరేటివ్ మూసెయ్యగానే అందరూ ఏక్షన్‌లోకి దిగాం.

తొమ్మిది అయేసరికి కేంటిన్‌లో డిన్నర్ చేసి మళ్ళీ పని మొదలుపెట్టాం మా డిన్నరవగానే కేంటిన్ మూసేసాడు కోపరేటివ్. నిశ్శబ్దంగా ఉంది. మా పని మేం చేసుకుపోతున్నా పనిపూర్తవడానికి పన్నెండయింది. కోపరేటివ్ తాళం వెయ్యడానికి, రామేశ్వర్ బైటకి వెళ్ళాడు. ఏదో షాక్ తిన్నట్టు మళ్ళీ స్టోర్స్‌లోకి పరిగెట్టుకొచ్చేశాడు. ఒళ్ళంతా చెమట్లు..

''సాబ్'' అన్నమాట అతికష్టం మీద బైటకి వచ్చింది.

''క్యా రామేశ్వర్..''

రామేశ్వర్ నోటమాట రావడంలేదు.

బైటకి చూపించాడు. వెంటనే వర్మ, నేను బైటకి వెళ్ళాం. బైట చీకట్లో ఎంతమందో తెలీదు. స్త్రీలు, పురుషులు చేతుల్లో ఝార్ఖండ్ ఆదివాసీ ఆయుధాలు, గొడ్డళ్ళు, కొడవళ్ళు, కత్తులు బాణాలతో నిలబడ్డారు. మా ప్రైప్రాణాలు పైనే పోయాయి. అప్పుడు కన్నుపొడుచుకు చీకట్లోకి చూసాను. కోపరేటివ్ చుట్టూ ఆదివాసీలే. ఆడ మగ పిల్లలు ఉన్నారు. మెల్లగా చప్పుడు లేకుండా కోపరేటివ్‌ని చుట్టుముట్టారు. చీమల బారు కొండ చిలువని చుట్టేసినట్టు చుట్టేసారు.

అందులో ముందున్న మొగాళ్ళు వర్మని పక్కకి తప్పుకోమని సైగచేసారు. మాకు మరో ఛాయిస్ లేదు. పక్కకి తప్పుకున్నాం వాళ్ళు లోపల కెళ్ళగానే లోపల మిగతా కోపరేటివ్ వర్కర్స్ అందరూ ఒక్కక్కరే బైటికి వచ్చేసారు.

ఏం జరుగుతుంది. ఎక్కడా అలికిడి లేదు. కోపరేటివ్ దగ్గర ఇద్దరు సెక్యూరిటీ గార్డ్సు ఉండాలి. వాళ్ళు కనిపించలా అంటే వాళ్ళని గుమ్టిలో కట్టిపడేసుండాలి.

స్టోర్సు నుండి సరుకులు బైటికి నడుస్తున్నాయి, బియ్యం బస్తాలు, పప్పులు, బట్టలు పట్టుకుపోయాయి. మిగతా చిన్నవాటికి తొక్కిసలాట జరుగుతోంది. పిల్లలు.. ఆడవాళ్ళు.. ఏ వస్తువూ మిగల్చలేదు. నా కళ్ళముందు జరుగుతున్న సామాజిక న్యాయం అబ్బురపరిచింది. కానీ దానికి చీకటి కావల్సి వచ్చింది.

అరగంటలో అంతా పూర్తయింది. అందరూ చీకట్లో కలిసిపోయారు.

మొదట తేరుకున్నది వర్మే. ''ఏంటి చూస్తారు తాళం వెయ్యండి'' అన్నాడు నవ్వుతూ. అందరం చిన్నగా నవ్వాం. ఇంక తాళాలెయ్యడానికి ఏం మిగిలింది?

''మనం అలా ఒకళ్ళనొకళ్ళు కోపరేషను చేసుకోవాలి. అందుకే దానికి కోపరేటివ్ స్టోర్స్ అని పేరు'' అన్నాడు. దానికీ అందరూ నవ్వారు.

''అయియే రావ్ సాబ్'' అంటూ తన స్కూటరు తీసాడు. దానిమీద ఇద్దరం క్వార్టర్స్ వేపు వెళ్ళిపోయాం.

తిన్నగా కాలేజీ డైరెక్టర్ క్వార్టర్స్‌కి వెళ్ళాం. ఆయన్ని లేపి జరిగిందంతా చెప్పాం. వర్మ మరికొంచెం ముందుకెళ్ళి "కోపరేటివ్ వర్కర్స్‌లో ఎవరో దీనికి సహకరించుండాలి ఇంత సరుకు వచ్చిందని సమాచారం వాళ్ళకి అంది ఉంటుంద"ని చెప్పాడు. డైరెక్టర్ పి.ఎకి కబురెళ్ళింది. రిపోర్టు డ్రాఫ్ట్ తయారైంది.

అంతా అయేసరికి మూడుగంటలైంది. "పొద్దున్నే డి.ఐ.జి ఇంటికి వెళ్ళి ఇవ్వండి" అన్నాడు డైరెక్టర్.

అక్కడితో ఆ కార్యక్రమం అవగా అందరం ఎవరి ఇంటికి వెళ్ళి వాళ్ళు పడుకున్నాం.

●●●

మర్నాడు పొద్దున్న సూర్యుడు ఎప్పటిలాగే ఉదయించాడు. వాడికేం తెలీదన్నట్టు..

కోపరేటివ్ దోచేసారన్న వార్త "గుప్పుమంది"

అది మా ఆవిడ నన్నడిగింది.

అవునన్నా..

రోజూ వచ్చే 'తుక్కులు' తీసుకెళ్ళే 'మాలో' వచ్చింది. ముసిముసిగా నవ్వుతోంది. నన్ను వోరచూపులు చూసింది మాలో ఆదివాసీ, నదికి అవతల ఉండే గ్రామంలో ఉంటోంది. కాలేజీలో పనిచేస్తోంది. కాలేజీలోనూ అదే పరిస్థితి, కైలా లేలో వర్కరు ఎప్పుడూ విష్ చెయ్యనివాడు నవ్వుతూ విష్ చేసాడు. వీళ్ళకి నిన్న రాత్రి ఏం జరిగిందో తెలిసింది. లేక వీళ్ళందులో ఆ మందలో ఉన్నారేమో? ఏది ఏమైనా రాత్రి జరిగిందానికి వీళ్ళంతా ఆనందిస్తున్నారు. సబబు అనుకుంటున్నారు.

కేంపస్‌లో చిన్న భయవాతావరణం నెలకొంది. మనం మన బతుకులు ఎంత అన్‌సేఫో అనుకున్నారు. కానీ ఆదివాసీల కోణం నుండి ఎవరూ ఆలోచించలేదు. అవసరంగానీ, అవగహనగానీ లేదు. ఎందుకంటే అది చీకట్లో జరిగింది.

కాలేజీకి రెండు నెలలు వేసంగి శెలవలు. శెలవల్లో కైలాలు, మాలోలు ఝూలోలు, ముండాలు, ఆదివాసీ వర్కర్ల అవసరం కాలేజీకి లేదు. వాళ్ళందరూ టెంపరరీ వర్కర్లు. కూరల్ది కూరలమ్ముకోలేదు. టైలర్స్‌కి కుట్లుండవు, చాకలికి బట్టలుండవు. సమ్మర్ రెండునెల్లూ మొత్తం శూన్యం. అస్తవ్యస్తం.

రెండువేల స్టూడెంట్సుతో, ఎనిమిదొందల స్టాపుతో కాలేజీ స్థాయినుండి యూనివర్సిటీగా ఎదుగుదామనుకున్న కాలేజీ యాజమాన్యానికి చుట్టుపక్కల పల్లెలనుంచి వస్తున్న 'తోటీలు' రోజు కూలీలు, ఫోర్త్ గ్రేడు స్టాపూ పట్టరు, పట్టించుకోరు. పట్టించుకోవలిసిన అవసరంలేదు. కాలేజీ ఇక్కడ పెట్టి వారికి ఉపాధి కల్పించామనుకుంటారు.

సెమినార్లు, ఫ్రెషర్స్ ఫంక్షను, మ్యూజిక్ నైటు అంటూ వేలకు వేలు వృధా చేసి, దొంగబిల్లులకి ముట్టచెప్పిన దాంట్లో పది శాతం ఆదివాసీ గ్రామాల మీద ఖర్చుపెట్టరు. ఆదివాసీ వాళ్ళెప్పుడూ మనం కట్టిపడేసిన బట్టలమీద తినివదిలేసిన కూడు మీద బతికారు. ఇంకా వాళ్ళు అలాగే బతుకుతారని అపోహ!

ఇక్కడ కాలేజీ కడుతున్నారంటే ఆనందపడ్డారేమో? మొదట్లో కట్టిపడేసిన బట్టలు గొప్పగా, తినివదిలేసిన తిండి రుచిగా కనిపించాయి. కానీ కాలేజీకి అవసరాలు పెరిగాయి. దానికి లోకల్స్ పనికి రాలేదు. వాళ్ళకి మోడస్టీ లేదు. ఇంగ్లీషు రాదు. వీళ్ళ సంస్కారం కాలేజీకి పనికిరాదు. కాలేజీ ఎదిగింది. రెండొందల నుండి రెండువేల స్టూడెంట్స్‌కి ఉవ్వెత్తున ఎదిగింది. దానికి కావలిసిన క్వాలిఫైడ్ మనుషుల్ని దిగుమతి చేసుకుంది.

వాళ్ళ దిగదుడుపులే లోకల్స్‌కి దక్కాయి. అందుకే ఈ ఆక్రోశం.. అయితే ఈ ఆక్రోశాన్ని అణచడానికి మనకి సర్వసదుపాయాలూ ఉన్నాయి. ***రాజ్యాంగంలో ఆక్రోశానికి చోటులేదు. అందుకే ఎవరూ ఆక్రోశించకూడదు. అందరూ నవ్వుతూ***

***ఉండాలి. భూమి లాక్కున్నాడూ, భూమికోల్పోయినవాడు.. తిన్నవాడు, తిననివాడూ, కొత్తబట్టకట్టిన వాడూ, దిగవిడిచిన బట్టకట్టినవాడు అందరూ సుఖంగా ఉన్నట్టు పోజెట్టాలి. అదో ఫోటో తీసి దానికింద సక్సెస్‌ఫుల్ ప్రజాస్వామ్యం అంటూ అమెరికా వీధుల్లో అమ్మేయాలి. ఈ ప్రజాసామ్యాన్ని కాపాడ్డానికున్న అనేక సపోర్టుల్లో పోలీసులొకరు. వీళ్ళు సామాన్యంగా ఏ విషయం పట్టించుకోరు. వీళ్ళు పట్టించుకుంటే ఎక్కడో ఏదో తప్పు జరిగిందని గవర్నమెంటు అభిప్రాయం తప్పు ఎవరు చేసారన్న నిర్ణయం చేయగల సత్తా పోలీసులకుందని, గట్టి నమ్మకం ప్రభుత్వంకి ఉంది.***

అలాంటి ప్రయత్నమే జరిగింది. అది కొంచెం ఎక్కువ మోతాదులో జరిగింది. కాదా లక్షరూపాయలు మరి. ఏ కుంభకోణాలకి, ఆ ఎమౌంట్ చిన్నదై. పోతుంది ఏ ఎలక్షన్లోనూ, దానికి విలువలేదు.

అలాంటిది లక్షరూపాయల సరుకులు లూటీ జరిగింది.

డబ్బుగా లూటీ అవలేదు. అయితే కేసేలేదు. రేషను, తిండిగింజలు.. పప్పుదినుసులు ఇంత దిగజారిపోయామా? అలా దిగజారకూడదు. తిండిగింజలకున్న సోషల్ నెసెసిటి అలాంటిది. వాటి ధరతక్కువే. బంగారంతో పోల్చలేం ఎవడేనా జ్యూయలరీ షాపుదోచాడంటే ఆ రోజు కబురుగా చదివిపారేస్తాం. కానీ తిండిగింజలు కొట్టుకెళ్ళారంటే.. ఆలోచిస్తాం! ఎక్కడో ఏదో తప్పు జరిగిందనిపిస్తుంది. మొత్తం వ్యవస్థ మీదే అపనమ్మకం ఏర్పడుతుంది. పొలిటీమీద అపనమ్మకం ఏర్పడింది. అలా జరక్కూడదా? అలా జరక్కుండా ఉండటానికేం చేస్తాం? గింజలు దోచుకెళ్ళిన వాడికి మళ్ళీ అవకాశం ఇవ్వం. కుళ్ళబొడుస్తాం కాలో చెయ్యో విరిచేస్తాం. అదే జరిగింది. పోలీసుల పవరు చూపించి వాళ్ళ ఆక్రోశం లేకుండా చేసారు. ఎందుకంటే ఈ లూటీ వల్ల ప్రజాస్వామ్యం కష్టాల పాలవుతుంది.

●●●

మర్నాడు మాలో తొక్కులు తీసుకెళ్ళడానికి రాలేదు.

ఆ మర్నాడు వచ్చింది. ఎవరో కొట్టారు. కింద పెదవి ఉబ్బి ఉంది. ఇంక ముసిముసినవ్వులు నవ్వలేదు.

కాలేజీలో కైలా పరిస్థితి అంతే మోచెయ్యి వాచివుంది. నేనెదురుపడినా బుర్రొంచుకు వెళ్ళిపోయాడు. అంటే లోకంలో ఉండాల్సిన, ప్రభుత్వం కోరుకున్న ఆర్డరు పునరుద్దరింపబడింది. కానీ వస్తువులేవీ కోపరేటివ్ స్టోర్స్‌కి పునరుద్దరింపబడలేదు. ఉద్దరింపబడవు కూడా అదంతే. ఆ రోజే కైలాను పిల్చాను.

"నువ్వేదో పనిపిల్లాడ్ని తీసుకొస్తానన్నావ్" అన్నాను.

"కల్ లాయేంగే సాబ్" అన్నాడు.

మర్నాడో కుర్రాడ్ని తీసుకొచ్చాడు. వాడు నన్నే చూస్తున్నాడు.

ఆ రోజు ఈ కుర్రాడు కూడా లూటీవాళ్ళతో కలిసి వచ్చాడేమో? నల్లగా ఆదివాసీ వాడే కైలా గ్రామం వాడే వాడ్ని "ఇంటో పన్చేస్తావా?" అనడిగా.

"ఊ" అన్నాడు.

"ఎంతిమ్మంటావ్" అని అడిగాను.

"ఎంతో కొంత ఇవ్వండి సాబ్" అన్నాడు కైలా.

అలా అంటున్నప్పుడు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"సరిలే రేపట్నుంచీ పంపెయ్" అన్నా.

"ఠీక్ హై సాబ్" అన్నాడు.

ఇద్దరూ బైటకెళ్ళిపోయారు. తృటిలో కుర్రాడు నా ఛాంబరులోకి వచ్చాడు. నిక్కరు జేబులోంచి సబ్బు తీసాడు. టేబులు మీద పెట్టి, వెంటనే మాయమైపోయాడు.

నేను అవాక్కయిపోయాను.

టేబులు మీద కొత్త లక్స్ సబ్బు ఎర్రటి రేపరు చుట్టి ఉంది.

ఆ రోజు జరిగిన కోపరేటివ్ లూటీలో ఈ కుర్రాడు ఉన్నాడు. వాడు సబ్బెందుకు దొంగలించాడు. సబ్బు సంస్కారం అలవర్చుకోవాలనుకున్నాడేమో? ఆ సబ్బు ఎందుకు వెనక్కి ఇచ్చేసాడు?

నిజాయతీ నిరూపించుకోడానికా?

మా ఇంట్లో మేం వాడేసిన సబ్బు ముక్కలు తనకి చాలనుకున్నాడా?

కైలా ఎందుకు కళ్ళ నీరెట్టుకున్నాడు? ఇంక మా బతుకులింతే అనా? ఎందుకు?

చాలా ప్రశ్నలకి సమాధానం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలదే విజయం అనుకోడం పొరపాటు ఏ రాజకీయ వ్యవస్థలోనూ అది జరగలేదు. ప్రజాస్వామికంలోనూ ప్రజలు గెలవరు.. మేము ప్రజలకోసం అనే కమ్యూనిస్టు ప్రభుత్వాలలోనూ అది జరగదు. అయితే అన్ని వ్యవస్థలూ భ్రమని మాత్రం కలిగించగలవు.

# మొదటి నేస్తం సాగి వర్మరాజు

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**దాదాపు 20 సంవత్సరాల తరువాత సొంత ఊరు** వెళుతున్నందుకో ఏమో, నా మనస్సు మా ఊరి జ్ఞాపకాలతో రైలు కంటే వేగంగా ఊరుని చేరుకోవాలని పోటీపడుతోంది. రైలు కిటికీలోనుంచి దూరంగా ఉన్న చెట్లూ, కొండలు ఒక్కోటి వెనక్కి వెళ్ళిపోతున్నాయ్. ఎక్కడో వర్షం పడిన ఆనవాలుని మోసుకొస్తున్న గాలి, పాతస్నేహితుల్ని, ఊరి చెరువుని, బడిని చేలగట్లని గుర్తుకు తెస్తున్నాయ్.

ఇంతలో పల్లీలు వస్తే కొనివ్వమని 'సిరి' అడుగుతుంటే, దానికి వంతపాడుతూ 'సిద్ధు'గాడు గారాలు పోతూ వాళ్ళమ్మని కాకా పడుతున్నాడు, ఇక లాభంలేదని పైన ఉన్న బ్యాగ్‌ని దించుతోంది నా శ్రీమతి. నేను మా ఊరిలో 8వ తరగతి దాకా చదివి తరువాత మా అమ్మమ్మ వాళ్ళ ఊళ్ళో డిగ్రీ దాకా చదవడం, తరువాత హైదరాబాద్‌లో జాబ్‌లో జాయిన్ కావడం, 'లత'తో పెళ్ళి బొంబాయ్ ట్రాన్స్ఫర్ కావడం ఓ పాప, బాబు పుట్టడం, నేను ఎప్పుడన్నా హైదరాబాద్ వచ్చి తమ్ముడి దగ్గర ఉన్నా అమ్మా నాన్నలని చూసి వెళ్ళటం మినహా దాదాపు ఊరు వెళ్ళింది లేదు.

లత బ్యాగ్ దించుతుంటే పిల్లల మొహాల్లో ఏదో జయించామన్న ఆనందం! నాకెందుకో వేరు శనక్కాయలు కొనుక్కుని తినాలంటే అదోలా ఉంటుంది. ఊళ్ళో ఎవరి చేలో రెండు మండలు పీకున్నా జేబుడు కాయలు వచ్చేవి. వాటికి అంటిన మట్టిని దులుపుకొని పచ్చికాయలు తింటుంటే ఆ అనుభూతి ఎంత డబ్బు పెట్టి కొన్నారాదు, 'లత' బ్యాగ్‌లో నుంచి పర్స్ తీస్తుంటే సీటు క్రింద పడిపోయింది ఏదో..

పిల్లలకి కొనుక్కోమని పది రూపాయలు ఇచ్చి నేను సీటు క్రిందపడిన వస్తువుకోసం వెదుకుతుంటే, లతకే దొరికింది, చుట్టూ కాయితంతో భద్రంగా చుట్టి ఉన్న పొట్లం ఒకటి, లత పేపర్ల మడతలన్నీ తీసి అందులో ఉన్న వస్తువుని నన్ను ఆశ్చర్యంగా చూస్తూ నా చేతికి ఇచ్చింది. నేను దానిని అపురూపంగా అందుకుని చూస్తుండగా, నా భార్య ప్రశ్నార్థకంగా చూస్తూ 'ఎవరన్నా విలువైన వస్తువులని దాస్తారు, కానీ దీన్ని తిరపతి ముడుపులా ఇంత భద్రంగా దాచారంటే దీని వెనుక ఏదో విషయం ఉందన్నమాట' అంటుంటే, పిల్లలు నీకొకటి, నాకొకటి అని కాయలు పంచుకుంటున్నారు.

ఒక్కసారి నా నేస్తం నాకళ్ళముందు మెదిలాడు, బస్ దిగ్గానే ఊరి బయట రోడ్‌కి ఆనుకుని ఉన్న నా మొదటి స్నేహితుడింటికి వెళ్ళి, తనకి నేను తెచ్చిన బట్టలు ఇచ్చి పలకరిస్తే ఏమంటాడో! అనకపోయినా ఇవన్నీ ఎందుకు బాబు నువ్వు చల్లగా ఉండాలన్నట్లు చేతులతో చెప్తాడు. నేను పలుకరిస్తే ఎంత ఆనందిస్తాడో అన్న అనుభూతే ఇంత ఆనందంగా ఉంటే, కలిస్తే ఎంత ఆనందంగా ఉంటుందో!? ఇంతలో నా భార్య చిన్నగా కుదుపుతూ విషయం చెప్పమని అడుగుతుంటే నేను ఈ లోకంలోకి వచ్చి సరే అన్నట్లు తల ఊపగానే లత నా ప్రక్కకి జరిగి 'ఊ.. చెప్పండి' అంది. ఇంట్రెస్ట్‌గా పిల్లల వేరుశనక్కాయలు ఒలిచి తొక్కలని కవర్‌లో పోస్తున్నారు, కంపార్ట్‌మెంట్‌లో ఓ ముసలాయన కిషోర్ కుమార్ పాటలు వింటూ, మరో కుర్రాడు ఏదో బుక్ చదువుతూ, అందరూ ఎవరి పనుల్లో వాళ్ళుంటే ఎవరికీ సంబంధం లేకుండా రైలు పరిగెడుతూ ఉంది.

***

అది నేను ఆరవ తరగతి చదువుతున్నప్పుడు అనుకుంటా మా ఇంటి గోడలు పాడైపోయాయని కరణంగారి ఇంటిలోకి అద్దెకి వెళ్ళినప్పుడు, సామాన్లని ఆ ఇంట్లో సర్దుతుంటే ఏమూటలోంచి పడిందో.. ఆ వస్తువు మొదటిసారి పడింది. చిన్నగా, ఎంతో అందంగా, కళాత్మకంగా నన్నాకర్షించింది, దాని తీసుకుని దేవుడి పటాలని శుభ్రం చేస్తున్న అమ్మ దగ్గరికి వెళ్ళి 'ఇది ఎవరిది?' అని అడిగాను. అమ్మ దాని చేతుల్లోకి తీసుకుని 'ఇది నీదే, నీ కోసం చిన్నప్పుడు 'మూగోడు' చేసుకొచ్చాడు' అంది. నేను దాన్ని అపురూపంగా చూస్తూ మూగాడి గురించి చెప్పమని మారాం చేస్తే నేనందించిన సామాన్లని సర్దుతూ నా చిన్న నాటి సంఘటన చెప్పసాగింది.

మాది చాలా పెద్ద కుటుంబం మా తాతయ్యకి తొమ్మిది మంది సంతానం, మా నాన్న ఎనిమిదో సంతానం. అత్తయ్యలు ఐదుగురు అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయి పెదనాన్న వాళ్ళు మేము కలిసి ఉండేవాళ్ళమట, మా అమ్మ నేను నెలల పిల్లాడిగా ఉన్నప్పుడు అమ్మమ్మ వాళ్ళు ఊరునుంచి మా ఊరు తీసుకొచ్చారంట. నేను చాలా ముద్దుగా ఉండేవాడినని అందరూ నన్ను ఎత్తుకుని ఆడించేవాళ్ళంట.

కానీ వాళ్ళందరిలో "మా మూగోడు" స్పెషల్, అప్పట్లో 'మా చాకలి', 'మా మాదిగోడు, 'మా మంగలి' ఇలా ప్రతి ఇంటికీ ఉండేవాళ్ళు. వాళ్ళలో మా మాదిగ 'రోశి' కొడుకే 'మూగోడు'. చాలా తెలివైన వాడు అసలు పేరేంటో తెలీదు కానీ పుట్టుకతోనే మూగ, చెముడు అట అందుకే అందరూ 'మూగోడ'నే పిలిచే వాళ్ళు, సరే నాకు మూగోడికి మధ్య స్నేహం ఎలా అంటే..

నేను మా ఊరు తీసుకొచ్చిన రెండోరోజే మూగోడు మా ఇంటికొచ్చి నన్ను చూసి ఎత్తుకుంటానని గొడవ చేశాడట (సైగలతో) మేమేమో 'రాజులం' వాడేమో 'మాదిగ' ఎలానా ఇవ్వటం అని ఆ రోజుకి వాడికి ఎలాగో సర్ది చెప్పి పంపారట.

మరుసటి రోజు ఉదయాన్నే ఇంటిముందు మూగోడు, మళ్ళీ సర్దిచెప్పి పంపడం, తరువాత రోజు మళ్ళీ ఉదయాన్నే ఇంటి ముందు, ఇక లాభంలేదని మా మేనత్త నా బట్టలు విప్పి వాడి ముందు పెడితే, ఆనందంతో మూగోడు నన్నెత్తుకుని గుండెలకి హత్తుకుని రకరకాలుగా నన్ను ఆడించి క్రిందకి దించితే నా మొహాన చెంబు నీళ్ళు గుమ్మరించి నన్ను దగ్గరకి తీసుకుని స్నానం చేయించేవారట, ఇలా రోజు తను రావటం నేను తనని చూసి కేరింతలు కొట్టడం తను నన్ను ఎత్తుకుని గుండెలమీద తన్నించుకోవడం, మీసాలు పీకించుకోవడం ఇలా రకరకాలుగా ఆడించేవాడట.

కొన్నిరోజులకి నేను లేచి నుంచుని అడుగులు వేయటానికి ప్రయత్నిస్తున్నప్పుడు మూగోడు నన్ను చాటంత మొహం చేసుకుని ఆనందంగా చూశాడట, తరువాత రెండురోజులు రాలేదట. అందరూ ఎక్కడి కెళ్ళాడో అనుకుంటుండగా మూడోరోజు మూగోడు ఉదయాన్నే ఇంటికి వచ్చాడట. నేను వాడిని చూసి కేరింతలు కొడితే, యధాప్రకారం బోసిముడ్డితో నన్ను వదలగానే మూగోడు నన్ను ఎత్తుకుని టవల్‌లో చుట్టి తీసుకొచ్చిన మూడంగుళాల చిన్ని చిన్ని చెప్పుల్ని నాకాళ్ళకి తొడిగి మురిసిపోయాడట. అవి ఎంతో అందంగా మంచి పనితనంతో (తోలుతో) చేసి తీసుకురావటానికే రెండు రోజులు రాలేదని ఇంట్లో అందరూ వాడికి నామీద ఉన్న అభిమానానికి అందరూ ఆశ్చర్యపోయి వాడి పనితనాన్ని అందరూ మెచ్చుకున్నారట.

"అప్పుడు మూగోడు నీకు చేసుకొచ్చిందే ఇది అని చెపుతూ, అందరం నీ బుడి బుడి నడకలు చూసి ఆనందిస్తుంటే, తను నీ చిన్ని పాదాలకు శ్రమ కలుగుతుందని నీకోసం చెప్పులు కుట్టుకొొచ్చాడు. మొట్టమొదట ఏ సంబంధం లేకుండా నీ అడుగులకి ఆసరాగా నిలిచాడ"ని అమ్మ చెప్పినప్పుడు నాకు మూగాడి మీద అభిమానం మరింత పెరిగింది.

***

"నేనెప్పుడన్నా ఊరికి వస్తే చిన్న పలకరింపుకే ఎంతో మురిసిపోయేవాడు. దాదాపు 20 సంవత్సరాలు అయ్యింది తనని చూసి, అందుకే ఈసారి నా మొదటి నేస్తానికి బట్టలు పెట్టి చూసి వెళదామనే అసలు ఈ ప్రయాణం" అని నేను చెప్పగానే నా శ్రీమతి

"ఐతే మీ నేస్తాన్ని చూపిస్తారన్నమాట" అంది.

"నేను వస్తున్నానని తెలిస్తే ఎక్కడున్నా రెక్కలు కట్టుకుని వాల్తాడు తెలుసా.?" అంటుండగా ట్రైన్ కరవది స్టేషన్‌లో ఆగింది.

స్టేషన్‌లో ట్రైన్ దిగి దేవరంపాడు బస్ ఎక్కిమా లచ్చమ్మ శిలదగ్గర దిగగానే తెలిసిన వాళ్ళందరూ పలకరిస్తుంటే వాళ్ళకి సమాధానం చెబుతూనే నా కళ్ళు నా నేస్తం కోసం వెదుకుతున్నాయ్, ఇంటికెళ్ళి పలకరింపులు అయిన తరువాత, అక్కని మూగోడెలా ఉన్నాడని అడిగాను.

రైలు పట్టాలు దాటుతుంటే రైలు క్రిందపడి చనిపోయాడని చెప్పింది, పాపం పుట్టుకతో చెవుడు కూడా అయినందువల్ల రైలు సౌండ్ వినిపించక చనిపోయాడని చెబుతుంటే నాకు కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

సాయంత్రం అన్నం సయించలేదు. ఆరుబయట మంచంపై పడుకుని ఆకాశంలోకి చూస్తుంటే చుక్కల్లో నా మొదటి నేస్తం.... బంగారు దారాలతో మబ్బులని కుడుతున్నాడు. నేను ఆశ్చర్యంతో "ఏం చేస్తున్నావ్ నేస్తం" అని అడిగితే తను నా వైపు చూసి "ఇన్ని లోకాలు దాటి రావాలంటే నీ కాళ్ళకి బాధ తెలీకుండా ఉండటానికి చెప్పులు కుడుతున్నా" అని నవ్వుతూ సమాధానం ఇచ్చాడు.

# సహజీవనం

వారణాసి నాగలక్ష్మి

**చేతిలో సీతమ్మ దగ్గర్నుంచి** వచ్చిన ఉత్తరం నలుగుతోంది..

'రెండేళ్ళకొకసారయినా పుట్టింటికి రావడం మానేసావు. ఈసారయినా సంక్రాంతికి మా మనవలిద్దరితో అల్లుడుగారితో మన ఊరు వస్తావనీ మాతో నాలుగురోజులు గడుపుతావనీ ఆశిస్తున్నాను' ఈ వాక్యాలమీదే హారిక చూపు ఆగిపోయింది.

మెల్లిగా చూపు కిందకి సారిస్తే రంగనాథంగారు అల్లుడినాహ్వానిస్తూ రాసిన నాలుగులైన్లు.. ఆలోచనలో పడింది హారిక. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు ఏడాదికోసారయినా పుట్టింటికి వెళ్ళడం, తల్లితండ్రులతో ప్రశాంతంగా గడిపి, తీయని జ్ఞాపకాలు మూట కట్టుకుని వెనక్కి రావడం జరిగేది.

అంజలి తొమ్మిదో తరగతికొచ్చినప్పటి నుంచీ స్కూలూ, కోచింగులతో జీవితం పరుగు పందెంలా మారిపోయింది. నాలుగు రోజులు ఆ పల్లెటూరిలో గడపడమంటే అమూల్యమైన సమయాన్ని వృధా చేయడమే అనే భావనలో పడిపోయారు తనూ భర్తా. ఇంట్లో ఒక్కటొక్కటిగా చోటు చేసుకున్న ఎలెక్ట్రానిక్ వస్తువులూ ఆధునిక సదుపాయాల కలవాటు పడుతూ ఎదుగుతున్న పిల్లలు తాతగారి ఊరు ప్రయాణం అనగానే 'అబ్బా కంప్యూటర్ ఉండదూ, డబ్బా టీవీ, ఇష్టమైన ఛానల్సు ఏవీ రావు' అంటూ అభ్యంతరాలు చెప్పడం మొదలుపెట్టారు. అమ్మమ్మా, తాతగార్లు ఏ పెళ్ళికో పేరంటానికో వస్తూ, పచ్చళ్ళూ, స్వీట్లూ పట్టుకొచ్చి కూతురింట్లో నాలుగురోజులుండి వెళ్ళడమే గాని వీళ్ళు ఆ ఊరికి వెళ్ళి అయిదేళ్ళు దాటిపోయింది.

ఇపుడు అంజలి మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతోంది. తనకి మొదటి సెమిస్టర్ పరీక్షలై సెలవులిచ్చారు. సుమంత్ తొమ్మిదోతరగతి. వాడికీ హాఫియర్లీ పరీక్షలై సంక్రాంతి సెలవులిచ్చారు. వెళితే ఇప్పుడు వెళ్ళాలి. మళ్ళీ వేసవి సెలవుల్లో అటు వేపంతా వేడీ చెమటా మరీ ఎక్కువ అనుకుంది హారిక.

సాయంత్రమయ్యేసరికి పిల్లలిద్దరూ ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు ఇల్లు చేరారు. వాళ్ళకి అమ్మమ్మ ఉత్తరం చదివి వినిపిస్తూ తన ఆలోచన చెప్పింది హారిక.

"అమ్మా.. ప్లీజ్ నేనీ సెలవుల్లో స్నో వరల్డ్‌కి వెళ్ళాలనుకున్నా. నాలుగైదు సినిమాలు చూడాలనుకున్నా. సమ్మర్‌లో మాకు సెలవలుండవు తెలుసా? నైంత్ అవుతూనే టెంత్ పోర్షన్ మొదలు పెట్టేస్తారట" అన్నాడు సుమంత్ బుంగమూతి పెట్టేస్తూ.

అంజలి అంతకంటే విసుగ్గా మొహం పెట్టి "ఏముందమ్మా ఆ ఊళ్ళో దోమలూ, పేడా, మురుగూ తప్ప" అనేసింది చాలా తేలిగ్గా.

హారిక ఒక్కసారిగా భావోద్వేగానికి లోనై పిల్లల్ని చూస్తూ ఉండిపోయింది. ఆమె కళ్ళు చెమర్చాయి.

"అంజూ! ఇన్నేళ్ళుగా ఆ ఊరితో ఆ మనుషులతో మీకేర్పడ్డ అనుబంధం అదేనా? ఊరి చుట్టూ పచ్చని పొలాలూ, తాతగారి వెంట జామతోటల్లోకి వెళ్ళడం, చెట్లనుంచి కాయలు కోసుకుతినడం, అమ్మమ్మ చేతి వంట తింటూ లొట్టలేయడం గుర్తురాలేదా? మీ కోసం కళ్ళలో వత్తులేసుకుని ఎదురుచూసే అమ్మమ్మా, తాతగారూ కాకుండా మీకు గుర్తొచ్చినవి దోమలూ, పేడా, మురుగూనా?" అంది హారిక.

"అలా ఎమోషనల్ అయిపోతావెందుకమ్మా? తాతగారూ, అమ్మమ్మా అప్పుడప్పుడు ఇక్కడికే వచ్చి మనతో కొన్నాళ్ళుండి వెళ్తున్నారుగా. వాళ్ళకోసం ఆ ఊరే వెళ్ళాల్సిన అవసరం ఏముంది? ఆ దోమలు కుట్టాయంటే ఇంతింత దద్దుర్లు. స్నానానికి గీజర్ లేదు, షవర్ లేదు, గోలెంలో నీళ్ళకి మూతకూడా ఉండదు. టాయ్‌లెట్స్ అంటే పెరట్లో అంత దూరం పోవాలి" ఇద్దరూ వరసగా తమ ఫిర్యాదులు చెప్పేస్తూ ఉంటే హారిక లేచి లోపలికెళ్ళిపోయింది.

అంజలి భుజాలెగరేసి ఆ విషయాన్ని బుర్రలోంచి డిలీట్ చేసేసింది. చేతిలో సెల్‌ఫోన్ లోంచి ఎస్సెమ్మెస్‌లు పంపించడం, అందుకోవడం ఊపిరి పీల్చినంత సులభంగా సాగిపోతుంటే చెవులకి ఇయర్ ఫోన్స్ తగిలించుకుంది. సుమంత్ కంప్యూటర్ గేంలో లీనమైపోయాడు.

చీకటిపడే వేళకి శ్రీహరి వచ్చాడు. అతనికి టీ, స్నాక్స్ తెచ్చిచ్చి, తండ్రి ఉత్తరం అందించింది. అతను చదివాక "ఎంతో ఆప్యాయంగా రాసారు ఒక్కసారి వచ్చి వెళ్ళమని.. ఐదేళ్ళయింది మా ఊరు వెళ్ళి. వెళ్ళి రావాలంటే ఇప్పుడే వీలు" అంది.

"సరే పిల్లలకి కుదిరితే మీరు ముగ్గురూ వెళ్ళండి. నాకు ఆఫీస్‌లో వీలయ్యేలా లేదు" అన్నాడు శ్రీహరి.

"పిల్లలకి రావాలని ఉన్నట్టులేదు. అందుకే ఆలోచిస్తున్నా" అని పిల్లలన్న మాటలు చెప్పింది హారిక.

శ్రీహరి ఆశ్చర్యపోతూ చూశాడు.

"అలా అన్నారా? అంటే ఈ సౌకర్యాలు లేని చోట వాళ్ళు ఉండలేని స్థితికి వచ్చేశారన్నమాట. ఇందులో మన తప్పే ఎక్కువుంది. వాళ్ళని నేనొప్పిస్తాలే. మీరు ముగ్గురూ వెళ్తురుగాని" అన్నాడు.

అన్నట్టుగానే ఏం మాట్లాడాడో ఏమో గానీ పిల్లలు అయిష్టంగానైనా ఒప్పుకున్నారు.

చిన్నప్పటిలా అమ్మతోపాటు రాత్రి బస్సెక్కి తెల్లారి తాతగారి ఊరు చేరేసరికి మర్చిపోయిన చిన్ననాటి తీయని జ్ఞాపకాలు కొన్ని గుర్తొచ్చాయి ఇద్దరికీ. హారికకైతే అలవాటు లేని ప్రయాణం వల్ల నడుమూ, కాళ్ళూ పట్టేసినా బస్సు దిగేసరికల్లా చల్లని ప్రభాత పవనాలు చుట్టేసి, మంచు తెరలూ, కళ్ళాపి చల్లిన వాకిళ్ళూ కనిపించి మనసు బాల్యంలోకి పరుగులు తీసింది..

రంగనాథంగారిల్లు, దిగిన చోటికి కూతవేటు దూరం. ఎవరి బాగులు వాళ్ళు అందుకుని నడుస్తుంటే సుమంత్ హారికతో

"చిన్నప్పుడు కొన్ని పనులు ఎంత సిల్లీగా చేసే వాళ్ళమో గుర్తొస్తే నవ్వొస్తోంది అమ్మా బస్సులో వస్తుంటే నాకో ఇన్సిడెంట్ గుర్తొచ్చింది. ఒకసారి అమ్మమ్మ డబ్బులిస్తే నేనూ అక్కా రాజు బుజ్జీ చింటుగాడూ బఠాణీలు కొని తెచ్చుకున్నాం. ఇంటికొచ్చాక వాటిని పంచుకున్నాం" అంటూ ఏదో చెప్పబోయాడు. వాడి మాటలు పూర్తికాకుండానే అంజలి పకపకా నవ్వుతూ "వీడు ఒకటే ఏడుపమ్మా నాకు తక్కువొచ్చాయా రాజుగాడికి ఎక్కువచ్చాయీ అంటూ. అపుడు తాతగారొచ్చి అయిదుగురినీ గుండ్రంగా కూర్చోబెట్టి బఠాణీలు ఒక్కొక్క గింజా ఓపిగ్గా పంచారు. ఆఖరికి ఒక్క గింజ మిగిలింది. ఆ గింజ మా అందరికీ చూపించి పక్కన కాలవలో పడేశారు" అంది. సుమంత్ కూడా నవ్వుతూ "అలా పారేశారేంటి తాతగారూ అంటే ఆ ఒక్కటీ ఎవరికిచ్చినా గొడవే కదరా అన్నారు. పోనీ మీరు తినకపోయారా? అంటే నాకూ మీ అమ్మమ్మకీ బఠాణీలు తినే పళ్ళు కావురా అన్నారు" అన్నాడు.

హారిక తండ్రి సెన్స్ ఆఫ్ హ్యూమర్ తలుచుకుని నవ్వుకుంది. అయిదు నిముషాల నడక తర్వాత ఇల్లు చేరారు ముగ్గురూ. వాకిట్లో ముగ్గేస్తున్న సీతమ్మ నవ్వుతూ ఎదురొచ్చింది.

తల్లి ఆయాసపడటం గమనించి "ఈ చలిలో అలా వంగి ముగ్గులేస్తే ఆయాసం రాదా అమ్మా? నువ్వేస్తున్నావేమిటివ్వాళ? దుర్గమ్మకేమొచ్చింది రోగం? ఇవాళ పనికి రాలేదా?" అంది హారిక. ముగ్గు చెయ్యితగలకుండా పిల్లలిద్దర్నీ దగ్గరికి తీసుకుంటూ "అయ్యో

అదేమిటే. పండగ పూటా అలా అంటావ్? దానికీ వయసు మీద పడింది పాపం. చలిలో పొద్దున్నే రాలేకపోతోంది. ఎనిమిదింటికొస్తుంది. అప్పటిదాకా పాచివాకిలి అలా ఉంచడం ఎందుకని చెంబుడు నీళ్ళు చల్లి, రెండు ముగ్గుచారలేస్తున్నా" అంది నవ్వుతూ.

"అన్నిటికీ అలా సర్దుకుంటావ్ గనకే వాళ్ళూ నిన్నలా ఆటాడిస్తారు" అంది హారిక లోపలికి దారి తీస్తూ.

"లేదులే.. కొడుకు పెద్దాడై ఇంక నువ్వు పనిచెయ్యక్కర్లేదన్నా ఊరికే ఇంట్లో కూర్చుని తినలేనని చెప్పి మన ఇల్లొక్కటే చేస్తోంది. పండక్కి మాత్రం నాగ పెట్టద్దనీ, పిల్లలొస్తున్నారనీ చెప్పా" అంది సీతమ్మ. వడిలి ముడుతలు పడ్డ తల్లి మొహం చూస్తూ 'అమ్మ ఎంత బలహీనంగ కనిపిస్తోందో' అనుకుంది. మనవలిద్దరూ తాతగారిని గాఢంగా హత్తుకున్నారు.

తండ్రిని పరీక్షగా చూస్తూ 'ఏడాదిలోనే ఇంత మార్పా? అసలే పలచని జుట్టు ముందంతా దాదాపు బట్టతలైపోయింది. వెనక ఉన్న నాలుగు పరకలూ పూర్తిగా తెల్లబడ్డాయి. బరువు కూడా బాగా తగ్గినట్టు కనిపించారు. ఇద్దరిలోనూ వృద్ధాప్య లక్షణాలు బాగా కనిపిస్తున్నాయి' అనుకుంది.

"త్వరగా మొహాలు కడుక్కురండే అమ్మలూ.. పాలూ, కాఫీలు తాగుదురుగాని" వంటింటిలోంచి సీతమ్మ మాటలకి బ్రష్షులూ పేస్టూ పుచ్చుకుని పెరట్లోకి నడిచారు.

వేడిగా కాఫీలు తాగుతూ కబుర్లు చెప్పుకుంటుంటే పక్కింటి అనసూయమ్మగారు పంపులో వచ్చే మంచి నీళ్ళు పట్టుకోడానికి వచ్చి, "ఏమిటమ్మా? ఇన్నేళ్ళపాటు పుట్టింటికిక్కూడా రాకుండా ఏమంత రాచకార్యాలు చేస్తున్నావు తల్లీ" సగం హాస్యంగానూ సగం నిష్ఠూరంగానూ అన్నారు.

"రాచకార్యాలేం లేవు పిన్నిగారూ! పిల్లలు చదువులే రాచకార్యాలు మాకు" అంది నవ్వబోతూ.

"అమ్మకీ, నాన్నగారికీ అంతంత జ్వరాలొచ్చినా పిల్లలెవరూ రాలేదేవిటా అని మేమంతా అనుకున్నాం. ఏమో ఎంతెంత పనుల్లో ఉన్నారో పాపం మీరంతా" అందావిడ తేలిగ్గా చురక అంటిస్తూ.

హారిక మనసు చివుక్కుమంది. "ఏమిటమ్మా? చాలా ఎక్కువగా వచ్చిందా జ్వరం? చెప్పనేలేదేం?" అంది తల్లి వైపు చూస్తూ.

"భలేదానివి. చెప్పకపోవడమేవిటీ? అవాళ నీళ్ళు పట్టుకుంటుంటే అమ్మగారు నీతో ఫోనులో చెప్పలా' ఇద్దరికీ టెంపరేచరుందనీ కోటయ్యగారొచ్చి మందిస్తున్నారనీ'? మీ అన్నయ్యకీ చెప్పారు, నీకూ చెప్పారు. ఒకళ్ళయినా వస్తారేమో అనుకున్నా" యధాలాపంగా అంటూ బిందె నిండగానే నడుంకెత్తుకుని ఆవిడ వెళ్ళిపోయింది.

వెనక నుంచి సీతమ్మ "అయ్యో అదేవిటండి అల్లా అంటారూ? అంత అవసరమైతే పిల్లలకి కబురు చెయ్యమా, వాళ్ళు రెక్కలు కట్టుకుని రారా? పరీక్షలూ హడావిళ్ళూ తీరగానే వాళ్ళే వచ్చారా లేదా?" అంది నొచ్చుకుంటూ.

గేటు దాటుతున్న ఆవిడ "చాల్లెండి చెప్పొచ్చారు. కొడుక్కి చెయ్యి విరిగిందంటేనూ, కోడలికి బెడ్ రెస్టంటేనూ, కూతురికి నడుం పట్టేసిందంటేనూ, మనవరాలికి చికెన్ ఫాక్సంటేనూ పిలిస్తేనే వెళ్ళారా మీరు? నెలరోజులపాటు పీల్చి పిప్పి చేసే జరాల్తో చిక్కి సగమయ్యారు. కాస్త పత్యం వండిపెట్టడానిక్కూడా కోడలూ రాలా, కూతురూ రాలా.. చాల్లెండి మీ సమర్థింపులు" అనడం వినిపించింది.

చిన్నపాటి గాలిదుమారం గిర్రున తిప్పి వదిలినట్టై నల్లబడ్డ మొహంతో అమ్మా నాన్నలవైపు చూసింది హారిక.

"కాస్త తిక్క మనిషే ఆవిడ.  ఆ మాటలు పట్టించుకోకు. ఏదో రాకరాక పుట్టింటికొస్తే వచ్చినరోజే ఈవిడొహర్తి" విసుక్కుంది సీతమ్మ.

ఇంతలో దుర్గమ్మొచ్చి "ఒచ్చారా పాపగారూ" అంటూ ఇంత మొహం చేసుకుని పలకరించి ఖాళీ కాఫీగ్లాసులందుకుని గిన్నెలు తోమడానికి వెళ్ళింది.

''అమ్మగారో.. అంట్ల గిన్నెలన్నీ పడెయండి ఒక్కసారే తోమిపోతా'' అనడంతో సీతమ్మ లేచి వెళ్ళింది.

సుమంత్ తాతగారి దగ్గరకి వెళ్ళి ''తాతగారూ, ఆవిడకేమన్నా పిచ్చా? మన విషయాలు ఆవిడకెందుకు? మనింటికి మంచి నీళ్ళకి వొస్తూ మనమీదే ఈ అథార్టీ ఏమిటి? మా కన్నా ఆవిడకే మీరంటే ఇష్టమన్నట్టు మాట్లాడుతుందేమిటి?'' అన్నాడు కోపంగా.

రంగనాధంగారు చిన్నగా నవ్వి ''ఇష్టాఇష్టాలతో పనిలేకుండా ఒకరికొకరు సాయి పడడం ఇక్కడ అలవాటు నాన్నా! మంచి నీళ్ళొక్కటే చూశావు నువ్వు. వాళ్ళింట్లో పూసే మల్లెలూ, గులాబీలూ, కాసే కొబ్బరికాయలూ ఎలా తెచ్చిస్తుందో చూశావా? ఇచ్చి పుచ్చుకోవడం అంటే ఏమిటో మీకు తెలీదురా సోమూ!'' అన్నారు.

తండ్రి చెపుతున్నదేదీ హారిక చెవుల్లో దూరలేదు. 'ఈ పల్లెటూళ్ళే ఇంత. అందరి విషయాలూ వీళ్ళకే కావాలి' అనుకుని చికాకు పడింది.

సీతమ్మ బలవంతం మీద పూర్వకాలంలా కాకపోయినా నూనె దూమెరుగ్గా రాసుకుని సున్నిపిండితో వొళ్ళు రుద్దుకుని తలస్నానం చేసారు. హారిక కూరలు తరిగిస్తే సీతమ్మ వంట పూర్తి చేసింది. వంటకాలన్నీ టేబుల్ మీద అమరుస్తుంటే ఎదురింటి సుందరి వచ్చి హారికనీ పిల్లల్నీ పలకరించి, గిన్నెతో తెచ్చిన జున్ను టేబుల్ మీద పెట్టి వెళ్ళింది.

మరో రెండు నిముషాలకి నాలుగిళ్ళ అవతలున్న రాజేశ్వరి గలగలా మాట్లడుతూ వచ్చి 'దొడ్డమ్మగారు చెప్పారు నువ్వొస్తున్నావని.. ఇవాళ దొడ్లో కాసిన గుత్తొంకాయలతో కూర చేశా. నీకిష్టమని నాలుక్కాయలు తెచ్చా.' అంటూ చిన్న బౌల్ అందించి వెళ్ళింది. మూతతీసి చూడగానే హారికకేకాదు పిల్లలిద్దరికీ కూడా నోరూరింది.

అంతా కూర్చుని భోజనాలు చేస్తుంటే సుమంత్ అడిగాడు ''ఇలా రోజూ చుట్టుపక్కల అందరూ అన్నీ పంచుకుంటారా అమ్మమ్మా?'' అని.

ఆవిడ వాడి వైపు మురిపెంగా చూస్తూ ''రోజూ కాదురా నాగన్నా ఏవైనా స్పెషల్ చేసుకుంటే ఈ ముసలాళ్ళు చేసుకోలేరని ఇలా తెచ్చిస్తూంటారు'' అంది.

''ఇవాళమీరొచ్చారు కదా నాన్నా. ఏమీ స్పెషల్స్ చేయకుండా అమ్మమ్మ ఊరుకోదు. ఈ మధ్య అమ్మమ్మకంత బావుండట్లేదు కదా అందుకని'' అన్నారు రంగనాధంగారు.

సీతమ్మ కళ్ళు మూసుకుని మొదటి ముద్ద చేతిలో పట్టుకుని ఒక్క క్షణం ధ్యానించి పక్కన పెట్టింది.

''అదేమిటి అమ్మమ్మా?'' అడిగింది అంజలి.

''మొదటి ముద్ద పితృదేవతలని తలుచుకుని పక్కన పెడతారమ్మా'' అంది హారిక.

''మరి తర్వాత దాన్ని పారేస్తారా?'' అడిగాడు సుమంత్.

''లేదు నాన్నా.. మన భోజనం అవగానే ఆ ముద్ద తీసుకెళ్ళి ప్రహరీ గోడమీదో, నూతి గట్టు మీదో పెడితే కాకులూ పక్షులూ తింటాయి'' అంది సీతమ్మ.

అంజలి మెరిసే కళ్ళతో తల్లి వైపు చూస్తూ ''అమ్మా! మొన్న సమ్మర్లో సిటీస్‌లో కాకులూ పిచికలూ నీళ్ళు దొరక్క చచ్చిపోతున్నాయనీ, వీలయినంతలో చిన్నదో పెద్దదో నీళ్ళు నింపిన బౌల్ ఒకటి ప్రతి ఇంటి ఆవరణలోనూ పెట్టాలని రిక్వెస్ట్ చేస్తూ ఇంటర్నెట్లో ఒక ఫోటో మెస్సేజ్ వచ్చింది గుర్తుందా?'' అంది.

''అవును. నాక్కూడా చూపించావు'' అన్నాడు సుమంత్.

''మరి అలా పెట్టారా మీరు?'' అడిగారు రంగనాధం గారు.

"లేదు తాతా! పెట్టాలనుకుంటూనే మర్చిపోయాం" అంది అంజలి కించపడుతూ.

"అమ్మలూ రోజువారీ పనులన్నిటిలో భూత దయని జోడించిన సంస్కృతి మనది. నీకు తెలుసుగా ముగ్గు అంటే బియ్యప్పిండి.. చీమలూ, ఇతర కీటకాలూ, పక్షులూ ముగ్గు తింటాయి. గమనిస్తే పండగల్లో మనం చేసే ప్రతి పనిలోనూ మనసుకు ఆహ్లాదం కలిగించే కళకి సహజీవన సూత్రాలు కూడా జతచేసి ఉంటాయి" అన్నారు రంగనాథంగారు.

సీతమ్మ "వంటకాలు చల్లారిపోకుండా తినండర్రా" అనడంతో మాటలు తగ్గించి భోజనాలు ముగించారు.

టేబుల్ శుభ్రం చేసి తల్లితో కబుర్లు చెపుతు పక్కమీద వాలిన హారికకి నిద్రముంచుకొచ్చింది.

"ప్రయాణంలో అలిసి పోయావే. పడుకో" అందావిడ.

"అమ్మా! ఎలా చేస్తున్నారమ్మా ఈ బస్సు ప్రయాణాలూ? డెబ్బయ్యేళ్ళు దాటుతుంటే? నడుం హూనమయింది" అంటూ నిద్రలోకి జారింది హారిక.

సాయంత్రమవుతుంటే హాల్లోంచి వినవస్తున్న మాటలకి మెలుకువ వచ్చింది. 'తన మనవడికి భోగి పళ్ళుపోస్తున్నామనీ, అంజలినీ సుమంత్‌నీ కూడా తీసుకుని వస్తే వాళ్ళని కూడా పక్కని కూర్చో పెట్టి పళ్ళు పోద్దామనీ' అంటోంది అనసూయమ్మ.

"అబ్బే వాళ్ళు అలా కూర్చోరండీ. పెద్దవాళ్ళయ్యారు కదా. వాళ్ళకి అలా నచ్చదు" అంటోంది సీతమ్మ.

"అక్కయ్యగారూ. భోగి పళ్ళు పోసేది పిల్లలకి దిష్టి తగలకుండా ఉండాలని. బస్తీ నుంచీ పసిడి బొమ్మలా మనవరాలూ, సిసింద్రీలాంటి మనవడూ వస్తే ఊరి దిష్టి తగలకుండా భోగి పళ్ళు పోసుకుంటే బావుంటుంది. పిల్లలింత పెద్దయ్యాక మీ ఇంట్లో ఈ పండగ పేరంటం పెట్టుకోరుగదా అని మా ఇంట్లో పసివాడితో కలిపి వీళ్ళిద్దరినీ, కుసుమ కూతుర్నీ కూడా కూర్చోపెట్టి పోద్దాం అంటున్నా" అంటోంది అనసూయ. హారిక మనసు ఆవిడ మాటల్లోని ఆత్మీయతకి కరిగిపోయింది.

"పొద్దున్న మీకు కోపం వచ్చిందని నాకు తెలుసులెండి. అయినా పిల్లలకి సేవ చేయించుకోవడమే కాదు. చేయడమూ అలవాటు చెయ్యాలి మనం. వాళ్ళు మీ ఆరాలు కనుక్కుని అవసరానికి అడక్కుండానే వచ్చి చేస్తుంటే వాళ్ళ పిల్లలూ తెలుసుకుంటారు. వాళ్ళకవసరమైనపుడు ముందుకెళ్ళి చేస్తారు. లేకపోతే రేపెప్పుడో అయ్యో నా కూతురికవసరమైన నాడు దాని కూతురూ, కోడలూ కూడా పట్టించుకోలేదని మీరే బాధపడతారు" అంది.

హారిక కళ్ళు చెమర్చాయి. 'నిజమే.. ఇంత వయసొచ్చి ఎప్పుడూ అమ్మ వచ్చినపుడు ఆవిడ ఇచ్చే ఆసరా కోసం, పుట్టింటికి వెళ్ళినపుడు దొరకబోయే విశ్రాంతి కోసం ఆశిస్తున్నాం' అనుకుంది.

సాయంత్రం భోగి పళ్ళ పేరంటానికి ఎక్కువ బతిమాలించుకోకుండానే వచ్చారు పిల్లలిద్దరూ. రాత్రి భోజనాలయ్యాక వీధి వాకిలి తుడిచి, నీళ్ళు చల్లి, పెద్ద రథం ముగ్గు తీర్చారు తల్లీ కూతురూ కలిసి. పక్క వాళ్ళ ముగ్గులతో పోల్చి తమదే బావుందని మురిసిపోయారు.

పక్కలు సర్దుకుని పడుకునే ముందు తల్లి అలమారలోంచి కాలినొప్పులకి రాసుకునే మందు ట్యూబు తీసుకోవడం చూసిన హారిక ఆవిడ వెనకే వెళ్ళి వద్దంటున్నా వినకుండా కాళ్ళకి మందు మర్దనా చేసింది. వాళ్ళ మాటల కలకలం విని అమ్మమ్మ గదిలోకి వచ్చిన పిల్లలిద్దరూ 'నేనూ రాయనా' అంటూ పోటీపడ్డారు.

సీతమ్మ నవ్వుతూ "కాళ్ళు రెండే ఉన్నాయర్రా. ఇంకోటుంటే ముగ్గురికీ మూడు ఇచ్చేదాన్ని" అని "అంజలి పాపాయీ, సోమూ నాన్నా మీ అమ్మ మేమంటే ప్రాణం పెడుతుంది. చూస్తున్నారుగా మీరూ అలాగే మీ అమ్మానాన్నల్ని చూసుకోవాలి" అంది. ఇద్దరూ తల ఊపారు.

రాత్రి పిల్లలిద్దరి పక్కనా పడుకుని "మీ సెల్‌ఫోన్సూ, ఇయర్ ఫోన్సూ ఏవర్రా?" అనడిగింది హారిక.

"నాన్న అవి తీసేసుకున్నారుగా. వెనక్కెళ్ళే వరకూ వాటిని వాడడానికి వీల్లేదన్నారు" అన్నారిద్దరూ నిద్రమత్తులో.

మధ్యాహ్నం చాలాసేపు నిద్రపోయిన హారికకి నిద్రపట్టలేదు. తల్లిదండ్రులతో సరే. తన పిల్లలతో కూడా ఈ మధ్య కాలంలో తనెప్పుడూ గడపనంత సన్నిహితంగా ఈ ఒక్కరోజులో గడపగలిగింది. దూరంగా ఉన్న వాళ్ళమధ్య కమ్యూనికేషన్‌ని మెరుగు పరచే ఆధునిక పరికరాలు, భౌతికంగా సమీపంలో నివసించే ఆత్మీయుల మధ్య ఎంత దూరాన్ని పెంచుతున్నాయి? ఈ పరికరాలకలవాటు పడ్డవాళ్ళు వాటికి ఎడిక్ట్స్‌గా మారి వాటి వాడకంలో ఏమాత్రం అవరోధం కలిగినా ఇరిటేట్ అయిపోతున్నారు. అవతలి వ్యక్తి చెప్పే విషయం పనికొచ్చేదో కాదో తెలుసుకోక ముందే చెవుల్ని స్విచాఫ్ చేసేస్తున్నారు. అమ్మ సంక్రాంతికి రమ్మని ఉత్తరం రాస్తే ' ఇంత కష్టపడి ఉత్తరం రాయడమెందుకు.. ఫోన్ చేస్తే సరిపోయేదిగా ' అని తనే అనుకుంది.

ఆ ఉత్తరాన్ని దాచుకున్నట్టుగా ఫోన్ కాల్ నైతే దాచలేదుగా. అమెరికాలో ఎక్కడో స్కూలు పిల్లలకి వారంలో ఒక రోజు ఎలక్ట్రానిక్ వస్తువులు వాడకూడదని ఆంక్ష విధిస్తారని వింది తను. అలా ఇక్కడ కూడా ప్రయత్నిస్తే మానవ సంబంధాలు మెరుగుపడడమే కాక ఈ ఎలక్ట్రానిక్ ఎడిక్షన్ నుంచి బయటపడి, ఈ తరం పిల్లలు మరింత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకుంటారేమో అనుకుంది.

సంక్రాంతి నాడు ఎదురింటి మేడమీద ఎగరేసిన గాలిపటాలూ, పక్కింట్లో సంధ్యవేళ గొబ్బిళ్ళ చుట్టూ తిరుగుతూ కన్నెపిల్లలు చేసిన బృంద నాట్యం, రోజూ తాతగారింటికి వచ్చే ఆవుని కనుమనాడు చక్కగా కడిగి బొట్టు పెట్టి పూజించడం, పిండి వంటలతో భోజనాలు.. ఈ సంబరాల నడుమ మిగతా మూడురోజులూ మూడు క్షణాల్లా గడిచిపోయాయి. సెల్ ఫోన్లూ, ఐ పాడ్లూ లేకపోవడంతో పిల్లలిద్దరూ అన్ని సరదాల్లోనూ మనస్ఫూర్తిగా పాలుపంచుకున్నారు. పరిసరాలను చక్కగా పరిశీలించారు. ప్రశ్నలడిగారు. జవాబులన్నీ శ్రద్ధగా విన్నారు.

నాలుగోరోజు రాత్రి బస్సుకి బయల్దేరుతుంటే సీతమ్మ పెదవులు నవ్వాయి, కళ్ళు తడిగా మెరిశాయి. ముగ్గురూ పెద్దవాళ్ళ కాళ్ళకి నమస్కారాలు చేసి దీవెనలందుకున్నారు.

మనవలిద్దరూ అమ్మమ్మనీ తాతగారినీ గాఢంగా హత్తుకుని ముద్దులు పెట్టారు.

బస్సు బయల్దేరుతుంటే రంగనాధంగారు "మళ్ళీ ఎప్పుడు? అడిగారు నవ్వుతూ. మనవలిద్దరూ "దసరా కొస్తాం తాతా" అన్నారు ముక్త కంఠంతో.

●●●

# త్రిశంకు స్వర్గం.. కోసూరి ఉమాభారతి

**ఎవరో గట్టిగా తట్టిలేపుతున్నారు.** కళ్ళు నులుముకుని లేచాను. ఎదురుగా ఓ అమెరికన్ పెద్దాయనే. అర్ధం కాలేదు. చుట్టూ చూశాను. మా ఇంటి దగ్గర పార్క్‌లో ఓ చెట్టు క్రింద, బెంచ్ మీద ఉన్నాను. 'జాక్ ఇన్ ద బాక్స్' యూనిఫారంలో ఉన్నాను. ఏమైనట్టు, పనికి బయలుదేరడం గుర్తుందే, మరి ఇక్కడున్నానేమిటి? అయోమయంగా ఉంది. టైం చూస్తే ఒంటిగంట అయ్యింది. ఎండగా కూడా

ఉంది. ఆ పెద్దాయన వాటర్ బాటిల్ ఇచ్చాడు. కాసిన్ని తాగి, లేచి నిలబడ్డాను. తల తిరిగినట్టయింది. నేను పనిచేసే 'జాక్ ఇన్ ద బాక్స్'కి రైడ్ అడిగాను. నాతో పాటు రెస్టారెంట్‌లోనికి వచ్చాడు ఆయన.

నన్ను చూస్తూనే తార, డేవిడ్ ఆశ్చర్యపోయారు. "రెండు రోజులుగా ఏమయిపోయావు రేణూ?" అన్నారు ఆదుర్దాగా. నాకేమీ తెలియలేదు. ఏమి చెప్పాలో అర్థం కాలేదు. నాకు రైడ్ ఇచ్చినాయన 'టేక్ కేర్' అని చెప్పి వెళ్ళిపోయాడు. జేబు నుండి ఫోన్, వాలెట్ తీసి చూశాను. తారనుండి, లెక్కలేనన్ని మిస్డ్ కాల్స్ ఉన్నాయి. తార, డేవిడ్ వాళ్ళ మాటలని బట్టి, ఏం జరిగుంటుందో అర్థమయ్యింది. కానీ వాళ్ళతో ఏమీ అనకుండా, "ఒళ్ళు బాగోక ఇంట్లో ఉండిపోయాను, తలపోటు వల్ల, ఫోన్ వినిపించి ఉండద"ని అన్నాను. "పెద్ద జబ్బుపడి లేచిన దానిలా ఉన్నావు, అసలేమైంది నీకు, నాకైనా చెప్పు రేణు, ప్లీజ్," అంది తార నాతో. ముభావంగా ఉండిపోయాను.

ఏడాది క్రితం మా ఆయన చనిపోయినప్పటి నుండి, పుట్టెడు దుఃఖంతో పాటు, తలపోట్లు, ఉన్నట్టుండి మతిలేనట్టుగా అయిపోవడం, పరిసరాలు కూడా తెలియనంతగా మనసు స్థంభించిపోవడం, పరిపాటయిందని తారకి ఇదివరలో చెప్పినట్టు గుర్తే. కాసేపటికి రైడ్ తీసుకుని ఇల్లు చేరాను. ఆలోచిస్తే అర్థమయింది, ఇంటి నుండి ఎప్పుడు వెళ్ళానోగాని, మతిలేని స్థితిలో ఇంటి పరిసరాల్లోనే తిరిగి, ఆ పార్క్ బెంచ్ మీద చేరానన్నమాట.

వెంటనే తారకి ఫోన్ చేసి విషయమంతా చెప్పాను. మరునాడు తానే డాక్టర్ దగ్గరకి తీసుకుని వెళ్ళింది. అన్ని పరీక్షలు చేసి, 'డిమెంషియా వ్యాధి' అని తేల్చారు. మూడు, నాలుగు సంవత్సరాలుగా సూక్ష్మంగా నైనా 'మతిలేనితనం', మరుపు' ఉండుండాలి అన్నారు. కొంతైనా వేరొకరి పర్యవేక్షణలో ఉంటే మంచిదన్నారు. మా అబ్బాయిలకి ఫోన్ చేసి, "రేపు శనివారం, మీ ఇద్దరు తప్పక ఇంటికి రండి, మీతో మీ అమ్మ ఆరోగ్యం గురించి మాట్లాడాలి. మమ్మీకి తన సంగతి ఏమీ అర్థంకాలేదు, కాబట్టి మనం రేపు కలిసినప్పుడు వివరిస్తాను," అని వాళ్ళకి చెప్పింది తార.

●●●

రామ్, నేను, భరత్ కూర్చుని, డాక్టర్ రిపోర్ట్ అంతా విన్నాము, తార మాటల్లో. "ఇక నుంచైనా వీలయినన్ని సార్లు వచ్చి అమ్మని చూడాలి మీరు, ఆమెకి ఇంకెవరున్నారు? మేము బయట వారమే కదా! ఆమె ఇబ్బందులన్నీ మీరు తీర్చగలిగినవే," అంది తార నా కొడుకులిద్దరితో. వాళ్ళముందే, నాతో మెడికైడ్ పేపర్స్ మీద సంతకం చేయించింది.

డాక్టర్ విజిట్ తరువాత, ఓ ఆరునెలలేమో, తార, డేవిడ్, జోసెఫ్ నన్ను ఓ పసిబిడ్డలా చూశారు. ఒక్కోరోజు జోసెఫ్ నన్ను తీసుకెళ్ళి రెస్టారెంట్ కౌంటర్‌లో కూర్చోబెట్టేవాడు. నాకు పెద్దగా పనిచేయబుద్ది అయ్యేది కాదు. డాక్టర్ చెకప్‌కి తార తీసుకెళ్ళేది. కార్ డ్రైవ్ చేయనిచ్చేవారు కాదు నా 'జాక్ ఇన్ ద బాక్స్' కుటుంబం. నా పాత కారు అమ్మేసి నా అకౌంట్‌లో నాలుగు వేలు వేసింది తార. నా డబ్బు వ్యవహారాలన్నీ చూసేది. వివరాలు నాకు చెప్పేది. నాతో ఓసారి, "ఈ ఆరునెలల్లో నీ కొడుకులు నెలకోసారన్నా వచ్చారా, పిచ్చిదానా, పెన్షన్ మీదే నీ జీవితం సాగుతుంది, తెలుసా?" అంది తార.

"నువ్వే నాకు అన్నీ తార" అన్నాను.

తార కోసం, అప్పుడప్పుడు నాకు చేతనయిన వంట చేస్తుండేదాన్ని.

●●●

ఆరు నెలల తరువాత సంఘటన....

"ఏంటి రేణు, ఇలా నైట్ డ్రెస్‌లో రోడ్డు మీద తిరగడం, మొన్న కూడా అంతే," అంటూ నాపై విసుక్కుని, నా అపార్ట్‌మెంట్ లోనికి నడిపించి సోఫా మీద కూర్చోబెట్టింది. అంతలోనే మళ్ళీ నన్ను సవరదీసి, "కాసేపట్లో వస్తా, నువ్వు విశ్రాంతి తీసుకో" అని నన్ను

లోపలుంచి, ఈసారి బయట నుంచి తాళం వేసుకుని వెళ్ళింది తార. నేనేమి చేసానో, ఎందుకు తార కోప్పడిందో తెలియలేదు. వెళ్ళి పడుకుండి పోయాను. ఆలోచనలు మొదలవుతూనే ఎవరో తుంచేసినట్టు ప్రతి ఆలోచన తెగిపోతుంది ఓ దారంలా. తలపోటు మొదలయింది. మంచినీళ్ళకోసం కిచెన్లోకి వెళుతుంటే తలుపు తెరుచుకుని తార, జోసెఫ్ వచ్చారు. నా బట్టలు, అవసరాలు సర్దేసి మూడు సూటుకేసులు నింపారు. "ఈ రోజునుండి నువ్వూ నాతోనే మా ఇంట్లో ఉంటావు" అంటూ తార నన్ను అపార్ట్‌మెంట్‌కి మార్చేసింది. చాలా అలసటగా ఉందంటే, నాతో మందులు మింగించి, "కాసేపు పడుకో," అంటూ బెడ్ రూం తలుపు దగ్గరికి లాగింది తార.

●●●

అప్పుడే సూట్‌కేసులు లోనికి తెచ్చిన జోసెఫ్‌తో, "రేణుని చూడలేకపోతున్నాను జోసెఫ్, తల దువ్వుకోదు, బట్టలు మార్చదు, తన ఇంటికి వెళ్ళి రెండు రోజులకొకసారి షవర్‌లోకి తోస్తే అక్కడా అలా నిలబడే ఉండిపోతుంది, నోట్లోకి తిండి కూడా సరిగా పెట్టుకోలేకపోతుంది. బాధగా ఉంది. కొద్ది రోజులు నేనే అన్నీ చేసి చూస్తా. అర్థం కావడం లేదు, ఏమి చేయాలో రేణుని" అంది దిగులుగా తార.

టీ చేసి, ఓ కప్పు టీ జోసెఫ్‌కి అందిస్తూ, "నా భర్త జీవన్ నన్ను వంచించి పారిపోయినప్పుడు, ఓ అన్నలా ఆదుకుని, ఆరు నెలలు ఇంట్లో ఉంచుకున్నారు రేణు భర్త రాఘువ, 'జాక్ ఇన్ ద బాక్స్'లో పనికి చేరి నిలదొక్కుకునేంత వరకు నన్ను సొంత వాళ్ళకన్నా ఎక్కువగా ఆదుకున్నారు, తెలుసా?" అని గుర్తుచేసుకుంది తార.

సూట్ కేసుల నుండి సామాను తీస్తూ, "నీవు చాలాకాలంగా బాగా క్లోజ్ ఫ్రెండ్‌వి కదా తార, ఏమిటిదంతా? రేణు కొడుకులు ఎక్కడ? అన్నాడు జోసెఫ్.

"నాకు రేణు 30 ఏళ్ళగా తెలుసు, ఏడాది క్రితం వాళ్ళాయన తల్లో రక్తనాళం చిట్లి అకస్మాత్తుగా 60ఏళ్ళకే చనిపోయిన సంగతి మీకు తెలిసిందేగా. తరువాత బాగా క్రుంగిపోయింది. వాళ్ళాయన పెన్షన్ తప్ప ఆధారం ఏమీలేదు. అందుకే డేవిడ్‌కి చెప్పి మన దగ్గరే పనిలో పెట్టాం కదా!" అంటూ ఓ నిముషం ఆగింది తార.

"రేణు కొడుకుల సంగతా? వాళ్ళ నాన్న ఎలక్ట్రిషన్ గానూ, గ్యాస్ స్టేషన్‌లోనూ పనిచేసి, కడుపుకట్టుకుని రామ్‌ని ఇంజినీరింగ్, హైదరాబాద్‌లో ఫ్లాట్ అమ్మేసి భరత్‌ని మెడిసన్ చదివించారు. ఇప్పటికీ అమ్మతో కూరలు, రోటీ చేయించుకుని పోతారు కానీ, అమ్మ ఎలా ఉంది? సాయం చేద్దాం అని అనుకోరు" అంటూ ఆశ్చర్యంగా వింటున్న జోసెఫ్‌ని చూసి, "యు బిలీవ్ మి, మొన్న ఆగిపోయున్న కార్ బ్యాటరీకి అవసరమయి, వాళ్ళని 90 డాలర్లు అడిగితే, తన దగ్గర లేవని, రోటీ కర్రీ తీసుకుని వెళ్ళిపోయాడట రామ్" కోపంగా చెబుతూ పోయింది తార.

●●●

మరో ఆరు నెలల తరువాత సంఘటన

అది హ్యూస్టన్ నగరంలో, జీరియాట్రిక్స్ (వృద్ధుల వైద్యం) మెడికల్ క్లినిక్ - సీనియర్ సిటిజెన్స్‌తో నిండి ఉంది. సోషల్ వర్కర్ మేరీతో ఓ భారతీయ మహిళ లోనికి వచ్చింది. ఆ మహిళ శ్రీమతి రేణు కుమార్. 'ఆల్జిమర్స్ వ్యాధి' పేషంట్ గా న మోదైంది. వివరాలు, హిస్టరీ తీసుకుంది నర్స్.

- పేరు - రేణు కుమార్, వయస్సు 62
- దిగవంగతుడైన భర్త - రాఘువ కుమార్, 65

- కాంటాక్ట్ - తారా శర్మ
- రోగి జబ్బు - రెండేళ్ళగా ఆల్జీమర్స్ వ్యాధి‘ (మెదడులోని జీవకణాలు నిర్జీవమై పోవు జబ్బు)
- ప్రస్తుత పరిస్థితి - 24 గంటల అజమాయిషీ, సహాయం అవసరం
- ఇద్దరు కొడుకులు, కాంటాక్ట్‌లో లేరు
- 58 ఏళ్ళకి ‘డిమెంషియా వ్యాధి‘ నిర్ధారణ
- 59 కి ‘ఆల్జీమర్స్ వ్యాధి‘తో ‘ఆల్జీమర్స్ హోం‘లో అడ్మిట్ అయింది
- ‘ఆల్జీమర్స్‘ హోం వాళ్ళ అశ్రద్ధ వల్ల పేషెంట్ బలహీనమయి పోయింది.
- గార్డియన్, తార శర్మ ఆరు నెలలుగా ఇండియాలో ఉండడం మూలంగా రేణు పరిస్థితి పాడయింది.
- సోషల్ వర్కర్ మిస్. మేరీ జేమ్స్, క్షీణించి పోయిన రేణుని గమనించి, సంగతంతా తెలుసుకుని, రిపోర్ట్ చేసింది.
- మరో ‘ఆల్జీమర్స్‘ ఫెసిలిటీకి మార్చే విధానంలో భాగంగా, రేణు కుమార్‌ని, మెడికల్ చెకప్‌కి తెచ్చింది.

మరో పదినిమిషల్లో డా.రాజన్ వర్మ వచ్చి, రేణుని ఎక్జామిన్ చేసి, మందులు, ట్రీట్మెంట్ రాసారు. రేణుని నర్సింగ్ హోంలో విజిట్ చేస్తానని చెప్పారాయన. ఆమె కొడుకులు గురించి విని ఆయన ఆశ్చర్యపోయారు. "భారతీయుల కుటుంబాలలో హెల్త్ సరిగా లేని తల్లితండ్రులని ఇలా అశ్రద్ధ చేసేవారు, యు.ఎస్.ఎ లో అరుదు, అసలు నేను చూడలేదు," అన్నారు డాక్టర్.

"ఇద్దరు కొడుకులుండి కూడా ఈ తల్లి ఇలాంటి పరిస్థితిలో ఉందంటే, చాలా బాధగా ఉంది డాక్టర్, నా యాభై ఏళ్ళ సర్వీస్‌లో, ఇండియన్ ఫామిలీస్ తటస్థపడింది చాలా తక్కువ. అందులో ఇటువంటి కేస్ షాకింగ్! ప్రయోజకులైన పిల్లలు, వృద్ధులైన తల్లితండ్రులని ఇలా అనాధుల్లా వీధులకి వదిలేయడం నేను ఊహించలేను. ఈ కేస్ నేను పబ్లిక్ చేసి ఓ అవేర్నెస్ వచ్చేలా న్యూస్ పేపర్‌కి రాయబోతున్నాను," అంది మేరీ ఆవేశంగా..

ఇంటికొచ్చి, భార్యతో చెప్పాడు రాజన్. పిల్లల కోసం, వారి పురోగతి దృష్టిలో పెట్టుకుని, ఈ దేశంలో ముఖ్యంగా భారతీయులు, అన్ని తరగతుల వారు శ్రమిస్తారు. మతిలేని కన్న తల్లిని త్యజించి, కాంటాక్ట్ లేకుండా ఉండగలగడం నమ్మశక్యం కానీ విషయమే, అనుకున్నారు వాళ్ళు.

●●●

ఆదివారం, పొద్దున్న పదిగంటల సమయం. నర్సింగ్ హోంలో రేణు గదిలోకి విజిట్‌కి వచ్చారు డా.రాజన్.

రేణు తల బ్రష్ చేస్తున్న తార ఆయన్ని విష్ చేసి, రేణు ఆయన కేర్‌లో ఆరోగ్యంగా ఉన్నందుకు, కృతజ్ఞతలు తెలుపుతూ, డా.రాజన్‌కి మరి కొన్ని విషయలు చెప్పింది రేణు గురించి. "ఇద్దరమూ గుంటూరు నుండి తెలుగు వారమే, కుటుంబాలు కూడా తెలుసు," అని చెబుతూ, "ఆమె కొడుకులే కాదు డాక్టర్, రేణు తమ్ముడు, మరిది కూడా ఆమెని వంచించారు, పుట్టింటి నుండి రావలసిన కాస్త పొలం ఇవ్వకుండా తమ్ముడు, పూర్వుల స్థలం డెవలప్ చేసి, రావలసిన వాటా ఇవ్వకుండా మరిది, రేణుకి అన్యాయం చేసారు. అమెరికాలో ఉంటూ కుబేరులైపోయిన వీళ్ళకి ఇవ్వాల్సిన అవసరం లేదని, వారి సంజాయిషీ," అంటూ నొచ్చుకుంది తార.

"అమెరికా అష్టైశ్వర్యాల నిలయం అనీ, ఇక్కడ నివసిస్తున్న తమ వారి జీవితాలు, స్వర్గతుల్యమనీ, అపోహ పడుతూ, ఒక్కోసారి ఈర్ష్యపడే కుటుంబ సభ్యులు ఇండియాలో ఎందరో కదా డాక్టర్ గారు", అంటూ వాపోయింది తార. "కొందరికి వాస్తవంగాను, కొందరికి ఊహల్లోనూ ఇక్కడి జీవనం ‘త్రిశంకు స్వర్గమే‘ మరి," అంటున్న తారతో, అప్పటి వరకు రిపోర్ట్ రాస్తూ, శ్రోతగానే ఉన్న డా.రాజన్, "ఏకీభవిస్తాను మీతో, ఇటువంటి సందర్భాలు ఎన్నో తెలుసు, వింటూనే ఉన్నాము" అంటూ రిపోర్ట్ రాయడం ముగించారు. ●●●

# ఎవరిదీ తప్పు?

డా. కల్లూరి శ్యామల

**ఆ వృద్ధురాలికి డెబ్బయి ఏళ్ళు వుంటాయి.** ఆ కాంపస్‌లో మూడోబ్లాకులో వుండే రాజారమణన్‌గారి తల్లి ఆవిడ. కోడలు స్వాతి మంచి పేరున్న డాక్టరు. వాళ్ళకి ఒకత్తే కూతురు. చాలా గారాంగా పెంచుకొస్తున్నారు. అన్ని విషయాలలో ఎంతో మంచిదయిన పేరున్న ఆ కోడలుకి అత్తగారంటే పడదు. ఆవిడకి పెద్దతనం వచ్చాక మరీ ఎక్కువ అన్ని విషయాలలో జోక్యం కల్పించుకుంటూంటుంది అని కోడలు స్వాతి బాధ. మనవరాలికి అస్తమాను ఏదో ఒకటి తినిపించటమో, రాత్రిళ్ళు తనదగ్గర పడుకోపెట్టుకుని కథలు కబుర్లు చెప్పటమో చేస్తూండేది ఆవిడ వంటరితనం తప్పించుకోటానికి. ఆ పాప చిన్నప్పుడు తను ఎం.డి చేసేరోజుల్లో తనకి నైట్ డ్యూటీలున్నప్పుడు ఆవిడ దగ్గర పాప పడుకున్నా, ఆవిడ పెట్టిన చిరుతిళ్ళు తిన్నా స్వాతికేబాధ వుండేది కాదు. ఇప్పుడు పాపపెద్దదైన తర్వాత అత్తగారు ఒక పెద్ద భారంలాగా అనిపించటం మొదలెట్టిందామెకు. తన అవసరంలేకుండా పాప పెద్దయిపోతుంటే స్వాతికేమీ నచ్చటంలేదు సరికదా అదంతా అత్తగారు తనకి వ్యతిరేకంగా చేస్తున్న కుట్ర అనిపించటం మొదలెట్టింది. రోజూ వాళ్ళింట్లో ఏదో ఒక కారణానికి దెబ్బలాటలవుతాయి. అత్తగారితో మాట్లాడవద్దని కూతురుమీద నిబంధనలు విధించేది. ఎప్పుడయినా ముసలావిడ నిగ్రహంపాటించలేక పాపతో మాట్లాడితే ఆవిడ చూస్తుండగానే పాపని కొట్టడం తిట్టడం చేస్తూంటుంది. చిన్నపిల్ల తన మూలాన్ని దెబ్బలు తినడం ఆవిడ భరించలేకపోతోంది. అల్లా అని పాప అలవాటు కొద్దీ తనదగ్గరకొస్తే పొమ్మని వదిలించుకోనూ లేదు. ఆవిడ కొడుకు ఎప్పుడూ తనపనిలో తనుంటాడు, ఇంట్లో గొడవల్లో తలదూర్చి ఎవరి తరఫున మాట్లాడినా రెండో వాళ్ళకి కోపం, దుఃఖం కలగటం అనివార్యమని అతనికి తెలుసు. అందుకే ఇద్దరికీ దూరంగా ఎప్పుడూ తన ఆఫీసు పనులంటూ బయటే తిరుగుతూ వుంటాడు.

ముసలావిడ బాధకి మరో ముఖ్యకారణం ఆవిడకి తన బాధ చెప్పుకోవటానికెవరూ లేరనే దొకటి. తన కోడలు రోజులు గడుస్తున్నకొద్దీ పెడ్తున్న ఆంక్షలు ఆవిడకి చాలా కంటకంగా అనిపిస్తాయి. అంతకీ ఆ మధ్య చాలారోజులు ప్రొద్దున్నే లేచేసి ఇంట్లో దేముడికి దీపం పెట్టేసుకుని గుడిదాకా నడిచి వెళ్ళి భోజనాల సమయందాకా అక్కడే కూచునేది. పూజార్లు కూడా ఆవిడని ఏమీ అనకుండా ప్రసాదం రోజూ తీసుకొచ్చి ఆవిడ ముందు పెట్టేసేవాళ్ళు. కొన్నాళ్ళ తర్వాత ఆవిడ సాయంత్రం కూడా వస్తుండటం చూసి మధ్యాహ్నం "ఎండలో ఏం వెళ్తారు పాటీ, ఇక్కడే తినేసి నడుము వాల్చండి" అని మరో ప్రసాదం ప్యాకెట్ చేతులో పెట్టేవాళ్ళుగూడా! ముక్కూ ముఖంతెలియని ఈ పూజార్లకున్న దయా దాక్షిణ్యాలు కొడుకు కోడలికి లేకపోయాయే అనే ఆవిడ పదేపదే అనుకుంటూవుంటుంది. మనవరాలు రోజూ సాయంత్రం వెళ్ళగానే "పాటీ, ఎక్కడికెళ్ళావు, నేనెంత వెతికానో తెలుసా? నీకు తెలుసు కదా నాకు స్కూలు మూడింటికి అయిపోతుందని. నిన్న నాకు బకాసురుడికథ చెప్తుతానన్నావు?" అని ప్రశ్నలవర్షం కురిపించేది.

"అవునమ్మా! మధ్యాహ్నం పూట అది ఒక్కత్తీ వుంటూందని నీకు తెలుసుకదా! ఇంట్లోనే వుండి తల్చుకుంటే నీ దేముడు వినిపించుకోడా ఏమిటి" అని కొడుకు విసుక్కుంటాడు. అసలు విషయమేమిటో అతనికి చెప్పలేక ఆవిడకి ఉక్రోషం వస్తూవుంటుంది.

అంతకుముందురోజు కొడుకు కోపంతో కేకలుపెట్టేసరికి ఆవిడ భరించలేక అసలు సంగతి చెప్పేసింది. "మీ ఆవిడకి నేను పాపతో మాట్లాడటం ఇష్టం వుండదురా!ఇంటికిరాగానే దాన్ని అన్ని విషయాలు అడుగుతుంది. ఈ పిచ్చిమొద్దు పాటీ కథ చెప్పిందనో, నేను పాటీ స్నేక్స్ అండ్ లాడర్స్ ఆట ఆడమనో చెప్తుందనుకో, దానికి తిట్లు పడతాయి. 'హోం వర్క్ చేసుకోవచ్చుకదా! వూరికే

పాటీతో ఆటలు పాటలు అంటూ కాలక్షేపంచెయ్యకపోతే!' అంటూ నన్ను కూడా ఝాడిస్తుంది. 'మీరుమాత్రం వయస్సు వచ్చిందికదా ఏరామా కృష్ణా అనుకోకుండా దానితో వూకదంపు కబుర్లేమిటి మీకు? అది చిన్నది సరే, మీ పెద్దరికం ఏ గంగలో కలిసింది?' " అంటూ కోడలు అన్న మాటలన్నీ చెప్పడం ఇష్టంలేకపోయినా మళ్ళీ మాట తిప్పుకుని "ఇది చిన్నది కదా, నిన్నమొన్నటిదాకా నా దగ్గరే పడుకుని నేను చెప్పిన కథలు వింటూ పెరిగిందయ్యే! నాతో మాట్లాడవద్దంటే అర్థంకాక మొండికెత్తితే కోడలు దాన్ని బాదుతూ వుంటుంది. ఎందుకులేరా, ఆ గుళ్ళోనే కృష్ణా రామా అనుకుంటూ కూర్చుంటున్నాను. వాళ్ళే మధ్యాహ్నం కొంచెం ప్రసాదం పడేస్తారు. దానితో నా కడుపు నిండిపోతోంది గూడా. ఇక్కడికొచ్చి చేసే పనేముంది కనుక?" అంటూ ముగించింది ఇంక చెప్పేందుకేమీ లేదంటూ.

కొడుకు షాక్ కొట్టినట్టు నిలబడిపోయాడు రెండు నిమిషాలపాటు, "ఏమిటేమిటీ? గుళ్ళో పూజార్లిచ్చిన ప్రసాదంతో కడుపు నింపుకుంటున్నావా? ఏం అమ్మా, నీ కొడుకు చచ్చిపోయాడనుకున్నావా? వాళ్ళేమి అనుకుంటారు? వున్న ఒక్క కొడుకు ఈ వృద్ధాప్యంలో తల్లిని వీధిని పడేసాడనుకోరూ? నీకెందుకన్నా కష్టమనిపిస్తే నాకెందుకు చెప్పలేదు? అయినా ఇల్లన్నతర్వాత లక్ష వుంటాయి. ఇంట్లో సద్దుకోవాలిగాని ఇలా వీధిన బడటం నీకు న్యాయంగా వుందా?"

తల్లి ఇన్నాళ్ళుగా పడుతున్న ఆవేదన గురించి ఆవగింజంత అవగాహన కూడా లేని కొడుకు తనమీద అగ్గిమీద గుగ్గిలంలా మండి పడటంతో ఏంచెప్పాలో తెలియక ఆవిడ లోపల్లోపలే కుమిలిపోయింది. ఏంచెయ్యాలిప్పుడు ఇంట్లో వుండి కోడలితో తిట్లు తినాలా, గుళ్ళో కెళ్ళి కొడుకుతో తిట్లుతినాలా అనేదే ఆవిడ సంగ్దిగ్ధం.

ఆరోజు సాయంకాలం గుడినుంచి వస్తుంటే కొడుకు స్నేహితుడు రాఘువరావు కనిపించి నమస్కారం చేసి ఆప్యాయంగా పలకరించాడు. ఈ బ్లాకుల్లో తమిళం తెలిసినవాడతనొక్కడే. తమ కుటుంబంలో అందరికీ పరిచయంవున్న ఒకేఒక వ్యక్తి ఇతను. ఆవిడ మొహం వాచినట్టు రాఘువరావుతో మాట్లాడుతూ అతనితో పాటు అతని ఇంటిదాకా వచ్చింది ఆ రోజు. ఎన్నాళ్ళబట్టో అణచిపెట్టుకున్న దుఃఖం వుబికి వచ్చినట్టయి ఆవిడ అతనితో కష్టాలన్నీ చెప్పుకొచ్చింది. ఆవిడ బాధేమిటో అర్థమయినా తను ఏం చెయ్యగలడో అర్థంకాని రాఘువరావు నిశ్శబ్దంగా ఆవిడ బాధవిని వూరుకున్నాడు. ఆవిడ రాఘువరావు ఇంట్లో డ్రాయింగ్ రూంలో కూర్చుని తన కష్టాలన్నీ చెప్పుకొచ్చింది. అతనామెకి తన కొడుకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నరోజులనుంచీ తెలుసును. మహా గొప్ప పరిచయంలేకపోయినా తనభాష తెలిసిన ఒకేఒక వ్యక్తి అవటంతో అతనంటే ఆవిడకి అభిమానం. మాట్లాడుతూ మాట్లాడుతూ అతనితో ఆరోజు చెప్పేసింది "నేను నాకొడుకింటికి వెళ్ళను. నువ్వు నా కొడుకు లాంటి వాడివే! నీదగ్గరే వుంటాను పూటకో రొట్టెముక్క ఇవ్వు చాలు. నా బెజ్జెడు బొజ్జకెంత కావాలి కనుక." అనగానే రాఘువరావు నిర్ఘాంతపోయి కూర్చుండిపోయాడు. "అల్లాగే దాన్దేముంది! మీరు నిశ్చింతగా వుండండి. ఏదో ఒకటి ఆలోచిద్దాం!" అని ఆవిడకి అభయహస్తమిచ్చి వంటింట్లోకి నడిచాడు.

"అమ్మా! పాటీ నాన్నతో ఏమ్మాట్లాడుతోంది? ఎందుకలా ఏడుస్తోంది?"

"తెలియదు తల్లీ!"

"తెలియదా? అదేంటి, నీకు అర్థంకాదా ఆవిడ చెప్పేది?"

"ఊహూ! ఆవిడంతా తమిళంలో చెపుతోంది కదా, నాకు తమిళం తెలియదు మరి!"

"మరి మనదే భాష?"

"బుద్దూ! మనభాషేమిటో తెలియదానీకు? మనది తెలుగు. ఇక్కడ అందరూ మాట్లాడేది హిందీ, ఇప్పుడు పాటీ నాన్నతో మాట్లాడేది తమిళం! "

"ఒహో! మరి నాన్నకి తెలుగు, తమిళం రెండూ వచ్చా?"

"అవును తల్లీ! కన్నడం, హిందీ, ఇంగ్లీషు కూడా వచ్చు మీ నాన్నకి!"

"ఎల్లానేర్చుకున్నారు అన్ని భాషలు నాన్న?"

"నాన్నకి మాథ్స్ కూడా వచ్చు ఎందుకంటే నీ అంతప్పుడు వాళ్ళమ్మని విసిగించకుండా టేబుల్స్ నేర్చుకున్నారు."

పది సంవత్సరాల ప్రత్యూష ప్రశ్నలకి సమాధానంచెప్పి చెప్పి విసిగెత్తిన ప్రవీణ కూతుర్ని ఆడుకోటానికి క్రిందకి పిల్లలదగ్గరికి పంపించేసింది. తనులేచి పాటీకి మజ్జిగ చేసి ఇద్దామని లేచింది. నవ్వుతూ ఆవిడముందుకి వెళ్ళి గ్లాసు అక్కడపెట్టి రావాలంటే కొంచెం మొహమాటంగానే వుంటుంది. ఆవిడ భాష ఓనమాలు రావు. ఆవిడ భాషేమిటో బాధేమిటోతెలియదు కానీ మర్యాదకోసం నవ్వుతూ వెళ్ళి కాఫీ, టీలు మజ్జిగ ఇవ్వాలి. ఇంతలో భర్త లోపలికి అడుగుపెట్టాడు.

"ప్రవీణా! వింటున్నావా? చిన్న సమస్య వొచ్చిందోయ్" అంటూ ఆవిడ అన్న మాటచెప్పి "అవటానికైతే రమణన్ నాకు పదిహేనేళ్ళుగా తెలుసు. అయితే ఈ విషయంలో నేనెల్లా కల్పించుకోగలను? పెద్దావిడ. దుఃఖంలో వుందనుకో! రాత్రి ఎక్కడికి పంపెయ్యగలను? ఈ రోజుకిక్కడ పడుకోనిద్దాం. రేపొద్దున్న ఆలోచిస్తాను"

ప్రవీణ చటుక్కున అతని చెయ్యి పట్టుకుని ఆపింది. "ఎంతలేదన్నా పెద్దావిడ, నేనూ ఒప్పుకుంటాను. కానీ ఒక్కనిమిషం అలోచించండి. గుడికని చెప్పి ఇల్లొదిన ముసలావిడ ఇల్లు చేరకపోతే ఎంత కాదనుకున్నా కన్న కొడుకు ఖంగారు పడడా? ఆవిడ మనింట్లో వుందని కనీసం వాళ్ళింట్లో తెలియాలికదా! వెళ్ళి చెప్పిరండి. అప్పుడుచూద్దాం!" ప్రవీణ చెప్పిందీ నిజమే, అనుకుంటూ షర్ట్ వేసుకుని రమణన్ ఇంటికి బయలు దేరాడు.

అంత లేటుగా తన ఇంటి బెల్ కొట్టిన స్నేహితున్ని చూసి ఆశ్చర్యపోయాడు. అతని ముఖంలో కొంచెం ఆదుర్దాగా చూసి "రమణన్ కొంచెం ఇలా, నీతో మాట్లాడాలి." అంటూ బయటికి తీసుకెళ్ళాడు. అనుమానంగా అతని వెనకాల వెళ్ళిన రమణన్

"ఏమైంది రఘూ? ఎనీ ప్రాబ్లెం?"

"ప్రాబ్లెం ఏమీ లేదు. ఐ మీన్ వుందనుకుంటే వుంది. లేకపోతే లేదు. ఈ రోజు ఆఫీస్ నుంచి వస్తుంటే మీ అమ్మగారు కలిసారు."

"అమ్మా! నీకు కనిపించిందా? ఈ మధ్య వయస్సు పెరిగి కొంచెం చాదస్తం గూడా పెరిగింది. సాయంత్రమనగా గుడికని చెప్పి వెళ్ళి ఇంతమట్టుకు ఇంటికి రాలేదు. ఈ మధ్య మధ్యాహ్నాలు కూడా అక్కడే కూర్చుంటోంది. స్వాతికీ ఆవిడకీ అసలు పడటంలేదు. ఇవ్వాల్టినుంచీ రాత్రిళ్ళుగూడా అక్కడే మకాం పెట్టదల్చుకుందో ఏంటో ఇంతమట్టుకురాలేదు. ఇప్పుడక్కడికే వెళ్తున్నాను."

"అవసరంలేదు. ఆవిడ మాఇంట్లో వుంది." నెమ్మదిగా గిల్టీగా ఫీల్ అవుతూ చెప్పాడు.

"మీ ఇంట్లోనా? అదేమిటి? అసలక్కడికెందుకొచ్చింది? ఈవిడకి రానురానూ మతిపోతోంది. సారీ, దోస్త్! పద, ఆవిడని వెనక్కి తీసుకొచ్చేస్తాను. ఇంట్లో గొడవలు ఇంట్లో వుండాలిగాని ఇలా వీధిన పడకూడదు"

రాఘవరావు బలవంతంగా అతన్ని అపుతూ "ఒక్క నిమిషం! రమణన్, ఆవిడ మాఇంటికి రావాలనుకుని రాలేదు. నాకు సాయంత్రం కనిపించినప్పుడు ఆవిడ మీ ఇంటికే వస్తున్నారు. నేను మామూలుగా పలకరించాను. అప్పటికే ఆవిడకేదో దుఃఖం తన్నుకొస్తున్నట్టుంది. నాతో మాఇంటికి వచ్చి కూర్చుండిపోయారు. ప్రవీణకి తమిళ్ తెలియదు. నువ్వేమీ భయపడనక్కరలేదు. మొహమాటపడనక్కరలేదు. ప్రవీణ నీకు చెప్పిరమ్మని పంపింది. నువ్వు ఖంగారు పడ్తావనే నేనొచ్చాను. చూడు మనిద్దరం పదిహేనేళ్ళబట్టీ స్నేహితులం. మాఇంటికావిడ వస్తే వీధిన పడినట్టుకాదు. ఆవిడ నీ దగ్గరే వుంటాను మా వాడి దగ్గరి కెళ్ళను అని ఏమేమిటో అంటోంది. నాకైతే పెద్దావిడ, నన్ను కొడుకుగా భావించి నాదగ్గరొక పూట వుంటే ఏమీ తప్పనిపించదు. రేపొద్దున్న వచ్చి తీసుకెళ్ళు. అప్పటికావిడ

శాంతిస్తుందికూడా! ఆవిడ భాష తెలిసి ఆవిడతో మాట్లాడేవారైనా వుంటే ఆవిడకింత ఒంటరితనమనిపించక పోయేది. మిగతా విషయాలు రేపు చూద్దాంలే! నువెళ్ళి నిశ్చింతగా పడుకో!" అని చెప్పాడు.

అయితే రమణన్‌కి తల్లి వ్యవహారం తలతీసేసినట్టయింది. ఈసారి భార్యమీద కోపంకాదు, తనమీద స్వంతకొడుకు కోపంలో ఏదో అన్నాడని బాధపడి ఇల్లొదిలేసింది. తనకయినా బుద్దిలేకపోయింది. తల్లనయినా చూడకుండా నోరు పారేసుకున్నాడు. రాఘవరావు వెనకాల అతని ఇంటికి నడిచాడు. రాత్రి ఇంట్లో అడుగుపెట్టిన స్నేహితులని చూడగానే ఆవిడకర్థమయిపోయింది తనకోసమే కొడుకు వచ్చాడని. మాట్లాడకుండా అతని వెనక ఇంటికి నడిచింది.

మర్నాడు భార్య హాస్పిటల్‌కెళ్ళగానే తల్లి దగ్గరొకొచ్చాడు. గుడికెళ్ళబోతున్న ఆవిడని చెయ్యి పట్టి కూర్చోబెట్టాడు. కోడలు గొడవలో కల్పించులోదలుచుకోక హాస్పిటల్‌కెళ్ళిపోయిందని గూడా తెలుసుకుందావిడ. సిగ్గుతో తలదించుకోవల్సిన అవసరం ఇన్నాళ్ళ జీవితంలో ఆవిడకెప్పుడూ రాలేదు మరి! "అబ్బాయి, ఏమీ అనుకోకురా నాకేమిటో మనస్సు బాగోలేక ఏంచేస్తున్నానో కూడా అర్థంకావటంలేదు. చిన్నదాన్ని కోడలు నాదగ్గరికి రాకుండా కట్టడి చేస్తుంటే నాకు దుఃఖం ఆగటంలేదు. నాకు మాత్రమెవరున్నారురా? నిన్నొక్కడినే నాకిచ్చి దేముడు నాకన్యాయం చేశాడనిపిస్తోందిప్పుడు! ఇంకొక కొడుకో కూతురో వుండి వుంటే మరీ అస్తమానూ నీకు భారంగా వుండకపోదును" ఆవిడ గొంతు పూడుకుపోయినట్లయింది.

రమణన్‌కి తల్లిదుఃఖం ఎలా తీర్చాలో తెలియలేదు. ఆవిడనెక్కడికయినా కనీసం పదిరోజులకయినా పంపించలేడు. భార్య అర్థంచేసుకుంటే ఎంతబాగుండును, అనుకుంటూ " అమ్మా, నిన్న నేను కారు పాడయిందని మండుటెండలో నడిచి ఇంటికి వచ్చాను. చంటిది ఒక్కత్తే ఇంటి బయటకూర్చుని వుంది. మామూలుగా నేను దానికన్నా ముందే వస్తాను కదా! నడిచి రావటంతో లేటయింది. నువ్వు ఇంట్లో వుండివుంటావనుకుంటూ వచ్చాను. నువ్వు సాయంత్రందాకా గుళ్ళోనే వుంటున్నావని నిన్నటిదాకా నాకు తెలియనే తెలియదు. ఆ అలసట, కోపంలో వళ్ళు తెలియకుండా నీమీద అరిచాను. నాది తప్పే ఒప్పుకుంటున్నాను. ఇప్పుడు నేనేమి చెయ్యాలో చెప్పు. స్వాతికి పని వొత్తిడో, కూతురుపట్ల పిచ్చి మమకారమో, నిన్ను అస్తమానూ సాధిస్తూ వుంటుంది. నేను రాత్రి తనతో చాలాసేపు మాట్లాడాను. ప్రస్తుతం ఏమీ ప్రాబ్లెం లేదు. నువ్వు కూడా సర్దుకుపో! నాకు మీరిద్దరూ సామరస్యంతో వుండటం కావాలి! నువ్వు కావాలమ్మా!. ఎంత వయస్సు వచ్చినా ప్రతివాళ్ళకీ తల్లిదండ్రుల పట్ల మమకారం వుంటుంది ఎవరో దుర్మార్గులైతేతప్ప! నేనల్లాంటివాడినని నీకనిపిస్తోందా చెప్పు? నిన్ను నిన్న అవమానించాను. నన్ను నేనవమానించుకున్నట్టే అనుకుంటున్నాను! అల్లా రఘు ఇంటికెళ్ళావు. అతను మనకి తెలిసినవాడే కానీ అతని భార్యకి ఏమీ తెలియదు కదా! ఏం బాగుంటుంది చెప్పు" తల్లిని బ్రతిమాలే ధోరణిలో చెప్పాడు.

ఆవిడ మాట్లాడలేదు. కానీ ఆరోజు మధ్యాహ్నం అతను వచ్చేసరికి ఇంట్లో దర్శనమిచ్చింది. ఇద్దరూ మాట్లాడుకుంటూ భోజనంచేశారు. నాలుగంటలకి కోడలు స్వాతి వచ్చింది. అత్తగారితో ఒక్కమాట మాట్లాడకుండా ఇంటిపనిలో పిల్లకి చదువు చెప్పటంలో నిమగ్నమయిపోయింది. మనవరాలు కూడా ఆవిడ దరిదాపులకి రాలేదు. ఆవిడ నిశ్శబ్దంగా నిట్టూరుస్తూ కృష్ణా రామా అనుకుంటూ కళ్ళుమూసుకుంది

అంతే, తెల్లారేసరికి ఆవిడ నిద్రట్లో కన్నుమూసిందని కబురు తెలిసింది రాఘవరావుకి. వెంటనే వెళ్ళాడు. స్నేహితుడికండగా నిలబడ్డాడు ఆ పదిరోజులు. వయస్సు తీరి ఆవిడ వెళ్ళిపోయిందని అందరూ అంటున్నా తనకారణంగానే తల్లి అసంతృప్తితో చనిపోయిందని రమణన్ మనసులో మధనపడ్డాడు.

అతని బాధేమిటో తెలిసినా తెలియకపోయినా ఒకరోజు రాఘవరావు తనస్నేహితుడి ఇంట్లో టీ తాగుతూ అన్నాడు, "పిల్లలికి తల్లిదండ్రులెంత అవసరమో తల్లిదండ్రులకీ పిల్లల అవసరముంటుంది కదూ! రఘూ! ముఖ్యంగా దేశంగాని దేశంలో నీ భాష

తెలిసినవాళ్ళెవరూ లేకపోవడంవలన నవ్వుతూ నీతో మాట్లాడే వాళ్ళు కనపడితే మొహవాచిపోయినట్లు ప్రవర్తించటం అసాధారణమేమీ కాదు! ఇందులో నీ తప్పేమీలేదు. ఆవిడ నిశ్చింతగానె వెళ్ళిందని నావుద్దేశ్యం! నువ్వు పోయే ముందురోజు ఆవిడ మాట్లాడినపుడు ఆవిడ తృప్తి పడ్డట్టే కనిపించిందన్నావు కదా! గుడికెళ్ళకుండా మధ్యాహ్నం మనవరాలితో గడిపిందన్నావు కూడా కదా!"

రమణన్ కూతురు లోపల్నించి వచ్చి తండ్రి మీద పడ్తూ "నాన్నా, పాటీ చెప్పిన గోవర్ధన పర్వతం కథ చెప్పాలి ఈ రోజు, లేక పోతే పాటీ కావాలని ఏడుస్తాను" అంటూ అతని వొళ్ళో వాలింది. తల్లి తనని గుండెలకి హత్తుకున్నట్టు రమణన్ గట్టిగా తనకూతుర్ని హత్తుకున్నాడు 'అల్లాగే తల్లీ' అంటూ.

కూతురి కౌగలింతలో తల్లి తనని క్షమించినట్టే అనుకున్నాడు రమణన్. వృద్ధాప్యంలో తల్లిని దగాచేసింది తనా, భాషా సౌలభ్యంకూడా లేని ఈ దేశంకాని దేశంలో ఒక్కగానొక్క కొడుకునై పుట్టిన నా దగ్గర ఉండాల్సొచ్చిన ఆవిడ దౌర్భాగ్యమా, చదువుకునీ ఎందర్నో ఎన్నో రోగాలబారి నుంచి తప్పించగలిగిన సామర్థ్యముండి తనకి స్వంత తల్లి లేకపోయినా అత్తగారిపట్ల అనుబంధం ఆప్యాయత చూపించలేకపోయినా కనీస ధర్మాన్ని నిర్వర్తించలేని భార్య అసమర్థతా... ఏది కారణం అనుకోకుండా వుండలేకపోయాడు రమణన్.

●●●

# పార్థుడూ పార్థివమూ

వసుంధర

***(ఒక మంచి కథ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారికి చేరాలన్న ఆకాంక్షతో ఇటీవలే అంటే జూలై 2012 'స్వప్న' మాసపత్రికలో ప్రచురితమైన ఈ కథని 'కౌముది' పాఠకులముందుకి తీసుకొస్తున్నాం. ఈ కథ పునఃప్రచురణకి ప్రత్యేక అనుమతినిచ్చిన 'వసుంధర' గారికి కౌముది కృతజ్ఞతలు తెలియచేస్తోంది.)***

**ఉన్నట్లుండి ఓ టివి చానెల్లో ఇంటింటా** కనిపిస్తున్నాడు పార్థుడు అనబడే పార్థసారథి.

పార్థుడేం ప్రముఖ వ్యక్తి కాదు. వారం క్రితం ఇంటర్ ఫైనలియర్ పరీక్షలు వ్రాశాడు. అతడి ప్రాముఖ్యానికి ఎంసెట్ రాంకు అనుకుందుకు లేదు. ఆ పరీక్షకింకా కొంత టైముంది.

తన ప్రాముఖ్యానికి పార్థుడు సంతోషిస్తున్నాడనుకుందుకూ లేదు. కలలు నింపుకోవాల్సిన కనులలోంచి కన్నీళ్ళు వరదలై పొంగుతున్నాయిప్పుడు. ఆ వరద ప్రభావానికి ఏ మాత్రమూ చలించకుండా అతడి ఎదురుగా మిన్నంటే ప్రయత్నం చేస్తున్న చితిమంటలు!

ఆ చితిలో కాలిపోతోంది చలపతి పార్థివ శరీరం. చలపతి పార్థుడి తండ్రి. అతడి కలల పునాది.

కాలిపోతున్నది తండ్రి శవం మాత్రమే కాదు, తన భవిష్యత్తు అని కూడా పార్థునికి తెలుసు. తండ్రి లేకపోతే తనకి వర్తమానమూ లేదని అతడికి తెలుసు. కాస్సేపట్లో తండ్రి శరీరం గుప్పెడు బొమికలూ, పిడికెడు బూడిదగా మారిపోతుందనీ తెలుసు. అందుకే దుఃఖం అతడిలో వరదలై పొంగుతోంది.

పార్థుడికి తండ్రి అంటే ప్రేమ. తన భవిష్యత్తంటే ప్రేమ. భవిష్యత్తుపై పెట్టుకున్న ఆశలవల్ల వర్తమానమన్నా ప్రేమే! అందుకే చితిమంటలు అతడిలో దుఃఖాన్ని పొంగిస్తే అది సహజం. కానీ తండ్రి పార్థివ శరీరం చితిమంటల్లో బొమికలుగా, బూడిదగా మారుతుందని విచారించడంలో అర్థం లేదు. ఎందుకంటే అందుకు అతడి ప్రయత్నమే కారణం. అదీ మామూలు ప్రయత్నం కాదు. ఒక జర్నలిస్టునీ, ఓ టివి ఛానెల్నీ, కొందరు క్లాస్‌మేట్స్‌నీ, ఎందరో ధర్మదాతల్నీ కూడగట్టుకున్న అసాధారణ ప్రయత్నమది.

నిన్న ఉదయం ఆరింటికి చలపతి కడుపులో నొప్పి అన్నాడు. కొడుకుతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రికి బయల్దేరాడు. ముందు నడిచే బయల్దేరాడు. కానీ దారిలో చలపతి ఒకచోట చతికిలపడిపోయాడు. అడుగు ముందుకు వెయ్యలేనన్నాడు. మరుక్షణం ఆయనకి స్పృహ తప్పింది. పార్థుడాయన్ని ఆటోలో ఆస్పత్రికి తీసుకెళ్ళాడు. అక్కడ డాక్టర్లు పరీక్ష చేసి - వచ్చింది పార్థివ శరీరం మాత్రమేనని తేల్చారు.

పార్థుడు షాక్ తిన్నాడు. తేరుకోగానే విశ్వానికి ఫోన్ చేసాడు.

విశ్వం చలపతి స్నేహితుడు. ఇప్పుడు వాళ్ళుండేది ఆయనింట్లోనే. ఫోన్ కబురు తెలియగానే ఆయన పరుగున ఆస్పత్రికి వచ్చాడు. మిత్రుడి శవాన్ని చూసి భోరుమన్నాడు. తేరుకున్నాక, "చింతించి వగచి ఏమి ఫలం? శవాన్ని మెడికల్ కాలేజీకి దానమిచ్చేయి. పుణ్యమూ, పురుషార్థమూ" అని కర్తవ్యోపదేశం చేశాడు.

పార్థుడు తండ్రి చావుకి ఎంత షాకయ్యాడో, ఈ సలహాకీ అంత షాకయ్యాడు. "తలకి కొరివి పెట్టాల్సిన కొడుకు నేనుండగా, ఆయన శరీరాన్ని ప్రయోగశాలకి అప్పగిస్తానా?" అన్నాడు తేరుకున్నాక.

"తలకి కొరివి పెట్టాలంటే వేలకి వేలు కావాలి. ఎక్కణ్ణించి తెస్తావ్? మెడికల్ కాలేజీకిస్తే - ఆయన శరీరం మానవాళికి మేలు చేస్తుంది. వాస్తవంగా ఆలోచించు" అన్నాడు విశ్వం.

పార్థుడు వాస్తవంగానే ఆలోచించాడు. ఐతే తల్లి మాలతి పరంగా అతనికి తెలిసిన వాస్తవం వేరే ఉంది.

చలపతి, మాలతిది ప్రేమ పెళ్ళి. ఇరుపక్షాల పెద్దలూ వాళ్ళ ప్రేమను హర్షించలేదు. పెళ్ళిని ఆమోదించలేదు. ఐనా ఆప్రేమికులు లెక్క చెయ్యలేదు. పెద్దలతో తెగతెంపులు చేసుకుని వేరు కాపురం పెట్టి ఒకరికొకరు ప్రాణంగా భావిస్తూ జీవనపోరాటం కొనసాగించారు. పెళ్ళయిన ఏడాదికి పార్థుడు పుట్టాక కొడుకే వాళ్ళిద్దరికీ ప్రాణమయ్యాడు. పార్థుడు బుద్ధిగా చదువుకుని వృద్ధిలోకి వస్తుంటే అదే తమ జీవన ప్రగతిగా భావించారు.

పార్థుడు మంచి మార్కులతో టెన్తు పాసయ్యాడు. వాణ్ణి ఇంటర్‌లో చేర్పించిన మరుసటి రోజే మాలతి కళ్ళు తిరిగి పడిపోయింది. వైద్యులకి చూపిస్తే కడుపులో పుండు అన్నారు. మందులకీ ఆపరేషనుకీ రెండు లక్షలౌతుంది అన్నారు. ఆ తర్వాత కూడా బ్రతికే అవకాశం ఫిఫ్టీ ఫిఫ్టీ ఫిఫ్టీ అన్నారు.

చలపతి చేస్తున్నది టీచరుద్యోగం. భుక్తికి లోటు లేదు కానీ, లక్షల్లో వైద్యానికి శక్తిలేదు. భార్యను బ్రతికించుకుందుకు ఆయన మిత్రుల సాయమడిగాడు. ఐదూ పదీ మించి సాయంచెయ్యలేమన్నారు వాళ్ళు. అలా బిందువు సింధువవదని గ్రహించిన చలపతి అభిమానాన్ని చంపుకుని ఐనవాళ్ళనీ వేడుకున్నాడు. వాళ్ళు సాయపడలేదు సరికదా, తమని కాదన్నప్పుడే వాళ్ళిద్దరూ తమకి చచ్చిన వాళ్ళతో సమానమన్నారు. చనిపోతే దహన సంస్కారం కూడా సరిగ్గా జరగక వాళ్ళ ఆత్మలకి శాంతి ఉండదని శాపనార్థాలు పెట్టారు.

మాలతి చనిపోయింది. అప్పుడు చలపతి మాలతి చావుకంటే, ఆమె దహన సంస్కారం కోసం ఎక్కువ పరితపించాడు. అందుకు కావల్సిన అప్పు సులభంగా పుట్టడం విశేషం. అది తీర్చడానికి ఆయన ట్యూషన్లు చెప్పడం మొదలుపెట్టాడు. ఒకటి రెండు దుకాణాల్లో పద్దులు కూడా వ్రాసేవాడు. పార్థుడు తండ్రి పడుతున్న శ్రమకి నొచ్చుకుంటే, "నా ప్రాణానికి ప్రాణమైన నీ తల్లి పార్థివ శరీరానికి - మమ్మల్ని కాదన్నవాళ్ళందరూ సిగ్గుపడేలా అంత్యక్రియలు జరిపించాను. ఆ తృప్తిలో - ఇంతకు రెట్టింపు కృషిచేసినా కూడా నాకు శ్రమ

అనిపించదు'' అన్నాడు. అప్పుడు తండ్రి గొంతులో ధ్వనించిన గర్వంలో, ''ఎలా బ్రతికామన్నది కాదు, ఎలా చచ్చామన్నదే ముఖ్యం'' అన్న సందేశం వినిపించి, అదే అభిప్రాయంగా బలపడింది పార్థుడిలో.

మరిప్పుడు తండ్రి పార్థివ శరీరాన్ని వైద్యశాలకి అప్పగించమని విశ్వం అంటే - అతడికెలా ఉంటుంది?

పోనీ అంటే, విశ్వం చలపతికి అసలు సిసలు స్నేహితుడు. చలపతి ఇంటద్దె కట్టలేక ఇబ్బంది పడుతున్నాడని తెలుసుకుని, అతడి కోసం తన ఇంట్లో ఓ వాటా ఖాళీచేసి ఇచ్చాడు. పరిస్థితులు చక్కబడేదాకా అద్దె అక్కర్లేదన్నాడు. తండ్రి గురించి కలవరపడే పార్థుడితో, ''ఇప్పుడు నీ దృష్టి చదువుమీద మాత్రమే ఉండాలి'' అని మందలించేవాడు.

పార్థుడు చదువునెప్పుడూ అశ్రద్ధ చెయ్యలేదు. కానీ తండ్రి అంటే అతడికి వల్లమాలిన ప్రేమ, గౌరవం. మాలతి చనిపోగానే, చలపతి తల్లిదండ్రులు ఆయన్ని తమలో కలుపుకునేందుకు ముందుకొచ్చారు. మళ్ళీ పెళ్ళి ప్రస్తావన కూడా తెచ్చారు. ''నా భార్య ప్రాణాలు కాపాడ్డానికి సహకరించి ఉంటే మిమ్మల్ని నా వాళ్ళుగానే భావించేవాణ్ణి. ఇప్పుడు మిమ్మల్ని చూస్తుంటే నా భార్య ప్రాణాలు తీసిన హంతకులనిపిస్తోంది. మీకూ నాకూ పొసగదు'' అని అతడు వాళ్ళని దూరంగా ఉంచాడు.

''నా జీవితాశయం మళ్ళీ పెళ్ళి కాదు. నా కొడుకు భవిష్యత్తు'' అంటూ వాళ్ళు తెచ్చిన పెళ్ళి ప్రస్తావననీ నిరసించాడు.

ఆ చలపతి పార్థివశరీరం పార్థుడి ఎదుట అచేతనంగా పడి ఉందిప్పుడు.

''నాన్నకి ఘనంగా అంతిమ సంస్కారం జరిపించాలి అంకుల్'' అన్నాడు విశ్వంతో.

విశ్వం అతడి వంక అదోలా చూసి, ''మీ నాన్న ప్రేమని నమ్మాడు. ప్రేమ కోసమే జీవించాడు. అదాయన జీవన సంస్కారం. నువ్వనే అంతిమ సంస్కారం ఏమిటో నాకు తెలియదు'' అన్నాడు.

''నాకు తెలుసు'' అనుకున్నాడు పార్థుడు తన ముందున్న తండ్రి శరీరాన్నే చూస్తూ.

ఆ శరీరాన్ని చూస్తుంటే కొన్ని నెలల క్రితం తను చూసిన మరో శవం గుర్తుకు వచ్చింది.

ఒకరాత్రి చలపతీ, పార్థుడూ రోడ్డు మీద నడుస్తుంటే ఇద్దరు నడివయస్కులు దారికి అడ్డొచ్చి, '' అనాధ శవం బాబూ! తృణమో పణమో తమకి తోచిందిచ్చి దహన సంస్కారానికి సాయం చెయ్యండి'' అన్నారు.

చలపతి ఆగి దారిపక్కనే పీక దాక తెల్ల గుడ్డ కప్పి ఉన్న శవాన్ని చూశాడు. జేబులో చెయ్యి పెట్టి చేతికొచ్చిన ఇరవైరూపాయల నోటు వాళ్ళకిచ్చాడు. నిజానికప్పుడు చలపతి జేబులో పాతిక రూపాయలే ఉన్నాయి. వంట చేసుకోవడం బద్ధకం అనిపించి - బయట ఫలహారానికి బయల్దేరారిద్దరూ. ఇప్పుడు మిగిలిన ఐదురూపాయలతో ఒక్కడి కడుపే నిండదు. అంటే మళ్ళీ ఇంటికెళ్ళి వంట చేసుకుని తినాలి.

''వాళ్ళు మోసగాళ్ళేమో నాన్నా'' అన్నాడు పార్థుడు.

''కావచ్చు, కాకపోవచ్చు కూడా. మనం మోసపోయినా ఫర్వాలేదు కానీ అనాధ ప్రేతానికి సంస్కారమంటే అనుమానించకూడదు'' అన్నాడు చలపతి దృఢంగా.

చలపతి అనాధ కాడు. ఆయనకి చెట్టంత కొడుకున్నాడు. ఐనా ఇప్పుడాయన పార్థివ శరీరం అనాధగా...

''శవాన్ని మీ ఇంటికి చేర్చాలా - నేనా ఏర్పాట్లు చెయ్యగలను?'' అన్న మాటలు విని పార్థుడు ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు. ఎదురుగా పాతికేళ్ళ యువకుడు. దళారిలా ఉన్నాడు.

పార్థుడు ఏదో అనేలోగా విశ్వం, ''ఏ ఇంటికి తీసుకు వెళతావు? శవాన్ని మా ఇంట్లో ఉంచడం వీలుపడదు'' అనేశాడు చటుక్కున. దళారీ యువకుడది తనకే హెచ్చరిక అనుకున్నాడేమో, ఓ అడుగు వెనక్కి వేశాడు.

పార్థుడు షాక్ తిన్నాడు. శవాన్ని వైద్యశాలకిమ్మన్న విశ్వం సలహాలో అంతరార్థం అప్పటికి స్ఫురింపగా, "అంకుల్ మీ ఇల్లు తప్ప ఇంకెవ్వరూ లేరు నాకు" అన్నాడు దీనంగా.

విశ్వం చలించలేదు, "ఐనా సరే, మధ్య తరగతి వాణ్ణి. ఇలాంటి విషయాల్లో నా ఇబ్బందులు నాకుంటాయి. పనిగట్టుకుని నట్టింటికి శవాన్ని తీసుకెళ్ళలేను. ఈ విషయంలో నాకు తోచిన సలహా ముందే చెప్పాను. నచ్చితే పాటించు. లేకుంటే నీ ఇష్టం. ఏ విషయం తేల్చుకుని ఒక్కడివీ ఇంటికిరా. అప్పుడన్నీ మాట్లాడుకుందాం" అన్నాడు గంభీరంగా. ఒక్కడివీ అన్న పదాన్ని ఆయన ఒత్తిపలికాడు.

అన్నీ అంటే ఏమిటని అడగలేదు పార్థుడు. అతడి ఆలోచనంతా తండ్రి అంతిమ సంస్కారం మీదే ఉంది.

చలపతికి అంతిమ సంస్కారం మీద ఎంత పట్టింపు ఉందో పార్థుడికి బాగా తెలుసు. తండ్రి రాత్రిబవళ్ళు అదే పనిగా శ్రమ పడుతుంటే, "నీ ఆరోగ్యం పాడయిపోతుంది నాన్నా! చదువుకంటే నువ్వే ముఖ్యం నాకు" అని హెచ్చరించాడు పార్థుడు ఒక్కసారి.

దానికి చలపతి వేదాంతిలా నవ్వి, "మీ అమ్మ పోగానే నాకు జీవితాశ పోయింది. ఆరోగ్యమూ అంతంత మాత్రం అయింది. ఎన్నాళ్ళు బ్రతుకుతానో తెలియదు. నిజానికి నేను పడే కష్టం నీకోసం కాదు. కూడబెట్టిందాంట్లో కొంత విశ్వం అంకుల్ దగ్గర దాస్తున్నాను. నేను కనుక అర్ధాంతరంగా కన్ను మూస్తే నా అంతిమ సంస్కారం నీకు భారం కాకూడదని నా తాపత్రయం. నా గురించి నువ్వు అప్పులపాలు కాకూడదు మరి" అన్నాడు.

ఆ మాటలు విన్నప్పుడు పార్థుడికి భయం వేసింది. కానీ తండ్రితో ఏం మాట్లాడాలో తెలియలేదు. విశ్వానికి చెప్పుకున్నాడు. దానికాయన తేలికగా నవ్వేసి, "మీ నాన్నకి నువ్వంటే ప్రాణం. నీ కోసమే బ్రతుకుతున్నాడు. భార్యపోయిన డిప్రెషన్‌లో ఏదో అలా మాట్లాడుతున్నాడంతే! నువ్వేం కలవరపడకు" అన్నాడు.

అప్పుడు విశ్వం మాటలు పార్థుడికిచ్చిన ఊరట అంతా ఇంతా కాదు. కానీ ఇప్పుడాయన శవాన్ని తనింటికి తీసుకురావడానికి వీల్లేదన్నాడు. తండ్రికి అంతిమ సంస్కారం వృధా అన్నాడు. తండ్రి దాచుకున్న డబ్బు గురించి ఒక్క మాటకూడా అనలేదు. అదేనా ఆయన అసలు రంగు?

పార్థుడు సంకోచిస్తూనే, "నాన్నకి అంతిమ సంస్కారం గురించి చాలా పట్టింపు అంకుల్! అందుకోసం మీ దగ్గర డబ్బు కూడా దాస్తున్నానన్నాడు నాతో" అన్నాడు.

విశ్వం ముఖం గంభీరంగా ఐపోయింది, "మీ నాన్నకి దాచుకునేటంత డబ్బుంటే - ముందు నాకు ఇంటద్దె కట్టమనేవాణ్ణి" అన్నాడు.

తండ్రి ఆయనవద్ద డబ్బు దాచుకున్నమాట నిజమని పార్థుడికి తెలుసు. కానీ, "నీకూ, మీ నాన్నకీ నేను ఆశ్రయమిచ్చాను సుమా" అని విశ్వం ఇప్పుడు తనకు గుర్తుచేస్తున్నాడని పార్థుడికి అర్థమైంది. తండ్రి విశ్వానికి డబ్బిచ్చినట్టు ఋజువేం లేదు. ఉంటే ఆయన ఆ డబ్బుని ఇంటద్దెగా చెల్లు చేసుకుంటాడు. అంటే తండ్రి చావుతో తనకీ , విశ్వానికీ ఋణం తీరిపోయినట్లే.

ఇక చెప్పాల్సిందేంలేనట్లు విశ్వం అక్కణ్ణించి కదిలాడు. పార్థుడాయన్ని ఆపే ప్రయత్నం చెయ్యలేదు.

అప్పుడు దళారీ యువకుడు ఒకడు ఓ అడుగు ముందుకు వేసి పార్థుణ్ణి పలకరించాడు. విషయం అర్థమైనవాడిలా, "నువ్వేం కంగారు పడకు. అలాంటప్పుడు ఏం చెయ్యాలో నాకు తెలుసు. భారం నా మీద వదిలేయ్. నీ తండ్రి అంత్యక్రియలు సంప్రదాయ బద్ధంగా జరిపించే పూచీ నాది" అన్నాడు.

ఆ మాటలతో పార్థుడిలో ధైర్యం పుట్టింది. అతడు సరేననగానే దళారీ యువకుడు రంగంలోకి దిగాడు. ఇలాంటి వ్యవహారల్లో ప్రొఫెషనల్‌లా ఉన్నాడు. చకచకా దూసుకుపోయాడు.

ముందు కబురు ఫోన్స్ ద్వారా కాలేజీలో పార్థుడి క్లాస్‌మేట్స్‌కి చేరింది. వెంటనే కాలేజీలో చందాల వసూలు మొదలైంది.

తర్వాత దళారీ హాస్పిటల్లోనే కొంత హడావిడి చేసాడు. అక్కడా విజిటర్స్ నుంచి కొన్ని పైసలు రాలాయి.

దళారీకి ఓ జర్నలిస్టు తెలుసు. కబురందగానే ఆయన తనకు పరిచితమైన టివి ఛానెల్ ద్వారా ఈ వార్తా రాష్ట్రమంతటా సంచలనాత్మకంగా ప్రచారమయ్యే ఏర్పాటు చేసాడు. ఎప్పటికప్పుడు బ్రేకింగ్ న్యూస్ అందజెయ్యడానికి ఓ విలేఖరి దళారీ దగ్గరకి వచ్చాడు.

టివిలో ఈ వార్త కథలా మారి ఆసక్తికరంగా చర్చనీయాంశమైంది. అభిప్రాయ సేకరణలో కొందరు విశ్వాన్ని తప్పు పట్టారు. కొందరు మరికాస్త దూరం వెళ్ళి వ్యవస్థనీ, రాజకీయాల్నీ, ప్రభుత్వాన్నీ తప్పుపట్టారు. ఐతే పార్థుడి మీద జాలిపడ్డవారు కూడా చాలామందే ఉన్నారు. ఆ జాలిలో కొంత చందాల రూపంలో దళారీని చేరింది.

అంతవరకూ ఊరూ పేరూ లేని పార్థుణ్ణి రాష్ట్రమంతా చూస్తోంది. తన చుట్టూ అందుకున్న ఈ ఊపుకి పార్థుడు ఉక్కిరిబిక్కిరైపోయాడు.

ఐనవాళ్ళు వదులుకున్నారు. మిత్రుడనుకున్నవాడు పట్టించుకోలేదు. ఐనా చలపతి అంతిమ సంస్కారానికి వచ్చిన స్పందన - మన సమాజంలో మానవత్వానికి అపూర్వ నిదర్శనం అనుకున్నాడు పార్థుడు

ఇరవై నాలుగు గంటల్లో ఏర్పాట్లన్నీ చకచకా జరిగిపోయాయి. చలపతి పార్థివ శరీరం శ్మశానానికి తరలింపబడింది. అంతిమ సంస్కారం పార్థుడు అనుకున్నదానికంటే ఘనంగా జరిగింది. చలపతి చితిమంటలు - టివి ఛానల్ ద్వారా ఎందరి ఇళ్ళలోనో ప్రత్యక్ష ప్రసారం అయ్యాయి. ఈ మహాకార్యానికి సహకరించిన ఎందరో మహానుభావుల పేర్లు ఇంటింటా వినిపించాయి. మచ్చుకి ఇంటర్వ్యూ పేరిట కొందరి ముఖాలు కనిపించాయి.

ఈ సమస్యని గుర్తించి, ప్రజలముందుంచి, వారిలో స్పందనకు స్ఫూర్తినిచ్చిన ఘనత మదేనంటూ ఆ టివి ఛానల్ పదే పదే చెప్పుకుంది. అలా కాసేపయ్యాక ఆ చానల్ దృష్టి మరో సంచలనాత్మక వార్తవైపు మళ్ళింది. జనావళి ఇళ్ళల్లో చలపతి చితిమంటలు మాయమయ్యాయి.

శ్మశానికి వచ్చిన పార్థుడి క్లాస్ మేట్స్ వెళ్ళిపోయారు. ఆసక్తితో వచ్చిన మరికొందరు జనం కూడా వెళ్ళిపోయారు. టివి విలేఖరి, మీడియా జర్నలిస్టు, దళారీ వెళ్ళిపోయారు. మర్నాడొచ్చి బొమికలు, బూడిద సేకరించుకోవడానికి ఓ మట్టి పిడతని పార్థుడు మాత్రం ఒక్కడూ అక్కడే ఉండిపోయాడు.

ఈ ప్రపంచంలో తాను ఒంటరినన్న భావం పార్థుడికి అప్పుడు కలిగింది. తండ్రి తన్ను ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోయాడన్న దుఃఖం పూర్తిగా వంటబట్టింది.

బయటపడటానికి కన్నీళ్ళు రాక ఆ దుఃఖమంతా అతడి వంట్లోనే ఉండిపోయింది.

చేతిలో తండ్రి బొమికలకై మట్టి పిడత, ఎదురుగా నిప్పుకణికలున్న కాష్టం. కింకర్తవ్య విమూఢుడై అలా చూస్తూ నిలబడిపోయిన పార్థుడి భుజం మీద ఉన్నట్టుండి ఓ చెయ్యి పడింది. ఉలిక్కిపడి వెనక్కి తిరిగితే విశ్వం!

"పద, ఇంటికి పోదాం" అన్నాడు విశ్వం.

పార్థుడు మళ్ళీ ఉలిక్కిపడి "ఏమన్నారూ?" అన్నాడు.

"నువ్వు సరిగ్గానే విన్నావు. పద, మనింటికి పోదం" అన్నాడు విశ్వం.

పార్థుడి కళ్ళనిండా అపనమ్మకం. అది కనిపెట్టిన వాడిలా, "ప్రాణమున్నంత సేపే ఈ శరీరానికి విలువ. నేను ప్రాణమున్న నీ శరీరానికి విలువనిచ్చాను. మధ్య తరగతివాణ్ణి. చలపతి నా మిత్రుడైనా - ప్రాణం లేని అతని శరీరం కోసం వేలకు వేలు ఖర్చుపెట్టే స్తోమతు నాకు లేదు. అందుకే ఉభయతారకంగా ఉంటుందని మీ నాన్న చలపతి శరీరాన్ని మెడికల్ కాలేజీకిమ్మని సలహా ఇచ్చాను. అది నచ్చక నువ్వు జనంలోకి వెళ్ళావు. ప్రాణంలేని పార్థివ శరీరానికి జరగాల్సిన సంస్కారానికి సమాజం ముందుకొచ్చింది. నీ కోరిక తీరింది. కానీ ప్రాణమున్న నీ శరీరానికి జరగాల్సిన సంస్కారం కోసం అరచి గీ పెట్టినా ఎవరూ ముందుకు రారని నాకు తెలుసు. ఆ బాధ్యత నాది. నువ్వు నా ఇంట్లోనే మా పిల్లల్లో ఒకడిగా ఉండు. చదువుకొనసాగించు. కలో గంజో మాతోనే కలసి తాగు. చిన్న ఆసరా దొరికితే జీవితంలో పైకి రావడానికి కోటి మార్గాలున్నాయి. వృద్ధిలోకి వచ్చి నీ తల్లిదండ్రుల పేరిట నలుగురూ మెచ్చే సత్కార్యాలు చెయ్యి. అదే వారికి అసలు సిసలు అంతిమ సంస్కారం. ఇప్పుడు జరిగిన సంస్కారం ఈరోజుతో మరుగున పడిపోతుంది. నువ్వు తలపెట్టిన సంస్కారం నువ్వున్నంతకాలమూ ఉంటుంది" అన్నాడు విశ్వం.

పార్థుడు తెల్లబోయి చూశాడాయన్ను. తండ్రి విశ్వం దగ్గిర దాచినదేమిటో అప్పుడతడికి అర్థమైంది.

"నేను ఒంటరిని కాను" అనుకున్నాడు పార్థుడు. అతడి చేతిలోని మట్టిపిడత జారి నేలమీద పడింది.

●●●

# విముక్తుడు — ఎన్. తారకరామారావు

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**"నరసింహం .. కొడుకుతో వెడుతున్నావా?"**

నరసింహం నవ్వాడు

"అలా మౌనంగా ఉంటే ఎలారా? అబ్బాయి వచ్చి వారం అయింది కదా. ఎన్నాళ్ళుంటాడు? అయినా ఒంటరిగా ఎన్నాళ్ళుంటావు? వయస్సు కూడా సహకరించదు. వెళ్ళు.."

నరసింహం మాట్లాడలేదు. నవ్వి ఊరుకున్నాడు.

●●●

నరసింహం లేకలేక పుట్టాడు. కనుక గారాబం ఎక్కువై చదువబ్బలేదు. చదువు రాలేదు గనుక ఉద్యోగం లేదు. కనుక చేసే పనిలేదు, తినడం రికామీగా తిరగడం తప్ప. తినటానికి, బ్రతికేందుకు నాలుగెకరాలు మాగాణి ఉంది. ఉండేందుకు మండువాలోగిలి వుంది.

వయసొచ్చాక కుర్రాడు ఏపుగా అందంగా ఉన్నాడు. ఆడబడుచులు లేరు. అప్పులూ లేవు. కుర్రాడికి చుట్టతాగడం తప్ప మరో వ్యసనం లేదు. సినిమాలు, పేకాటలు, స్త్రీ వ్యామోహంలాంటి అలవాట్లు లేవు అన్న దిలాసాతో ఓ ఆడపిల్లల తండ్రి పిల్లనిచ్చి పెళ్ళిచేశాడు. కనుక నరసింహానికి వేళకింత వండిపెట్టి మంచీ చెడూ చూసే మాధవి అండగా తోడుగా దొరికింది.

నరసింహం జీవితంలో ఒడుదుదుకులు గాలివానలు ఏమీలేవు. ఎందుకంటే నాకు తెల్సి వాడి కేమీ కోరికలు, ఆశయాలు, తపన లేవు.

నిద్రలేవడం, కృష్ణానదిలో మునిగి అటునుంచటు అమరలింగేశ్వర స్వామి, గుడికెళ్ళడం ఆ తర్వాత ఇంటికొచ్చి అరుగు మీద కూర్చోడం లేదా నడుం వాల్చడం.

తల్లి బ్రతికున్నన్ని రోజులూ నరసింహం ఆలనా పాలనా ఆమె చూసేది. వేళకింత వండి పెట్టడం, గుడ్డలు కొనిపెట్టడం, పొలం కౌలు మాట్లాడి డబ్బు వసూలు చేయడం, పెళ్ళిళ్ళల్లో పేరంటాళ్ళకు వెళ్ళడం, ఇంట్లో కావాల్సిన వస్తువులు తేవడం.. ఇదీ అదీ అని లేకుండా అన్న ఆమే చూసేది, చేసుకునేది.

"కిరాణా కొట్టుకెళ్ళి ఉప్పు తేరా" అని చెబితే తెచ్చేవాడు.

"డా. ప్రసాదరావుగారున్నారేమో చూసిరా!" అంటే చూసొచ్చేవాడు.

"ఉన్నాడా!"

"లేడు"

"ఎప్పుడొస్తారుట"

"నే అడగలేదు"

ఇలా చెప్పిన పని తప్ప మరో పని చేయడం నరసింహం ఎరగడు.

వార్తాపత్రికలు కొనడు చదవడు. రేడియో వింటాడు. కానీ కార్యక్రమాలు పూర్తయినా రేడియో ఆపడు. సినిమాకు ఒకవేళ వెడితే

"ఎలా ఉందిరా?"

"బాగుంది"

"ఏం బాగుంది కథా పాటలా హీరోయినా, నృత్యాలా..." అని వివరం అడిగితే

నవ్వి ఊరుకుంటాడు.

నరసింహం హైస్కూల్లో నా సహాధ్యాయి. అందువల్ల నాకీ విషయాలు తెలుసు.

నే పై చదువులకు వేరే ఊళ్ళు వెళ్ళడం, ఉద్యోగరీత్యా ఒక నగరం నుంచి మరో చోటుకు వెళ్ళడం జరిగినా నరసింహం సంగతులు తెలుస్తూనే వున్నాయి. దానికో కారణం ఉంది. నరసింహానికి నాకూ ఉన్న స్నేహం కావచ్చు. లేదా నేను తెలివిగలవాడినన్న నమ్మకం కావచ్చు అదీకాకపోతే చిన్ననాటినుంచీ వాడి అమ్మా నాన్న..."ఒరేయ్ నీకేదన్నా తెలియకపోతే వాడినడుగు" అని చెప్పినమాటలు చేసిన హితబోధ కావవచ్చు. నరసింహం నా దగ్గరకు సలహా కొచ్చేవాడు. వచ్చి నేనేది చెబితే అది అక్షరాలా సుగ్రీవాజ్ఞలా పాటించేవాడు. అది నా గొప్పతనం కాకపోయినా వాడి మూఢవిశ్వాసానికి ప్రతీకగా కూడా చెప్పుకోవచ్చు.

నరసింహం పెళ్ళికి సలహా ఇచ్చా.

నరసింహం కొడుకు చదువు గురించి సలహా ఇచ్చా.

ఇలాగా నరసింహం జీవితంలోని అనేకానేక ముఖ్య సంఘటనలు నా జోక్యం ప్రమేయం ఉండటం వల్ల నరసింహం జీవితం గురించి నాకు పూర్తిగా సాధికారికంగా అన్ని విషయాలూ తెలుసు.

నరసింహానికి పెళ్ళయి భార్యకాపురానికొచ్చి పరిస్థితులు ఆకళింపు చేసుకున్నాక నరసింహం భార్య మాధవి చెప్పిన విషయాలు ''అన్నయ్యగారూ మా మిత్రుడులాంటి మనిషి ఉన్నాడంటే నమ్మరు జనం. బలేవాడండి ఏం మనిషికైనా ఏవో కోరికలుంటాయి ఫలానాది కావాలని లేదా ఇలా చేస్తే బావుంటుందని. కానీ ఈయనకు కోరికలు లేవు. ఉన్నా ఏమీ తెలియవు. పెడితే తింటాడు. పెట్టకపోతే ఎన్ని గంటలైనా, రోజులైన తిండి గురించి అడగడు. అలాగని యాగీ చెయ్యడు. కృష్ణలో స్నానం, చుట్టతాగడం తప్ప ఈయనకు మరో వ్యాపకం లేదు. ఇది నా అదృష్టమో దురదృష్టమో తెలియదు.''

ప్రయాణం చేస్తే రిక్షా, ఆటో ఆమె పిలిచి బేరం చెయ్యాలి, బస్సు రైలు టికెట్ ఆమె కొనాలి. డబ్బు, బాధ్యత ఆమెదే ఇలా నరసింహం కీ ఇచ్చినా చలనం లేని కొయ్యి బొమ్మ. కాకపోతే ఈ బొమ్మకు ప్రాణం ఉంది. అంతే తేడా.

నరసింహానికి చాలా ఏళ్ళ తర్వాత కొడుకు పుట్టాడు. వాడు చదువులో మెరికలాంటివాడు. వాడి చదువుకు డబ్బు కావాలి కదా పొలం అమ్మాల్సి వచ్చింది. ఒక్కగానొక్క కొడుకు కోసం పొలం అమ్మడం నరసింహం భార్యకు ఇష్టంలేదు. కానీ మరోదారి లేదు.

''అన్నయ్యగారూ ఉన్న పొలం అమ్మితే మాకు భుక్తికి ఇబ్బంది. వాడేమో చదువుకుని విదేశాల్లో ఉద్యోగం చేసి, ఆ డబ్బుతో మళ్ళీ పొలం కొంటానులే అంటున్నాడు. ఏం చెయ్యమంటారు?'' నరసింహం భార్య సలహా అడిగింది.

చదువులో అన్ని తరగతుల్లో అగ్రభాగాన ఉన్నవాడిని ప్రోత్సహించవలసిందే ఉన్న అర్హతలకు ఏదో చిన్న ఉద్యోగం రావచ్చు. బావిలో కప్పలాగా జీవితం గడుపుకోవచ్చు. కానీ మంచి భవిష్యత్తు ఉన్న కుర్రాడి జీవితం భగ్నం చేయడం భావ్యమా!

కాదు..!

నరసింహం కొడుకు రమణ ఉద్యోగస్తుడైనాడు. డబ్బు పంపాడు. దాంతో పాటు ఓ ఇంటివాడు అయ్యాడు. వెళ్ళిన చోటే.

మాధవి కృంగిపోయింది.

''అన్నయ్యా ఇప్పుడేం చెయ్యాలి. లేకలేక పుట్టాడు వాడి సుఖం సౌభాగ్యం కోసం కడుపు మాడ్చుకుని బ్రతుకుతుంటే వాడిలా పరాయి దేశంలో ఓ ఇంటివాడైతే ఇక్కడ మా పరిస్థితేమిటి? డబ్బు పంపుతున్నాడు సరే. వాడక్కడుంటే ఇక్కడ ఈ రాతిమనిషి పైకి చెప్పడు కానీ లోలోపల దుఃఖపడుతున్నాడు. ఎక్కడ పిల్లలు కనపడ్డా తాతా అని పిల్చినా ఆగిపోతాడు. నిరామయింగా అటే చూస్తూండిపోతాడు. ఇలా ఎన్నాళ్ళో. !? ''

అలా ఎన్నాళ్ళో గడవలేదు. మాధవి మంచం పట్టింది. అలాగే పడుతూ లేస్తూ నరసింహానికి తోడుగా నీడగా ఉంటూ కంటికి రెప్పలా చూసుకుంటూ ఓ రోజు కన్నుమూసింది. అంతా వివరంగా నరసింహం కొడుక్కి చెప్పా. రమణ ఆఘమేఘాల మీద భార్యతో వచ్చాడు. కానీ.

మాధవి అంత్యక్రియలు నేనే దగ్గరుండి నరసింహం చేత చేయించాల్సి వచ్చింది. కొడుకు వచ్చేవరకు శవాన్ని ఉంచడం సాధ్యం కాక.

రమణ, అతడి భార్య మళయాళీ క్రిస్టియన్ అయిన ఇద్దరూ శ్రద్ధగా భక్తిగా ఆచారం ప్రకారం దశదినకర్మ యధావిధిగా నిర్వర్తించారు.

నరసింహాన్ని తమతో తీసుకుపోతామన్నారు.

నరసింహం అవుననీ, కాదని చెప్పడు.

"మామా అక్కడ స్వంత ఇల్లుంది. పౌరసత్వం ఉంది. ఇద్దరం ఉద్యోగస్తులం. ఇక్కడ కొచ్చి ఉండలేం. ఉండీ ఏం చెయ్యాలి. చదువుకుంది శుభ్రంగా బతకటానికి. పైగా ఇక్కడ అయినవాళ్ళు, బంధువులు ఎవరున్నారు? జన్మభూమి, ఉన్నఊరు అన్న మిధ్యా బంధాలు తప్పు. మా ఆవిడను చూశారుగా కులమతాలకతీతంగా ఎంతో నిష్టగా కర్మకాండలు నిర్వహించిందో. నాన్నకు ఏ కష్టం రాకుండా చూసుకుంటాం. నువ్వే చెప్పి వప్పించాలి"

ఇదీ నరసింహం కొడుకు, కోడలు చెప్పిన సారాంశం.

వాళ్ళ వాదన నిజమనిపించింది. నరసింహం కోడలు క్రిష్టియన్ అని చెబితే గానీ నమ్మలేం. హిందూ ఆచారాలను ఎంతో అంకిత భావంతో పాటించింది. మాట తీరు అన్నిటా అణుకువ సహనం కనబరచింది.

సుజాత నరసింహం కోడలు వ్యవహారశైలి నాకు నచ్చింది. అదే మాట నరసింహానికి చెప్పా.

నరసింహం నవ్వాడు. ఓ క్షణం తరవాత "అక్కడ కృష్ణానది ఉంటుందా?" అనడిగాడు. నేనాశ్చర్యంగా చూశా. తొలిసారి నరసింహం మాట తీరుకు.

"కృష్ణానది ఉండదు. కానీ నదులున్నయి"

"అమరలింగేశ్వర స్వామి ఉంటాడా?"

"దేవుడెక్కడ లేడు సర్వాంతర్యామి కదా! ఐనా కొడుకు కోడలు నిన్ను అపురూపంగా చూసుకుంటారు. వెళ్ళు" అని ఖరాఖండీగా చెప్పా.

నరసింహం కాదని ఔనని అనలేదు.

కాశీవెళ్ళి తల్లి అస్తికలు గంగానదిలో కలిపి ఆ తర్వాత కొన్ని క్షేత్రాలు తీర్థాలు చూసివస్తామని తండ్రి ప్రయాణానికి ఏర్పాట్లు చేసి వస్తామని వెళ్ళారు.

నరసింహం దినచర్య మారలేదు. కాకపోతే రెండు గుప్పెట్ల బియ్యం వండుకోవడం, పెరుగేసుకు తినడం ఇది కొత్త కార్యక్రమం. రోజూ ఓసారి నరసింహాన్ని పలకరించడం బాగోగులు విచారించడం నా వంతయింది.

నెలరోజులు గడిచాయి.

నరసింహాలో ఏ మార్పు లేదు, దినచర్యలో తేడాలేదు.

నరసింహం కొడుకు, కోడలు యాత్రలు పూర్తిచేసుకుని వచ్చారు.

ఇల్లు అమ్మడం బాధ్యత నాకు అప్పగించారు.

నరసింహం కొడుకు కోడలు తండ్రి అలవాట్లు తెలుసుకున్నారు. మాధవి తాలూకు గుర్తుగా ఆమె మంగళ సూత్రం చేతిగాజులు భద్రపరిచారు.

నరసింహానికి కావల్సిన చుట్టలు కొన్నారు. సామానులు కొన్ని తీసుకెళ్ళేవి కాక మిగతావి నాకప్పగించారు.

తెల్లవారితే ప్రయాణం.

నరసింహం యధావిధిగా ఆఖరుసారి కృష్ణకు స్నానానికి వెళ్ళాడు.

అంతే తిరిగి రాలేదు.

శవమై లాంచీల రేవులో తేలాడు.

నేనూహించని పరిణామం ఇది. నరసింహం కొడుకు కోడలు ఆశ్చర్యపోయారు.

ఎన్నో ఏళ్ళుగా ఒకేచోట స్నానం చేసే నరసింహం కాలుజారి కృష్ణానది ప్రవాహంలో పడి చనిపొయ్యాడంటే నేనమ్మలేదు.

నమ్మిన వాళ్ళే ఎక్కువమంది.

నరసింహం మరణం నాకు ఎన్నో ప్రశ్నలు సంధించినట్లయింది.

నరసింహం కావాలనే చనిపొయ్యాడా.!?

అలాంటి స్వనిర్ణయం తీసుకున్నాడా ఏమో !!

కానీ నరసింహ భవబంధాలనుంచి విముక్తుడైనాడు. అతడి జీవితానికి ముగింపుకు అతడే కర్త కదా..

●●●

# గోరంత పొరపాటు

డి. కనకదుర్గ

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**వాచీ చూసుకుంది మేఘన. 'అబ్బ, ఇరవైనిముషాలయింది చెక్కిచ్చి.** అడిగితే సంతకానికి వెళ్ళిందంటారు. ఈ కంప్యూటర్లు వచ్చాక కూడా ఈ బాంకు వాళ్ళు ఏం మారలేదు,' అని విసుక్కుంది. మళ్ళీ అరగంటలో క్లాసు. ఆటోలో పదిహేను నిమిషలు పడుతుంది కాలేజీకి వెళ్ళటానికి. అప్పుడే రెండయింది. ఈ సినిమా టైములో ఆటో దొరకడం కష్టమే. కాలేజీకి లేటుగా వెడితే హెచ్ ఓ డీ భూతంలా మీద పడుతుంది. ఎప్పుడు ఎవరిని విమర్శిద్దామా అని ఎదురు చూస్తుంటుంది. ఆవిడతో మాట పడటం కంటే ఉద్యోగం మానెయ్యడం తేలిక. ఉద్యోగం మానటం అనుకోగానే ఇంటి దగ్గర ఉన్న అమ్మా, నాన్న గుర్తొచ్చారు. ఇద్దరక్కల పెళ్ళిళ్ళు, అన్నయ్య ఇంజనీరింగ్ చదువు ఎట్లా తట్టుకున్నారో వాళ్ళు. తనకి మెరిట్ స్కాలర్ షిప్ రావటంతో ఎం.ఎస్సి దాకా ఆగకుండా చదువుకోవటం సాధ్యమైంది. గోల్డ్ మెడల్ కూడా రావడంతో డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా సెలక్షన్ కూడా తేలికయింది. నాన్న ప్రైవేటు ఆఫీసు సర్వీస్‌లోనే రిటైర్ అవడంతో ఇప్పుడు తన సంపాదనే ఆధారం. 'పాతికేళ్ళు దాటుతున్నాయి, పెళ్ళి చేసుకోమ్మా' అంటారు. 'పిల్లకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా' అని చుట్టాలు, పక్కాలు అడుగుతూనే ఉంటారు. కానీ తల్లిదండ్రులని వదిలేసి ఎలా పెళ్ళిచేసుకోవడం? ఇంకా తమకే మర్యాదలు చేయాలనే బావగార్లు, పెళ్ళాం గయ్యాళి అవటంతో అమ్మా నాన్నని దగ్గర పెట్టుకోలేని అన్నయ్యా - వెరసి తనూ తల్లిదండ్రులూ కలిసి ఉంటున్నారు. ముసలివారైన తల్లిదండ్రులకి మనశ్శాంతిగా ఉండాలని తను ఆశిస్తే, పెళ్ళికాని కూతురుకి అండగా ఉంటున్నామని వాళ్ళు సంతోషిస్తున్నారు.

నాన్నకి మోకాళ్ళ నొప్పులు బాగా ఉన్నాయని అంటే, మర్నాడు సాయంత్రం ఆర్థోపెడిక్ ఫిజిషియన్‌తో అపాయింట్‌మెంట్ తీసుకుంది. దానికోసం డబ్బులు విత్ డ్రా చెయ్యడానికి బాంకుకి రావలసి వచ్చింది. 'ఈ కాలేజీ వాళ్ళు కూడా - కాలేజీలో క్యాష్ పే

చెయ్యకుండా, బ్యాంక్ లో ఎకౌంట్స్, వాటిల్లో జీతాల డిపాజిట్లు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా జరిగే కుంభకోణాలు, రాజకీయనేతల దోపిడీ నిరాటంకంగా సాగిపోతూనే ఉంది. ' క్యాష్ అనుకోగానే కాలేజీ, క్లాసు గుర్తొచ్చాయి. 'మైగాడ్! వెంతనే ఆటోలో వెడితే లేట్ అవకుండా వెళ్ళవచ్చు.'

కౌంటర్ కేసి చూసింది. టీ తాగుతోంది కౌంటర్‌లో కూర్చుని తన చెక్ తీసుకున్న అమ్మాయి. ఛామన చాయ, కొంచెం లావుగా ఉంది. మామూలు ప్రింటెడ్ కాటన్ చీర కట్టుకుంది. అధికారం బాగానే చేస్తోంది. పదినిముషాల క్రితం అడిగితే 'అంత తొందరేమిటండీ, ఎంత మంది ఉన్నారో చూడండి' అంది.

ఖర్మ కాలి మొదటివారం మళ్ళీ బాంకుకి రావలసి వచ్చింది. అందుకే అందరూ కార్డు వాడుతున్నారు. ఏటిఎమ్ కార్డు తీసుకుంటే టెంప్టేషన్ ఉంటుందేమో అని తనకు భయం. వచ్చే పాతికవేలల్లో ఇల్లు గడవడమే కష్టంగా ఉంది. ఇక మిగతా వాటికి టెంప్ట్ అయితే ఎలా? అయిదువేలు నెలకి ఎలా అయినా సేవ్ చెయ్యాలని తను చాలా జాగ్రత్తగా మానేజ్ చేస్తుంది. మొదట పదివేలు విత్ డ్రా చేసి ఇంటద్దె, పనిమనిషి జీవితం, ఇంటిసామన్లు తెస్తుంది. తరువాత కూడా వారానికి రెండు నుంచి మూడు వేలు అవసరానిబట్టీ తీస్తుంది. అంత జాగ్రత్తగా ఉన్నా అప్పుడప్పుడు ఏమీ మిగలదు. వాచీ చూసుకుంది మేఘన. ఇంకో అయిదు నిముషలు గడిచింది. లేచి కౌంటర్ దగ్గరకి వెళ్ళింది.

"మాడమ్, నా చెక్ వచ్చిందేమో చూడండి."

"వస్తే పిలుస్తాం, కూర్చోండి." సౌమ్యంగానే ఆవిడ అన్నా కూడా, తన తొందరలో ఉన్న మేఘనకి కటువుగా వినిపించింది. పైగా క్లాసుకి టైమైందన్న తొందర.

"మూడుసార్లు చెప్పారు పిలుస్తాం అని. నా తరువాత వచ్చినాయన ఇప్పుడే క్యాష్ తీసుకుని వెళ్ళిపోయారు" కొంచెం గట్టిగానే అంది మేఘన.

"ఇప్పుడే తీసుకున్నాయనైతే పొద్దున్నే వచ్చి చెక్ ఇచ్చి వెళ్ళాడు చెక్ పాసయిన రెండు గంటల తరువాత ఇప్పుడు వచ్చి క్యాష్ తీసుకున్నాడు."

"అంటే నా మనీ రావటానికి ఇంకా గంటన్నరౌతుందా?" గట్టిగా అంది మేఘన.

ఆమెలో సహనం పోతోంది.

"గంటన్నర ఎందుకౌతుందండీ? ఎవ్వరికైనా ఒక అరగంట మాగ్జిమమ్ టైము. మీ చెక్ వచ్చేస్తుంది, కూర్చోండి." మర్యాదగానే చెప్పినా కొంచెం గట్టిగానే అంది ఆవిడ.

ఓర్పు పూర్తిగా పోయింది మేఘనకి.

"ఒక్క చెక్కుకి అరగంటైతే, రోజుకి ఎన్ని చెక్కులు పాస్ చెయ్యగలుగుతారు మీరు?" మేఘన వెటకారంగా అడిగిన ప్రశ్నకి కోపం వచ్చింది ఆమెకి.

"బాంకుకి వచ్చిన వాళ్ళందరి చెక్కులు పాస్ చేస్తామండీ, మాటిమాటికీ ఇలా ఒచ్చి మమ్మల్ని డిస్టర్బ్ చెయ్యకపోతే" అంతే వెటకారంగా సమాధానం చెప్పింది ఆవిడ.

"ఇలాగ పనిచేస్తే అందరి చెక్కులు పాస్ చేసినట్టే. నేను చెక్ ఇచ్చాక మూడుసార్లు మీరు కుర్చీలోంచి లేచి వెళ్ళారు. టీ తాగారు. కౌంటరు ముందు అంత క్యూ ఉన్నప్పుడు మీరు ఇట్లా లేట్ చేస్తే ఎట్లా? పని చెయ్యటమే కాదు, త్వరగా చెయ్యటం కూడా ముఖ్యమే. మా జీవితాలు సగం వెయిటింగ్‌లో గడిచిపోవటానికి మీలాంటి వాళ్ళే కారణం." క్లాసుకి టైమైపోతోందన్న ఆందోళన, తండ్రి ఆరోగ్యం

గురించిన దిగులు, తప్పు చేసిన వాళ్ళకి పాఠాలు చెప్పే టీచరు బుద్ధి - అన్నీ కలిపి పూర్తిగా ఓర్పు కోల్పోయి అరిచేసింది మేఘన. దూరంగా కూర్చున్న ఆఫీసరు లేచి వచ్చాడు.

"ఏమైందమ్మా?" కౌంటరు ముందు కూర్చున్న అమ్మాయినడిగాడు.

"చూడండి సార్, ఆవిడ చెక్ పాసవడం లేటయిందని అరుస్తున్నారు."

"ఏమ్మా, మీ పేరు?" అప్పుడే ప్యూన్ తెచ్చిన చెక్కుల్లో వెతుకుతూ అడిగాడు.

"సారీ అమ్మ, ఇవాళ ఇక్కడ కంప్యూటరు పనిచెయ్యటంలేదు. అందుకని చెక్కులన్నీ మెయిన్ కంప్యూటర్‌లో చూసి పాస్ చేస్తున్నాం."

"నా పేరు మేఘన. లేటవడమే కాదండి. ఆవిడ ఎట్లా మాట్లాడుతున్నారో చూడండి. అంత ఇండిఫరెన్స్ అయితే ఎలాగ? నాకు క్లాస్ టైం అయిపోతోంది. లెక్చరర్స్ కూడా ఆవిడలాగా ఉంటే పిల్లలు ఊరుకోరు. గతిలేక ఇక్కడ మా కాలేజీ ఎకౌంట్ ఉండబట్టి రావలసి వస్తోంది. మకు ఒక గంట మించి ఫ్రీ టైం ఉండదు ఏ రోజూ. మీరేమో గంటలు గంటలు చేస్తారు." ప్రతీసారీ లోలోపల విసుక్కునే మేఘన పైకి కక్కేసింది తన అక్కసంతా.

కౌంటరు ముందు అమ్మాయి ఏదో అనబోతే, వారించి తన చేతిలో చెక్కు ఇచ్చాడు ఆ ఆఫీసరు.

"ముందు ఆవిడ్ని పంపండి" అని మేఘనని చూపించాడు.

ఆయన చేతిలోని చెక్కు తీసుకుని, మూడు వేలు లెక్కపెట్టి, కౌంటరు దగ్గర పెట్టింది నిరసనగా చూస్తూ ఆ అమ్మాయి.

"మామీద కోపం చూపించడం కాదు. మీ పని చకచకా చెయ్యడం నేర్చుకుంటే ఈ విసుగులుండవు. మీ లాగా కౌంటరు ముందు కూర్చునే వాళ్ళు ముందు క్లైంట్స్ పని చూసి తీరిగ్గా కబుర్లు చెప్పుకోవడం, టీలు తాగడం చెయ్యాలి."

ఆ మాటలంటూనే విసురుగా డబ్బు తీసుకుని పర్సులో పెట్టుకుని గబగబా బైటకి నడిచింది మేఘన.

●●●

"థాంక్ గాడ్ కదూ నాన్నా. పెద్ద ప్రాబ్లం ఏమీలేదని చెప్పారు. ఆపరేషన్ అంటాడేమోనని నేను భయపడిపోయాను." తండ్రిని పట్టుకుని మెట్లెక్కిస్తూ అంది మేఘన. అప్పటికి అదే మాటను పదిసార్లు లోపల, రెండుసార్లు తండ్రితో పైకి అంది.

"అవునమ్మా. ఎక్సర్ సైజులు తప్పకుండా చేస్తాను. ఏదైనా మంచి ఆయల్ పట్రామ్మా మసాజ్ చేసుకుంటాను." కూతురి మీద ఇంకా భారం పడటం లేదని సంతోషిస్తున్న రంగనాథం అన్నాడు తృప్తిగా.

"ఏమ్మా, ఏమన్నారు డాక్టరు గారు?" తలుపు చప్పుడు విని బైటికొచ్చిన విమలమ్మ అడిగింది ఆత్రుతగా.

"ఏం లేదమ్మా కంగారేం లేదు. మందులు వాడితే నొప్పులు తగ్గిపోతాయన్నారు. ఆయిలేదన్నా తెస్తాను. మసాజ్ కూడా చేసుకుంటే బాగుంటుందన్నారు."

"మహానారాయణ తైలం తేమ్మా. రోజూ నేను చేస్తాను మసాజ్" భర్తకి మంచినీళ్ళు అందిస్తూ ప్రేమగా అంది విమలమ్మ.

"సరే. ఎలాగూ తెస్తాను. నాన్నకి నువ్వు మసాజ్ చేస్తే, నీకు నేను మసాజ్ చేస్తాను. కాళ్ళు నొప్పులంటావు, ఏదో ఒక పనిచేస్తూనే ఉంటావు. డాక్టరు దగ్గరకి రమ్మంటే రావు." తల్లి భుజం చుట్టూ చెయ్యి వేసింది మేఘన ఆప్యాయంగా.

"పాపం అమ్మ.. అర్ధరాత్రి ఆకలేస్తోందన్నా లేచి ఏదో చేసిపెడుతుంది. తనకి మాత్రం ఎప్పుడు రెస్ట్ అనీ! నిజంగా ఈ తల్లిదండ్రుల ప్రేమని మించిందేముంది ప్రపంచంలో?"

"కాఫీ ఇదిగో మేఘూ. అమ్మలూ, మనం ఒకసారి మాధవరావుగారింటి దాకా వెళ్ళాలి. వాళ్ళింట్లో చిన్న పోర్షన్‌లోకి ఎవరో కొత్తగా అద్దెకి వచ్చారట. ఇందాక మీరు బయటకి వెళ్ళినపుడు ఒక అమ్మాయి మనింటికి వచ్చింది. ఇక్కడ ఏ షాపులో సరైన రేట్లున్నాయనీ, గాస్ సిలిండరు సప్లై కంపెనీ ఎక్కడ ఉందనీ అడగటానికి వచ్చిందట. మీరు వెళ్ళిన దగ్గరనుంచీ డాక్టరు ఏమంటాడోనని నాకు ఒకటే ఆందోళనగా ఉండింది. ఆ అమ్మాయి రావడం మంచిదయింది. కూర్చోమని టీ ఇచ్చి మాట్లాడేటప్పటికి, పాపం, తనుకూడా మొహమాట పడకుండా వాళ్ళ కుటుంబ వివరాలు చెప్పింది. ఆ విషయాలు వింటే బాధనిపించిందిందమ్మా. ముగ్గురూ కూతుళ్ళే అని పై వాళ్ళిద్దరికీ పదహారేళ్ళకే పెళ్ళిళ్ళు చేసేశారుట. ఈ అమ్మాయి మాత్రం డిగ్రీ అయ్యాక ఏదో పరీక్ష రాసి ఉద్యోగంలో చేరిందట. పాపం, ముప్ఫైనాలుగేళ్ళు వచ్చినా పెళ్ళి చేసుకోకుండా తల్లిదండ్రులని చూసుకుంటోంది. మాటల సందర్భంలో తను కొంచెం బాధపడింది. ముగ్గురిలో ఒక్కరయినా అబ్బాయిగా పుట్టినా తన తల్లిదండ్రులని ఇంకా బాగా చూసుకునేవాడేమో అని అంది. అప్పుడు నేను మన కుటుంబం గురించి చెప్పాను. అభిమానానికి కొడుకైనా, కూతురైనా ఒకటేననీ, మాకు కొడుకు ఉన్నా నువ్వే చూసుకుంటున్నావనీ చెప్పాను." కళ్ళల్లో నీళ్ళు చిందాయి విమలమ్మకి.

'బహుశా తల్లి తనగురించి బాధపడుతుందేమో' అనుకుంది మేఘన.

"పాపం తండ్రికి కాన్సరు ఆపరేషన్ అయిందటమ్మా. తరువాత ఇంజక్షన్లేవో ఇప్పిస్తారే, అవి ఇస్తున్నారట. తల్లికి ఏడాది క్రిందట పక్షవాతం వచ్చి ఎడమ కాలూ, చెయ్యి పడిపోయి, ఇంకా పూర్తిగా స్వాధీనంలోకి రాలేదట. వింటుంటేనే చాలా బాధేసింది, పాపం ఇంక అనుభవిస్తున్న ఆ అమ్మాయి ఎంత బాధపడుతోందో. వారిద్దరి వైద్యం ఖర్చులు ఎక్కువై సెంటర్లో ఇల్లు ఖాళీ చేసి అద్దె తక్కువ కదా అని ఇక్కడికి మార్చిందట. రెండు బస్సులు మారి వెళ్ళాలిట ఆఫీసుకి. చాల సౌమ్యురాల్లా ఉంది. అయినా ఎంత సహనం ఉండాలి ఇంత బరువు ఒక్కర్తీ భరించాలంటే!"

చలించిపోయింది మేఘన. ఒకేలాంటి కష్టాలు పడుతున్న వారికి కలిగే ఆత్మబంధువన్న భావం కలిగింది ఆమెలో. తల్లిదండ్రులకి వయసు మీద పడ్తుండడంతో తను రోజూ భగవంతుడికి దండాలు పెడ్తుంది. 'స్వామీ అమ్మా నాన్న ఆరోగ్యాలు కాపాడు' అంటూ. నాన్న కాస్త మోకాళ్ళ నొప్పులనేటప్పటికే తను అల్లల్లాడిపోయింది. నాన్న పడే బాధ గురించి ఒక వైపు, దాని ట్రీట్‌మెంట్‌కి ఎంత అవుతుందో, మంచి ట్రీట్‌మెంట్ ఇప్పించలేనేమో అనే భయం ఒకవైపు తనని తినేశాయి. ఈ లెక్చరర్ ఉద్యోగానికి ఫెసిలిటీస్ ఏమున్నాయి? రిటైర్ అయేవరకు పర్మనెంట్, తరువాత కూడా ఏదో చాలీ చాలని పెన్షన్ ఉంటుంది. కానీ, ఒక మెడికల్ ఖర్చుకానీ, ఎల్ టి సి లు కానీ ఏమీ ఉండవు. ఆర్.టి.సీలో పనిచేసే ఉద్యోగస్తుల కుటుంబాలకి బస్సు ప్రయాణాలు పూర్తిగా ఫ్రీ. అలాగే రైల్వే ఉద్యోగస్తుల కుటుంబ సభ్యులందరికీ రైల్వే పాసులు. కంపెనీల్లో పనిచేసేవాళ్ళకి మెడికల్ ఖర్చు రీయంబర్స్‌మెంట్ కాక మందులకీ, దానికి ఎక్స్‌ట్రా డబ్బులు. ఏ రకంగా పనికిరానిది ఈ టీచర్ వృత్తే. టీచర్లు, లెక్చరర్ల పిల్లలకి కనీసం చదువన్నా ఫ్రీగా ఉండాలికదా! తన కొలీగ్స్‌లో కాలేజీల్లో చదువుతున్న పిల్లలున్న వాళ్ళు వాళ్ళ పిల్లల చదువులెంత ఖర్చులో కూడుకున్నవో, తమకి ఎంత కష్టమౌతుందో స్టాఫ్ రూములో చర్చించుకుంటుంటారు. మరి వేలమంది విద్యార్థులని తయారు చేసే టీచర్ల పిల్లలకి స్కూలు, కాలేజీల ఫీజులన్నా లేకుండా రూలు పెట్టాలి కదా ప్రభుత్వం.

తల్లి పిలవడంతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చింది మేఘన.

"ఒకసారి మనం వాళ్ళింటికి వెళ్దాం మేఘూ. వాళ్ళకేమైనా అవసరం వస్తే మనని అడగమని చెబుదాం రోజూ మధ్యాహ్నం మీ నాన్న పడుకున్నప్పుడు వాళ్ళింటికి వెళ్ళివస్తాను."

"అవునమ్మా తప్పకుండా నేను కాస్త ఫ్రెష్ అయి వస్తాను. వెళ్ళి, ఆ గాస్ కంపెనీ నంబరిచ్చి కాస్సేపు మాట్లాడి వద్దాం." లోపలికి వెళ్ళింది మేఘన. తయారవుతున్నంతసేపూ ఆ అమ్మాయి గురించే ఆలోచన. మనకి వారిమీద ప్రేమ ఉంటే తల్లిదండ్రులని చూసుకోవడం ఏమీ కష్టంకాదు. పైగ వాళ్ళు దగ్గర ఉంటే ఎంతో ధైర్యంగా ఉంటుంది. కానీ వాళ్ళకేదైనా ఆరోగ్య సమస్య వస్తే ఎలా తట్టుకునేది? పాపం, ఆ అమ్మాయి ఎలా భరిస్తోందో అంత టెన్షన్. ఒక వైపు తల్లి ఆనారోగ్యం వలన ఇంటిలో పని, తండ్రికి సేవ, వారి మందులు టైం ప్రకారం ఇవ్వడం, ఇవన్నీ కాక బయటకు వెళ్ళి రోజంతా ఉద్యోగ బాధ్యతలు - పాపం, ఎలా నిభాయించుకుని వస్తోందో తను. దూరంగా ఉన్నా, తనకొక అన్నయ్య ఉన్నాడు. ఇటువైపు కాంపులకి వచ్చినపుడు వదినకి తెలియకుండా వచ్చి అమ్మా, నాన్నలని చూసి వెడుతుంటాడు. మరీ ఏదైనా అవసరం వస్తే తమకి అన్నయ్య సహాయం చేస్తాడనే అనిపిస్తుంది తనకైతే. కానీ అటువంటి ఆశ కూడా లేకుండా ఆ అమ్మాయి ఎలా బ్రతుకుతోందో! పెళ్ళిళ్ళై పోయిన అక్కల్ని ఏమి సహాయం అడగగలదు? పాపం, వీలైనంత కంపెనీ ఇవ్వాలి ఆమెకి. ధైర్యం చెప్పాలి.

"అమ్మా, నేను రెడీ,"

"పద, నా వంట కూడా అయిపోయింది. ఎనిమిదింటికి నాన్న భోంచేస్తారు. ఓ గంట కూర్చుని వద్దాం."

రెండిళ్ళు దాటి మూడో ఇల్లు మాధవరావుది. బ్యాంక్ ఆఫీసరుగా రిటైర్ అయాడు. ముందు పెద్దింట్లో వాళ్ళుంటారు. వెనక చిన్నవి రెండు పోర్షన్లు ఉన్నాయి. పెద్ద ఇంటి పక్కనుంచి వెనుక వైపుకి వెళ్ళారు విమలమ్మ, మేఘన. కుడివైపు వరండాలో ఇంకా కొంత సామాను పెట్టి ఉంది. అటువైపు వెళ్ళారు. రెండు రూములు, వంటిల్లు ఉన్న పోర్షన్ అది. ముందు రూములో నాలుగు కుర్చీలు, ఒక మంచం ఉన్నాయి. మంచం మీద ఒకాయన పడుకుని ఉన్నారు. పొడుగ్గానే ఉన్నా, సన్నగా, చూడగానే రోగిలానే కనిపిస్తున్నారు. వీళ్ళిద్దరిని చూసి లేవబోయారు. వారించింది మేఘన.

"అంకుల్, మీరు పడుకోండి. అమ్మా, నువ్వు ఇటు కూర్చో, నేను లోపలికి వెళ్ళి ఆంటీని పలకరిస్తాను."

విమలమ్మ అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుంది. లోపలి రూములోకి వెళ్ళింది మేఘన. అక్కడ ఎవరూ లేరు. అది దాటి వరండాలోకి వెళ్ళింది. అక్కడ కుర్చీలో ఒకావిడ కూర్చుని ఉంది.

"నమస్కారమండీ. నా పేరు మేఘన. రెండిళ్ళవతల ఉంటాం. మధ్యాహ్నం మీ అమ్మాయి వచ్చారుట. చూద్దామని అమ్మ, నేను వచ్చాం. గాస్ కంపెనీ నంబరు ఈ పేపరులో ఉంది."

మెల్లిగా లేచి నుంచుంది ఆవిడ.

"థాంక్స్ అమ్మా. అమ్మ కూర్చున్నారా?" అడిగింది మేఘనని.

"ఆ"

"సీతా," పిలిచింది ఆవిడ వరండా అవతల చీకట్లోకి చూస్తూ.

పిండిన చీరని ఇంకా గట్టిగా పిండుతూ వెలుగులోకి వచ్చింది ఒక అమ్మాయి.

"మీరా?" అవాక్కయి పోయింది మేఘన.

"మీరు.. ఇక్కడ.." సందేహంగా నిలబడింది వరండా అంచుదాకా వచ్చి ఆ అమ్మాయి, ముందు రోజు బాంకులో మేఘన చెక్కు తీసుకున్న అమ్మాయి.

"సీతా, మధ్యాహ్నం నువ్వెళ్ళింది వీళ్ళింటికేనట. తను, వాళ్ళమ్మగారు మనని చూట్టానికి వచ్చారు. ఇదిగో, గాసు నంబరు ఇచ్చింది తీసుకో. "పేపరు కూతురి చేతిలో పెట్టి ముందుగదిలోకి మెల్లిగా నడుచుకుంటూ వెళ్ళింది. వరండాలోకి వచ్చి చీర పక్కనున్న తీగమీద ఆరేసి మేఘన దగ్గరకి వచ్చింది సీత.

కొంచెం తేరుకుంది మేఘన.

"మిస్ సీతా, అయామ్ వెరీసారీ. ఐ అపాలజైస్ ఇమ్మెన్స్లీ. నిజంగా సారీ. ఏదో క్లాసు తొందరలో ఉండి నిన్న మీతో చాలా దురుసుగా ప్రవర్తించను. కొంచెం ఓర్చుకుంటే బాగుండేది. క్లాసుకి లేటయితే మా హెడ్ చేసే కామెంట్స్‌కి నేను బాధపడాలని ఆలోచించానే కానీ, నేను చేసే కామెంటుకి ఇంకొకళ్ళు బాధపడతారని గ్రహించలేకపోయాను. చాలా సారీ సీతా. మీ పరిస్థితి తెలియదు. నన్ను క్షమించండి." గబగబా మాట్లాడుతున్న మేఘన దగ్గరగా వచ్చి భుజం మీద చెయ్యి వేసింది సీత.

"నిన్న నా మూడ్ కూడా బాగోలేదు. నాన్నకి కీమోతెరపీ అనుకున్నంత గుణం ఇవ్వటంలేదని పొద్దున్నే డాక్టరుగారు చెప్పారు. చాలా డిస్టర్బ్‌డ్‌గా ఉన్నాను. బాంక్‌లో జనరల్‌గా నేనే అందరికంటే ఫాస్ట్‌గా పని చేస్తానని అంటారు మా కొలీగ్స్. అలాంటిది నిన్న ఏం చేశానో నాకే తెలీదు. అందుకే ఇవాళ శలవు పెట్టేసి ఇల్లు సర్దుకునే పనిలో పడ్డాను. ఈ రకంగా అయినా నాన్నకి దగ్గరగా ఉండచ్చుకదా అని."

ఆమె కన్నీళ్ళు చూసి మేఘన కళ్ళు నిండాయి.

"ఎదుటివారి పరిస్థితి గురించి ఒక్క క్షణం ఆలోచించినా నిన్న నేను చేసిన పొరపాట్లు లాంటివి ఎవరూ చెయ్యరు. ఏమైనా చాలా సారీ సీతా. అసలే బాధలో ఉన్న మీ మనసు చాలా కష్టపెట్టాను. నన్ను మనస్ఫూర్తిగా క్షమించానంటేనే నాకు మనశ్శాంతి."

"జీవితంలో ఎదుర్కొనే సంఘటనలు, మన అనుభవాల ముందు ఇటువంటివి చాలా చిన్న విషయాలు. ఉద్యోగం చెయ్యక తప్పని సరి అయ్యి ఇంకొకళ్ళతో మాట పడకూడదనే ఆత్మగౌరవం ఉన్నపుడు ఆందోళనేంత ఉంటుందో అర్థం చేసుకోగలను. ఆ విషయం పూర్తిగా మరిచిపోండి. మీ పేరు..?"

"మేఘన."

"రండి, మేఘనా. కొంచెం కాఫీ చేసి తీసికెడదాం. నాన్నకి కాఫీ అంటే చాలా ఇష్టం. ఎన్నిసార్లయినా తాగుతారు."

ఎంతో సన్నిహితురాలిగా మేఘన భుజం చుట్టూ చెయ్యివేసి వంటింట్లోకి నడిచింది సీత.

'భగవంతుడా, సీతకున్నంత సహనాన్నియ్యి నాకు.' సీత నడుం చుట్టూ చెయ్యివేసి నడుస్తూ, దేవుడ్ని ప్రార్థించింది మేఘన ఆర్తిగా.

●●●

## చిలికి చిలికి

కండ్లకుంట శరత్‌చంద్ర

**"ఊం! ఇస్త్రీరాస్తు. సుబ్బమ్మమస్తు"** మొదలు పెట్టాడు పదుకొండేళ్ళ వయసున్న కార్తీక్.

పదిహేనేళ్ళ వయసున్న, అతడి అన్నయ్య శ్రీనివాసులు, అది విని పళ్ళు పటపటా కొరికాడు.

"సవతి స్త్రీ ఆంధ్రమానాన్నే, పరాభవ అద్దినమ్ము" కార్తీక్ తలెత్తకుండా చదువుతూనే ఉన్నాడు.

"ఒరేయ్ ఆపు. ఆపరా!" గది విరిగిపోయేలా అరిచాడు శ్రీనివాసులు.

కార్తీక్, ఝుడుసుకుని ఆపేసాడు.

"ఏమ్రిరా! ఏమిటి నువ్వు చదువుతోంది? ఆం!"

"నువ్వే చదవమన్నావ్ కదా, అన్నయ్య పెళ్ళిపత్రిక చదువుతున్నాను" చెప్పాడు కార్తీక్.

"అది ఏ భాషలో ఉందిరా?"

"తెలుగు"

"మరి, నువ్వే భాషలో చదివి చస్తున్నావ్?" ఉరిమాడు శ్రీనివాసులు.

అన్నయ్య కంఠంలోని చిరాకు, బాడీ లాంగ్వేజీ మొహంలో కనిపిస్తున్న క్రోధపు ఛాయలూ చూసి కార్తీక్‌కు తాను ఏదో తప్పుచేసానని మాత్రం అర్థమయ్యింది. కానీ ఆ తప్పేమిటో అర్థం కాలేదు.

"తెలుగులోనే చదువుతున్నాను కదా" చిరాగ్గా అడిగాడు కార్తీక్.

"నువ్వు చదువుతున్న ప్రతీ తెలుగుపదం, తెలుగు లాగే ఉంది. కానీ, పత్రికలో ఉన్నదేమిటి, నువ్వు చదివేదేమిటి? శ్రీరస్తు! శుభమస్తు!! ఈ పదాలను ఇస్త్రీరాస్తు, సుబ్బమ్మమస్తు అని చదివావ్.

స్వస్తిశ్రీ చాంద్రమానేన, ప్రభవాది నామ అనే పదాలను సవతి స్త్రీలతోనూ, పరాభవాలతోనూ భ్రష్టు పట్టించావ్. తెలుగు సరిగ్గా చదవడం రాని చవటవి, దున్నపోతువి, జీవితంలో పైకి ఎలా వస్తావురా?"

జీవితంలో పైకి రావాలంటే తెలుగు సరిగ్గా చదవడం రావాలన్న విషయం కార్తీక్‌కు ఎవరూ చెప్పలేదు. చెప్పినా విని ఉండేవాడు కాదు.

శ్రీనివాసులు, తన తిట్లోత్తర శతనామావళిని ఏకధాటిగా చదివేస్తున్నాడు.

"ఒరేయ్ మన నాన్నగారు తెలుగుపండితులు. ఒక ప్రక్క స్కూల్లో తెలుగు టీచర్‌గా పనిచేస్తూ, మరో ప్రక్క పౌరోహిత్యం చేస్తూ ఊళ్ళో గౌరవంగా బ్రతుకుతున్నారు. అలాంటి మహానుభావుడి కడుపున చెడబుట్టావ్ కదరా. పండిత పుత్ర పరమ శుంఠ అనే నానుడికి నీలాంటి వల్లే జీవం వస్తోంది. అసలూ..."

"నీలాంటి వల్లే కాదు. నీలాంటి వాళ్ళ వల్లే అనాలేమో?" అడిగాడు కార్తీక్.

"నోర్ముయ్. నేను, నీకు అన్నయ్యను, తమ్మయ్యను కాను. ఎదురు చెప్పకు. ఊఁ! చదువు."

కార్తీక్ చిన్నబుచ్చుకున్నాడు. "నేను చదవను పో" అంటూ పెళ్ళి పత్రికను టీపాయ్ మీద పెట్టి విసురుగా బయటికి పరుగెత్తాడు.

శ్రీనివాసులు, ఠక్కున పైకి లేచి అతని వెంట పడ్డాడు.

కార్తీక్, జింకపిల్లలాగా సందుల్లో పడి, ఎడమకూ కుడికీ, కుడికీ ఎడమకూ తిరుగుతూ పారిపోసాగాడు.

శ్రీనివాసులు కాస్త తెలివైనవాడవడంతోనూ వాళ్ళుండే ఊరు సైకిలేసుకుని అటునుండి ఇటు తొక్కితే పావుగంటలో అయిపోయేంతటి సూక్ష్మమైనదవడంతోనూ, కార్తీక్ సూక్ష్మదృష్టి లేనివాడవడంతోనూ శ్రీనివాసులు, తమ్ముణ్ణి మూడు నిమిషాలలో పట్టుకున్నాడు.

మెడపట్టుకుని, తమ్ముణ్ణి ఇంటికి ఈడ్చుకొచ్చి, "ఊఁ! చదువు" అన్నాడు.

కార్తీక్ ఏడుస్తూ "అమ్మరానీ నీ సంగతి తేలుస్తా" అన్నాడు.

"చదవ్వోయ్ బుడంకాయ్. అమ్మ వచ్చినా, తెలుగు సరిగ్గా చదవనందుకు నిన్నే తిడుతుంది. ఊఁ" అన్నాడు శ్రీనివాసులు.

కార్తీక్ కన్నీళ్ళు తుడుచుకుంటూ పెళ్ళి పత్రిక అందుకుని చదవసాగాడు.

"వై!శాఖ ఊఁ! ఊఁ! అశుద్ధ విధి.యా! ఆఁ! మంగలివారము. మధ్య అన్నము. అనుదరా న్రతచ్చ ఆఁఆఁ అశుభలగ్గ్నమ్! నాకూ.కూ ఆఁ!ఆఁ! నాకుమార్ తేతేతే చిలసౌవి, ఊఁ! ఊఁ..మలను ఆఁ!ఛీ శవకుమార్ కూకూ.."

"ఆపరా గాడిదా! మలను, శవకుమార్‌కు ఇచ్చి పెళ్ళి జరిపిస్తావ్రుటా. వైశాఖ అనే పదాన్ని 'వై' అని 'శాక' అని అప్పడంలా విరుస్తావా. శుద్ధ విదియను, అశుద్ధం చేస్తావా! మధ్యాహ్నమును కాస్తా మధ్యలో అన్నముగా చేస్తావా? అనురాధా నక్షత్రాన్ని అనుదారా అని కసాబిసా పొడిచి ఖూనీ చేస్తావా? మంగళవారాన్ని కాస్తా క్షురకులవారంగా తీర్మానం చేస్తావా? పత్రికను మొదటినుండి మళ్ళీ చదువు." ఉరిమాడు శ్రీనివాసులు.

కార్తీక్, ముక్కునుండి కారుతున్న డాల్డాను అరచేతితో తుడుచుకుని, ఊడిపోతున్న లాగును పైకిలాక్కుంటూ, పెళ్ళి పత్రికను విసిరేసి, "నేను చదవను పో" అన్నాడు. మళ్ళీ కొళాయి ఆన్ చేస్తూ.

"నీ ఏడుపులకు కరిగేవాళ్ళెవరూ ఇక్కడ లేరు. మలను, శవానికిచ్చి పెళ్ళిచేస్తానంటూ చదివితే, మెచ్చుకుంటాననుకున్నావా? ఈ మాత్రం తెలుగు ఏడవలేనివాడివి, రేపో మాపో నీకు ఉపనయనం చేస్తే, సూర్యశ్చమామన్యుశ్చమన్యుపతయశ్చ్ అంటూ సంధ్యా వందనపు శ్లోకాలు ఎలా ఏడుస్తావ్? పదవ తరగతి తెలుగు నీ ఆరోతరగతి వాచకంలా వంద్రగ్రాములుండదు. అరకిలో ఉంటుంది. అందులో, మీకు ఉన్నట్లు ఉపకారికినుపకారము అంటూ సులభమైన పద్యాలు ఉండవు. తిక్కన గారి పద్యాలుంటాయి. తిక్కనగారంటే ఆషామాషీ కాదురోయ్. ఒహోహో! ఒక్కో పద్యం చదువుతుంటే నూనె, నెయ్యిలాంటివేవీ వేసుకోకుండా కొత్త ఆవకాయ తింటున్నట్లుంటుంది. బట్టీయం వేసి, అప్పచెప్పాలంటే లాగు తడిసిపోతుంది."

"............"

"అంతే కాదురోయ్. శ్రీ శ్రీ గారి కవితలుంటాయి. ఝుంఝానిల షడ్జధ్వానం, కంకేళికా మంఝురులు, చాంపేయమాల, రసరాజ్యడోల, రుద్రాళిక నయన జ్వాలిక, తంత్రి నై మూర్చనలు పోవడం ఒహోహో ఒక్కో పదం పలకడానికే నాలుక భయపడుతుంది. అవన్నీ గుర్తుపెట్టుకుని, పరీక్షలలో రాయడమంటే మాటలు కాదు."

"............"

"నీ ఖర్మకాలి, సిలబస్ మారిపోయి, పానుగంటి లక్ష్మీ నరసింహంగారి సాక్షి వ్యాసాలలో, ఏదో ఒక వ్యాసం మీ పాఠ్యాంశంగా పెట్టారనుకో. గొంతులో ఇనుపగుళ్ళు పడినట్టే! సాక్షి వ్యాసాలంటే, ఆషామాషీ కాదురోయ్, తెలుగు వ్యాకరణమంటే అల్లాటప్పాకాదు. పరుషములు సరళములు, వర్గయుక్ పరుషములు, వర్గయుక్ సరళములు, దంత్యములు, శాష్యములు, ధ్రుతము! ఉత్పలమాల, చంపకమాల, వైజయంతిమాల, కాంచనమాల, గులేబకావళిమాల ఒహోహో చస్తావ్. అంతేనా! శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు నేర్చుకోలేక ఏడుస్తావ్."

కార్తీక్ ఇవన్నీ విని గజగజ వణికిపోసాగాడు.

"అందుకే ఆరోతరగతి నుండే తెలుగు సరిగ్గా చదివితే, పదవతరగతికి వచ్చేసరికి నాలాగా పండితుడవైపోతావ్ రా! ఊఁ!" అన్నాడు శ్రీనివాసులు.

కార్తీక్ ఏడుపు ఆపి, పెళ్ళి పత్రిక అందుకుని చదవసాగాడు. "చీల, సౌవి, మలను, ఛీ, వశ, కుమార్‌కు"

"ఆపు. ఆపెహే!" కసిరాడు, మళ్ళీ క్లాసు పీకడానికి సిద్ధమౌతూ!

కార్తీక్ క్యారుమని ఏడుపు మొదలు పెట్టాడు.

"అయ్యో అయ్యో ఏమైందిరా" అరుస్తూనే వాళ్ళ అమ్మ, లలితమ్మ లోపలికొచ్చింది. ఆమెను చూడగానే, కార్తీక్‌కు గజేంద్రమోక్షంలో విష్ణుమూర్తిని చూసినప్పుడు గజేంద్రుని ఫీలింగ్ లాంటి భావన కలిగింది. పెళ్ళిపత్రిక విసిరేసి, ఛెంగుమని దూకి, తల్లి దగ్గరికొచ్చి, అన్నయ్య ఫిర్యాదు చేసాడు.

సాధారణంగా, కోర్టులలో అయితే జడ్జి ప్రశాంతంగా ఇరువైపులా వాదనలు విని, సంవత్సరానికో, శతాబ్దానికో 'తీర్పు వెలువరుస్తున్నా' అంటాడు. కేసును మరింత క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలనుకుంటే, ఏ సహస్రాబ్దమో సమయం తీసుకుంటాడు. కానీ ఇళ్ళల్లో పిల్లల మధ్య వచ్చే స్పర్థలకు, జడ్జిమెంట్ వెంటనే వచ్చేస్తుంది. అయితే ఈ జడ్జిమెంట్ సాక్ష్యాధారాలని, వాదోపవాదనలను బట్టి కాకుండా, కొన్ని అంశాలపై ఆధారపడి ఉంటుంది.

అఆ, ఇఈ అనే ఇద్దరు పిల్లల మధ్య స్పర్థ వచ్చిందనుకుందాం (sibling rivalary)

అఆ, ఇఈ కంటే వయసులో చిన్నవాడైతే జడ్జిమెంట్ 'అఆ'కు అనుకూలంగా వస్తుంది.

అఆ, ఇఈలు దాదాపు సమవయస్కులై ఉంటే, మొదటగా ఎవరైతే ఏడుస్తూ వెళ్ళి రిపోర్ట్ చేస్తారో, తీర్పు వారికి అనుకూలంగా వస్తుంది.

అఆ, ఇఈకి అన్నయ్య అయ్యుండి, ఇఈ అమ్మాయి అయితే తీర్పు గ్రామీణ కుటుంబం అయితే అఆకి అనుకూలంగానూ, పట్నంలోని కుటుంబం అయితే ఇఈకి అనుకూలంగానూ వస్తుంది. అఆ, ఇఈకి అక్కయ్య అయ్యుండి, ఇఈ అబ్బాయి అయితే.. తీర్పు గ్రామీణ కుటుంబం అయితే అఆకి అనుకూలంగానూ, పట్నపు కుటుంబం అయితే ఇఈకి అనుకూలంగానూ వస్తుంది.

అఆ, ఇఈలు అన్నాచెల్లెళ్ళు అయ్యుండి వారికి ఉఊ అనే ఇంకో సోదరి కూడా ఉంటే తీర్పు అఆకు అనుకూలంగా వస్తుంది.

ఇది సాధారణంగా జరిగే విధానం. మొత్తం మీద ఎన్ని కాంబినేషన్స్ వచ్చినా, పిల్లల విషయంలో 'ఏడుపు'దే పై చేయి. ఎవరు ఆరునొక్క శృతిలో, ఆపకుండా ఏడుస్తూ వెళ్ళి కంప్లైంట్ ఇస్తే, వాళ్ళదే పైచేయి.

పక్కవీధిలో పేరంటానికి వెళ్ళొచ్చిన లలితమ్మ, కార్తీక్‌ను "నా నాయనే ఊర్కో" అని సహజసిద్ధమైన మాతృస్వభావంతో ఓదారుస్తూ, మరో ప్రక్క శ్రీనివాసులు వంక చూసి, "భడవా! తమ్ముణ్ణి ఏడ్పిస్తావా? బుద్దిలేదూ పదవతరగతి కొచ్చావ్. రేపో ఎల్లుండో కాలేజీ మెట్లు ఎక్కుతావ్. తమ్ముణ్ణి ప్రేమగా చూసుకోవాలనే ఇంగిత జ్ఞానం ఉండక్కర్లేదూ?" కసిరింది.

శ్రీనివాసులు తల్లి వంక కోపంగా చూస్తూ, "నేనేమీ వాడిని ఏడిపించలేదు. పెళ్ళిపత్రిక చదివిపెట్టరా అంటే తెలుగును ఖూనీ చేసాడు. నాలుగు మంచి మాటలు చెప్పాను. దానికే ఏడ్చేసాడు" అన్నాడు.

"నోర్ముయ్యవోయ్. ఓహోహో పే...ద్ద అన్నరికం వెలగబడుతున్నాడు. పెళ్ళి పత్రిక చదివి పెట్టమని, చదువు సంధ్యలు రాని పిచ్చయ్యతాతలాగా అడగడమెందుకూ? ఏం నువ్వు చదువుకోలేవూ? నీకు చదువు రాదూ? నా బంగారు తండ్రిని ఏడిపిస్తావా" అంది లలితమ్మ, కార్తీక్ కన్నీళ్ళు తుడుస్తూ.

"అరే. చెబితే అర్థం కాదూ నాకు చదువురాక వాణ్ణి చదవమనలేదు. వాడికి తెలుగు సరిగ్గా రాదు. ఆ లోపాన్ని పూడ్చాలని చదివించాను. తప్పులు సరిచెయ్యాలన్నదే నా ప్రయత్నం. అరే వీడికి తెలుగు రాకపోతే, అదే బళ్ళో చదువుతున్న నాకు ఎంత అప్రతిష్ట?! నాన్నగారికి ఎంత అగౌరవం. శివకుమార్‌ను శవకుమార్ అని చదువుతున్నాడు. శుభమస్తును సుబ్బమ్మమస్తు అంటున్నాడు. ఏం, వాడి అన్నయ్యగా, వాడికంటే నాలుగేళ్ళు పెద్దవాడిగా వాణ్ణి ఆ మాత్రం మందలించొద్దా?" అన్నాడు శ్రీనివాసులు.

''మందలించొచ్చు కానీ, నెమ్మదిగా చెప్పాలి. ఓర్పుతో చెప్పాలి. ఓర్పు అలవర్చుకోకపోతే, ఇక నువ్వూ మీ నాన్నలా తయారవుతావ్'' అంది లలితమ్మ.

ఆమె వాక్యం పూర్తికాకముందే, యజ్ఞ నారాయణ శాస్త్రి అనే నామధేయం కలిగిన ఆమె భర్త, బజార్‌లో నుండి లోపలికి వచ్చాడు.

''ఏమిటే, ఏంటో పేలుతున్నావ్? నేను లేనప్పుడు, మన పిల్లలకు నా గురించి చెడుగా చెబుతున్నావా?'' అన్నాడు కూర్చుంటూ.

లలితమ్మ నోరెత్తకముందే, శ్రీనివాసులు టూకీగానూ, వేగంగానూ దృశ్యాన్ని ఆయనకు వివరించాడు. యజ్ఞనారాయణ శాస్త్రి, పెద్దకొడుకు పక్షం వహించాడు.

''కనగానే పుత్రుడు కాదు. తండ్రి పేరు నిలబెట్టేవాడే కొడుకు. నా పేరు నిలబెట్టకపోగా, తెలుగును చిత్రవధ చేసి చదువుతూ, నా పేరును గంగలో కలుపుతావ్రా కార్తీక్. అన్నయ్యను చూడు, ఎంత చక్కగా చదువుతాడో వాణ్ణి చూసి బుద్ధి తెచ్చుకో. అసలు తెలుగు భాష అంటే ఏమిటో తెలుసా ! దాని గొప్పదనం తెలుసా తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' అంటారు. అసలు తెలుగు భాష గురించి నన్ను అడిగితే'' ఎవ్వరూ ఆయనను అడక్కపోయినా, గుడ్డిలో మెల్ల అన్నట్లు పావుగంటసేపు తెలుగుభాష గురించి క్లాసు పీకాడు.

కార్తీక్ మళ్ళీ ఏడవసాగాడు. శ్రీనివాసులు, తండ్రి తనకు అండగా నిలవడంతో 'మిలేసుర్ మేరా తుమ్హారా' పాటలో బాలమురళీకృష్ణలాగా చిరునవ్వులు చిందిస్తూ తలాడించసాగాడు.

''అబ్బబ్బబ్బా! ఏమిటండీ మీరూ, మీ ఉపన్యాసము. ఇదేమైనా తరగతిగదనుకుంటున్నారా. మీరు ఎంత టీచర్ అయితే మాత్రం, అవకాశం దొరికినా, దొరక్కపోయినా క్లాసుపీకాలా? మీ గుణాలే మన శీనుగాడికీ వస్తున్నాయి. వాడు, తమ్ముడికి ఓర్పుతో చదువు చెప్పాలికానీ, కసురుతూ, తిడుతూ చెప్పాలా. శీనుగాణ్ణి తిట్టాల్సిందిపోయి, ఆకాశవాణిలో ఉగాది కవిసమ్మేళనంలో కవితలు చదివే పాత కవిలాగా అర్థంకాని భాషలో ఏమిటేమిటో చెప్తారేం'' అంది లలితమ్మ

''హమ్ పందికేమి తెలుసు పన్నీటివాసనా, గాడిదకేమి తెలుసు రెక్సోనా సబ్బువాసనా అని, తెలుగుభాష గురించిన విషయాలు నీకెందుకు రుచిస్తాయి. అసలు, మీ పుట్టింటి తీరే అంతకదా. ఎప్పుడూ పాలాలెమ్మట, బావులెమ్మట, పెంటదిబ్బలెమ్మట, గట్లెమ్మట, చెట్లెమ్మట పడి తిరుగుతారు. నీకూ అదే నేర్పారు. ఇహ నీకు భాష గురించి ఏం తెలుస్తుంది?''

''ఆఁ మరి నన్నెందుకు చేసుకున్నారు? ఏ శ్రీశ్రీ చెల్లెలినో, చలం కూతురినో, విశ్వనాథ సత్యనారాయణ మనవరాలినో, యండమూరి వీరేంద్రనాథ్ అక్క కూతురినో, యద్దనపూడి సులోచనారాణి ఆడపడుచునో, మల్లాది మరదలినో, దాశరథి బంధువునో చేసుకుంటే సరిపోయేది. ఇద్దరూ కలిసి, తెలుగు భాష గురించి చర్చిస్తూ కూర్చునేవాళ్ళు. పొయ్యిలో పిల్లి లేచేదే కాదు. అసలు, మా నాన్నగారు ఎంత కష్టపడి మా పెళ్ళిళ్ళు చేసారో తెలుసా? మా నాన్నగారికి పాండిత్యం లేకపోవచ్చు కానీ ఇంగితజ్ఞానం ఉండేది. మా నాన్నగారికి జ్యోతిష్యం తెలియకపోవచ్చు కానీ ఆయనకు హితము కోరడమంటే ఏంటో తెలిసేది. అసలు..''

''ఆపెయ్. ఆపక్కడ. ఓహో డ్రామా డైలాగులు చెబుతోంది మా నాన్నగారు పండితులు, జ్యోతిష్యం, పౌరోహిత్యం తెలిసినవారు. నువ్వు మీ నాన్నగారికి డబ్బా కొట్టుకుంటూ, పరోక్షంగా మా నాన్నగారిని తిడుతున్నావన్నమాట. ఒసేవ్, మా నాన్నగారిని తిట్టావంటే, నీకు శౌరవాది నరకాలు తప్పవు. ఆయనేగనక జాతకం వేసి, నిన్ను చేసుకోమని చెప్పకపోయుంటే, మనకు ముడిపడేదే కాదు. అసలు మన పెద్దవాడు శ్రీనివాసులు ఎవరనుకున్నావ్? సాక్షాత్తూ మా నాన్నగారి అంశే! ఆ ఎత్తు, ఆ గుండ్రని మొహం ఆ కళ్ళు వాడి మాట తీరు చూస్తున్నావ్ గా. మా నాన్నగారే, మనమీద అభిమానంతో మళ్ళీ జన్మించారు. పదేళ్ళ దాంపత్యం తర్వాత, ఎందరో దేవుళ్ళను మొక్కగా పుట్టిన వంశాంకురం వాడు'' అన్నాడు శాస్త్రి.

"అంత మాత్రం చేత, మన కార్తీక్ గాడిని తిట్టాలా? చిన్నపిల్లాడిని ఏమైనా అంటే, నాకు కోపం వస్తుంది. అసలు, కార్తీక్ గాడు లేకపోతే ఇంట్లో సందడే ఉండదు. శ్రీనివాసులుగాడు, వీడికేమీ చదువు చెప్పనక్కర్లేదు, తిట్టనక్కర్లేదు" అంది లలితమ్మ.

"అదెలా కుదురుతుంది నాన్నా నేను చదువు చెప్పకపోతే వాడికి మార్కులెలా వస్తాయ్?" అడిగాడు శ్రీనివాసులు తండ్రి వంక చూస్తూ. అధికార పార్టీ అధ్యక్షుడిలా ఉంది అతని చూపు.

"మరే నిజమే. నువ్వు ప్రతిరోజూ వీడికి రెండు గంటలు ట్యూషన్ చెప్పు" అన్నాడు తండ్రి.

"నేను అన్నయ్యతో చదువు చెప్పించుకోను" మొండిగా అన్నాడు కార్తీక్.

"అక్కర్లేదురా" అంది తల్లి, అల్టిమేటమ్ ఇస్తూ.

"నీ సిఫార్సు వద్దు. వాడు చచ్చినట్లు కూర్చోవాల్సిందే అన్నాడు తండ్రి, విప్ జారీ చేస్తూ.

"నేను కూర్చోను" అన్నాడు కార్తీక్, తల్లి చాటున నక్కుతూ, అసమ్మతి నాయకుడిలాగా.

"ఓహో అయితే, ఈ పెళ్ళి పత్రికను తప్పులు లేకుండా చదివి ఏడువు." అన్నాడు తండ్రి. కార్తీక్ తల్లి అండ చూసుకుని పెళ్ళి పత్రికను చింపేసాడు. అన్నయ్య ముందు తప్పులు చదివితేనే తిట్లతో వాయించి వదిలాడు. ఇక తండ్రి ముందు తప్పులు చదివితే, వీపు పగిలేలా అవకాశాలు ఎక్కువుగా ఉన్నాయి.

"పెళ్ళి పత్రికను చించుతావుట్రా" అంటూ తండ్రి కోపంగా పైకి లేచాడు.

"అబ్బా! చిన్నపిల్లాడు వదిలెయ్యండి" అని, తల్లి కార్తీక్‌కు రక్షణగా నిలబడింది.

"ఛీఛీ! ఈ ఇంట్లో నా పెత్తనం శూన్యం. తప్పు చేస్తే నా కొడుకును నేను చేతులారా దండించుకునే భాగ్యం కూడా లేదు. ఆడపెత్తనం తంబళ్ళ దొరతనం. రాత్రికి ఎసట్లో పిడికెడు బియ్యం తక్కువగా పోసి చావు. నేను తినను. తినాలని లేదు" అని శాస్త్రి బయటికి వెళ్ళిపోయాడు.

"నాకూ అక్కర్లేదు. తమ్ముణ్ణి దారిలో పెడదామని చూసాను. నువ్వు అడ్డొచ్చి వాడికి నన్ను లోకువగా చేసావ్" అంటూ శ్రీనివాసులు బయటికి వెళ్ళిపోయాడు.

"హమ్ నేనూ తినను" అనేసి లలితమ్మ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"అమ్మోయ్ నేను మాత్రం తింటానేవ్ వండిపెట్టు. అలా బయటికి వెళ్ళి, ఆడుకుని వస్తా" అని కార్తీక్ తుర్రుమన్నాడు.

అంతలో అక్కడికి వచ్చిన పెళ్ళిపత్రికలోని 'శివకుమార్' చెల్లెలు, చిరిగిపోయి హాల్లో పడివున్న తన అన్నయ్య పత్రికను చూసింది. ఒక్కసారిగా ఆ అమ్మాయి ముక్కుపుటాలు కోపంగా పైకిలేచాయి. ఆ అమ్మాయి సరాసరి వార్తను, ఇంటికి మోసుకెళ్ళింది.

'రక్తచరిత్ర' టైపులో రెండుకుటుంబాల మధ్య పోరు మొదలయ్యింది.

శాస్త్రి ఇంట్లో కార్తీక్ తప్ప ఆరోజు ఎవ్వరూ భోజనం చెయ్యలేదు. నిద్రపోయి ఉదయం మెలుకువ రాగానే జ్ఞానమూ, ఆకలీ రెండూ ఒకేసారి మేల్కొన్నాయి.

'ఎవడిదో పెళ్ళి పత్రికను కార్తీక్ సరిగ్గా చదవలేదని, దానిపై గొడవలు పడి, అన్ పార్లమెంటరీ భాష వాడకుండానే తిట్టుకుని, అరచుకుని ఇంట్లో మనశ్శాంతి లేకుండా చేసుకుని, తిండికూడా తినకుండా పడుకున్నాం. ఛీ! ఛీఛీ' అని ఎవరికి వారే లోలోపల అనుకున్నారు.

ఐతే, పెళ్ళి పత్రిక చింపినందుకు గానూ శివకుమార్ తండ్రి శంకరశర్మ, యజ్ఞనారాయణ శాస్త్రిని బజార్లో ఝాడించి వదిలాడు. శంకరశర్మ భార్య పార్వతమ్మ, శాస్త్రి భార్య లలితమ్మను గుళ్ళో తిట్లదండకంతో సన్మానించింది. దాంతో, వాళ్ళు పెళ్ళికి వెళ్ళలేదు.

ఊళ్ళో ఉన్న బ్రాహ్మణ కుటుంబాలలో శాస్త్రి వర్గం, శర్మ వర్గం బయల్దేరాయి.

ఒకరి ఇంటికి మరొకరు వెళ్ళరు. ఒకరు పెట్టిన ముహూర్తాలను మరొకరు ఆక్షేపిస్తారు. శాస్త్రి తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసే పాఠశాలలోనే, శివకుమార్ చెల్లెలు చదువుతోంది. ఆమె శుద్ధమొద్దు. మార్కులు తులమో, అరతులమో రాసాగాయి. అయితే దానికి కారణం తనకూతురికి జ్ఞానం లేకపోవడం కాదనీ, శాస్త్రే దగ్గరుండి ఆ పిల్లకు మార్కులు తక్కువగా వెయ్యిస్తున్నాడనీ శర్మ ప్రచారం చేసాడు.

దాంతో, శర్మవర్గానికి చెందిన వారి పిల్లల తల్లిదండ్రులు, తమ పిల్లలను మరో పాఠశాలకు మార్చారు. గణపతి శాస్త్రి అని సినిమాలలో ఓ క్యారెక్టర్ ఆర్టిస్టు ఉన్నాడు. అతడికీ, ఈ ఊరికీ ఏడేడు జన్మలలో ఏ జన్మలోనూ సంబంధంలేదుగానీ, శర్మ వర్గీయులు అతడు నటించిన సినిమాలు చూడడం మానేసి, ఆయా సినిమాల ఆదాయానికి గండికొడుతున్నామనే భ్రమలో ఉన్నారు. శాస్త్రి వర్గీయులేం తక్కువ తినలేదు. ధూర్జటి శర్మ అనే వ్యక్తి ఎడిటర్‌గా కొనసాగుతున్న దినపత్రికను కొనడం మానేసారు.

మరీ ముందుకు వెళ్ళి, ఇరువర్గీయులూ పత్రికలలో ఒకరిని తిడుతూ మరొకరు వ్యాసాలు రాసుకున్నారు. 'శాస్త్రి' వర్గంలో గత రెండు వందల ఏళ్ళలో జన్మించిన మహానుభావుల చరిత్రలు వెదికి, ఒకాయన 'ఆంధ్ర శాస్త్ర శాస్త్రి చింతామణి' అనే బృహత్ గ్రంథం రాసాడు.

'శర్మ' అనే పేరును తోకగా కలిగిన వాళ్ళెంతటి ఉదారులో, ఒకాయన పి.హెచ్.డి చేసి, నిరూపించే ప్రయత్నం చేసాడు.

ఎలక్షన్లలో ఇరువర్గాల వారూ తమ తరపున అభ్యర్థులను నిలబెట్టారు. దురదృష్టవశాత్తు రాంబాయమ్మ అనే నిరక్షరాస్య మహిళ గెలిచింది.

ఈ 'పేరు' ఇలా సాగుతుంటే, "పదండి పదండి. మీ టైం అయిపోయింది" అంటూ వారం రోజుల తేడాతో యమభటులు యజ్ఞనారాయణ శాస్త్రిని, శంకరశర్మను లాక్కెళ్ళిపోయారు.

యజ్ఞనారాయణ శాస్త్రి పెద్దగా పాపాలు చేయకపోవడంతో, యముడు వారం రోజుల్లో అతడిని స్వర్గానికి పంపేసాడు. దీంతో 'శాస్త్రి వర్గంపై ప్రేమ, శర్మ వర్గంపై చిన్న చూపు చూపే యమధర్మరాజు దిగిపోవాలి' అంటూ శంకర శర్మ, ఎన్టీఆర్ 'యమగోల' సినిమా ప్రభావంతో సమ్మె చెయ్యబోయాడు. కానీ నిజం యముడు సినిమా యముడులాగా కామెడీ జీవి కాకపోవడంతోనూ కులమత వర్గ ప్రాంతీయ భేదాలు లేనివాడవడంతోనూ శంకరశర్మను నూనెబాణలిల్లో వేయించాడు.

పైలోకాల్లో అలా ఉంటే, క్రింద ఊరిలో ఇంకా అధ్వానంగా ఉంది.

ఊళ్ళో ఇరువర్గాలకు సపరేటు శ్మశాన వాటికలు, గుళ్ళూ, దుకాణాలూ వెలిశాయి.

ఒకరినొకరు కొట్టుకోరు. తలలు నరుక్కోరు. ద్వేషించుకుంటారు అంతే.

మరో రెండు తరాలు గడిచాయి. ఇంకా, ఊళ్ళో తంతు అలాగే ఉంది.

'అసలు మీ వర్గాలకు ఎందుకు పడదయ్యా బాబూ అందరం భారతీయులం. ఒక రాష్ట్రం వాళ్ళం. ఒక భాష మాట్లాడతాం, ఒక ఊరి వాళ్ళం. అయినా, ఎందుకు ఈ ద్వేషం?' అని ఈ కథ రాసిన నాలాంటివాడో, చదివిన మీలాంటివారో వెళ్ళి అడిగామనుకోండి. ఒసామాబిన్ లాడెన్ మీద ఒట్టు. కారణం ఎవ్వడికీ తెలియదు. తెలుసుకోరు. ఆలోచించరు. ఎవడైనా జ్ఞానదంతం పెరిగి, కాస్త ఆలోచించ జూస్తే, వాడి పన్ను పీకుతారు.

ఇలాంటిది చూసే, ఎవరో తెలివైన ప్రాణి, "చిలికి చిలికి గాలివాన అయ్యింది" అనే చక్కని జాతీయాన్ని తెలుగు భాషకు ప్రసాదించాడు.

*(ఇది సరదా కోసం రాసింది. ఎవ్వరినీ కించపరచడానికి కాదు. ప్రపంచంలోని ఎన్నో 'ద్వేషాల'కు మూలకారణం చాలా చాలా చిన్నదై ఉంటుంది. ఆ మూలకారణం కొన్నిసార్లు దొరుకుతుంది, కొన్ని సార్లు దొరకదు. మనిషి తార్కికంగా ఆలోచించనంతకాలం ఈ 'ద్వేషాలు' అలాగే ఉంటాయి - రచయిత)*

●●●

# ఇంటిపేరు

## కొల్లి ప్రవీణ

"**నా ప్రతీ శ్వాసలోను నీ జ్ఞాపకాలు** తేలియాడుతూ ఉండేవి. ఈ రాకకై నా కనులు నలుమూలలా వెతికేవి. నీ కౌగిలి వెచ్చతనపు స్పర్శకోసం నా అణువణువూ పరితపించేది. ఆమడ దూరంలోనే నీ రాకను గ్రహించి, ఊపిరి సలపనంత వేగంతో నీదరికి చేరాక, దాహం తీర్చలేని ఉప్పటి ద్రవంలో నన్ను విసిరేసావు.

నీలో నా ఉనికి నన్ను నిలదీసింది, నేనెవరని? నాలో నీ ఉనికి నేను కోల్పోయేలా చేసింది. నన్ను నేను నిలబెట్టుకోవటం కోసం తప్పలేదు ఈ నిర్ణయం నాకు. ఛిద్రమైన నాలో సగభాగం, మిగిలిన భాగాన్ని కూల్చేయ్యాక మునుపే బాధ్యతలు తట్టిలేపాయి. నిస్సహాయత వ్యక్తిత్వాన్ని అధికమించక ముందే, వ్యక్తిగా, మహిళగా, తల్లిగా నాలో ఉన్న రూపాలకు అపురూపన్ని ఆపాదించుకుని, ప్రాణవాయువు నింపుకోవటం కోసం ఈ అడుగు వెయ్యక తప్పలేదు. పాదం ఎత్తేవరకు ఎంతో ఘర్షణ, సంఘర్షణ. దింపిన పాదం మరి వెనుకకు తిరిగి చూడలేదు. అడుగులు వడివడిగా సాగిపోయాయి."

రాస్తున్న పేపర్లలో నుంచి తలెత్తి చూసింది స్వాతి. గాఢ నిద్రలో ఉన్న మూడున్నరేళ్ళ కొడుకు వైభవ్ అమాయకపు మొహం ప్రేమగా చూసింది. రాస్తున్న పేపర్లు పక్కన పెట్టి వైభవ్ దగ్గరకు వెళ్ళి దుప్పటి కప్పి నుదుటిపై ముద్దు పెట్టుకుంది. గడియారం ఒంటిగంట చూపుతుంది. అయినా నిద్రరావట్లేదు. నిద్రరాకుండా పక్క మీద వాలితే ఆలోచనలు చుట్టుముట్టేస్తాయి. మళ్ళీ పేపర్లు ముందేసుకుని కూర్చుంది.

టేబుల్ పై స్కూల్ అప్లికేషను ఫ్యాన్ గాలికి రెపరెపలాడుతుంది. అసలే దిగులుగా ఉన్న మనసు మరింత కుంగిపోయింది. అప్లికేషను చేతుల్లోకి తీసుకుని పేపర్స్ అన్నీ తిరగేసింది. గుండ్రటి చేతి రాతితో అన్ని కాలమ్స్ పూర్తిచేసింది, ఆ ఒక్క కాలమ్ తప్ప. మనసు ఎదురు తిరుగుతోంది, ఎందుకు రాయాలి అని. ప్రేమ, బాధ్యత లేని చోట హక్కు ఎలా సంక్రమిస్తుంది? తరాల సంస్కృతి, వంశపారంపర్యాన్ని, పురుషాధికార సమాజాన్ని ఎదిరించే శక్తి ఆలోచనలలో ఆవేశాన్ని నింపుతోంది.

వైభవ్ నిద్రలో ఉలిక్కిపడి, అమ్మా అని కలవరిస్తున్నాడు. స్వాతి వెంటనె లైట్ ఆఫ్ చేసి, కొడుకు పక్కకు చేరింది. వైభవ్ తల్లి పొట్ట ఎక్కి నిద్రలోకి జారుకున్నాడు. చిన్ని తండ్రి తల తల్లి గుండెలపై భద్రంగా ఒదిగింది. కొడుకు తలను నిమురుతూ జోకొడుతోంది స్వాతి. మనసు పరిపరి విధాల పరుగుపెడుతోంది.

గత ఐదేళ్ళలో జరిగిన సంఘటనలన్నీ కళ్ళ ముందు కదలాడుతున్నాయి.

స్వాతి, రఘు ఒకే కాలేజీలో చదువుకున్నారు. చదువులో పోటాపోటీగా ఉండేవారు. సాహిత్యం నుంచి రాజకీయాలదాకా చర్చించుకునేవాళ్ళు, వాదులాడుకునేవారు. రఘు చలం సాహిత్యం, స్త్రీ వాదం గురించి అనర్గళంగా మాట్లాడేవాడు. అతని ఆదర్శాలకు ఆకర్షితురాలయింది స్వాతి. అది ప్రేమో ఆకర్షణో తేల్చుకునే లోపే, చదువు అయిపోవటం, ఇద్దరికీ కాంపస్ ఇంటర్వ్యూలో ఒకే కంపెనీలో ఉద్యోగాలు రావటం కూడా జరిగిపోయాయి. కులం కూడా ఒకటే కావటంతో ఇద్దరి ఇళ్ళలోనూ పెళ్ళికి ఒప్పుకున్నారు.

పెళ్ళి విషయాలు మాట్లాడటానికి రఘు తల్లి అనసూయ, తండ్రి రామారావు స్వాతి ఇంటికి వచ్చారు. ఆ మాట ఈ మాట అయ్యాక, "మరి చెప్పండి నాగేశ్వరరావు గారు, ఎంతిస్తారు మీ అమ్మాయికి?", రామారావు కట్నం ప్రస్తావన తీసుకొచ్చారు.

"ఐదెకరాల పొలం అమ్మాయి పేరున ఉందండి. మాకు చేతనయినంతలో పెళ్ళి ఘనంగా చేస్తాం" స్వాతి తండ్రి నాగేశ్వరరావు చెప్పారు.

"ఐదెకరాలు అంటే, సుమారు పాతిక లక్షలు చేస్తుంది, అంతేకదండీ?", ప్రశ్నార్థకంగా అడిగారు రామారావు.

"సుమారు అంతే"

"మా వాడికి కోటి రూపాయల పైనే ఇస్తామని ఎన్నో సంబంధాలు వచ్చాయి. ఏదో వాడు ఇష్టపడ్డాడని మీ అమ్మాయిని చేసుకోవాల్సి వస్తుంది. ఎంతైనా పాతిక లక్షలు అంటే చాలా తక్కువ. పోనీ కాష్ ఎంత ఇవ్వగలరు?" కటువుగానే అడిగారు రామారావు.

"కాష్ అంటూ ఏమీ ఇవ్వలేనండి. మాకు పెళ్ళి ఖర్చులు చాలానే ఉంటాయి కదా"

"అలా కాదు, ఇంకో మాట చెప్పండి. మాకు ఇంటి ఖర్చు కింద రెండు లక్షలు కావాలి. మీ అమ్మాయికే పెడతాం కదా బంగారం, బట్టలూను."

అక్కడే కూర్చున్న స్వాతి అసహనంగా కదిలింది. తన కళ్ళలోని విభ్రాంతి దాచుకోవడానికి విఫల ప్రయత్నం చేసింది. నిరాశ నిలువెల్లా ఆవరించి, రఘు వైపు తీక్షణంగా చూసింది. రఘు ఇవేమీ పట్టనట్టు ఎటో చూస్తున్నాడు.

అక్కడ జరుగుతున్న బేరసారాలను భరించలేక కుర్చీలో నుంచి విసురుగా లేవబోయింది. స్వాతినే గమనిస్తున్న తల్లి పార్వతి కూతురి చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది. ఇదంతా రఘు ఓ కంట గమనిస్తూనే ఉన్నాడు.

"ఏమిటా విసురు? నువ్వు కాసేపు లోపలే ఉండు", కోపంగా అంది పార్వతి.

"ఏదో వస్తువును కొనుక్కున్నట్టు, అమ్ముతున్నట్టు ఆ బేరసారాలేమిటి? పైగ మేమిద్దరమూ ఇష్టపడి చేసుకుంటున్న పెళ్ళి" ఉక్రోషంగా అంది స్వాతి.

"స్వాతి, ఆవేశపడకు. అన్ని పెళ్ళిళ్ళలోనూ జరిగే తంతే ఇది. ఎంత చదువుకున్నా, ఉద్యోగం చేస్తున్నా ఆడపిల్లకు కట్నం ఇవ్వాల్సిందే"

"అది కాదమ్మా రఘు కూడా ఏమీ మాట్లాడట్లేదు", ఇంకా ఏదో అనబోతున్న స్వాతిని తల్లి అడ్డుకుంది.

"కట్నం కింద ఇచ్చే పొలం నీకే కదమ్మా ఇచ్చేది. మా అమ్మాయికి మేం ఇస్తున్నాం. నువ్వు ఎక్కువగా ఆలోచించి మనసు పాడుచేసుకోకు. ఇంటి ఖర్చుల కింద అందరూ అడుగుతున్నదే", మరేమీ మాట్లాడనీయకుండా పార్వతి అక్కడి నుంచీ వెళ్ళిపోయింది.

పెట్టుపోతలు, పెళ్ళి ఏర్పాట్ల గురించి మాట్లాడి రఘు అమ్మ నాన్న వెళ్ళిపోయారు. కట్న కానుకుల గురించి స్వాతికి ఎక్కువగా తెలీకుండా జాగ్రత్తపడ్డారు పార్వతి, నాగేశ్వరరావు దంపతులు. స్వాతి ఒకటి రెండు సార్లు రఘుతో ఈ విషయం గురించి అడిగితే, మాట దాటేసాడు.

పెళ్ళిలో చిన్న పెద్ద అలకలు, సాధింపులు జరిగాయి. కొన్ని స్వాతి దాకా వచ్చాయి, మరికొన్ని రాలేదు.

పెట్టిన సెలవలు అయిపోవటంతో, పెళ్ళయిన పదిరోజులకే స్వాతి అత్తారింటికి కాపురానికి వచ్చేసింది. రఘు ఒక్కడే కొడుకు. ఇంకా కొత్త పెళ్ళి ముచ్చట్లు తీరకమునుపే ఇద్దరూ ఆఫీసులకు పరుగులు తీసారు.

స్వాతి కాపురానికి వచ్చిన మొదటి వారం రోజులు అనసూయే వంట పనంతా చేసింది. స్వాతి ఇల్లు సర్దడం, కూరగాయలు తరగటం లాంటి పనుల్లో సాయం చేసేది. అనసూయ వీలు దొరికినప్పుడల్లా, మీ వాళ్ళు మంచి బట్టలు పెట్టలేదు, మర్యాదలు సరిగ్గా చెయ్యలేదు అంటూ గొణుగుతూనే ఉండేది. స్వాతికి అవన్నీ వినటం చిరాగ్గా, విసుగ్గా ఉన్నా ఏమి అనలేక విని విననట్టు ఊరుకునేది. కాపురానికి వచ్చీ రాగానే గొడవలెందుకు అని కొంత, పోన్లే పెద్దావిద చాదస్తం అని కొంత సర్దుకుపోయింది.

ఆరోజు ఉదయం ఐదుగంటలకు నిద్ర లేచి స్వాతి వంటింట్లోకి వెళ్ళింది. రోజూ ఆపాటికే పాలుకాస్తూ ఉండే అత్తగారు వంటింట్లో కనిపించలేదు. ఏం చెయ్యాలో తోచలేదు. ఫ్రిడ్జ్‌లో పాల ప్యాకెట్ తీసి గిన్నెలో పోసి పొయ్యిపై పెట్టింది. ఏమి కూరగాయలు తరగాలో తెలీక అయోమయంగా ఉంది. అప్పుడు వచ్చింది అనసూయ, "స్వాతి ఈ రోజు నుంచి నువ్వే వంట చెయ్యి" అని చెప్పేసి తన రూంలోకి వెళ్ళిపోయింది.

ఎక్కడ మొదలు పెట్టాలో, ఏం చెయ్యాలో తోచలేదు. ఎప్పుడన్నా అమ్మ ఊరు వెళితే బంగాళాదుంపల వేపుడు, ఆమ్లెట్ వేసుకోవటం తప్పితే పెద్దగా వంట చేసింది లేదు. స్వాతి అదృష్టం బాగుండి ఇంట్లో ఆలుగడ్డలు ఉన్నాయి. మరొకటి ఆలోచించకుండా వేపుడు చేసేసింది. తీరా చూస్తే కూర కొంచమే అయింది, అందరికి సరిపోదు. ఫ్రిడ్జ్‌లో టమాటాలు ఉంటే, వాటితో రసం పెట్టింది. రసం పొడి ఎక్కడ ఉందో కనిపించలేదు, అడుగుదామంటే అత్తగారు రూంలో ఉన్నారు. తాలింపు డబ్బాలో ఆవాలు అయిపోయయి, అవన్నీ వెతుకుతుంటే పొయ్యిపై మరుగుతున్న టీ పొంగిపోయి పొయ్యి గట్టంతా పాడయింది. ఇడ్లీ పిండి రెడీగా ఉండటంతో, హమ్మయ్య బతికిపోయాను అనుకుంటూ అందరికీ ఇడ్లీలు వేసేసింది. అప్పటికే 7 గంటలయ్యింది.

అనసూయ వంటగదిలోకి వచ్చి, అక్కడ గందరగోళంగా ఉన్నా పొయ్యి, గట్టు చూసి చిరాగ్గా మొహం పెట్టి, "ఏమ్మా ఏనాడు వంట గది మొహం చూడలేదా మీ ఇంట్లో?" వ్యంగ్యంగా అంది.

స్వాతి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కన్నీరు అత్తగారి కంట పడకూడదని తలదించుకుని తన బెడ్రూంలోకి నడిచింది. అప్పుడే నిద్రలేచి వస్తున్న రఘు, గుమ్మం దగ్గర ఎదురయ్యాడు. స్వాతి వైపు ఆశ్చర్యంగా చూసి హాల్లోకి వెళ్ళాడు. అనసూయ అన్న మాటకన్నా, ఏమైంది అని తనని అడగకపోవటం చాలా బాధించింది స్వాతిని. కాసేప ట్లో తేరుకుని స్నానం చేసి తయారయ్యింది. స్వాతి రెడీ అవుతుండగా రఘు రూంలోకి వచ్చాడు. ఏమీ మాట్లాడకుండా గంభీరంగా గబగబా తయారయ్యాడు.

ఆఫీసులో ఇద్దరూ కలిసి లంచ్ చేస్తున్న సమయంలో, "స్వాతి నీకు ఇంటి పనులు చెయ్యటం కూడా రాదా?"

రఘు అడిగిన విధానానికి స్వాతిని కోపం వచ్చింది.

"రఘు, నీకు వచ్చా?", ఉదయం కోపం స్వాతి మనసులో ఇంకా ఉంది

"నాకెందుకు వస్తాయి? ఆ అవసరం నాకెందుకు వస్తుంది?"

"నీకు రాని పనులు నాకు పూర్తిగా వస్తాయని ఎలా అనుకున్నావు? చిన్నప్పటి నుంచి నాక్కూడా నీలాగానే చదువుతోనే సరిపోయింది. నీకు తెలుసు ఎలాంటి కాంపిటిటివ్ వరల్డ్ లో నెగ్గుకొస్తున్నామో"

"నువ్వు ఎంత చదువుకున్నా, ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా. భార్యగా ఇంటి పని, వంట పని చెయ్యాల్సింది నువ్వే"

"రఘు, నువ్వేనా ఇలా మాట్లాడుతుంది ఫెమినిజం గురించి ఉపన్యాసాలు ఇచ్చింది నువ్వేనా?"

"కమాన్ స్వాతి.. బి రియలిస్టిక్"

"రఘు, అవి నా బాధ్యతలే, కాదని నేనెప్పుడు అనను. పెళ్ళికి ముందే వంట చెయ్యడంలో చెయ్యి తిరిగేటంత నేర్పు, నేర్చుకునే సమయం నాకెప్పుడు ఉంది? నేను కూడా నీలాగానే చదువు ముఖ్యం అన్న తరహాలోనే పెరిగాను. ఎగ్జామ్స్, ప్రాజెక్ట్స్, మార్క్స్ వీటిల్లో ఊపిరి తీసుకునే తీరిక నీకు ఎప్పుడన్నా దొరికిందా? నేను కూడా అలాగే వచ్చాను అని నువ్వెందుకు అర్థం చేసుకోవు?"

"అయితే.. ఇప్పుడేమంటావు?"

"ఈ పనులన్నింటికి అలవాటు పడటానికి నాకు కొంత సమయం పడుతుంది. నీ సాయం అందించు"

"అమ్మ మరోసారి నీ గురించి ఫిర్యాదు చెయ్యకుండా చూసుకో"

స్వాతి ఉదయం నాలుగు గంటలకే నిద్రలేవటం చేసుకుంది. మెల్లమెల్లగా వంట నేర్చుకుంది. అత్తగారి సాధింపులకు అలవాటు పడినట్టే ఉంది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాక వంట చేసే ఓపిక మాత్రం ఉండేది కాదు. ' పొద్దున్న కూరలు సాయంత్రం తినే అలవాటు మాకు లేదమ్మా' అంటూ గొణిగేది అనసూయ.

ఒకనాడు స్వాతి, ' సాయం చేద్దువురా' అని రఘుని వంటింట్లోకి పిలిచిందని పెద్ద రాద్ధాంతమే అయ్యింది ఆ ఇంట్లో. ఇంత జరుగుతున్నా రఘు తనను సపోర్ట్ చేస్తూ ఒక్కనాడన్నా మాట్లాడకపోవటం స్వాతిని అమితంగా బాధించేది.

●●●

ఆ రోజు ఒకటో తారీకు. రఘు స్వాతి డెస్క్ దగ్గరకు వచ్చి, "ఈ రోజు శాలరీ ట్రాన్స్‌ఫర్ అయ్యింది. ఈవెనింగ్ వెళుతూ బ్యాంకు దగ్గర ఆగి నీ శాలరీ డ్రా చేద్దాం", అన్నాడు.

"ఏదన్నా అర్జెంటు అవసరమా డబ్బుతో", అడిగింది స్వాతి.

"అలా ఏమి కాదు, శాలరీ డ్రా చేసి నాన్నకు ఇవ్వాలి"

"ఎందుకు అలా", అయోమయంగా అడిగింది.

"అదంతే, నువ్వు ప్రతీ చిన్న విషయానికి వాదించకు", విసురుగా వెళ్ళిపోయాడు.

ఒక్క క్షణం స్వాతి బ్లాంక్ అయిపోయింది. రఘు ఏం మాట్లాడాడో కూడా అయోమయంగా అనిపించింది. అర్జెంట్‌గా చెయ్యాల్సిన పని ఉండటంతో ఇంకా ఆ విషయాన్ని పక్కన పెట్టేసింది.

ఆఫీసు అయ్యాక ఇద్దరూ బండి మీద ఇంటికి బయలుదేరారు. రఘు దారిలో బ్యాంకు దగ్గర ఆపాడు. స్వాతి ఏమి మాట్లాడకుండా, డబ్బులు డ్రా చేసి రఘు చేతిలో పెడుతూ, అతని కళ్ళలోకి చూసింది. ఏదో విజయగర్వం తొంగి చూస్తోంది అతని కళ్ళలో.

ఇంటికి వెళ్ళగానే నోట్ల కట్టలు అనసూయ చేతిలో పెట్టాడు. స్వాతి ఎవరి మొహం చూడకుండా రూంలోకి వెళ్ళిపోయింది.

స్వాతి మరో విషయం గమనించింది. ఇంటికి సంబందించిన ఏ విషయాలు తనతో మాట్లాడేవారు కాదు. ఆ ఇల్లు తనకెప్పుడూ పరాయిగానే తోచేది.

●●●

పెళ్ళయి ఆరు నెలలు గడిచింది. ఎంత ఊహించుకుంది వివాహ జీవితం గురించి. రఘు ఒక్కడే కొడుకు. అత్తా మామలతో కలిసి ఉండాలని తనకు ముందే తెలుసు. అందరూ కలివిడిగా ఉంటారని కలలు కంది. రఘు రోజు రోజు తనకు దూరమవుతున్నాడు. ఇద్దరికి కనీసం మాట్లాడుకునే సమయం కూడా చిక్కట్లేదు. ఒక వారం రోజులు సెలవు పెట్టి ఎక్కడికన్నా వెళితే బాగుండు.

"రఘు, పెళ్ళయ్యాక మనిద్దరం కలిసి ఎక్కడికి వెళ్ళింది లేదు. ఒక వారం సెలవు ఎక్కడికన్నా వెళ్దామా?"

"ఇప్పుడా?.. అసలే చాలా ఖర్చు ఉంది, తరవాత చూద్దాంలే"

"ఏం ఖర్చు?"

"ఆఫీసుకు దగ్గరగా అపార్ట్‌మెంట్ చూస్తున్నాను. అది కుదిరేలా ఉంది. ఎంత లోన్ తీసుకున్నా, డౌన్ పేమెంట్ చెయ్యాలి"

"ఇల్లు కొనుక్కుంటున్నామా?", ఆనందంగా అంటూనే, "నాతో ఒక్కమాటన్నా చెప్పలేదే రఘు?" బాధగా అంది స్వాతి.

"ఇందులో నీకు చెప్పేదేముంది? నేను నాన్న చూసుకుంటున్నాం", ఒక్క మాటలో తేల్చేసాడు.

కంట్లో సన్నటి కన్నీటి పొరను తనలోనే దాచేసుకుంది.

●●●

ప్రాజెక్ట్ డెడ్‌లైన్ ఆ రోజు. చివరి నిమిషంలో ప్రాబ్లమ్స్ రావటంతో అందరూ రాత్రంతా వంతుల వారీగా పనిచెయ్యాల్సి వచ్చింది. స్వాతి తన పనంతా అవచేసుకుని ఇంటికి వెళ్ళేటప్పటికి రాత్రి పన్నెండు దాటిపోయింది. కాలింగ్‌బెల్ కొట్టగా కొట్టగా అనసూయ విసుగు మొహంతో తలుపు తీసి, "ఇప్పుడా రావటం, అర్ధరాత్రి దాటాకా కొంపకు చేరేది?", అని నిష్ఠూరమాడింది.

శారీరక అలసటను మించిన మానసిక నీరసం ఆవరించింది స్వాతిని.

అలసిపోయిన స్వాతికి కడుపులో ఆకలి దహించేస్తుంది. గబగబా ఫ్రెష్ అయ్యి, వంటింట్లోకి వెళ్ళి చూస్తే, గిన్నె అడుగున కొంచెం అన్నం ఉంది. కూర గిన్ని సింక్ ఓ పడేసి ఉంది.

"నేను ఒక మనిషిని ఇంట్లో ఉన్నా నన్న స్పృహే లేదా వీళ్ళకు" మనసు కష్టపెట్టుకుని, అర్ధాకలితో నిద్రపోయింది.

●●●

"రఘు, నాకు ఈ పనితో చాలా ఫ్రస్టేషన్‌గా ఉంది. ఐ నీడ్ బ్రేక్. రెండు రోజులు అమ్మ దగ్గరకు వెళ్ళివస్తాను" అడిగింది స్వాతి.

"ఇప్పుడెందుకు?" అడిగాడు రఘు.

"చెపుతున్నాను కదా. ఐ యామ్ టైర్డ్, ఐ నీడ్ సం టైం ఫర్ మై సెల్ఫ్"

"ఏంటి నువ్వొక్కదానివే పని చేస్తున్నట్టు మాట్లాడుతున్నావు", విసుక్కున్నాడు రఘు.

"పని గురించి కాదు. ఇక్కడ నాకు చాలా లోన్లీగా అనిపిస్తుంది"

"ఇప్పుడు నీకేం తక్కువైంది ఇక్కడ" కోపంగా అడిగాడు.

"ఏం తక్కువైందని చెపితే నీకు అర్థం అవుతుంది రఘు," నీరసంగా అంది.

"అర్థం పర్థం లేకుండా మాట్లాడకు స్వాతి" విసుక్కున్నాడు.

"అయితే చెపుతా విను. నేను మీలో ఒక మనిషిని అన్న ఆత్మీయత నేనేనాడు చూడలేదు ఈ ఇంట్లో. మానసికంగా నన్ను వాకిట్లోనే ఉంచేశారు. శారీరకంగా మాత్రమే మీతో ఉన్నాను. నా పని శ్రమ నాది మాత్రమే" నిస్సహాయిత ధ్వనించింది స్వాతి మాటలలో.

"ఓ నీకు ఇంటి పని చెయ్యడానికి బాధగా ఉన్నట్టుందే" వ్యంగ్యంగా అన్నాడు.

"విపరీతార్థాలు తియ్యకు రఘు. నా వాళ్ళకు వండి పెట్టుకోవటం కష్టం కాదు నాకు. నేను తిన్నానో లేదో కూడా పట్టించుకోని వారు నా వాళ్ళు అవుతారా"

"సంపాదిస్తున్నావని పొగరు నీకు"

"సంపాదన.. హు, నా చేతిలో వెయ్యి రూపాయిలన్నా ఉన్నాయా ఇప్పుడు?" నిలదీసింది స్వాతి.

"నీ జీతం నాకేమన్నా ధారపోస్తున్నావా? నువ్వు ఎప్పుడు అడిగితే అప్పుడు ఇస్తూనే ఉన్నాను కదా"

"నేను సంపాదించేది నా ఒక్కదానికోసమేనా? కుటుంబంలో నేనూ భాగమే అనుకునే కదా, పెళ్ళయిన నాటి నుంచి నా జీతం నువ్వు తీసుకుంటున్నా నేనూ ఏనాడు కాదనలేదు. ఇలా వాదించుకోవటం వల్ల ఉపయోగం లేదు రఘు. డబ్బు, పని ప్రసక్తే లేదు. నువ్వు నాతో ప్రేమగా మాట్లాడితే చాలు. ఇంట్లో అందరూ నాతో ఆత్మీయంగా ఉంటే అంతే చాలు" కన్నీరు జలజలా జారిపోయాయి.

రెండు రోజులు సెలవు పెడదామనుకున్నది, వారం రోజులు సెలవు తీసుకుని పుట్టింటికి వెళ్ళింది స్వాతి.

బలవంతపు నవ్వును అతికించుకున్న కూతురి మొహంలో కళ తప్పటాన్ని స్వాతి తల్లిదండ్రులు ఇట్టే గ్రహించేసారు. స్వాతి చెపుతుందేమోనని పార్వతి రెండు రోజులు చూసింది. ముభావంగా ఉంటున్న కూతురు ఏదో దాస్తోందని తెలుస్తూనే ఉంది.

"ఏమ్మా, మీ అత్తగారింట్లో అందరూ బాగున్నారా?" అడిగింది పార్వతి.

"ఆ బాగానే ఉన్నారమ్మా"

"నిన్ను బాగానే చూసుకుంటున్నారుగా? నీకేం లోటులేదుగా?"

"లేదమ్మా, అంతా బాగానే ఉంది"

"స్వాతి, నీతో అడపాదడపా ఫోన్లో మాట్లాడుతూనే ఉన్నాను. నువ్వెప్పుడు ఏమి తేడాగా చెప్పలేదు. కానీ, నీ మొహంలో కొండంత భారం దాస్తున్న మనసు కనపడుతుంది. ఏమైందమ్మా?"

ఆ మాత్రం ప్రేమకే కరిగిపోయింది. స్వాభిమానంగా పెరిగిన కూతురు బేలగా కన్నీరు పెట్టుకోవటం చూసి పార్వతి తట్టుకోలేకపోయింది. స్వాతి తనకు ఆ ఇంట్లో ఎదుర్కొంటున్న అనాదరణ గురించి చెప్పుకుంది. పార్వతి స్వాతిని ఓదారుస్తున్న సమయంలో బయటకు వెళ్ళిన నాగేశ్వరరావు వచ్చి, వారి సంభాషణ అంతా విన్నారు.

ఆ రోజు రాత్రి ఈ ఇంట్లో ఎవరూ నిద్రపోలేదు.

"పార్వతి, పుట్టెడు దుఃఖంలో వచ్చిన స్వాతిని తిరిగి ఆ ఇంటికి పంపించటానికి మనసు ఒప్పుకోవట్లేదు" నాగేశ్వరరావు బాధగా అన్నారు.

"ఏ కారణం చెప్పి పంపించరు చెప్పండి? కొడుతున్నారా, తిడుతున్నారా అని లోకం అడగదూ?"

"భర్త కొట్టటం, తిట్టటం మాత్రమే కష్టాలు అనుకుంటే, మన దేశంలో 80 శాతం భార్యలకు అసలు కష్టాలే లేనట్టు", నిట్టూర్చారు.

"నాకు కష్టంగానే ఉండండి. కాపురాన్ని పాడుచేసుకోలేము కదా. మీరు స్వాతికి ధైర్యం చెప్పండి"

వారం ఇట్టే గడిచిపోయింది. "నీకు అండగా మేమున్నాం", తండ్రి చెప్పిన మాటలకు కొండంత ధైర్యం తెచ్చుకుని తిరుగు ప్రయాణమయ్యింది స్వాతి.

ఎవరి కష్టాలు వారివే. తల్లితండ్రులు, తోబుట్టువులు, బంధువులు, స్నేహితులు ఇలా ఎందరు ఉన్నా, ఎవరి సమస్యలకు పరిష్కారాలు వారే వెతుక్కోవాలి. కాకపోతే మనసులో బాధ మనవారితో చెప్పుకుంటే సగం భారం తగ్గుతుంది. పుట్టింటికి వెళ్ళి వచ్చాక స్వాతికి కొండంత భారం తగ్గినట్టుంది.

"ఇది నా కాపురం, నేనే సర్దుకోవాలి" తేలిక పడ్డ పనసుతో గట్టి నిర్ణయం తీసుకుంది.

"నన్ను వీళ్ళెందుకు తమలో కలుపుకోవట్లేదు? లేక నేనే కలవలేకపోతున్నానా? తప్పు ఎక్కడ జరుగుతోంది?" పరిపరివిధాలా ఆలోచించింది.

కలుపుగోలుతనం నేర్చుకుంది. తనకు తానే అత్తా మామలను పలకరిస్తోంది. భర్తతో సామరస్యంగా మాట్లాడటానికి ప్రయత్నిస్తోంది. విసుగులు, కోపాలు మనసులోనే నొక్కెయ్యటం అలవాటు చేసుకుంది.

●●●

ఒకనాడు షాప్ నుంచి కూరగాయలు, సరుకులు తీసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, పక్కనుంచి స్కూటర్ రాసుకుంటూ వెళ్ళటంతో అదుపు తప్పి కింద పడిపోయింది. కుడి చేతికి ఫ్రాక్చర్ అయ్యింది. నెలరోజులు పిండి కట్టు వేసారు.

"నీకు బాగోలేదు కదా. ఇక్కడ ఉండి మాత్రం నువ్వేం చేస్తావు చెప్పు? కట్టు విప్పేదాకా నిన్ను పుట్టింటికి పంపమని అమ్మ చెప్పింది", అన్నాడు రఘు.

"ఇక్కడ ఉండి మాత్రం నువ్వేమి చేస్తావు" ఆ భావంలోని అర్థం జీర్ణించుకోలేకపోయింది స్వాతి.

"నేను ఆరోగ్యంగా ఉన్నంత సేపు, ఇక్కడే ఉంటూ మీ అందరికీ సేవలు చెయ్యాలి. నాకు ఏ మాత్రం చిన్న తేడా వచ్చినా, నేను వెంటనే పుట్టింటికి వెళ్ళిపోవాలి. హు.. కోడలి అవసరాన్ని చాలా గొప్పగా నిర్వచించారుగా" వ్యంగ్యం, కోపం అసహనం వినిపించాయి.

నెలరోజులు సిక్ లీవ్ పెట్టి పుట్టింట్లో ఉండిపోయింది.

"స్వాతి, ఎక్కువగా ఆలోచించకమ్మా. ఇవన్నీ మామూలే, అందరి ఇళ్ళలోనూ ఉండేవే తల్లి. నీ భర్తకు చెడు అలవాట్లు లేవు. నిన్ను శారీరకంగా బాధించటంలేదు. అత్తమామలతో సర్దుకుపో తల్లి" అనసూయ అనునయంగా చెప్పింది.

"అమ్మా, అసలు కష్టం అంటే ఏమిటి? నిర్వచించగలమా? నా ఇష్టాలు, కష్టాలు నా అభిప్రాయాలు చివరకు నా ఉనికినే గుర్తించలేని చోట నన్ను శారీరకంగా బాధించట్లేదు అని సర్దుకుపోమంటావా అమ్మా? ప్రశ్నించటం మొదలు పెట్టిన స్త్రీకి మిగిలేవి ప్రశ్నలే" నిట్టూర్చింది స్వాతి.

కోలుకున్నాక తిరిగి వచ్చిన స్వాతి రొటీన్‌లో పడటానికి కొంత సమయం తీసుకుంది.

●●●

పెళ్ళయిన నెల రోజుల నుంచే, "విశేషం ఏమీలేదా" అంటూ అత్తగారు విసిగిస్తూనే ఉంది. ఏది ఏమైనా వివాహ బంధం గట్టిపడేదాకా మరోప్రాణిని ఈలోకంలోకి తీసుకు రాకూడదనే నిశ్చయించుకుంది స్వాతి. తల్లి ఒకటి రెండు సార్లు పిల్లలు పుడితే అన్నీ అవే సర్దుకుంటాయి అని సలహా చెప్పినా, స్వాతి అంగీకరించలేదు.

పెళ్ళయి రెండేళ్ళు దాటిపోయింది. బంధం అల్లుకుందా అని ప్రశ్నించుకుంటే సూటిగా చెప్పే సమాధానమే లేదు. స్వాతికి ఇంకో ఏడాదిలో ముప్పై నిండుతాయి. ఇంకా లేట్ చేస్తే ఫెర్టిలిటీ ప్రోబ్లమ్స్ వస్తాయని ఆలోచించుకుని, ఆ మాటే రఘుతో అంది. రఘు ఏమీ మాట్లాడలేదు. విని ఊరుకున్నాడు అంతే.

●●●

"తన గర్భంలో ఈ చిన్ని ప్రాణం", డాక్టర్ కన్‌ఫర్మ్ చేసారు. ఈ శుభవార్త మొదట భర్తకే చెప్పాలని ఎంతో సంతోషంగా ఇంటికి వచ్చింది. రాత్రి లేట్‌గా వచ్చిన రఘుకోసం ఎదురు చూస్తూ కూర్చుంది. రఘు వచ్చి రాగానే అతని చెవిలో మధురంగా చెప్పింది. రఘు మొహంలో ఏ భావమూ లేదు, ఏమీ స్పందించలేదు.

స్వాతికి నీరసం ఆవరించేసింది. నిరాశ కమ్ముకున్న ఆ రాత్రి ఎలా గడిచిందో తనకే తెలీదు.

"ఈ బిడ్డ నాది, ఈ ఆనందం, తృప్తి నాది. రఘు సంతోషించలేదని నేనెందుకు నా సంతోషాన్ని పాడు చేసుకోవాలి. నేను తల్లిని కాబోతున్నాను. నా చేతుల్లోకి పసి ప్రాణం రాబోతుంది" తనకి తానే ధైర్యం చెప్పుకుని, సంతోషానికి స్వాగతం పలికింది.

రఘు ముభావంగా ఉండటంతో నిరుత్సాహపడ్డ స్వాతి, రెండు రోజులు ఆగి, కాస్త మనసు కుదుట పడ్డాక అప్పుడు ఇంట్లో అందరికి చెపుదామని ఊరుకుంది.

ఆ మర్నాడు రాత్రి,

"స్వాతీ!, నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి" అన్నాడు రఘు.

"చెప్పు" పక్కకు వచ్చి కూర్చుంది.

"లుక్.. నువ్వు ఎమోషనల్ అయిపోకు, ప్రాక్టికల్‌గా మాట్లాడుకుందాం"

"విషయం ఏమిటో చెప్పు"

"స్వాతి, ఐ నాట్ రెడీ ఫర్ దిస్ బేబి. నాకు ఆన్‌సైట్ చాన్స్ వస్తుంది. రెండు సంవత్సరాలు ప్రాజెక్ట్‌పై అమెరికా వెళ్ళబోతున్నాను. నువ్వు ఇక్కడ జాబ్‌కు రిజైన్ చేసి నాతో రావాలి. నీకు అక్కడ జాబు రావటం పెద్ద కష్టం కాదు."

"స్టాపిట్ రఘు", కోపంగా అరిచింది స్వాతి.

"అండ్ ఐ వాంట్ యు టు ఎబోర్ట్ దిస్ ప్రెగ్నెన్సీ. ఈ టైంలో ప్రెగ్నెన్సీ, కిడ్ ఇవన్నీ నా యాంబిషన్స్‌కి అడ్డు"

విభ్రాంతిగా చూస్తున్న స్వాతిని పట్టించుకునే స్థితిలో లేడు రఘు.

"అండ్ ఒన్ మోర్ వెరీ ఇంపార్టెంట్ థింగ్, నువ్వు అమ్మతో నీ ప్రెగ్నెన్సీ గురించి చెప్పకు" ఆపకుండా చెప్పుకుంటూ పోతున్నాడు రఘు.

"ప్లీజ్, స్టాప్ టాకింగ్ రఘు. నేను ఇంక వినలేను. నాకు మీ అమ్మ రికమండేషన్ అవసరం లేదు" అక్కడి నుంచి వెళ్ళిపోయింది స్వాతి.

"సర్దుకుపోవటానికి కూడా ఒక హద్దు ఉంటుంది. నన్ను నేను పూర్తిగా కోల్పోలేను. అలా కోల్పోతే, నన్ను నేను ఎప్పటికి క్షమించుకోలేను. బంధం విరగకూడదని లాగాను ఇంతకాలం. తెగేదాకా సాగదీసావు నువ్వు. ఇప్పుడు అతకటానికి ఏమీ మిగలలేదు. ఒడ్డుకు చేరతాననుకున్నాను, దిగుడు బావిలో ఈదుతున్నానని ఇప్పుడే అర్థమయ్యింది."

అత్తగారికి తను గర్భవతినని చెప్పి, పుట్టింటికి వెళ్ళిపోయింది స్వాతి.

నెలరోజుల్లో రఘు దగ్గర నుంచి విడాకుల పేపర్లు వచ్చాయి. "విశేషం ఏమీలేదా?" అత్తగారి మాటలు చెవిలో మారు మోగుతుండగా సంతకం పెట్టింది.

పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిదండ్రులు కొండంత అండగా నిలిచారు. బిడ్డ బోసి నవ్వుల్లో సంతోషాన్ని వెతుక్కుంది. వైభవ్ అని నామకరణం చేసుకుంది. ఉద్యోగం మారింది.

చూస్తుండగానే వైభవ్‌కు మూడేళ్ళు నిండిపోయాయి. స్కూల్ అప్లికేషన్ పూర్తి చేస్తూ, ఆలోచనలో పడింది. వైభవ్ ఇంటి పేరు రాయాలి. ఏనాడు తన బిడ్డను కనీసం చూడని సో కాల్డ్ తండ్రి ఇంటి పేరు ఎందుకు రాయాలి? ఒక్కొక్క అక్షరం రాయాలంటే మనసు ముక్కలవుతుంది. రోజూ బాబు పుస్తకాలపై ఆ పేరు చూస్తే, తనకు గతం గుర్తుకు రాకుండా ఉంటుందా! తనను తాను ఎందుకు శిక్షించుకోవాలి?

స్వాతి తనకు తండ్రి పరంగా వచ్చిన ఇంటిపేరునే రాసి అప్లికేషను పూర్తి చేసింది. మరొక్కసారి వైభవ్‌ను తృప్తిగా చూసుకుని, తను రాస్తున్న కథను కొనసాగించింది.

●●●

# నమ్మకం పేరు

సుధీర్ వంకధార

**అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**"ఎనీథింగ్ రాంగ్ సర్!"**

"నాట్ ఎనీథింగ్, బట్ ఎవ్రిథింగ్ రాంగ్" అన్నాడు బాస్ కోపంగా ఫైల్‌ని ముందుకు తోస్తూ. బాస్ మొహంలో అసహనం స్పష్టంగా తెలుస్తోంది. ఫైల్‌ని ముఖాన విసిరేయనందుకు సంతోషించమన్నట్టు ఉంది అతని చూపు.

"ఏమిటండి ఇది?" ఒక్క నిమిషం తర్వాత అన్నాడు బాస్. "ఇంత అనుభవం ఉన్న మీరే ఇలా చేస్తే?"

"సారీ సర్. ఏదో పరధ్యానంలో" మాట పూర్తిచేసేందుకు ధైర్యం చాల్లేదు.

తేరుకునే అవకాశం ఇవ్వకుండా బాస్ అన్నాడు. "చూడండి, పరాంకుశంగారు ట్రాన్స్‌ఫర్ అయ్యాక ఆ పోస్ట్ ఖాళీ అవుతుంది. ఆ పోస్ట్ అర్హత ఉన్న మీలాంటి వారు చాలా తక్కువ. ఇప్పుడు మీరు ఇలాంటి తప్పిదాలు చేస్తే." అతను వాక్యం పూర్తిచెయ్యలేదు, చేయాల్సిన అవసరం లేదు, తనకి అర్థమయ్యింది, తనకు అర్థమవుతుందని అతనికి తెలుసు. వెళ్ళమన్నట్టు సైగ చేసాడు.

ఫైల్ తీసుకుని బయటికి వెళ్తున్నాడు. అయిపోయింది. అంతా స్పష్టంగా తెలుస్తోంది. ఈ ప్రమోషన్ తనకి రానట్టే. బాస్ ఛాంబర్ తలుపు తీసుకుని, బయటకి అడుగుపెట్టాడు. కానీ అతను అడుగు వేసింది ఆఫీసులోకి కాదు, అంధకారంలోకి కాలు మోపిన చోట నేల లేదు, తను అగాధంలోకి జారిపోతున్నాడు. చుట్టూ చీకటి, ఎక్కడికో ఎంతో లోతుకి అలా వెళ్ళిపోతున్నాడు.

చప్పున మెలుకువ వచ్చింది విశాల్‌కి.

"ఛ, కలా! ఎంత భయమేసింది" అనుకున్నాడు.

పక్కన భార్య ఇవేమీ పట్టనట్టు కునుకు తీస్తోంది. తన ఉలికిపాటుకి కొద్దిగా కదిలింది, అటు తిరిగి సర్దుకుని పడుకుంది.

మంచానికి నాలుగడుగుల దూరంలో చిన్న టేబుల్ మీద టైం పీస్, దాదాపు అయిదు గంటలు అయినట్టుగా చూపిస్తోంది.

రోజు ఆరింటికి అలారం మోగుతుంది. పక్కనే ఉంటే వెంటనే ఆఫ్ చేస్తామని, నాలుగడుగుల దూరంలో ఉంచుతుంది తను. కానీ ఈ మధ్య మోగాల్సిన అవసరం లేదు దానికి, రోజూ ఇలాగే పీడ కలలతో ముందే లేచి కూర్చోవటం అలవాటయింది.

ఎందుకిలా జరుగుతోంది. ఆలోచించసాగాడు. రోజూ ఆఫీసుకి సంబంధించిన కలే. ఇదంతా ఆ నినాద్ గాడి వల్లే. ఈ రోజు వచ్చిన కల నిజంగా త్వరలో జరగబోయేదే కొత్త బాస్ వచ్చి కొన్ని నెలలే అయ్యింది. వచ్చీ రాగానే ఆ నినాద్ గాడు పూర్తిగా పటాయించేసాడు. తనకు రాబోయే ప్రమోషన్ తన్నుకు పోతున్నాడు, అయిదేళ్ళుగా ఎదురుచూస్తున్న అవకాశం, దానికోసం చాలా కష్టపడ్డాడు.

మధ్యలో బాస్ మారటం వల్ల వచ్చింది ఈ సమస్యంతా.

●●●

స్నానం చేసి డ్రెస్అప్ అయ్యి డైనింగ్ టేబుల్ దగ్గరకి వెళ్ళాడు. పిల్లలిద్దరూ అప్పటికే తినటం ముగించి స్కూల్ బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. ఆరేళ్ళ వినీల చేతులు గుండ్రంగా తిప్పుతూ ఏదో పాడుతోంది. తొమ్మిదేళ్ళ విక్రం ఏదో క్రాస్ వర్డ్ చేస్తున్నాడు, కిటికీ దగ్గర కూర్చుని బస్ గురించి చూస్తూ.

"నాన్నా! సమస్య తొలిగిపోతుందన్న నమ్మకం. నాలుగు అక్షరాల్లో" అడిగాడు విక్రం.

"తెలీదు!" ఒక్క ముక్కలో చెప్పాడు. ఆలోచించవలసినంత పెద్ద సంగతిలా అనిపించలేదు. అందుకే దాన్ని పట్టించుకోలేదు. స్నానం చేసిన మనస్సు ఫ్రెష్ అవ్వలేదని తెలుస్తూనే ఉంది.

●●●

డెస్క్ ఫోన్ మోగింది.

"ఒకసారి ఛేంబర్ లోకి రండి" బాస్ పిలుపు. వెళ్ళాడు.

"ఇది చాలా ఇంపార్టెంట్ టాస్క్, పరాంకుశం గారు చెయ్యాల్సింది. అతను కొంచెం బిజీ ఇవ్వాళ, అందుకే మీకిస్తున్నాను. సాయంత్రానికి నాకు అప్‌డేట్ ఇవ్వండి."

బాస్ ఛాంబర్ నుంచి బయటకు వస్తుంటే స్పష్టంగా అర్ధమవుతోంది. ఇదంతా ఆ నినాద్‌ని ప్రమోట్ చేయడానికి బాస్ ఆడుతున్న డ్రామా, తనికిచ్చిన పని తను చెయ్యలేడు. ఆ సాకు చూపించి తనను పక్కకు నెట్టేస్తారు.

చాలా నిస్సత్తువుగా అనిపించింది విశాల్‌కి. ఎవరినయినా సలహా అడుగుదామంటే ఎవరిని అడగాలో తెలీటంలేదు.

"ఏంటి సారూ దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" కళ్యాణ్ గాడి పలకరింపు. తనే కంటిన్యూ చేసాడు.

"ఎంతయినా నువ్వు లక్కీ గురూ! మన బాస్‌కి నీ మీద గురి కుదిరినట్టుంది. కొత్త పనులేవో చెపుతున్నట్టున్నాడు"

విశాల్‌కు అది వెటకారంగా అనిపించింది. కళ్యాణ్ వైపు చూశాడు, కానీ అతని మొహంలో వెటకారమేమీ కనిపించలేదు.

"అన్నట్టు మన అనిరుధ్‌కి కొత్త పోస్ట్ ఇచ్చారట. లక్కీ ఫెలో, మళ్ళీ ప్రొమోషన్ కొట్టేశాడు" చెప్పాడు కళ్యాణ్.

"అవునా ఇప్పుడే కాల్ చేస్తాను," అని ఫోన్ తీసుకున్నాడు. వాడికి కంగ్రాట్స్ చెప్పడానికి కాదు కానీ, తన సమస్యకు ఏదైనా దారి చూపిస్తాడేమోనని చిన్న ఉత్సాహం.

"కంగ్రాట్స్ రా! ఇప్పుడే న్యూస్ తెలిసింది."

''థాంక్స్ రా'' చాలా ముక్తసరిగా అన్నాడు అనిరుధ్. అతని గొంతులో ఎక్సైట్‌మెంట్ అస్సలు కనిపించటంలేదు. మునపటి ఉత్సాహం కూడా కనిపించటంలేదు.

''ఏమైంది అలా ఉన్నావ్? అంతా హ్యాపీయే కదా'' అడిగాడు విశాల్.

''ఏం చెప్పమంటావ్ గురూ, ఇంట్లో పరిస్థితులేం బాలేవు. మా ఆవిడకు టీవీ తప్ప ఇంకేవీ పట్టవు. మా వాడేమో పదేళ్ళైనా నిండకుండానే చెడు అలవాట్లకు మరిగాడు.''

విషాల్‌కు ఎక్కువ మాట్లాడాలనిపించలేదు, తన సమస్య అస్సలు చెప్పాలనిపించలేదు. ఏదో పిచ్చాపాటి మాట్లాడి పెట్టేసాడు.

●●●

సాయంత్రం అయిదింటికి బాస్ చాంబర్ నుంచి వస్తుంటే, తన టేబుల్ తుడుస్తూ కనబడ్డాడు ప్యూన్ శివం.

''ఏంటి?'' కొంచెం విసుగ్గా అడిగాడు.

''పొరపాటున టేబుల్ మీద నీళ్ళు పడ్డాయి సార్, కాగితాలేవీ తడవలేదండి.''

శివం చాలా కంగారులో ఉన్నాడు, అతను భయపడుతున్నట్టు తెలుస్తోంది. ఎందుకు వీడికింత కంగారు, ఇదేదో పెద్ద సమస్య అయినట్టు అనుకున్నాడు.

''ఫరవాలేదులే, అక్కడంత ముఖ్యమైనవేం లేవు'' అన్నాడు, తన బ్యాగ్ తీసుకుని బయల్దేరుతూ ''.బయట వాన సార్, గొడుగు తెస్తానుండండి.''.

కారు డోర్ మూస్తూ ''థాంక్స్'' అన్నాడు విశాల్. శివం నవ్వుతున్నాడు, ఆ నవ్వులో ఆనందం. ఆ ముఖంలో దాన్ని మించిన ఏదో ఫీలింగ్, తనకి అర్థం కావట్లేదది.

●●●

''ఈవేళ్టినుంచి మీకు ఆయిల్ ఫుడ్ కట్'' ఉప్మా అందిస్తూ చెప్పింది విశాల్ భార్య. తలెత్తి చూసాడు, ఆమె నవ్వుతూ చెపుతోంది.

''మీ రిపోర్ట్స్ వచ్చాయి, డాక్టర్ గారితో మాట్లాడాను''

ఆ తరువాత ఆమె చెప్పింది అతను వినలేదు. ఉదయం అనిరుధ్‌తో సంభాషణ గుర్తుకొస్తోంది. వాడికి ఎన్ని ప్రమోషన్లు వచ్చినా ఇంట్లో సుఖం లేదు. వాడి కొడుకు గురించి చెప్పిన సంగతి గుర్తొచ్చి ''విక్రం ఎక్కడా?'' అని అడిగాడు.

''పాపకు సుడోకు నేర్పిస్తున్నాడు''

విశాల్ మొహం విప్పారింది. సాయంత్రం శివం కళ్ళలో చూసిన ఫీలింగ్‌కి అర్థం తెలిసినట్టయ్యింది.

ఉదయాన్నే కొడుకు అడిగిన ప్రశ్న గుర్తొచ్చింది - ''సమస్య తొలిగిపోతుందన్న నమ్మకం?'' దానికి సమాధానం తట్టలేదు కానీ అతనికి ఆ రోజు అదేంటో అనుభవ పూర్వకంగా తెలిసింది.

ఆ రాత్రి అతను ప్రశాంతంగా నిద్రపోయాడు.

అప్పట్నుంచీ అలారానికి మాత్రం ప్రతిరోజూ మోగాల్సిన పని పడింది.

●●●

# నిర్మాతలు

ఎ.పుష్పాంజలి

అపూర్వచిత్ర ( సినీ నిర్మాణ సంస్థ ) సహకారంతో కౌముది - రచన నిర్వహించిన కథల పోటీలో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**నేనూ, ప్రసాదూ చెరువు కట్టెక్కక ముందే** నీళ్ళ చప్పుడు లయబద్ధంగా వినిపించి ప్రాణానికి హాయినిచ్చింది. బాతులు క్వాక్ క్వాక్ మంటూ వయ్యారాలు వలకబోస్తూ కట్టమీద వెళ్తున్నాయి. సంధ్యారుణిమను పులుముకున్న సాయంకాలం సుందరంగా ఉంది.

కట్టమీద మొగలి పొదలు దాటి చివరి వరకూ వెళ్ళి వెనక్కి తిరిగి వచ్చాం. వరిపొలాలూ, కట్టా కలిసే చోట, మధ్యలో ఎల్లమంద గుడిసె ఉంది. వెళ్ళేటప్పుడు అక్కడెవరూ లేరు. కానీ ఇప్పుడు నలుగురు మనుషులతో, అంతా రచ్చరచ్చగా ఉంది.

అక్కడ ఆగి "ఏంది ఎల్లమందా సంగతీ?" అన్నాను.

"ఏవుందయ్యా! పబ్బులికి పెల్లయ్యే తలికి దానికి పదారే, పెల్లయ్యేటప్పటికి సమత్సరం అయింది. దానికి పిల్లల్లేరనీ, ఇక పుట్టరనీ, ఆ సెంచిగోడూ, ఆడిపెల్లాం రచ్చ కొచ్చిను. తిరుపాలు గోడికి మారు మనువు సేత్తారంట" అన్నాడు ఎల్లమంద విచారంగా.

అతని భార్య అంకమ్మ బిక్క ముఖమేసుకుని చూస్తోంది. అంత దూరంలో నిలుచున్న చెంచయ్యా అతని పెళ్ళాం, ఇంకెవరో ఇద్దరు ముగ్గురు మనుషులు గుర్రుగా చూస్తున్నారు.

వాళ్ళవంక చూస్తూ "పెళ్ళాం బతికుండగానే రెండో పెళ్ళికి దిగితే చేసుకున్నోణ్ణీ, చేసినోళ్ళనూ, బొక్కలోకి తోస్తారు తెలుసా?" వాళ్ళకర్థమయ్యే భాషలో అన్నాను.

వాళ్ళంతా అమాయకుల్లా చూస్తున్నా వాళ్ళలో ఒక గడుసువాడు పళ్ళికిలిస్తూ "మాయాందోల్ల కట్టుబాట్లు తమరు రెడ్డోళ్ళు. అయ్యన్నీ తమకు తెలవదు" అన్నాడు.

"ఈ దేశంలో అన్ని కులాల వాళ్ళకీ ఒకే చట్టం ఒకే న్యాయం. ఒకే పోలీసు స్టేషనూ, ఒకే కోర్టు. మీకూ మాకూ నేరుగా ఏమీ లేవు. పైగా ఇప్పుడు కట్నాలు తీసుకున్నా, ఆడవాళ్ళను హింసపెట్టినా దానికి వేరే కోర్టులున్నాయి ప్రత్యేకంగా. తెలిసి మసలుకోండి" బెదిరింపుగా అన్నాను.

నేనలా చెప్పడంతో కొందరు జారుకున్నారు. ఎల్లమందా అంకమ్మల కళ్ళు సంతోషంతో మెరిశాయి.

"రేపు నేను, నీ అల్లుడు తిరుపాలుని పిలిచి మాట్లాడతలే ఎల్లమందా! దిగులు పడబాకు" అని ధైర్యం చెప్పి పొలాల్లోకి దారి తీశాను. పొలాలు దాటితే మా ఊరు తురిమెర్ల.

అంతవరకూ మాట్లాడకుండా మౌనంగా ప్రేక్షక పాత్ర పోషించిన ప్రసాదు "హరీ! కొత్త కథకి ఏం ప్లాటు తీసుకుందామా అని ఆలోచిస్తున్నాను. ఇప్పుడు ఎల్లమంద కథే నాకు ప్లాటు" అన్నాడు ఉత్సాహంగా.

అతని మాటలు నాకు కాస్త బాధ కలిగించాయి. మేం ఈ తురిమెర్ల గ్రామంలో హైస్కూలు ఉపాధ్యాయులం. అంతేకాదు. రచయితలం కూడా. అంటే నూటికి నూరు పాళ్ళు నిజాయితీగా ఉంటూ భావిభారత పౌరుల నైతిక పటిష్టతకూ వ్యక్తిత్వ వికాసనికీ నిర్మాతలుగా వ్యవహరించవలసిన వాళ్ళం. స్థంభాలు బలహీనపడితే మొత్తం వ్యవస్థ సమూలాగ్రంగా కూలిపోవలసిందే!

"హరీ! నువ్వంతగా జోక్యం కలిగించుకోకు. ఈ కథ సహజంగా ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూద్దాం. ఆ సహజమైన మలుపులే కథకి తుష్టీ పుష్టీ" అని అతను అంటుండడం నా విచారాన్ని అధికం చేసింది.

నేను కథకోసం ఆలోచించడం లేదు. ఊళ్ళో రైతుకుటుంబాలకి తల్లో నాలుకలా ఉండే ఎల్లమందకూ, అంకమ్మకూ, మా కళ్ళముందే పెరిగి పెద్దదైన సుబ్బులకీ వచ్చిన కష్టాన్ని గురించి ఆలోచిస్తున్నాను. ముఖ్యంగా మా కుటుంబంలో ప్రతి పండుగకు - అతిధులూ, సేవకులూ వాళ్ళే. మా అమ్మ హయాం నుంచీ సంక్రాంతికి పిండి దంచడం, పెసలు సున్నిపిండి విసరడం, ఉల్లాం చల్లి చేపలు పట్టినప్పుడు, వాటిని తెచ్చి శుభ్రం చేయడం మేమంతా గనేల రంధ్రాల్లో పీతలు పట్టినప్పుడు, వాటిల్లోంచి జలగలు తీసేసి, రోట్లో దంచండంలాంటి పనులన్నీ వాళ్ళే చేసేవారు. ఆ పరంపర ఇప్పుడు నా భార్య సరళ కొనసాగిస్తూ ఉంది.

తను రాయబోయే కథగురించి ప్రసాద్ ఏదేదో చెబుతూ ఉన్నా నేనదేం వినడంలేదు.

వరిపొలాల్లో నడిచేప్పుడు, వరిపంట వివిధ దశల్లో వేరు వేరు వాసనలొస్తుంటాయ్. నీరేతలప్పుడు బురదా ఎరువు కలిసిన వాసనా, పంటకోసి పనలు ఎండేటప్పుడు ఈవాళలా ఎండతో కలసిన ఒగ రెండ వాసనా, ఇవ్వన్నీ పల్లెతో తమ బాల్యాన్ని మమేకం చేసిన నాలాంటి వాళ్ళ ప్రాణాలకి హాయినిస్తాయి.

ప్రసాద్ నా బాల్యమిత్రుడైనా, మొదట్నించీ ఇంతే వాడి జీవితం మూఢ నమ్మకాలకూ, దురాచారాలకూ, కుహనా విలువలకూ ఎంత మాత్రం దూరంగా లేదు. ఉపాధ్యాయులూ, రచయితల బతుకులే ఇలా ఉంటే, ఈ వ్యవస్థకు పునర్నిర్మాత లెవరు?

ఈ తురిమెర్ల నెల్లూరు జిల్లాలో ఉన్న ఒక వ్యవసాయ గ్రామం. మా తల్లితండ్రుల కాలంలో ఇక్కడ 'నాగరికతా' చిహ్నాలు లేవు. మేం సైకిళ్ళ మీదో, ఎద్దు బండ్లమీదో, ఏదీ లేకుంటే కాలినడకనో, నడిచి దాదాపు ఆరుమైళ్ళున్న బుచ్చిరెడ్డి పాలానికి వెళ్ళి హైస్కూలు చదువులు చదివాం. తర్వాత నెల్లూరులో డిగ్రీలు, బి.ఎడ్లూ చదువులు చదివాం. తర్వాత నెల్లూరులో డిగ్రీలు, బి.ఎడ్ లు పూర్తిచేసి టీచర్లమైనాం.

ఆ తర్వాత బుచ్చికి దగ్గర్లోనే ఉన్న పెన్నానదీ తీరప్రాంతమైన 'సంగం'లో నేను పనిచేస్తున్నప్పుడు, నా సహ ఉపాధ్యాయనీ 'సరళ' నన్నాకర్షించింది. ఆమె ప్రవర్తనా, ఆ పొందికతనం, నాకు చాలా నచ్చాయి. సరళను పెళ్ళి చేసుకోవాలనుకున్న నేను విషయం ఇంట్లో చెప్పినప్పుడు పెద్ద దుమారం చెలరేగింది. సరళ క్రిస్టియన్ కావడమే ఇందుకు కారణం. నన్ను 'దారి'లో పెట్టమని ప్రసాదుని పంపారు మా వాళ్ళు. ఆ వాళ అతనన్న మాటలు నాకింకా గుర్తిన్నాయ్.

"ఒరే హరీ! ఇలాంటివి కథల్లో రాయడానికీ, వినడానికీ చదవడానికి రంజుగా ఉంటాయే. కాని నిజ జీవితానికి మాత్రం పనికిరావు. నిన్ను సంఘం వెలివేసి నీచంగా చూస్తుంది" అని హితబోధ చేశాడు.

"నాకు చెప్పావు సరే. ఒక రచయితగా నువ్వు సమాజానికిచ్చే సందేశం?" అన్నాను.

"నేను ముందు మనిషిని. సంఘజీవిని. సాంఘిక కట్టుబట్లకు బద్ధుడనై జీవించక పోతే రేపు నాకు పుట్ట బోయే పిల్లలకు ఇక్కడ స్థానం ఉండదు." అంటూ చాలా బలహీనమైన కారణం బలంగా చూపించాడు.

స్నేహితులే పెద్దలుగా నా పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళికి ప్రసాదు రాలేదు. ఒక సంవత్సరం పాటూ మాకు దూరంగా ఉన్న మా పెద్దవాళ్ళు, అలా ఎంతో కాలం ఉండలేక, మళ్ళీ మాకు దగ్గరైనారు. మంచితనం మనిషిలో ఉంటుంది గాని, మతంలో కాదని మావాళ్ళు గుర్తించారు. ఈవాళ సరళంటే మా అమ్మా నాన్నలకి ప్రాణం. సరళ తల్లిదండ్రులు కూడా నన్ను సొంత కొడుకులాగే ప్రేమిస్తారు అంతకన్నా ఇంకేం కావాలి?

ఆ తర్వాత రెండేళ్ళ కనుకుంటాను, బోలెడు కట్నంతీసుకుని ప్రసాదు ఇందుమతిని పెళ్ళి చేసుకున్నాడు. నాకిద్దరు పిల్లలు. పెద్దవాడు గ్రూప్స్ రాసి సెక్రటేరియట్లో ఉద్యోగం చేస్తున్నాడు. వాడికన్నా చిన్నది అమ్మాయి బి.యస్సీ నర్సింగ్ పాసై ఆర్మీ సర్వీస్‌లో ఉంటూ ప్రస్తుతం ఢిల్లీలో ఉంది.

ప్రసాదుకు ఇద్దరూ కొడుకులే. నాకు రెండోసారి కూతురు పుట్టిందని తెలియగానే ప్రసాదు సాధ్యమైనంత విచారంగా ముఖం పెట్టి "అయ్యో పాపం" అంటూ సానుభూతి ప్రకటించాడు అనవసరంగా. కూతుళ్ళు లేకపోవడం తన అదృష్టానికి చిహ్నమన్నట్టు మాట్లాడేవాడు ఎప్పుడు.

నెల్లూరు జిల్లాలో వివిధ ప్రదేశాల్లో ఉపాధ్యాయులుగా పనిచేసిన మేము, పదవీ విరమణ సమయానికి తురిమెర్ల చేరాం. ఇప్పుడు చాలా పల్లెల్లో ఆ పల్లెతనం మాయమైంది. ప్రతి ఊళ్ళో టీవీ టవర్లూ, సెల్ టవర్లూ, డిపార్ట్ మెంటల్ స్టోర్లూ, కనీసం రెండు మూడు ప్రైవేటు ఆస్పత్రులు హోటళ్ళు ఒకటీ రెండు బ్యూటీ పార్లర్లూ, తప్పని సరిగా ఉండాల్సిందే ప్రజలంతా ఇబ్బడి ముబ్బడిగా ఇంగ్లీషు పదాలు దొర్లిస్తున్నారు. మోతుబరి రైతులంతా రచ్చబండలమీద ప్రపంచ రాజకీయాలు మాట్లాడుతుంటారు. ప్రతి ఒక్కరి చేతిలో సెల్ ఫోను ఉండాల్సిందే చాలా వరకూ రైతు తత్వం, మానవత్వం రెండూ ఊరు మొగసాల్లోకి పారిపోయాయి.

అయినా నాకు నా పల్లే ఇష్టం.

ప్రసాదు జీవితం మరో విధంగా సాగింది. అతనెక్కడున్నా, పిల్లల చదువులకంటూ కుటుంబాన్ని నెల్లూర్లో బాడుగింట్లో ఉంచేవాడు. సరళ ఉద్యోగ రీత్య అప్పుడప్పుడూ నాకు దూరంగా ఉన్నా, పిల్లల్ని తన దగ్గిరే ఉంచుకుని క్రమశిక్షణతో పెంచింది.

మనవాళ్ళు ఫార్ములా ప్రకారం ఇద్దరు పిల్లల్ని కని, వాళ్ళ వీపు మీదా ఒకడికి ఇంజనీరు ముద్ర మరొకడికి డాక్టరు ముద్ర గుద్దడానికి సిద్ధంగా ఉంటారు. ప్రసాద్ కూడా అదే చేశాడు. వాళ్ళని డొనేషన్లు కట్టి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేర్పించాడు. దానికోసం రెండిళ్ళలో ఒక ఇల్లూ పొలంలో ముప్పావు వంతూ, పరహస్తం గతమై చుట్టూ అప్పులు మిగిలాయి నెల్లూర్లో కుటుంబాన్ని నడపడం కష్టమైంది. ఇందుమతి తురిమెర్ల అత్తింటి కాపురానికి తిరిగొచ్చిది అది ఆమెకు సుతారమూ కిట్టని పని.

స్కూలు ఎగ్గొట్టి ప్రసాద్ చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారం అతనికేమీ మిగల్చలేదు. ఒకసారి, ఊరివాళ్ళ రిపోర్టుల ఆధారంగా ఎంక్వయిరీ జరిపి అతన్ని సస్పెండ్ కూడా చేశారు. ప్రస్తుతం అది మానేసి ఈ ఊళ్ళో చిట్స్ నడుపుతున్నాడు.

ప్రసాద్‌కు ఎన్ని అప్పులున్నా, ఎన్ని సమస్యల మధ్య మూలుగుతున్నా తన రచనా వ్యాసంగాన్ని మాత్రం కొనసాగించేవాడు. అతను తన కథల్లో ఆదర్శవంతమైన పాత్రల్ని సృష్టించేవాడు. వాటికి వర్ణ బేధాలుండవు. కులమత తేడాలుండవు. యువకులు కట్నకానుకలాసించరు. పల్లె ప్రజలు శుద్ధమాండలీకాన్ని వాడుతుంటారు. నూటికి తొంభై శాతం పల్లెల్లో ఇప్పుడు శుద్ధ మండలీకం లేదు. ప్రసాద్ ఆకుపచ్చని కాన్వాస్‌పై అందమైన పల్లెజీవితం ఆకర్షణీయంగా చిత్రించేవాడు. ఐతే నాగరికత పల్లెముఖం మీదా, మనసుమీదా పూసిన నల్లదనం అతను చూపించే వాడు కాదు. వరి చేలు మాయమై వాటి స్థానంలో నెలకొన్న చేపల చెరువులను కూడా అతను చూపించలేకపోయేవాడు. అయినా వింతగా అతని కథలకి పురస్కారాలూ, బహుమతులు వస్తుండేవి. ఏది ఏమైనా నా కొక్కటే విచారం. మగపిల్లల తల్లిదండ్రుల్లో నైచ్యం ఆడపిల్లలను కన్నవారిలో దైన్యం, మటుకు అలానే ఉన్నాయి. సాంఘిక దురాచారాలను మట్టుబెట్టడానికి ఈ ప్రబోధకులు మందు పూనుకోవాలి. మళ్ళీ, బోధించాలి.

ఆవాళ పంచాయితీ ఆఫీసులో స్వీపరుగా పనిచేస్తున్న ఎల్లమంద అల్లుడు తిరుపాలుని పిలిపించాను. రెండో పెళ్ళి చేసుకోడం చట్ట రీత్యా నేరమనీ, సుబ్బులు రిపోర్టు చేస్తే దాని పర్యవసానాలేమిటనీ అతనికి తెలియచెప్పాను. పదహారేళ్ళ నుంచే పిల్లల్ని కనాల్సిన అవసరం లేదనీ చెప్పాను. ఇంకా, విపరీతంగా పెరుగుతున్న జనాభా మానవ మనుగడను ఎలా అస్తవ్యస్తం చేసిందో వివరించాను.

నేను చెప్పిందంతా విన్న తిరుపాలు బుర్రగోక్కున్నాడు. "తమరు సెప్పేటిదంతా నిజమే నయ్యా. మా ముసల్ది తగన్ది. దాని కెప్పుడూ డబ్బు గొడవే. సుబ్బులు మంచి పిల్లే దానికి అన్నాయం సెయ్యనే అంటూ ఉంటే, దానమ్మా బడవా, ఇంటదంటయ్యా" అన్నాడు.

అతన్తో మాట్లాడిన తర్వాత తేలిన విషయం, అతడికైతే ఈ రెండో పెళ్ళి ఇష్టం లేదు. అయితే తిరుపాలుకి ఒక అక్క ఉంది. ఆమె భర్త స్వీపరుగా ప్రభుత్వోద్యోగం చేస్తూ చనిపోయాడు. కూతురు ఈడేరింది. అందుకని ఆ పిల్లని మేనమామ వరసైన తిరుపాలుకి కట్టబెడితే. ఉత్తరోత్రా తమకు అండగా ఉంటాడని అనుకుంటోంది. తన భర్త మరణం ద్వారా వచ్చిన డబ్బుల్తో తిరుపాలుకి టి.వి.యస్, టీ.వీ, వాచీ ఉంగరం, ఇవ్వజూపుతున్నది ఆ అక్క.

అతన్తో ఇంకా మాట్లాడుతుండేటప్పుడే సాయంకాలపు నడక కోసం ప్రసాదు వచ్చాడు. మా ఇద్దర్నీ మార్చి మార్చి చూసి "ఏమైంది? తిరుపాలు రెండో పెళ్ళి చేసుకుంటాడటా?" అన్నాడు ఆత్రంగా.

"ఊహూ" అన్నాను నేను.

అతని ముఖంలో ఆశాభంగం కనిపించింది. "ఇప్పుడు నా కథలో మూడో సీను ఈ పెళ్ళిమీదే ఆధారపడి ఉంది హరీ." అన్నాడు.

"వెనకటి కెవరో నీలాంటి మూర్ఖుడు 'రెండో ప్రపంచ యుద్ధం సినిమాగా తీస్తాను, అందరు సైనికులకు డబ్బులివ్వడం కష్టం గనక యుద్ధంలో నిజమైన తుపాకులే ఉపయోగిస్తాను' అన్నాడట. నీ కథ కోసం తిరుపాలు రెండో పెళ్ళి చేసుకుని, అమాయకురాలైన ఆ సుబ్బులి జీవితాన్ని బలి తీసుకోమంటావా?" అన్నాను ఆవేశంగా.

"వాళ్ళల్లో ఇల్లాంటివన్నీ సహజమే హరీ, మధ్యలో నువ్వు ఆవేశపడతావెందుకు?" అన్నాడు తేలికగా.

"నువ్వూ నేనూ దాన్ని మార్చడానికేగా ఉన్నాం. గవర్నమెంట్ ఇచ్చే జీతంతో పొట్టలు పెంచి కూచోడానిక్కాదు" అన్నాను.

"ఆదర్శాలు వల్లించడానికీ, వినడానికి మాత్రమే బాగుంటాయని ఎప్పుడు తెలుసుకుంటావు?"నా వైపు జాలిగా చూస్తూ అన్నాడు వాడు.

కొంత అర్థమెయ్యీ కొంతకాక. మా సంభాషణ వింటూ తికమక పడ్డాడు తిరుపాలు.

సరళ లోపల్నుంచి వచ్చి" ఏంటి స్నేహితులిద్దరూ ఆవేశంగా మాట్లాడుకుంటున్నారు?" అంది.

"అది మాకు మామూలేగా చెల్లమ్మా?" నా వైపు జాలిగా చూస్తూ అన్నాడు వాడు.

"అది మాకు మామూలేగా చెల్లమ్మా" అన్నాడు ప్రసాద్.

మారనందుకు నాకు చాలా విచారంగా ఉంది ప్రసాద్ అన్నాను.

"నాక్కూడా" అన్నాడు వాడు.

ఇద్దరం లేచి వాకింగ్ కు బయల్దేరాం.

"ఒరే హరీ. నా పెద్దకొడుక్కి మంచి సంబంధం వచ్చింది. ఇది గనక స్థిరమైతే నా అప్పులన్నీ తీరిపోతాయి. కోటికి పైగానే తూగుతుంది పెళ్ళికూతురు" అన్నాడు ప్రసాద్.

నాకేమీ అనాలనిపించలేదు. నేను ముభావంగా ఉండడం గమనించిన ప్రసాద్. "హరీ. నువ్వు కట్టెక్కి వచ్చెయ్యి. ఒక ముఖ్యమైన పని ఇప్పుడే గుర్తొచ్చింది" అంటూ వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

నా మనసు వికలమైంది. జాలిలేని ఈ ప్రసాదు, దయార్ద్ర హృదయం కలిగి మానవతకూ, కరుణకూ ఆలవాలమైన పాత్రలనెన్నింటినో సృష్టించాడు. బహుమతులూ పొందాడు.

తన కొడుకులు 'సంపాదించ'బోయే కట్నంతో తన అప్పులన్నీ తీరుతాయనీ, నెల్లూర్లో పెద్ద బంగళాలాంటి ఇల్లు కడతాననీ, కారూ గట్రా కొనుక్కుని దర్జాగా ఉండాలనీ, బోలెడాశలున్నాయ్. పైగా ఇది మాట్లాడిన ప్రతిసారీ "పాపం పిల్లకెలాంటి సంబంధం తెస్తావో" నంటూ నామీద సానుభూతి కురిపించడం నాకు భరింప శక్యం కావడం లేదు.

"ఆ విషయాన్ని గురించి నాకెలాంటి చింతా లేదు. పుట్టించినవాడు అన్నింటికీ పరిష్కారాలు ఆలోచించే ఉంటాడు. నువ్వనవసరంగా చింతపడి నీ ఆరోగ్యం పాడు చేసుకోకు" అని ఒకింత కఠినంగానే చెప్పాను.

రచనల్లో నిజాయితీ ఎక్కణ్ణుంచీ వస్తుంది? రచయిత మనసులో నుంచా? ప్రవర్తనలో నుంచా? కలంలోని రంగు సిరానుంచా? ఇది నా కెప్పుడూ ఒక ప్రశ్నే. చాలామంది స్త్రీ రచయితలు కూడా ఈ ప్రసాదుకు భిన్నంగా లేరు.

నా కొడుక్కి కట్నం తీసుకుందామన్న ఆలోచన నాలో ఎప్పుడూ లేదు. లేదా మా అమ్మాయి కట్నం కోసం నేనేమీ మూటగట్టనూ లేదు.

ఒక్కడినే ఇలా ఈ చెరువు గట్టు మీద కూచోడం నాకెంతో ఇష్టం. "ఒంటరితనంలో, నిశ్శబ్దంలో, నీ ఆత్మలోకి తొంగి చూసుకుంటావు" అని ఒక ప్రఖ్యాత తాత్వికుడి వ్యాఖ్య చదివాను ఎక్కడో.

ఈ ప్రపంచపు గొడవలతో సంబంధం లేని ప్రకృతి ప్రశాంతంగా ఉంది. దూరంగా పొలాల్లో మాట్లాడుతున్న రైతుల గొంతులు శూన్యంలో ప్రయాణం చేసొచ్చి, అస్పష్టంగా నా`చెవుల్లో దూరుతున్నాయ్. తూముల దగ్గర చాకలివాళ్ళు అరుస్తూ తుళ్ళుతూ, ఆరిన బట్టలు మూటగడుతున్నారు.

నా మనసు నెమ్మదిగా సేద తీరుతున్నది. నా జీవిత ధ్యేయమంతా సాయంత్రాలిలా ఇక్కడ కూచోడమేననిపిస్తోంది. ఓ ప్రకృతి మాతా నువ్వెంత దయామయివి? నీ బిడ్డలకు రూపమివ్వడమే కాక, నీ ఒడిలో ఎంత బాగా సేదతీరుస్తున్నావు"

నా ఆలోచనను, అంతర్ముఖతనూ భంగం చేస్తూ ఎల్లమంద ఇంటినుంచి ఎవో అరుపులూ కేకలూ వినిపించాయి. గబగబా లేచి అటువేపుకి నడిచాను.

నన్ను చూడగానే కొందరు జారుకున్నారు. కొందరు కాస్త దూరంగా తప్పుకున్నారు. ఎల్లమంద చొక్కా చినిగి ఉంది. అంకమ్మ ముడి ఊడిపోయి జుట్టంతా అస్తవ్యస్తంగా ఉంది. ఆమె ఏడుస్తోంది.

"ఏమైంది" అన్నాను కంగారుగా.

"ఏముందయ్యా! తమరు తిరిపాలు గోడితో ఏందో మాట్లాడి ఉంటే వాడు ఇంటికాడికి బొయ్యి వీరయ్య ఇట్టా సెప్పిండు. నేను హర్గీసు మారుమనువు సేసుకోను అనిండంట. వోడి అబ్బకీ అమ్మకీ చిర్రెత్తుకొచ్చి నలుగుర్ని పోగు సేసి రచ్చ కొచ్చిను. సెయి కూడా సేసుకునిండ్రు" చెప్పాడు ఎల్లమంద.

వెంటనే అంకమ్మ అందుకుని "మా ఇసయం పదమందికీ సెప్పి మా పరువుదీత్తా ఉండారు" అంటూ నా జుట్టు పట్టుకుందయ్యా. రైక చినగ బెరికిండ్రు" అంది వెక్కిళ్ళ మధ్య.

"సరే పదండి పోలీస్ స్టేషన్‌కి రిపోర్ట్ రాయిద్దాం" అన్నాను.

దూరంగా ఉన్న నలుగురూ పరుగెత్తుకొచ్చి నా కళ్ళమీద పడ్డారు.

"చమించండయ్యా. ఈ తప్పు కాయండ్రి. ఏదో సపోర్ట్ రమ్మంటే వచ్చాంగానీ మాకేం తెల్సు ఇదంతా? ఏం అంకమ్మక్కా. నేనేమన్నా మాట్టాడినానా"? అని ఒకరూ, "ఎల్లమంద బావో నాకే పాపం తెల్దు. నిన్ను నేనేమన్నా అన్నాను గట్టిగా. వాళ్ళంతా వెళ్ళిపోయారు. వీళ్ళ గొడవలింతే. చీమ కుట్టినా, ఆ గాయాన్ని చెలిగి చెలిగీ పెద్ద పుండు చేస్తారు. ఇది చిన్నప్పటినుంచీ చూస్తూనే ఉన్నాను.

నేను ఇంటికెళ్ళేసరికి సరళ సంతోషంగా చెప్పింది. "రేపు మీరు స్టేషనుకెళ్ళాలి. ఢిల్లీ నుంచి వచ్చే ట్రైన్లో పాప, హైదరాబాద్ ట్రైన్లో బాబు వస్తున్నారు" అంది.

మనసు సంతోషంతో గంతులేసింది. వాళ్ళు నాకు పిల్లలేకాదు. అభిప్రాయాలు పంచుకునే స్నేహితులు కూడా. నాతోబాటు పొలాల వెంబడీ, చెరువుకట్టకీ, తోటల్లోకి తిరుగుతారు. ఎందుకంటే నాలాగే వాళ్ళూ ఈ పల్లెకు దూరంగా ఎప్పుడూ లేరు గనక.

ప్రసాద్ గబగబా వచ్చాడు. "ఏంటి హరీ? ఎల్లమంద ఇంటి దగ్గర గొడవటా?" అన్నాడు.

"నీకెవరు చెప్పారు?"

"ఎవరో అన్నారులే" అన్నాడు.

కానీ అది అబద్ధం. అతనే దూరం నుంచి చూసి ఉండొచ్చు.

"ఏం లేదులే" అతని కథలో మూడో సీను భగ్నం చేస్తూ అన్నాను.

"రేపు పిల్లలొస్తున్నారన్నయ్యా" అంది సరళ.

"సిటీస్ లో ఉండే వాళ్ళిక్కడేం బావుకుంటారమ్మా? వీలు చూసుకుని మీరే వెళ్ళలేక పోయారా"? అన్నాడు. మళ్ళీ "నేనూ మీకొక శుభవార్త చెప్పడానికొచ్చాను. రేపు పిల్లని చూసుకోడానికి నెల్లూరు వెళ్తున్నాం. రాగలరా మీరు కూడా?" అన్నాడు సరళ వంక చూస్తూ ప్రసాద్.

"ఏమీ అనుకోకండయ్యా! పిల్లలొస్తున్నారు గనక వంటా వగైరా" అంది సరళ.

ఆవాళ ఉదయం బస్సు పట్టుకుందామని బస్టాపులో నిలుచుని ఉండగా, కారొకటొచ్చి నా పక్కనే ఆగింది.

అందులోంచి ప్రసాద్ పెద్ద కొడుకు అరవింద్ దిగాడు. అతను నెల్లూరు బొల్లినేని హాస్పిటల్లో పనిచేస్తున్నాడు.

"అంకుల్ " అంటూ ప్రేమగా కౌగిలించుకున్నాడు. అప్పటి ప్రేమ ఇంకా మర్చిపోని ఆ లేత గుండెలో మిగిలి ఉన్న తడికి నా కళ్ళు చెమర్చాయి.

"ఏం నాన్నా. బాగున్నావా"? వెచ్చగా కౌగలించుకుంటూ అడిగాను.

"అంకుల్ ఏమీ అనుకోకండి. మీ కెవ్వరికీ చెప్పకుండా ఒక పని చేశాను. మంచిపనే లెండి. ఇదిగో ఈ వెనక సీట్లో అమ్మాయి నా భార్య ముంతాజ్. మా హాస్పిటల్లో నర్స్‌గా పనిచేస్తోంది. నిన్ననే మా పెళ్ళి రిజిస్టర్ చేశాం మాతో ఇంటికి రండి దయచేసి" అన్నాడు అరవింద్

ముంతాజ్ కారు దిగి నాకు నమస్కారం చేసింది ఇద్దరూ వంగి నా కాళ్ళు కళ్ళకద్దుకున్నారు.

మనసారా ఆశీర్వదించాను.

అవతల పిల్లల్ని రిసీవ్ చేసుకోవాలని మనసు హెచ్చరిస్తున్నా వాళ్ళ వెంట ఇంటికి వెళ్ళడం చాలా తప్పనిసరి అనిపించింది. కొత్త దంపతుల్ని చూసి ప్రసాదూ, ఇందుమతీ ఎవరో పోయినట్టు బాధ పడసాగారు. ఇందుమతి కింద దొర్లాడుతూ శోకాలు పెట్టింది. ప్రసాద్ స్థంభానికేసి తలబాదుకున్నాడు.

"ఊరుకోరా! అందరూ పోగవుతున్నారు" అన్నాను.

"ఒరే మొదట్నుంచీ నీకు నేనన్నా నా కుటుంబమన్నా ఎంతో కుళ్ళు. ఇప్పుడు సంతోషపడు" అన్నాడు వాడు.

ఆ వెంటనే ఇందుమతి అందుకుని "ఆయనొక కిరస్తానీ దాన్ని కట్టుకున్నాడు. ఇప్పుడు నా కొడుకొక తురకదాన్ని కట్టుకుంటే సంతోషపడుతా ఉన్నాడు" అన్నది.

ముంతాజ్ ముఖం ఎర్రగా కంది నేలలోకి దిగజారిపోయింది. వాళ్ళని శాంతపరచడానికి తన శాయశక్తులా ప్రయత్నించిన అరవింద్ బాగా విసిగిపోయి "ఇంటికెళదాంపదండంతా" అన్నాడు.

ఈ వార్త అప్పుడే ఊరంతా పాకినట్టుంది. ఇల్లు చేరగానే అమ్మ ఎర్రనీళ్ళూ, కర్పూరంతో దిష్టి తీసి కొత్త దంపతులను ఆహ్వానించింది.

లోపల్నుంచి బైటకొచ్చిన పాపా, బాబూ, అరవింద్ తమ్ముడు గోవింద్‌లను చూసి ఆశ్చర్యపోయాను.

"అయితే మీకు ముందే..?"

"తెలుసు నాన్నా. అరవిందన్న ఎప్పుడో చెప్పాడు" అంది పాప.

ఎప్పుడొచ్చారోగానీ అంకమ్మా, సుబ్బులూ బావిదగ్గర చేపలు కడుగుతున్నారు.

నన్ను చూసి సుబ్బులు దగ్గరగా వచ్చి "అయ్యా నాల్రోజులు నన్నూ, తిరుపాలునీ, ఎట్టైనా పంపండయ్యా. ఇక్కడ గొడవలు ఎక్కువగా ఉండాయ్" అంది.

"ఎటూపోవద్దు. బావి పక్క మూల గది ఖాళీగా ఉంది. ఇద్దరూ అక్కడే ఉండండి. మీకే భయంలేదు" అన్నాను.

లోపలికెళ్ళాను.

అందరూ సరదాగా మాట్లాడుకుంటున్నారు. అరవింద్ కూడా అంతా మర్చిపోయినట్టున్నాడు. ముంతాజ్ కూడా బాగా కలిసిపోయింది అందరితో.

'ఏ మహానుభావుడు అంకురార్పణ చేశాడో గానీ నవసమాజ నిర్మాతలు వీళ్ళే' అనుకున్నాను.

సరళ నా దగ్గరగా వచ్చి ఎవరికీ వినబడకుండా "మీ పిల్లలు కూడా మీకోసం ఏవో శుభ వార్తలు తెచ్చారట. తెలుసా?" అంది.

●●●

## కథ చెప్తాను.. వింటావా? — అరిపిరాల సత్యప్రసాద్

**ఎప్పుడూ లేనిది ఆ రోజు** ఎందుకో బారు వైపు అడుగులేశాడు ప్రణవ్. సామాన్యంగా తోడు లేకుండా అతను ఒంటరిగా బారుకు వెళ్ళడం చాలా అరుదు. సరే వెళ్ళడం మాట అలా వుంచండి, అక్కడ అనుకోకుండా అతనికి సుజన్ కలవడమే విచిత్రం. సుజన్‌కి, ప్రణవ్‌కి చాలా కాలంగా స్నేహం వుంది. పైగా ప్రణవ్ రచయితగా పేరు పొందిన తరువాత సుజన్ అతనికి అభిమానిగా కూడా మారిపోయాడు.

"రేయ్ ప్రణవ్.. ఇటురారా" అన్నాడు సుజన్ అతన్ని చూడగానే. ప్రణవ్ ముందు ఆశ్చర్యపోయినా తోడుగా మనిషి దొరికాడన్న సంతోషంతో సుజన్ దగ్గరకు వెళ్ళాడు.

"రా.. రా.. బేరర్... సార్‌కి నాకు విస్కీ తీసుకురా" అంటూ అరిచాడు సుజన్. బేరర్ వరాలిచ్చే దేవుడిలాగా అడిగినవన్నీ అమర్చాడు. బయట చీకటిపడింది. ఇక్కడ బారులో మంది ఎక్కువ లేరు కాబట్టి మందు చిక్కబడింది. మత్తు తలకెక్కబడింది.

"నేను కూడా నీ లాగే కథలు రాద్దామనుకుంటున్నానురా.." సుజన్ అన్నాడు మత్తుగా.

"ఏంట్రోయ్.. నీకు కూడా కథలు రాయాలనిపించింది..?" నవ్వాడు ప్రణవ్ గమ్మత్తుగా.

"చంపేస్తున్నాడురా వాడు..." సుజన్ అన్నాడు.

"ఎవర్రా?" ప్రణవ్ చిరాకు.

"ఇంకెవడు.. మా బాసు బోసుగాడు.."

"బాసులన్న తరువాత అంతమాత్రం ఇబ్బంది పెడతారు మరి. అది వాళ్ళ జన్మ హక్కు" అన్నాడు ప్రణవ్.

"అది కాదురా.. వాడి సాడిజం ఎక్కువైపోయింది. అందుకే వాడి గురించి ఒక కథ రాసిపడేయాలని నిర్ణయించుకున్నా"

"బాగుంది... మంచి కథాంశం. బాగా రాసావంటే ఏదైనా కథల పోటీలో బహుమతి కూడా వస్తుంది.." భరోసా ఇచ్చాడు ప్రణవ్.

"మరి కథ చెప్తాను వింటావా?"

"కథలంటే ఎప్పుడైనా రెడీ! చెప్పు... ఆగాగు.. ఇంకో పెగ్గు చెప్పి మొదలుపెట్టు" అన్నాడు ప్రణవ్. సుజన్ పెగ్గు చెప్పి గ్లాసులో వున్న కాస్త ద్రవం మింగి మొదలుపెట్టాడు.

"ఉదయం ఏడుగంటలైంది... ." ఒక్క క్షణం ఆగాడు.. "అలారం అదే పనిగా మోగుతోంది.."

"ఆపరా.. ఆపు.."

"ఏంటి అలారమా?"

"కాదురా నీ కథ.."

"ఏం? ఎందుకు?"

"ఈ ప్రపంచంలో ఎన్ని కథలు ఇలా అలారం కొట్టడంతో మొదలయ్యాయి? నీ అలారం కొడితే నాకెందుకు, కొట్టకపోతే నాకెందుకు... డైరెక్ట్‌గా కథలోకి రావాలి... వేరే రకంగా మొదలు పెట్టు"

"సరే అయితే విను" అని ఒక్క క్షణం ఆలోచించి చెప్పాడు "వాడు చచ్చిపడున్నాడు..."

"బాగుంది... చాలా బాగుంది.. 'వాడు చచ్చిపడున్నాడు'... కొంచెం మిస్టరీ, సస్పెన్స్‌తో మొదలైంది. ఈ వాక్యం చదివారంటే పాఠకులు ఎవరు చచ్చాడు? ఎందుకు చచ్చాడు? అన్న కుతూహలంతో చదువుతారు. కానీ.. తరవాత చెప్పు.." ఉత్సాహంగా అన్నాడు ప్రణవ్.

"వాడు చచ్చిపడున్నాడు. వాడి శరీరం నిండా గాయాలు. బూటుతో తన్నినవి.. కర్రతో కొట్టినవి.. రాడ్డుతో బాదినవి.. మొత్తం రక్తం కారుతున్నాయి.."

"నో.. నో.. నో... వాయలన్స్ వద్దు మనకి... ఇలా భీభత్స రసం పోషిస్తే ఎవరూ చదవడు... రక్తాలు, హత్యలు వద్దు మనకి.."

"ఓకే... వాడు చచ్చిపడున్నాడు. చాలా ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు వుంది వాడి శవం. వాడు చేసిన తప్పులకి ఇలా చావాల్సిందే అని దేవుడు నిర్ణయించాడు. వాడే నా బాస్"

"వాడు.. వాడు.. ఏంట్రా? వాడికో పేరు లేదా?"

"వుంది.. బోసుబాబు"

"అది మీ బాసు నిజం పేరు.. ఆయనకి తెలిస్తే చంపేస్తాడు. వేరే పేరేదైనా పెట్టుకో.."

"ఏదో ఒకటి - సుబ్బారావో, పరంధామయ్యో.."

"అదిగో అక్కడే దాల్ ఫ్రైలో కాలు వేశావ్. మన తెలుగు సాహిత్య చరిత్ర ప్రకారం పరంధామయ్య అంటే రిటైరైన మాష్టారు. పంచె కట్టుకోని, చేతి కర్రతో, కళ్ళద్దాలతో ఎప్పుడు చూసినా గుండలమీద కుంపటిలా వున్న కూతుర్ని ఎవడో ఒకడి నెత్తిన మంటలా పెట్టాలని కాళ్ళు అరిగేలా తిరుగుతుంటాడు."

"అయితే సుబ్బారావు?"

"సుబ్బారావంటే మధ్యతరగతి సంసారి. జీతానికి జీతానికి మధ్య ముప్పైరోజుల బ్రతుకు ఈడ్చే సామాజికుడు"

"మరైతే ఏ పేరు బాగుంటుంది?"

"ఆఫీసర్ అంటే కొంచెం మోడర్న్‌గా వుండాలి కదా?"

"మరి బోసుబాబు అలా లేడుగా.."

"అది వాస్తవం. కథలు మరీ అంత వాస్తవికంగా వుంటే ఆ కథ అచ్చు కాదు. కొంచెం ఆలోచించు.."

"అయితే రంజిత్ అని పెట్టుకుందాం.."

"ఫర్వాలేదు... బాగానే వుంది. ఇప్పుడు మళ్ళీ మొదట్నుంచి చెప్పు"

"రంజిత్ చచ్చిపడున్నాడు... చాలా ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు వుంది వాడి శవం. వాడు చేసిన తప్పులకి ఇలా చావాల్సిందే అని దేవుడు నిర్ణయించాడు. అసలు ఆ రంజిత్‌గాణ్ణి ముక్కలు ముక్కలుగా నరికి కాకులకి గద్దలకి వెయ్యాలి కానీ భీబత్స రసం అవుతుందని చచ్చి శవంలా వుండిపోయాడు"

"కథలో ఇలాగే వుంటుందా లేకపోతే నాకు చెప్తున్నావా?"

"ఏమో తెలియదు నువ్వే చెప్పాలి... కానీ వాణ్ణి మాత్రం కాకులకి గద్దలకి వెయ్యాల్సిందే"

"అది నీలో వున్న ఫ్రస్ట్రేషన్. అలాంటివన్నీ పక్కన పెట్టి ప్రశాంతంగా కథ ఆలోచించాలి."

"వాణ్ణి తల్చుకుంటేనే వళ్ళు మండిపోతోంది. ఇంక ప్రశాంతంగా ఎలా వుండగలనురా?"

"అదే చిత్తప్రజ్ఞత అంటే... రచయితలకి అది చాలా అవసరం.."

"సరే. అయితే విను. రంజిత్ చచ్చిపడున్నాడు... చాలా ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు వుంది వాడి శవం. వాడు చేసిన తప్పులకి ఇలా చావాల్సిందే అని దేవుడు నిర్ణయించాడు. శవం చుట్టూ జనం. అందరూ నవ్వుతున్నారు. కొంతమంది ముసిముసిగా నవ్వుతున్నారు. ఇంకొంతమంది విరగబడి నవ్వుతున్నారు. నేను కూడా నవ్వుతున్నాను. ఆనందంగా, సంతోషంగా నవ్వుతున్నాను. హ హ హ హ"

"అదిగో మళ్ళీ సాడిజం వస్తోంది. శవం ముందు జనం నవ్వడం వరకు బాగానే వుంది. నీ నవ్వే కొంచెం ఓవరైంది.."

"సరే తీసెయ్... స్వతంత్రంగా కథ చెప్పే అవకాశం ఇవ్వటంలేదు నువ్వు."

"నీ పిచ్చిగాని కథలు రాసేవాడికీ, కవితలు రాసేవాడికి స్వతంత్రం అనేది వుండదు.."

"అయితే నన్ను కూడా మామూలుగా నవ్వమంటావు? సరే... ఆ తరువాత ఆ శవాన్ని శ్మశానానికి తీసుకెళ్ళి పాతిపెట్టారు."

"అప్పుడే స్మశానందాకా పొయ్యావే?"

"ఏం చెయ్యమంటావు? శవాన్ని పెట్టుకోని భజన చేశాం అని రాయమంటావా?"

"అంతేలే.. కానీ ఒకసారి శవాన్ని పాతి పెట్టాక ఇంక కథేముంటుంది?"

"ఆలోచించనీ... ఆ... ఇది బాగుంది.. ఏ కుక్కలో నక్కలో వచ్చి వాడి శవాన్ని బయటికి లాగి..."

"ఛీ.. ఛీ... హర్రర్ కథేమన్నా రాస్తున్నావా?"

"మరి ఎలా!? వాడు చచ్చినా నా కసి చావలేదు. ఏదోకటి చెయ్యాలి వాణ్ణి."

"అయితే ఒకపని చెయ్యి.. చాలావరకు కథల్లోలాగా మొదటి పేరా చివర్లో... అతని శవాన్ని చూశాక నాకు గతం గుర్తుకొచ్చింది అని రాసి, మూడు నక్షత్రాలు పెట్టి వెనక్కి పో. అక్కడ వాణ్ణి ఏదో ఒకటి చేసెయ్యి."

"ఇది బాగానే వుంది. కానీ ఏం చేస్తే బాగుంటుంది.?"

"మొదట్నుంచి ఒకసారి చెప్పు... ఫ్లోలో ఏమన్నా వస్తుందేమో.."

"సరే. అయితే విను. రంజిత్ చచ్చిపడున్నాడు... చాలా ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు వుంది వాడి శవం. వాడు చేసిన తప్పులకి ఇలా చావాల్సిందే అని దేవుడు నిర్ణయించాడు. శవం చుట్టూ జనం. అందరూ నవ్వుతున్నారు. కొంతమంది ముసిముసిగా నవ్వుతున్నారు. ఇంకొంతమంది విరగబడి నవ్వుతున్నారు. ఆ శవాన్ని చూడగానే నాకు గతం గుర్తుకొచ్చింది. మూడు చుక్కలు. రంజిత్ 'నన్ను చంపద్దు... నన్ను చంపద్దూ' అని అంటున్నాడు. నేను ఇనప బకిల్ వున్న బెల్టుతో పిచ్చ కొట్టుడు కొట్టాను..."

"బాలేదు"

"సరే పిచ్చ కొట్టుడు బాగాలేదంటే, వీర కొట్టుడు కొట్టాను అని రాద్దాం"

"బాలేనిది అది కాదు... అసలు నువ్వు అతన్ని చచ్చేట్టు కొట్టడమే బాగలేదు... పైగా దానికి గతం అని ఫ్లాష్ బ్యాక్ ఒకటి.."

"మరేం రాయాలి?"

"అతని కుటుంబం గురించో, అమాయకమైన ముఖం గురించో, ఆఫీసులో అతను పడే కష్టం గురించో..."

"రేయ్ ప్రణవ్.. ఆ బోసుబాబుకి సపోర్ట్‌గా మాట్లాడావో.."

"బోసుబాబు కదురా... రంజిత్.. మన కథలో కారెక్టర్..."

"కేరక్టర్ కాదు. నా బాసు బోసుబాబే. వాణ్ణే నేను చితక్కొట్టి చంపేశాను. అదే కథ..."

"అలాగైతే అది పత్రికల్లో అచ్చుకూడా కాదు. సొంత డబ్బుల్తో పుస్తకం అచ్చు వేయించుకునే రచయితలాగా తయారౌతుంది నీ బ్రతుకు."

"భేతాళుడిలా డైలాగులు వెయ్యకు. నేను వాణ్ణి చంపుతున్నా.. అంతే అదే కథ. నువు వొద్దన్నావో నిన్ను ఇప్పుడే చంపుతా.." పక్కనే పడివున్న బీరు బాటిల్ ఎత్తాడు సుజన్. పైగా అప్పటికే బిల్లు టేబుల్ మీదకు వచ్చేసింది. కాదంటే బిల్లు కట్టాల్సివస్తుందని ప్రణవ్‌కి అర్థం అయ్యింది.

"ఇంత ప్రేమగా చెప్తే కాదంటానా? నీ ఇష్టం వచ్చినట్లు చెప్పు"

"అయితే విను - రంజిత్ చచ్చిపడున్నాడు... వాడి వంటి నిండా గాయాలు. బూట్లతో తన్నినవి, కొరడాతో కొట్టినవి, రాడ్డుతో బాదినవి.

వాడి గాయాల నిండా రక్తం కారుతోంది. వాడు చేసిన తప్పులకి ఇలా చావాల్సిందే అని దేవుడు... కాదు కాదు నేనే నిర్ణయించాను. శవం చుట్టూ జనం. అందరూ నవ్వుతున్నారు. కొంతమండి ముసిముసిగా నవ్వుతున్నారు. ఇంకొంతమంది విరగబడి నవ్వుతున్నారు. వాళ్ళంతా ఆఫీసులో అతని కింద పనిచేసే వాళ్ళు. నేను కూడా విరగబడి నవ్వుతున్నాను. హ హ హ్హా.. సరిగ్గా అప్పుడే నాకు గతం గుర్తుకొచ్చింది. మూడు చుక్కలు. రంజిత్ 'నన్ను చంపద్దు... నన్ను చంపద్దూ అని అంటున్నాడు. నేను ఇనప బకిల్ వున్న బెల్ట్‌తో పిచ్చ కొట్టుడు కొట్టాను. ఆ దెబ్బలకే వాడు చచ్చిపోయాడు. వాడి శవాన్ని స్మశానానికి తీసుకెళ్ళి పాతిపెట్టారు. ఆ తరువాత నక్కలు వచ్చి వాణ్ణి పీక్కుతిన్నాయి. వాడు దయ్యమయ్యాడు..."

"అదేంటి కొత్తగా?"

"చెప్పేది విను - వాడు దయ్యమయ్యి మా ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాడు. నాకు మేరేజిడేకి లీవ్ ఇవ్వడానికి ఏడ్చిన వాడికి ఇప్పుడు వాడి డెత్ డే రోజు వాడి సీట్లో కూర్చోని వున్న నేను కనిపించాను."

"అదేంట్రా? నీకు ప్రమోషనా? నీకన్నా ముందు రావాల్సినవాళ్ళు ఉన్నారు కదా?"

"కథ రాస్తోంది ఎవరు?"

"నువ్వే"

"సో ప్రమోషన్ కూడా నా ఇష్టమే..."

"సరే కానీ"

"ఇంకేముంది ఆఫీసరుగా నన్ను చూసిన బోసుబాబుగాడి దయ్యం ఆత్మహత్య చేసుకుంది."

"బోసుబాబు కాదు రంజిత్.."

"రంజిత్ అని రాస్తే నాకు తృప్తి రావటంలేదు... బోసుబాబనే రాస్తాను"

"అయినా చచ్చి దయ్యమైనవాడు మళ్ళీ ఆత్మహత్య చేసుకోవడమేంటిరా?"

"నా ఇష్టం... ఆత్మహత్య కాకపోతే మళ్ళీ నేనే దయ్యాన్ని కూడా చంపానని రాస్తా..."

"సరే నీ ఇష్టమే.. కాకపోతే ఒక చిన్న సజెషన్.."

"చెప్పు -"

"మన ప్రస్తుత తెలుగు సాహిత్య ధోరణులు చూసినట్లైతే.."

"తెలుగులో చెప్పు"

"ఏం లేదురా.. ఇప్పుడొస్తున్న కథలు చూడు. చివర్లో ఒక పాత్ర మరో పాత్రకి మూడు నాలుగు పేరగ్రాఫుల ఉపన్యాసం ఇవ్వాలి. అండుకే చివర్లో ఆ దయ్యాన్ని చూసి నువ్వు ఆ బాసుగాడికి చిన్న లెక్చర్ ఇచ్చినట్లు రాస్తే బాగుంటుంది."

"లెక్చర్ ఇవ్వాలా? చచ్చినోడు.. వాడికి లెక్చర్ ఇచ్చేదేంటి. వాణ్ణి మళ్ళీ మళ్ళీ చంపాలి అంతే."

"సరే అలాక్కానీ... బారు మూసేస్తున్నారు వెళ్దామా?"

"సరే పద... కానీ ముందు కథ ఎలా వుందో చెప్పు?"

"కథ సూపర్ రా..."

"అవును... ఆ బోసుబాబుని చంపేశా... అదే సూపర్..."

"కరక్టే... చంపాల్సిందే వాణ్ణి"

"అన్నొటొరే మర్చిపోయాను కాకులు గద్దలు వున్నాయని మొదట్లో చెప్పాను కదూ... అవి మర్చిపోయాను. మళ్ళీ మొదట్నుంచి మొదలుపెడతాను..."

అప్పటికే ఆలస్యమౌతోందని ఇద్దరిని బయటికి మోసుకొచ్చి పడేశారు బార్‌లో పని చేసేవారు. కథ బయట కూడా కొనసాగుతూనే వుంది. మర్నాడు ఆఫీసుకి వెళ్ళాలని వాళ్ళకి గుర్తుకొచ్చేదాకా సాగుతుందది.

అయితే సుజన్ కథ రాశాడా? ఆ కథని తెలుగు సాహితీలోకం నిండు హర్షంతో స్వీకరించిందా? నిబిడాశ్చర్యంతో చూసిందా? లేక నిర్దాక్షిణ్యంగా తిరస్కరించిందా? ఇవన్నీ ప్రస్తుతానికి శేషప్రశ్నలే. ●●●

# కృష్ణం వందే జగద్గురుం

మణి వడ్లమాని

**అది త్రేతాయుగం నాటి సంగతి.** దశరథ మహారాజు సంతానం కోసం చేసిన పుత్ర కామేష్టి యాగం పరిసమాప్తి అయ్యింది. యజ్ఞపురుషుడు పాయసాన్న ప్రసాదం మహారాజుకి ఇవ్వగా దానిని అయన తన ముప్పురు రాణులుకు పంచారు. వారు గర్భవతులయ్యారు. ఇలా కొన్ని మాసాలు గడిచాక మహారాజుకి నలుగురు కుమారులు కలిగారు. శ్రీరామచంద్రుడు కౌసల్య దేవియందు, లక్ష్మణ, శత్రుఘ్నుడు సుమిత్రా దేవి యందు, భరతుడు కైకయినందు జన్మించారు.

అయోధ్య అంతా ఆనందోత్సవాలతో వోలలాడుతోంది.

శ్రీరాముడు యోగానిద్రను వీడి పారాడు పాపాయి అయ్యాడు కానీ ఎవరన్నా ఆ ముద్దు పాపడుని నేలమీదకి దించుతారా? అందరు భుజాలమీద మోసేవారే. ఇలా రాముడు దినదిన ప్రవర్ధమానుడౌతున్నాడు. ఇంక అంతఃపురంలో రాముడు ముద్దుముచ్చట్ల గురించే యెవరి నోట విన్నా! అతని ముద్దుచేష్టలు, అతని గారం, అతని చిలిపి పనులు, ఆటలు - యెంత విన్న తనివితీరదు ఆ దశరథ మహారాజుకి. ఇంక కైకయి మహారాణి సంగతి చెప్పనే అక్కరలేదు, కన్నది కౌసల్యదేవి అయినా కానీ పెరిగేది కైకయి వొడిలోనే. ఆమెకి రాముడు అత్యంత ప్రీతి పాత్రుడు. యెప్పుడు ఇలా ఆ అంతఃపుర కాంతలకి ఆ రాముని ఆటపాటలు చూసే భాగ్యం కలిగింది.

అలాంటి వో అంతఃపుర కాంత తమ వాడలో రాముని చిలిపి చేష్టల గురుంచి చెబుతుండగా, ఆ వాడలోనే ఉంటున్న ఒక అయోధ్య పౌరుని కుమారుడు "ఆనందుడు" అనే పది పన్నెండు సంవత్సరాల బాలుడు మైమరచి వింటున్నాడు. ఆ బాలుని కళ్ళముందు అందమైన రాముని రూపం సదా కదలాడుతోంది! ముద్దులు మూటగట్టే ఆ రూపం ఊహిస్తూ ఆ బాలుడు రాత్రి నిదరపోలేదు ,రాముడిని ఎత్తుకున్నట్లు, భుజాలమీద మోసినట్లు ,అతనితో దాగుడుమూతలాడినట్లు ఇలా తెల్లవార్లూ కలలు కంటునే వున్నాడు. వేకువనే లేచి వాళ్ళ తండ్రిని అడగసాగాడు, "తండ్రీ.. నేను నీతో పాటే రాజమందిరంకి వస్తాను. రాముడుని చూస్తాను, రాముడుని ఆడిస్తాను" అని. ప్రతిరోజూ ఇదే సంభాషణ.

అప్పుడు ఆ బాలుడు తండ్రి "నాయనా ఆనందా! మనం సామాన్యులం. వారు మహారాజులు. వారిని చూడటమే మనకు మహాభాగ్యం, అంతేకాని వారిని కలవడం మనకి సాధ్యం కాని పని" అని నచ్చచెప్పసాగాడు. కాని ఆనందుడు ఎంతకూ వినలేదు. పట్టు విడలేదు. పైగా "ఆ రాముడు మహారాజుగారి ఇంట వద్దనే ఎందుకు వుండాలి? మన వాడకి రాకూడదా? నేను కూడా ఆతనితో ఇంకా మరికొంతమంది స్నేహితులతో కూడి ఆడుకుంటాం.." అని ఒకటే గొడవచేస్తుండగా, ఆ తండ్రి భయపడి ఈ వార్త బయటికి పొక్కితే రాజ భటులు తనను దండిస్తారని భయపడి ఆతని తన మేనమామగారి వూరు పంపించాడు. కాని ఆనందుడు మనస్సు ఆ అందాల చిన్నారి రాముని స్మరిస్తూనే వుంది. "రాముడు మనవాడలో వుండ కూడదా మనజతగాడు కాకూడదా! " సదా అదే స్మరణ ఆనందుడి మనసులో.

ఇక్కడ రాముడు పెరిగి పెద్దవాడు అవ్వడం, విశ్వామిత్ర యాగరక్షణకి వెళ్ళడం, జానకితో వివాహం, తరువాత అరణ్యావాసం చెయ్యడం, రావణసంహారం, రాజ్యపాలన చేపట్టడడం, సీతవియోగం, కుశలవ జననం, రామావతార పరిసమాప్తి జరగడం కూడా జరిగింది.

అక్కడ ఆనందుడు వయసు పెరిగింది కానీ మనసు మాత్రం చూడని ఆ చిన్ని రాముని రూపాన్ని తనకు తోచినవిధంగా ఊహించుకుంటూ - అతని తోటి ఆడుతున్నాడు, పాడుతున్నాడు ,ఏడుస్తాడు, నవ్వుతాడు, అలుగుతాడు, మళ్ళీ 'రామ రామ' అంటూ కలవరిస్తాడు. ఇలా అతను తన అవసాన దశకు చేరుకున్నాడు. అప్పుడు మహావిష్ణువు అతని భక్తికి మెచ్చి అతని కోరికను గ్రహించి "ఆనందా! నీకు ఈ అంత్యసమయంలో ఒక వరాన్ని ప్రసాదిస్తున్నాను. నీవు ఏదైతే ఈ జన్మలో కోరుకున్నావో నీ ఈ కోరికను ద్వాపరయుగంలో తీరుస్తాను. పుట్టింది మహారాజుల ఇంట అయినా పెరగడం మాత్రం ఒక పల్లెలో సామాన్యుల ఇంట పెరుగుతాను. అప్పుడు నువ్వు రేపల్లెలోని గోపాలకుల ఇంట పుట్టి నాకు నేస్తంగా వుండి నన్ను ఆడించడం, భుజాలమీద మోయ్యడం లాంటి పనులు చేస్తూ, నేను చేసే ప్రతి చిలిపి పనిని చూసి ఆనందం పొందగలవు" అని వరమిచ్చాడు.

"మహాప్రసాదం తండ్రీ! నన్ను ఈ విధముగ కరుణించావా! దేవా,భక్త నారాయణ.. నమో నమహ" అంటూ తనువును చాలించాడు ఆనందుడు.

****

ద్వాపరయుగంలో శ్రీ మహావిష్ణువు దేవకీ వసుదేవులకు అష్టమ గర్భాన శ్రీకృష్ణుడిగా జన్మించాడు. భగవానుడి ఆదేశం ప్రకారం వసుదేవుడు ఆతనిని రేపల్లెలోని యశోదా నందుల ఇంట వదలి వారికి పుట్టిన యోగామాయను తీసుకొని రాగా, కంసుడు చేతికి ఇవ్వగా తనను చంపబోయే తన శత్రువు వేరొకచోట పెరుతున్నాడని చెప్పి అంతర్ధాన మయింది..

రేపల్లెలో గోకులానికి పెద్ద అయిన నందుని ఇంట చాలా కాలానికి కొడుకు పుట్టంవల్ల, రేపల్లె అంతా సంబరాలు జరుపుకొన్నారు. అష్టమి నాడు పుట్టడంవల్ల "ఆ రోజును గోకులాష్టమిగా " కూడా పేరు గాంచింది.

వసుదేవుని పెద్ద భార్య రోహిణి దేవి, మిగిలిన కొంతమంది యాదవులు కూడా నందుని ఇంట రేపల్లెలోనే తలదాచుకున్నారు. బలరాముడు ఆమె బిడ్డ. యాదవుల గురువు వసుదేవుని పిల్లద్దరికి. బలరామకృష్ణలని నామకరణం కావించాడు .

అందరు సంబరాలలో మునిగితేలుతుండగా వూయలలో వున్న బాలకృష్ణని తదేక దీక్షతో చూస్తున్నాడు ఎనిమిది, తొమ్మిది సంవత్సరాలు వయసువున్న ఓ చిన్నపిల్లవాడు.. చిన్నయ్య గోపబాలకుడు అతనిపేరు.

యశోదతో "మరేమో అత్తమ్మ కిట్టయ్య నన్ను చూసి నవ్వుతున్నాడు, చేతులూపుతూ నన్ను ఎత్తుకోమంటున్నాడు. నేను ఎత్తుకోనా " అని ఆశగా అడిగాడు.

"అమ్మో నువ్వు చిన్నపిల్లాడివి, అప్పుడేకాదు కిట్టయ్యకి బుడిబుడి అడుగులు వచ్చిన తరువాత నువ్వే వాడిని నడిపించుదువు గాని" అని అంది.

"ఐతే యశోదమత్తమ్మా! రోజు నేనే కిట్టయ్యని ఇలా వూయలలోంచే ఆడిస్తాను" అంటూ అమాయకంగా చెప్పి "మాకిట్టయ్యని నేనే ఆడిస్తానోచ్" అంటూ గెంతుకుంటూ వెళ్ళిపోయాడు.

వాడి అమాయకత్వానికి యశోద, రోహిణి ఇద్దరూ కూడా ఆనందంగా మురిసిపోయారు .

బలరామకృష్ణ లిద్దరూ దినదిన ప్రవర్ధమానమవుతూ వచ్చారు.

అక్కడ కంసుడికి "నిన్ను చంపేవాడు వేరోకొచోట పెరుతున్నాడు"అన్న యోగమాయ మాటలు జ్ఞప్తికి వచ్చి వెంటనే తన అనుచర్లు అయిన కొంతమంది రాక్షసులను పిలిచి అన్ని చోట్ల గాలించి క్రిష్ణుడిని వధించమని ఆదేశించి పంపాడు.

పూతన, ధేనుకాసరుడు, శకాటాసురుడు మొ.వారు అన్ని చోట్ల వెదకి రేపల్లె వైపు వచ్చారు.

ఇంక ఇక్కడనుంచీ బాలకృష్ణుని లీలలు మొదలయ్యాయి.

ఒకపక్క రాక్షస సంహారం చేస్తూ, చిలిపికృష్ణుడు చేసిన లీలలు అన్ని ఇన్ని కావు. ఊరులో వున్నందరి ఇళ్ళల్లో దూరి పాలు వెన్న,మీగడ ఆరగించేవాడు. ఈ అల్లరంతటకి నాయకుడు క్రిష్ణుడు. అతనిని భుజాల మీద ఎక్కించి మోసుకెళ్ళడం ఆ అమయాకపు గోపబాలకుడి పని. అసలు ఆ కిట్టమ్మ రూపం చూస్తునే మురిసిపోయేవాడు. చేతవెన్నముద్ద పెట్టి, చెంగల్వ పూదండ చుట్టి, బంగారుమొలతాడు పట్టుదట్టి, నెమిలి ఈకలతో తలమీదపించం పెట్టి, దృష్టి పడకుండా చేతికి తాయత్తులు అత్తమ్మ తెచ్చినవి కట్టి, ఆ కాలి గజ్జెలుతో ఘల్లు ఘల్లు మని నడుస్తూంటే ఆ ముద్దు మోహనరూపం ఎంతచూసినా తనివితీరేది కాదు. రాత్రి నిద్రలో కూడా కిట్టమ్మ నామస్మరణమే .

కాళియమర్దనం కోసం మడుగులోకి దూకినప్పుడు అందరికంటే ముందు తనే భయపడి యశోదకి చెప్పాడు గోపబాలకుడు..

"కిట్టయ్యా ఎందుకయ్యా ఇలాంటి సాహసాలు చేస్తావు భయం వెయ్యదా?" అని చిన్నయ్య అడిగాడు. అప్పుడు కృష్ణుడు కొంటెగా "నేను అలా చెయ్యకపోతే అమ్మ నన్ను దండిచదు. అమ్మ చేత తిట్లు వెన్న కన్నా బావుంటాయి అందుకోసం" అని చిలిపిగా నవ్వాడు.

ఇలా కృష్ణలీలలన్నింటిలోను చిన్నయ్య ఎంతో తాద్యాత్మం చెందుతూ ఆ మురళీ గానం వింటూ పరవశం చెందుతున్నాడు చిన్నయ్య గోపబాలకుడు.

కంస సంహారం జరిగింతరువాత రాచనగరు మధురలో తన కన్నతల్లి తండ్రులను కలుసుకున్నాడు శ్రీకృష్ణుడు. యశోద నందులకు తనను గురుంచి బెంగపడ వద్దని, తనని ఎప్పుడూ యశోద తనయుడుగానే లోకమంతా గుర్తిస్తారని ఓదార్చాడు.. రేపల్లె నుంచి వచ్చిన గోపబాలకులు కిట్టయ్య లేకుండా తాము రేపల్లె వెళ్ళం అన్నారు. వారికి సమాధానంగా శ్రీకృష్ణుడు "ఇప్పుడు మీరు అందరు వెళ్ళండి. ఇక్కడ నా భాద్యతలు నేరవేర్చాక మన రేపల్లె వస్తాను " అని చెప్పాడు.

"ఇదేమిటి కిట్టయ్యా! నువ్వులేని జీవితం జీవితమే కాదు. నేను ఇప్పుడే నీ ఎదురుగా ప్రాణ త్యాగం చేస్తాను " అన్నాడు చిన్నయ్య.

అప్పుడు కృష్ణుడు అతనికి పూర్వజన్మలో అతను కోరిన కోరిక జ్ఞాపకం చేశాడు "నీకోసం నేను సామాన్యుడిగా గోకులంలో పుట్టాను. నీతో ఆడాను, పాడాను. నీకోరిక తీర్చాను. భక్తుడి కోరిక తీర్చడం నాపని! అదే చేసాను. నేను లేనిలోటును, నన్ను తన ప్రాణం కంటే మిన్నగా చూసుకొన్న నంద యశోదలకు నా బాల్య క్రీడలు గుర్తుచేస్తూ సదా వాళ్ళని చూసుకోవటం ఇప్పుడు నువ్వు చెయ్యవలసిన కార్యం. అప్పుడు నువ్వుకూడా వారితో పాటే నన్ను తలచుకుంటూ, నన్ను మీ మనోనేత్రాలతో చూస్తూనే వుంటావు" అని చెప్పగా చిన్నయ్య ఆనందంతో ఉద్వేగభరితుడై "తప్పక చేస్తాను కిట్టమ్మా! తప్పు తప్పు ! శ్రీకృష్ణా! ఇప్పడు నీవు రాచవారి అబ్బాయివి కదా" అనగానే,

శ్రీ కృష్ణుడు "ఎప్పటకి నేను నీ కిట్టమ్మనే మిత్రమా!" అని నిండుగా కౌగిలించుకున్నాడు..

ఆ ఆలింగనంతో తన జన్మ ధన్యమైందంటూ చేతులు జోడించాడు చిన్నయ్య !!

**నీవే తల్లివి దండ్రివి**
**నీవే నా తోడునీడ నీవే సఖుడా**
**నీవే గురుడవు దైవము**
**నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణ !**

# కనపడని అంకాలు

శశికళ. వి

**దూరంగా కనిపిస్తున్నాయి వెలుగుతూ లైట్స్.** దగ్గర కొచ్చే కొద్దీ ప్రాంగణం అంతా వెలిగిపోతూ కనిపించింది బస్ కిటికీలోనుండి. హమ్మయ్య ఇంకో రెండు మూడు గంటలు.. ఇవి అప్ప చెప్పేస్తే ఇంటికి వెళ్ళిపోవచ్చు అనుకున్నాను. ఏదో ధైర్యం చెప్పుకోవటానికి అనుకున్నాను కానీ, ఇంతకు ముందు ఎలక్షన్స్ జ్ఞాపకాలు గుర్తుకు వచ్చి మనసు చేదు తిన్నట్లు అయిపోయింది.

తప్పదు. రోట్లో తలపెట్టినాక రోకలి పోటు తప్పదు అన్నట్లు ఉద్యోగంలోకి వచ్చినాక ఎలక్షన్స్ డ్యూటీలు తప్పవు. ఇంకా ఎన్ని చెయ్యాలో!? బాధగా మూలిగింది మనసు.

"దేవుడా అక్కడ రష్ ఎక్కువ లేకుండా ఈ ఈ. వి.ఎం కంట్రోల్ యూనిట్, కవర్స్ అన్నీ అప్ప చెప్పెయ్యాలి "మనసులోనే దేవుడికి మొక్కుకున్నాను. అప్పటికే రాత్రి పది అయింది. సాయంత్రం ఎప్పుడో తాగిన టీ. ఇక్కడ ఎవరి బిజీలో వాళ్ళు ఉన్నారు. అసలే ఎలక్షన్ డ్యూటీ చెయ్యటానికి వచ్చిన వాళ్ళు అంటే పెద్ద గౌరవం లేదు. ఏదో తోసుకుంటూ క్యూలో నిలబడితే ఒక బిర్యాని పాకెట్ అదీ సగం కడుపు నిండేటట్లు ఇస్తారు. వద్దు అనుకున్నామో ఇక ఆకలి కథ అంతే. నాకు అయినా పర్వాలేదు, పాపం.. ఆ అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ అయితే ఆకలి తీరక అల్లాడుతున్నాడు నిన్న.

ఇక ఈ రోజంతా ఈసారి రూల్స్ మార్చటం వలన ఓటు వెయ్యటానికి వచ్చిన ప్రతి ఒక్కరు సంతకం చెయ్యాల్సి వచ్చేసరికి ఏడువందలు ఓట్లు ఉన్న బూత్‌లో కూడా మంచి నీళ్ళు తాగేంత టైం కూడా లేని పరిస్థితి. ' వద్దురా స్వామీ ఈ బాధలు' దిగులుగా అనుకున్నాను. బస్ ఆగింది.

ఎ.పి.ఓ పిలుస్తూ ఉన్నాడు కొన్ని వస్తువులు తీసుకుని. ఎలక్షన్ లగేజ్ ఉందా లేదా చెక్ చేసుకున్నాను. మా బ్యాగ్‌లు సంగతి తరువాత. కిందకు దిగి చుట్టూ చూద్దును కదా. ఆశ్చర్యం. ఎక్కడా రష్ లేదు.

"ఏమిటి మనమే ఫస్ట్ వచ్చామా?" అడిగాను.

"అదే అర్థం కావటం లేదు" అతను కూడా ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

నవ్వుతున్నాడు మా రూట్ ఆఫీసర్. "ఎవరి రూట్ ఆఫీసర్‌ల దగ్గర వాళ్ళే హాండ్ ఓవర్ చెయ్యాలి. తరువాత చేద్దురు ముందు తినండి" చెప్పి ఇద్దరికీ పాకెట్స్ ఇప్పించాడు. కూర్చున్నాము ఒక దగ్గర. తెరిచి చూస్తే బిర్యాని.. !

"దేవుడా" నిట్టూర్చాను.

"సార్ మీరు తీసుకోండి.." అని తనకే ఎక్కువ ఇచ్చేసాను. పాపం ఆకలి ఎక్కువగా ఉందనుకుంటా.. వెంటనే తినేసాడు. మరి ఇప్పుడు మేము టవునుకు వెళ్ళినా ఏమిదొరకవు. చుట్టూ చూసాను. ఇంతకు ముందులాగా అందరు ఒక దగ్గరే హ్యాండ్ ఓవర్ చెయ్యక్కర్లేదు. ఇది బాగుంది. మేము ఒక పదిహేను బూతులు కలిపి ఒక దగ్గరే ఇచ్చేస్తే చాలు.

కవర్స్ వ్రాయని వాళ్ళు రాసుకుంటున్నారు. లెక్కలు చూసుకుంటున్నారు. అంతా హడావిడి.. అయితే ఎలక్షన్‌కి వెళ్ళేటప్పుడు ఉన్న టెన్షన్ లేదు.

అందరు అలిసిపోయి, వాడిపోయి.. "క్షేమంగా వచ్చారా?" తెలిసిన వాళ్ళు పలకరించుకుంటున్నారు. కొందరు ఏవి ఎలా ఫిలప్ చేయాలో అడిగి తెలుసుకుంటున్నారు. ఎవర్నీ ఎవరు పట్టించుకునే స్థితిలో లేరు.

మా ఫ్రెండ్స్ ఇంకా రాలేదు. ముందు మా దగ్గరున్నవి హాండ్ ఓవర్ చేస్తే పని అయిపోతుందనుకున్నాము.. అలానే వెళ్ళి హ్యాండ్ ఓవర్ చేసాము. అట్టే ఇబ్బంది పెట్టకుండా తీసుకున్నారు. చూస్తేనే తెలిసిపోతుంది ఎక్కడ ఎలక్షన్ వాయిదా పడలేదు. ఆర్.డి.ఓ గారు చాలా సంతోషంగా ఉన్నారు.

అదిగో.. "హాయ్.. హాయ్" పిలుపులు మా ఫ్రెండ్స్. స్కూల్ వాళ్ళు అందరు వచ్చేసారు.

అందరం పి.ఓ.లే కాబట్టి ఒకే బూత్‌కి పడే సమస్యే లేదు. 'హమ్మయ్య' అంటే 'హమ్మయ్య' అనుకున్నాము. 'ఒక గండం గడిచింది' అని ఊపిరి పీల్చుకుని 'సముద్ర తీరానికి పోయిన వాళ్ళు ఏరి?'.. పలకరించుకున్నాం.

క్షేమ సమాచార పరిమళాలు, నవ్వుల పువ్వులు. పోయినసారి అక్కడకు వెళ్ళిన వాళ్ళని రూంలో పెట్టి తాళం వేసిన చరిత్ర ఉంది.

"అక్కడకు ఎందుకు సార్.. ఆడవాళ్ళు? చూసి వెయ్యండి. " అని దీనంగా అడిగినా పట్టించుకోరు.

పైగా "మీరు అయితే సహనంగా పూర్తి చేస్తారు" అని కితాబు ఇస్తారు, మమ్మల్ని చల్లబరచటానికి. మాకు కత్తి మీద సాము గుండెల్లో దడ.

గబగబా అందరం ఒకరికి ఒకరం సహాయం చేసుకున్నాం. అందరు వేరే వేరే దగ్గర కాబట్టి ఎవరి రూట్ ఆఫీసర్స్ దగ్గర వాళ్ళు హాండ్ ఓవర్ చేసేసారు. కొందర్ని తీసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారు.

అందరు సహనం చచ్చిపోయి పెనం మీద ఆవాలు గింజల్లా ఎగురుతున్నారు. దానికి తగ్గట్లు.. చేతిలో పెట్టిన డబ్బులు చూస్తే కడుపు మండిపోయింది.

అసలు ఇవ్వకపోయినా ఊరికే చేసిన పుణ్యం అయినా వస్తుంది. ఇంత టెన్షన్‌కి ప్రాణం పణంగా పెట్టి వస్తే ఇదే మర్యాద..!! హ్మ్.

"ఇంకా రాణి మేడం రాలేదు" అన్నారు ఫ్రెండ్స్.

"సరే అక్కడ కూర్చుందాం." అనుకుంటూ ఒక దగ్గర ఖాళీగా ఉంటే కూర్చున్నాం అందరం.

ఎలక్షన్స్ మీద జోక్స్ వేసుకుంటూ నవ్వుకుంటున్నాం.

పక్కన రెండు కుర్చీలు కలిపి ఉన్నాయి. దానిలో ముద్దుగా నిద్రపోతూ ఒక చిన్న నెలల బాబు.

బాబు కిందకి పడకుండా టేబుల్ అడ్డం పెట్టి ఉన్నారు. పైనుండి చందమామ వెన్నెల పడుతూ ఉంటే మూసిన పిడికిళ్ళు అప్పుడప్పుడు తెరుస్తూ, ఎర్రని పెదాలు చిన్నగా కదులుతూ ముంగురులు గాలికి ఎగురుతూ ముద్దుగా ఉన్నాడు. మెల్లిగా కదులుతున్నాడు. బాబుకి సంబంధించిన వారు ఏరి?

చుట్టూ చూసాము.. ఎక్కడ కనపడలేదు ఎవరూ.. గబుక్కున కదిలాడు బాబు నిద్రలో, వంగి పట్టుకున్నాను.

వాళ్ళ అమ్మలాగా తోచాను కాబోలు పొట్టకు వెచ్చగా అల్లుకున్నాడు.. హమ్మయ్య అనుకున్నాను. అప్పుడే మొదలైంది సమస్య.

వాడు మెల్లిగా చేతులు పైకి లేపుతున్నాడు, కొంగు జరుపుతూ.

పాపం..వాడు నేనే వాళ్ళమ్మ అనుకుంటున్నాడు. అందరం మొహాలు చూసుకున్నాము. ఇప్పుడెలా? అక్కడ పాలు ఎలా దొరుకుతాయి? మేము చిన్నపిల్ల తల్లులం కాక పోతిమి.

రాగం పెరుగుతూ ఉంది. చేతిలో నిలవకుండా కాళ్ళతో తన్నేస్తూ ఉన్నాడు.

మా తల్లి మనసులు గిలగిలలాడుతున్నాయి. గుక్క పెట్టేస్తే ఏమి చెయ్యాలా అని గడగడలాడిపోయాం. నీళ్ళు ఇచ్చినా ఒప్పుకోడు. అయినా నెలల పిల్లాడు నీళ్ళు గ్లాస్‌లో ఎలా తాగుతాడు. అయినా అమృతం కావాల్సిన వాడికి నీళ్ళు ఇస్తే ఒప్పుకుంటాడా? ఉన్నట్లుండి గుక్క పెట్టేశాడు. ఏమీ చెయ్యాలో తెలీక, అందరికి, తల తిరిగిపోతోంది..! ఎప్పుడు తాగాడో ఏమో, చిన్న పొట్ట లోపలికి వెళ్ళిపోయి ఉంది. ఏమి చెయ్యాలో తెలీక అందరి కళ్ళలో గిరుక్కున తిరుగుతున్న నీళ్ళు. డబ్బులుంటే ఏమి ప్రయోజనం ఇలాంటి సమయాల్లో గుక్కెడు పాలు కావాలి కానీ.

ఉన్నట్లుండి ఎక్కడి నుండి వచ్చిందో ఒక పెద్దావిడ వచ్చి ఎత్తుకుంది. కొంచెం గుర్తుపట్టాడు. కానీ ఏడుపు పూర్తిగా మానలేదు. "మా మనవడు.. అమ్మా.." అంది.

"చెప్పి వెళదాము అంటే ఎవరూ లేరు. ఇప్పుడే టాయిలెట్‌కి వెళ్ళి వస్తున్నాను" సంజాయిషీ చెబుతున్నట్లు మళ్ళీ ఆమే అంది.

"వాళ్ళ అమ్మ ఏది?" అడిగాము కోపంగా, ' మనిషేనా?..ఎలా వదిలేసి వెళ్ళింది' అని లోలోపల అనుకుంటూ.

దూరంగా చూపించింది. అక్కడ ఒక తల్లి కవర్స్ హాండోవర్ చేసుకుంటూ ఉక్కిరి బిక్కిరి అవుతూ ఉంది. అందరి కోపం ఎదురుకోలేక, వాళ్ళకి సమాధానం చెపుతూ ఏటికి ఎదురు తెడ్లు వేస్తూ.. అర్ధరాత్రి డ్యూటీ చేస్తూ.. పాపం ఇంకా బాలింతే! కాని ఎలక్షన్ డ్యూటీ తప్పదు. ఇప్పుడు పాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఐనా పై అధికారులు ఒప్పుకోరు. అందరూ ఇంటికి వెళ్ళే తొందరలో ఉన్నారు. కవర్స్ తీసుకుంటూ పాలు ఎలా ఇస్తుంది. మాకు భలే కోపం వచ్చింది. అక్కడకు వెళ్ళి ' ముందు వాడు ఏడుస్తున్నాడు.. చూడుపో' అని పంపేసాం. అక్కడ వాళ్ళకు విషయం సర్ది చెప్పాం.

ఈ లోపల రాణి మేడం వచ్చేసారు. అక్కడే బస్‌లు ఉన్నాయి. వెళుతూ బాబు కోసం చుట్టూ చూసాం. బాబు నన్ను గుర్తుపట్టినట్లు పెద్దగా నవ్వాడు.

పొట్ట నిండినట్లుగా ఉంది. అమ్మమ్మ వళ్ళో ఎగురుతూ ఉన్నాడు. నవ్వుకుంటూ టాటా చెప్పాం. వాడికి అర్థం కాక పోయినా వెళ్ళి బస్ ఎక్కి ఇంటి వెళ్ళేసరికి ఉదయం కోళ్ళు కూసేసాయి.

పొద్దున్నే వచ్చిన న్యూస్ పేపర్ చూసాను.

" ఎలక్షన్ ప్రశాంతం..!" పేపర్లో అదీ హెడ్ న్యూస్!

కింద ఇంకో న్యూస్ - ఆర్.డి.ఓ.గారు ప్రశాంతంగా జరిగినందుకు కృతజ్ఞతగా పార్టీ ఇస్తున్నట్లు ఫోటోలు..!.

నిన్న రాబోయే ముందు, తల్లిపాల కోసం అల్లల్లాడిన చిన్నబాబు రూపం కళ్ళ ముందు కదిలింది.

అంతే! పై వాళ్ళే అందరికి గుర్తు ఉంటారు..! జెండా ఎగరటమే అందరు చూస్తారు, కానీ ఆ జెండా ఎగరడానికి ఊతం ఇచ్చిన మాలాంటి తల్లుల త్యాగం ఎంతమందికి తెలుస్తుంది!?

మనసు బాధగా మూలిగింది.

అందుకే మమ్మల్ని భూమాతతో పోలుస్తారేమో..!.